
'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 345

బుధవారం 7-3-2018




**అంతా ఆఖరి గంటలోనే..!**

ఐసీఐసీఐ, యాక్సిస్‌లకూ పీఎన్‌బీ సెగ సెన్సెక్స్ 430 పాయింట్లు డౌన్ -10లో



**భారత్ ఓటమి**

ముక్కోణపు టి20 టోర్నీ తొలి మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో పరాజయం -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పీఎన్‌బీ స్కామ్..

## బ్యాంకర్లకు సమన్లు

**నీరవ్ మోదీ సంస్థలకు ఇచ్చిన రుణాలపై ఎస్ఎఫ్ఐవో ఆరా**



- విచారణకు 31 బ్యాంకుల ఎగ్జిక్యూటివ్‌లు
- యాక్సిస్, ఐసీఐసీఐ చీఫ్‌లకూ పిలుపు?
- గీతాంజలి గ్రూప్ వీపీ విపుల్ అరెస్టు

10లో

నీరవ్ మోదీపై పార్లమెంటులో విపక్షాల విసుర్లు

## చోటా మోదీ ఎక్కడ?



- ఉభయసభల్లో రెండో రోజూ కొనసాగిన నిరసనలు
- చర్చ లేకుండానే బుధవారానికి వాయిదా
- బ్యాంకింగ్ స్కాంలపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానానికి ప్రతిపక్షాల పట్టు..

7లో

ఘోర ప్రమాదం

## వంతెన నుంచి పడ్డ ట్రక్కు

**30 మంది దుర్మరణం**



- గుజరాత్‌లోని భావ్‌నగర్ జిల్లాలో దుర్ఘటన
- పెళ్లికి వెళ్తుండగా ప్రమాదం
- మరో వాహనాన్ని అధిగమించబోయి అదుపుతప్పిన ట్రక్కు

7లో

# టీఆర్ఎస్ ప్లీనరీ వేదికగా 'ఫెడరల్ ఫ్రంట్'!

**ఏప్రిల్ 27న లాంఛనంగా ప్రకటించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం**

- హైదరాబాద్ లేదా నల్లగొండలో భారీ బహిరంగ సభ
- పలు ప్రాంతీయ పార్టీల నేతలకు ఆహ్వానం
- ఉద్యమం నాటి తరహాలో ఏకతాటిపైకి తీసుకొచ్చే వ్యూహం
- దేశవ్యాప్తంగా అందరి దృష్టి రాష్ట్రంపై పడేలా ప్రణాళిక
- ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న టీఆర్ఎస్ అధినేత.. అనంతరం సభలో పాల్గొనే నేతలపై స్పష్టత

సాక్షి, హైదరాబాద్: దేశ రాజకీయాల్లో మార్పు కోసం రూపుదిద్దుకోనున్న ఫెడరల్ ఫ్రంట్ ప్రకటనకు టీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సభను వేదికగా చేసుకోవాలని టీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు టీఆర్ఎస్ ఇప్పటికే ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇదే వేదికపై ఫెడరల్ ఫ్రంట్‌పై పూర్తిస్థాయి ప్రకటన చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై సన్నిహితులతో చర్చించినట్టు సమాచారం.

**కార్యాచరణపై కసరత్తు..**

కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా దేశంలోని ప్రాంతీయ

మిగతా 2వ పేజీలో ▶



**బంగారు భారత్!**

- ఫెడరల్ ఫ్రంట్ ఎజెండాపై సీఎం కసరత్తు.. దేశానికి 'బంగారు తెలంగాణ' నమూనా - 2లో

10 మంది బందిపోటు దొంగలు | 5 కిలోల బంగారం

# కట్టేసి.. కొట్టేశారు



మంగళవారం దోపిడీ జరిగిన పాతబస్తీలోని నిత్యాదాస్ కార్ఖానా

**రాష్ట్ర రాజధానిలో భారీ దోపిడీ .. జ్యువెలరీ కార్ఖానాను టార్గెట్ చేసిన దుండగులు**

- 5 కేజీల పసిడి ఆభరణాలతో ద్విచక్ర వాహనాలపై పరార్
- పాతబస్తీలో పట్టపగలే ఘటన
- సినీ ఫక్కీలో కార్ఖానాలోకి ప్రవేశం.. కత్తులు, తుపాకులతో బెదిరింపులు
- సంస్థ మేనేజర్‌తోపాటు సిబ్బందినీ కట్టేసిన దొంగలు.. ఆపై దోపిడీ
- కార్ఖానాతో 'పరిచయం' ఉన్న వారి పనిగానే అనుమానం
- రంగంలోకి ఆరు ప్రత్యేక బృందాలు

సాక్షి, హైదరాబాద్

మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయం..

రద్దీగా ఉండే హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతం హైకోర్టుకు కూతవేటు దూరం..

నగర పోలీసు సాయుధ దళం ప్రధాన కార్యాలయం వెనుక ప్రదేశం..

ఉన్నట్టుండి 10 మంది దొంగలు జ్యువెలరీ కార్ఖానాపై దాడి చేశారు. కత్తులు, తుపాకులతో బెదిరించి మేనేజర్‌ను, సిబ్బందిని బంధించారు.

బట్వాడాకు సిద్ధంగా ఉన్న ఐదు కేజీల బంగారు ఆభరణాలు తీసుకుని ఉడాయించారు.

పోతూపోతూ సీసీ కెమెరాల దృశ్యాలు రికార్డయ్యే డిజిటల్ వీడియో రికార్డర్ సైతం పట్టుకుపోయారు.

కార్ఖానాలో అణువణువూ పరిచయం ఉన్న వారే ఈ దొంగతనంలో పాలుపంచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ బందిపోటు దొంగతనం నేపథ్యంలో ఆరు ప్రత్యేక బృందాలను

మిగతా 2వ పేజీలో ▶

# 'పెట్టుబడి' సాయం మూడు దశల్లో..!

**భూరికార్డుల డిజిటలైజేషన్ పూర్తికాకపోవడంతో నిర్ణయం**

- వచ్చే నెల 19 నుంచి చెక్కుల పంపిణీ షురూ
- డిజిటలైజేషన్ పూర్తయినకొద్దీ సాయం అందజేత
- ఏ బ్యాంకు, బ్రాంచీలోనైనా సొమ్ము తీసుకునేలా ఆర్డర్ చెక్కులు
- కానీ రైతుకు ఏదో ఒక బ్యాంకులో ఖాతా ఉండటం తప్పనిసరి
- పథకం దుర్వినియోగం కాకుండా ఈ నిబంధన: అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయాన్ని మూడు దశల్లో అందజేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. రెవెన్యూశాఖ చేపట్టిన భూప్రక్షాళన రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ జాప్యం అవుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. డిజిటలైజేషన్ అవుతున్న భూముల వివరాలను ఎప్పటికప్పుడు తీసుకుని ఆ మేరకు రైతులకు పెట్టుబడి చెక్కులను పంపిణీ చేస్తామని పేర్కొంటున్నాయి. వచ్చే నెల 19న చెక్కుల పంపిణీ ప్రక్రియను మొదలుపెట్టి.. 45 రోజుల్లో రైతులందరికీ పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కో దశలో కచ్చితంగా ఇంత మందికి పంపిణీ చేయాలన్నట్టుగా కాకుండా.. వీలైనంత మంది రైతులకు ఇస్తూ, మూడు దశల్లో మొత్తం పంపిణీ పూర్తి చేస్తామని వెల్లడిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి, బ్యాంకులకు కూడా నిధుల సమస్య,

మిగతా 2వ పేజీలో ▶



ఫ్యామిలీలో...

**వాళ్లది ఆరాటం.. నాది పోరాటం**

మగాడిలో దమ్ము, ధైర్యం లేనప్పుడల్లా చేసేదొక్కటే... స్త్రీని కించపరచడం, స్త్రీ సామర్థ్యాన్ని శంకించడం, స్త్రీని అణచివేయడం. ప్రతిభ, ఆత్మవిశ్వాసం ఉన్న మగాడు ఇలాంటివేమీ చెయ్యడు. అవి లేనివాళ్లకు ఉండేది ఒక్కటే.. రాజకీయ ఆరాటం! అవన్నీ ఉన్న మహిళది ప్రజలకోసం పోరాటం.

ఎమ్మెల్యే రోజా ఇంటర్వ్యూ..

## రైతు బీమాకు రూ. 500 కోట్లు



- బడ్జెట్‌లో కేటాయించాలని ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ ప్రతిపాదన
- అన్నదాతల సాధారణ మరణాలు, ఆత్మహత్యలకూ ఇదే బీమా వర్తింపు.. ఇక రైతు ఆత్మహత్యల జాబితా తయారీకి చెల్లుచీటీ
- రూ. 5 లక్షల పరిహారంలో రూ. 2 లక్షలు కేంద్రం వాటా
- మార్గదర్శకాలు రూపొందిస్తున్న అధికారులు

- వివరాలు 6లో





## మేఘాలయ సీఎంగా సంగ్మా ప్రమాణం

- నాగాలాండ్, త్రిపురలకు ఖరారైన కొత్త సీఎంల పేర్లు

-వివరాలు 7లో

## శ్రీలంకలో ఎమర్జెన్సీ

- శ్రీలంకలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మత ఘర్షణల నేపథ్యంలో దేశంలో పది రోజుల పాటు ఎమర్జెన్సీని విధించారు.

-వివరాలు 7లో


ఇదండీ సంగతి



సడెన్‌గా అలా మాట్లాడేసరికి మీ ఆరోగ్యం మీద అనుమానం వచ్చి డాక్టర్‌ని తీసుకొచ్చాన్సార్!!

# ఏప్రిల్ 14న రజనీ పార్టీ?

### రజనీ అభిమాన సంఘాల వెల్లడి



**సాక్షి ప్రతినిధి, చెన్నై:** ప్రముఖ నటుడు రజనీకాంత్ ఏప్రిల్ 14న పార్టీని ప్రకటిస్తారని ఆయన అభిమాన సంఘాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో రాజకీయ ప్రవేశం ఖాయమని ప్రకటించిన రజనీ తన అభిమాన సంఘాల పేరును రజనీకాంత్ ప్రజా సంఘాలుగా మార్చారు. ఆ తరువాత వాటికి జిల్లా ఇన్‌చార్జ్‌లను నియమిస్తున్నారు. మరో వైపు రెండుకోట్ల సభ్యత్వం లక్ష్యంగా ప్రజా సంఘాల ఇన్‌చార్జ్‌లు ప్రజలను కలుస్తున్నారు. చాపకింద నీరులా సాగుతున్న రజనీ రాజకీయ సన్నాహాలు చెన్నై పూందమల్లిలోని విద్య, పరిశోధన కేంద్రంలో ఎంజీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంతో ఊపందుకున్నాయి. ఈ సభలో రజనీ చేసిన ప్రసంగం ఎంజీఆర్ అభిమానులను సైతం ఆకట్టుకుంది. మంగళవారం నుంచి నాలుగురోజులపాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రజనీ తన ప్రజాసంఘాల నేతలతో మాట్లాడడం ప్రారంభించారు. ఏప్రిల్ మొదటి వారంలో అన్నిజిల్లాల ఇన్‌చార్జ్‌లను చెన్నైకి పిలిపించుకుని కొత్త పార్టీ పేరు, పతాకం, చిహ్నం, లక్ష్యాలు తదితర అంశాలపై చర్చించిన తరువాత ఆవిర్భావ తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.


## 25 వేల మంది రైతులతో యాత్ర

### ఆలిండియా కిసాన్ సభ నేతృత్వంలో నాసిక్ నుంచి ముంబైకి..

**నాసిక్:** రుణ మాఫీ, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం సుమారు పాతిక వేల మంది రైతులు నాసిక్ నుంచి ముంబైకి మహా యాత్రగా బయల్దేరారు. ఆలిండియా కిసాన్ సభ నేతృత్వంలో ఈ ర్యాలీ మంగళవారం సాయంత్రం ప్రారంభమైంది. థానే, పాల్ఘర్ జిల్లాల రైతులు మార్గ మధ్యలో వారితో జతకలిసే అవకాశాలున్నాయి. యాత్ర ప్రారంభించడానికి ముందు రైతు నాయకులు ప్రసంగిస్తూ..ముంబైలో తాము విధాన్ సభను ముట్టడిస్తామని హెచ్చరించారు. అభివృద్ధి పేరిట ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవద్దని ఆలిండియా కిసాన్ సభ కార్యదర్శి రాజు దేస్లే ప్రభుత్వాన్ని కోరారు. ఆలిండియా కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ ధావ్లే, నాసిక్ ఎమ్మెల్యే జేపీ గావిట్‌లు యాత్రలో పాల్గొంటున్నారు. ర్యాలీ మార్చి 12న ముంబై చేరుకునే అవకాశాలున్నాయి.

## సొంత పార్టీకి హీరో ఉపేంద్ర గుడ్‌బై

### పార్టీ నేతలతో విభేదాలే కారణం



**సాక్షి, బెంగళూరు:** ఎంతో ఆర్భాటంగా రాజకీయ పార్టీ పెట్టి ఆరు నెలలు కూడా కాకముందే అంతర్గత కుమ్ములాటలతో విలక్షణ నటుడు, కన్నడ స్టార్ ఉపేంద్ర దాన్నుంచి వైదొలిగారు. కన్నడ ప్రజ్ఞావంత జనతా పార్టీ (కేపీజేపీ) అధ్యక్ష పదవి, ప్రాథమిక సభ్యత్వానికి ఆయన మంగళవారం బెంగళూరులో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇకపై తనకు, కేపీజేపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'ఏ లక్ష్యాలతో కేపీజేపీని ప్రారంభించామో అదే లక్ష్యాలతో మరో పార్టీని ప్రారంభిస్తా. నేను ఏ పార్టీలోనూ చేరడం లేదు. ప్రజాకీయ పేరుతో మరో పార్టీ ఏర్పాటు చేయబోతున్నా. వీలైతే ఆ కొత్త పార్టీ ద్వారానే ఎన్నికలకు వెళ్తా. కుదరకపోతే వచ్చే కార్పొరేషన్ లేదా గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనైనా పోటీ చేస్తాను' అని తెలిపారు. ప్రజా రాజకీయాలే పరమావధి అని చెబుతూ ఉపేంద్ర నాలుగు నెలల క్రితం పార్టీకి నాంది పలికారు. అయితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, పార్టీ నిర్వహణ తదితర విషయాల్లో ఇతర నేతలతో విభేదాలు వచ్చాయి. ఉపేంద్రది నియంతృత్వ ధోరణి అని నేతలు వీధికెక్కారు. కాగా, తనకు ఇప్పటికే అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని, కావాల్సినదల్లా ఒక రాజకీయ పార్టీ ఏర్పాటు ఉపేంద్ర స్పష్టం చేశారు. పార్టీ ఏర్పాటు చేసి ఎన్నికల గుర్తు వస్తే అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు. కాగా, ఉపేంద్ర ఏర్పాటు చేసే కొత్త పార్టీ నుంచి పోటీకి సిద్ధమని ప్రముఖ దర్శకురాలు రూపా అయ్యర్ ప్రకటించారు.

## విధులపైనా అవగాహన కల్పించాలి: మోదీ

**న్యూఢిల్లీ:** ప్రజలకు వారు నిర్వర్తించాల్సిన విధులపై అవగాహన కల్పించడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల్ని నిర్వర్తించకుండా హక్కుల గురించి వాదించడం రాజ్యాంగ ప్రాథమిక విలువలకు విరుద్ధమని అన్నారు. ఆర్టీఐ(సమాచార హక్కు)లాగానే.. సరైన నడవడికపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని, ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతను సీఐసీ తీసుకోవాలని మోదీ కోరారు. పారదర్శకత, జవాబుదారీతనాలు ప్రజాస్వామ్య పాలనకు ఎంతో ముఖ్యమని అన్నారు. సాధికారత కలిగిన పౌరుడు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అన్న అంశంతో ఏకీభవిస్తానని, గత నాలుగేళ్లలో ప్రజలకు సమాచారమిచ్చేందుకు, సాధికారత కోసం ఎన్నో ప్రయత్నాలు చేశామని ప్రధాని చెప్పారు. ఈ సందర్భంగా సీఐసీ మొబైల్ యాప్‌ను ఆయన ప్రారంభించారు.

## విమాన చార్జీల నియంత్రణ అవసరం

### అభిప్రాయపడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

**న్యూఢిల్లీ:** పండుగలు, పలు సీజన్‌లలో విమాన సంస్థలు చార్జీలను విపరీతంగా పెంచడం సరికాదని మంగళవారం భేటీ అయిన పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా ఇలాంటి చర్యలు మన దేశంలో సరికాదంది. చార్జీల పెంపు విషయం తెలిసినా పౌర విమాన శాఖ ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంపై పార్లమెంట్‌కు నివేదక అందజేయాలని నిర్ణయించారు. విమాన చార్జీల నియంత్రణకు గతంలో ఇచ్చిన సూచనలను ఆ మంత్రిత్వ శాఖ సీరియస్‌గా తీసుకున్నట్లు లేదని రవాణా, పర్యాటకం, సంస్కృతిపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. కొన్ని విమాన సంస్థలు మామూలు రోజుల్లో కంటే పండుగల సీజన్‌లో 10 శాతం చార్జీలను పెంచుతున్నాయని, దీనిపై ప్రభుత్వ నియంత్రణ తప్పకుండా అవసరమని వివరించింది. ఏవియేషన్ టర్బైన్ ఇంధన చార్జీలు తగ్గినప్పుడు ఆ మేరకు ప్రయాణికులు లబ్ధిపొందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించింది.

## ర్యాగింగ్‌పై నెలవారీ నివేదికలు ఇవ్వండి

### విద్యాసంస్థలను కోరిన హెచ్చార్డీ శాఖ

**న్యూఢిల్లీ:** ర్యాగింగ్‌కు సంబంధించి కళాశాలల్లో నమోదయ్యే ఫిర్యాదులపై నెలవారీ నివేదిక ఇవ్వాలని మానవ వనరుల శాఖ విద్యా సంస్థలను ఆదేశించింది. కాలేజీల్లో ఎన్ని ర్యాగింగ్ కేసులు నమోదవుతున్నాయి, వాటిల్లో పరిష్కృతమవుతున్న కేసులెన్ని? వంటి వివరాలు ఇవ్వాలని కోరింది. ఒకవేళ ఏదైనా ఫిర్యాదును మూసివేస్తే దానికి గల కారణాలను కూడా నివేదికలో వెల్లడించాలని తెలిపింది. అలాగే ర్యాగింగ్‌పై ఫిర్యాదు చేసిన విద్యార్థులు, తల్లిదండ్రుల స్పందన ఎలా ఉందో చెప్పాలని పేర్కొంది. ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్, ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తదితర నియంత్రణ సంస్థలతో జరిగిన సమావేశంలో హెచ్చార్డీ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో ప్రధానంగా ర్యాగింగ్ నిరోధానికి విద్యా సంస్థల్లో చేపడుతున్న కార్యక్రమాలు, వాటి అమలుతీరు తదితర అంశాలపై చర్చించింది.



### ఫెడరల్ ఫ్రంట్ ఎజెండా..

# బంగారు భారత్!

### కసరత్తు చేస్తున్న కేసీఆర్ • దేశానికి 'బంగారు తెలంగాణ' నమూనా

- కాళేశ్వరం తరహాలో ప్రతి రాష్ట్రంలో జాతీయ సాగునీటి ప్రాజెక్టు
- దేశవ్యాప్తంగా రైతులందరికీ పెట్టుబడి సాయం పథకం
- అన్ని రాష్ట్రాల్లో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులు
- అంతటా 24 గంటల విద్యుత్.. వ్యవసాయానికి ఉచిత సరఫరా
- ప్రభుత్వ వైద్యానికి ప్రాధాన్యం.. కేసీఆర్ కిట్ తరహా పథకాలు
- అన్ని ప్రభుత్వ పాఠశాలలు రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్పు నినాదం
- రిజర్వేషన్ల శాతం, నిధుల వినియోగం అధికారాలు పూర్తిగా రాష్ట్రాలకే!
- రాష్ట్రాలకు పన్నుల్లో వాటాను 50 శాతానికిపైగా పెంచాలనే డిమాండ్
- ప్రాథమికంగా సిద్ధమైన ఎజెండా..
  రాష్ట్ర, ఇతర రాష్ట్రాల అధికారులతో ముఖ్యమంత్రి చర్చలు



**సాక్షి, హైదరాబాద్:**

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు లక్ష్యంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఏర్పాటు చేయనున్న ఫెడరల్ ఫ్రంట్‌కు రాజకీయ ఎజెండా సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా సమాన అభివృద్ధి లక్ష్యంగా, రైతులను, పేద వర్గాలను ఆదుకునే చర్యలతో ఎజెండాను రూపొందిస్తున్నారు. ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా అమలు చేసిన పథకాలను చూపి, గుజరాత్ మోడల్ నినాదంతో దేశ రాజకీయాల్లో సత్తా చాటారు. అదే తరహాలో 'బంగారు తెలంగాణ'ఎజెండాను దేశవ్యాప్తంగా అమలు చేయడం లక్ష్యంగా ఫెడరల్ ఫ్రంట్ ఎజెండాను సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో అమలవుతున్న ముఖ్యమైన పథకాలు, కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తామనే నినాదాన్ని ఎత్తుకోనున్నారు. ఈ ఎజెండాకు సంబంధించి సీఎం కేసీఆర్.. సీఎంవో అధికారులు, వివిధ రాష్ట్రాల్లోని సీనియర్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా అవసరమైన, ప్రభావం చూపగలిగే పథకాలను గుర్తించాలని కేసీఆర్ అధికారులకు సూచించినట్లు సమాచారం. మొత్తంగా బంగారు తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలను దేశవ్యాప్తంగా అమలు చేసే లక్ష్యంతో ఫెడరల్ ఫ్రంట్ ఎజెండాను ప్రాథమికంగా ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది.

### ప్రాథమిక ఎజెండాలోని అంశాలివీ..

- రాష్ట్రాలకు కేంద్రం పంపిణీ చేస్తున్న పన్నుల వాటాను 42 శాతం నుంచి 50 శాతానికి పైగా పెంచాలి.
- స్థానిక సంస్థలకు కేంద్రం నేరుగా నిధులు పంపిణీ చేసే విధానాన్ని మార్చాలి. రాష్ట్ర ప్రభుత్వాల ద్వారానే స్థానిక సంస్థలకు నిధుల పంపిణీ జరగాలి.
- కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఇచ్చే నిధులను నిర్దిష్టంగా అదే పథకానికి ఖర్చు చేయాలనే నిబంధనలు తొలగించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆ నిధులను తమ ప్రాంత, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించుకునేలా అవకాశం ఉండాలి.
- రక్షణ, విదేశాంగం, అంతర్గత భద్రత, కరెన్సీ నిర్వహణ వంటి కీలకమైన అంశాలు కచ్చితంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండాలి. మిగతా అంశాలన్నింటినీ రాష్ట్రాలకే కేటాయించాలి. ఉమ్మడి జాబితాలో ఉన్న దాదాపు అన్ని అంశాలను రాష్ట్రాలకే అప్పగించాలి.
- రిజర్వేషన్ల శాతం నిర్ణయించే అధికారం రాష్ట్రాల పరిధిలోనే ఉండాలి. జనాభాలోని ఆయా వర్గాల నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్రాలకు ఉంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయి.
- తెలంగాణలో లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందించేందుకు నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు నమూనాగా.. ప్రతి రాష్ట్రంలో ఒక భారీ సాగునీటి ప్రాజెక్టును నిర్మించాలి. అక్కడి ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి. ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి కేంద్ర నిధులతోనే నిర్మించాలి.
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన చిన్న నీటి వనరులను పునరుద్ధరించాలి. రాష్ట్రంలో అమలు చేస్తున్న మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలి. అన్ని రాష్ట్రాల్లో చెరువులు, కుంటలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.
- రాష్ట్రంలో అమలు చేయనున్న ఎకరానికి రూ.8 వేల వ్యవసాయ పెట్టుబడి సాయం పథకాన్ని దేశమంతటికి విస్తరించాలి. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందించాలి.
- దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి. వ్యవసాయానికి ఉచితంగా కరెంటు సరఫరా ఉండాలి. దీనికి అవసరమైన మౌలిక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- తెలంగాణలో ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించేలా అమలవుతున్న 'కేసీఆర్ కిట్'తరహా పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలి. ప్రసూతి అనేది పేదలకు భారం కాకుండా, పేద మహిళలకు ఆరోగ్యపరంగానూ ఈ పథకం భరోసా ఇస్తుంది. ప్రజారోగ్య రంగాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.
- ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ రెసిడెన్షియల్ స్కూళ్లుగా అభివృద్ధి చేయాలి. దేశవ్యాప్తంగా ప్రైవేటు విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని తీర్చిదిద్దాలి.

## లెక్కలు చెప్పనందుకు చిక్కులు

- స్థానిక సంస్థల్లో పోటీ చేయకుండా 13,329 మందిపై అనర్హత
- గత ఎన్నికల ఖర్చులు చెప్పనందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొరడా

**సాక్షి, హైదరాబాద్:** గత స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు పాటించని వేలాది మందిపై రాష్ట్ర ఎన్నికల సంఘం కొరడా ఝళిపించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలతోపాటు 2014లో జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ఖర్చు వివరాలను చెప్పని 13,329 మందిపై అనర్హత వేటు వేసింది. మూడేళ్ల వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. అనర్హత వేటుకు గురైన వారిలో 8 వేల మంది గత ఎన్నికల్లో పంచాయతీ వార్డు సభ్యులుగా పోటీ చేశారు. మరో 3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఉమ్మడి ఏపీలో 2013 జూలైలో తెలంగాణలోని 8,778 సర్పంచ్, 88,682 వార్డులకు ఎన్నికలు జరిగాయి. అలాగే 2014 మార్చిలో 438 జెడ్పీటీసీ, 6,441 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అన్ని పదవులకు సగటున ముగ్గురు చొప్పున పోటీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన వారు... ఎన్నిక ముగిసిన 40 రోజుల్లోగా ఎన్నికల ఖర్చుల వివరాలను అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. లేకుంటే ఎన్నికల సంఘం షార్ట్ నోటీసు జారీ చేస్తుంది. ఈ నోటీసుకు స్పందించని వారిపై మూడేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేస్తుంది. ప్రక్రియలో భాగంగా షార్ట్ నోటీసుకూ స్పందించని 13,329 మందిపై రాష్ట్ర ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసింది. ఎన్నికల ఖర్చు వివరాలను చెప్పని వారికి నోటీసులు ఇచ్చే ప్రక్రియ ఇంకా జరుగుతోంది. దశలవారీగా ఇలా వేటు వేసే ప్రక్రియ కొనసాగనుంది.

## ...'ఫెడరల్ ఫ్రంట్'!

▶ మొదటి పేజీ తరువాయి



పార్టీలను కూడగడతానని ప్రకటించిన కేసీఆర్.. భవిష్యత్ కార్యాచరణపై దృష్టి కేంద్రీకరించారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలను ఆకర్షించి, ఏకతాటిపైకి తీసుకు వచ్చేందుకు అనుసరించాల్సిన ఎత్తుగడలపై మథనం చేస్తున్నారు. దీనికోసం రాజకీయ, రాజకీయేతర మేధావులతో చర్చిస్తున్న ఆయన.. టీఆర్ఎస్ ఆవిర్భావ సభను వేదికగా చేసుకోవాలని భావిస్తున్నారు.

**ఉద్యమం నాటి తరహాలో..**

తెలంగాణ ఉద్యమం జరుగుతున్న రోజుల్లో టీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభలను నిర్వహించారు. వాటికి ఇతర రాష్ట్రాల్లోని పార్టీల అధినేతలు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. మాజీ ప్రధాని దేవెగౌడ, ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, ఆర్ఎల్‌డీ అధినేత అజిత్‌సింగ్ తదితరులు టీఆర్ఎస్ సభల్లో పాల్గొని తెలంగాణ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. అలా ఇతర పార్టీలు రాజకీయ వేదికలపై సంఘీభావం తెలపడం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. ఇప్పుడు ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులోనూ అదే తరహాలో వ్యవహరించాలని.. కలిసి వచ్చే రాజకీయ పార్టీల నేతలను, కూటమి పట్ల సానుకూలంగా ఉన్న నేతలను ఆహ్వానించాలని కేసీఆర్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. తద్వారా దేశవ్యాప్తంగా ఫెడరల్ ఫ్రంట్‌పై దృష్టి పడుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 27న నిర్వహించే భారీ బహిరంగసభను ఫెడరల్ ఫ్రంట్‌కు పునాదిగా మలచాలని కేసీఆర్ యోచిస్తున్నట్టు తెలిసింది.

**10 లక్షల మందితో..**

ఫెడరల్ ఫ్రంట్‌కు పునాది వేసే బహిరంగసభను తెలంగాణలో ఏర్పాటు చేయడం వల్ల దేశవ్యాప్తంగా మన రాష్ట్రంపై దృష్టి పడేలా చేయడం, టీఆర్ఎస్ కేడర్‌లో స్థైరం నింపడమనే రెండు లక్ష్యాలు నెరవేరుతాయని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లేదా నల్లగొండలో 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు కేసీఆర్ సన్నిహితులు చెబుతున్నారు. దేశంలోని పలు ప్రాంతీయ పార్టీల అధినేతలను, ప్రతినిధులను ఆహ్వానించనుండటంతో ఆ స్థాయిలోనే బహిరంగ సభ ఉండాలని భావిస్తున్నట్టు చెబుతున్నారు. కేసీఆర్ ఒకసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లి వస్తారని.. అనంతరం బహిరంగసభకు ఆహ్వానించే పార్టీల నాయకులు, ప్రతినిధుల జాబితా సిద్ధం కానుందని పేర్కొంటున్నారు.

# కట్టేసి.. కొట్టేశారు

▶ మొదటి పేజీ తరువాయి

రంగంలోకి దింపారు.

**అంతా పశ్చిమబెంగాల్ వారే..**

పశ్చిమబెంగాల్‌కు చెందిన నిత్యాదాస్ బంగారు ఆభరణాల తయారీ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఓ కార్ఖానా ఉండగా, పాతబస్తీలోని పేట్లబురుజు సమీపంలో నగర పోలీసు సాయుధ దళం ప్రధాన కార్యాలయం(సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్) వెనుక వైపు ఉన్న షేర్ అలీ తబేలాలోని ముజీబ్ ఇంట్లో మరో కార్ఖానా నడుస్తోంది. మూడంతస్తుల భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఆరేళ్లుగా నడుస్తున్న ఈ కార్ఖానాలో పశ్చిమబెంగాల్‌కు చెందిన అనేక మంది పనిచేస్తున్నారు. కొందరు మానేస్తుండగా ఎప్పటికప్పుడు కొత్త వారు చేరుతున్నారు. నిత్యాదాస్ ఇటీవల ముంబై వెళ్లగా మేనేజర్‌గా ఉన్న ఆయన మేనల్లుడు సాహెబ్‌దాస్ పనులు పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 8 నుంచి 10 మంది దుండగులు ఒక్కసారిగా కార్యాలయంలోకి చొరబడ్డారు. లోపలి నుంచి తలుపులు బిగించి బోల్టులు పెట్టారు. కత్తులు, కర్రలతో భయపెడుతూ సాహెబ్‌తో పాటు పనిచేస్తున్న 20 మంది కార్మికుల్ని ఓ చోటుకు చేర్చారు. వారి కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి దాడి చేశారు. అరిస్తే చంపేస్తామని బెదిరించి ఓ రూమ్‌లో అందరినీ బంధించారు. కార్ఖానాలో ఉన్న 5 కేజీల బంగారాన్ని ఓ బ్యాగ్‌లో నింపుకుని పరారయ్యారు. దుండగులు వెళ్తూవెళ్తూ సీసీ కెమెరాల డీవీఆర్‌నూ పట్టుకుపోయారు. కొద్దిసేపటికి తేరుకున్న సాహెబ్ మిత్రులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

**తెలిసిన వారి పనేనా..?**

బందిపోటు దొంగతనానికి ఒడిగట్టిన దుండగులు కార్ఖానాలో అణువణువూ తమకు తెలిసినట్లు వ్యవహరించారు. బయటకు ఎవరికీ కనిపించని ఓ చిన్న బీరువా విషయాన్నీ వీరు కార్మికులతో ప్రస్తావించారు. అదే గదిలో బందీగా ఉన్న ఓ కార్మికుడు ఆ బీరువాలో ఏం లేదని చెప్పినా వినిపించుకోని దుండగులు.. ఆభరణాలు ఉంటాయని తెరవాలంటూ బెదిరించారు. కార్మికులు దాన్ని తెరవగా అందులోని 1,100 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకున్నారు. కార్ఖానాలోకి వచ్చేందుకు ప్రధాన ద్వారం వినియోగించిన వీరు.. తిరిగి వెళ్లడానికి మాత్రం పక్కనే ఉన్న కనెక్టింగ్ రోడ్ వాడారు. కార్ఖానా వద్దకు చేరుకునే విషయంలోనూ దుండగులు తెలివిగా వ్యవహరించారు. పది మందీ కలసి వస్తే ఎవరైనా గమనించే ఆస్కారం ఉందనే ఉద్దేశంతో వేర్వేరు మార్గాల్లో ఎవరికి వారుగా పేట్లబురుజు చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ నుంచి కార్ఖానా సమీప ప్రాంతంలోకి నడుచుకుంటూ వెళ్లి గంటన్నర పాటు విడివిడిగా వేచి ఉన్నారు. నేరం చేసిన తర్వాత సైతం వచ్చిన మార్గంలో కాకుండా ఫిర్దోష్ స్కూల్ వైపు వెళ్లారు. దొంగతనం పూర్తయిన తర్వాత సమాచారం అందుకున్న ముగ్గురు దుండగులు ద్విచక్ర వాహనాలు తీసుకురాగా.. వాటిపై ఆరుగురు సొత్తుతో పారిపోయారు. మిగిలిన వారు జనాల్లో కలసి కనుమరుగయ్యారు. చార్మినార్ పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్, టాస్క్‌ఫోర్స్‌ను రప్పించారు.

**స్కూల్ వద్ద ఆగిపోయిన జాగిలం..**

ఘటనాస్థలికి వచ్చిన పోలీసు జాగిలాలు కార్ఖానాలో 15 నిమిషాలు కలియతిరిగాయి. ఆపై ముందు ఉన్న ప్రధాన రహదారి వైపు కాకుండా చార్ మహల్ మీదుగా పురానాపూల్ వెళ్లే దారిలోకి వెళ్లాయి. అక్కడ నుంచి ఓ గల్లీలోని ఫిర్దోస్ స్కూల్ వద్దకు వెళ్లి ఆగిపోయాయి.



కార్మికులను విచారిస్తున్న పోలీసులు

కొద్దిసేపు అక్కడే ఉన్న జాగిలం తిరిగి కార్ఖానా వద్దకే వచ్చింది. దీన్నిబట్టి దుండగులు ఫిర్దోష్ స్కూల్ మీదుగా పురానాపూల్ వైపు పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉదంతం జరిగిన సమయంలో కార్ఖానాలో ఉన్న కార్మికులతో పాటు మేనేజర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పురానాపూల్, పేట్లబురుజుతో పాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫీడ్‌ను అధ్యయనం చేస్తున్నారు. కార్ఖానాకు 150 మీటర్లని పురానాపూల్ వైపు ఉన్న ఓ సీసీ కెమెరాలో దుండగులు వినియోగించిన ద్విచక్ర వాహనం ఆనవాళ్లు రికార్డు అయినట్లు తెలిసింది.

**సరైన భద్రతా చర్యలు లేవన్న డీసీపీ..**

దొంగతనం జరిగిన ప్రాంతాన్ని దక్షిణ మండలం డీసీపీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ ఉదంతంలో కాల్పులు జరిగిన ఆనవాళ్లు లేవని, ఎవరికీ గాయాలు కాలేదని వివరించారు. ప్రస్తుత, మాజీ సిబ్బంది పాత్ర కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ముంబై నుంచి నిత్యాదాస్ వస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయని చెప్పారు.

### ఎక్కడా కనిపించని 'ప్రతిఘటన'

ప్రాథమిక ఆధారాలను బట్టి ఈ బందిపోటు దొంగతనంలో పది నుంచి 12 మంది పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు ద్విచక్ర వాహనాలతో సమీపంలోనే వేచి చూడగా.. మిగిలిన వారు కార్ఖానాలోకి ప్రవేశించారు. ఆ సమయంలో కార్ఖానాలో ఉన్న 20 మంది కార్మికులు ప్రతిఘటించే ప్రయత్నం చేయలేదని పోలీసులు చెప్తున్నారు. వీరు ప్రతిఘటించినా, కాస్త ధైర్యం చేసి అప్రమత్తం చేసినా సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో శిక్షణ నిమిత్తం గ్రౌండ్స్‌లో ఉన్న దాదాపు 200 మంది పోలీసులు అప్రమత్తమయ్యేవారు. దీనికితోడు బందిపోటు దొంగలు తమకు కార్ఖానాలో ప్రతి అణువూ తెలిసినట్లు ప్రవర్తించారు. వీటిని బేరీజు వేస్తున్న పోలీసులు ఆ కార్ఖానాకు చెందిన ప్రస్తుత–పాత కార్మికులు కలసి ఈ దొంగతనం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఇదే విషయాన్ని ముంబైలో ఉన్న నిత్యాదాస్ వద్ద ప్రస్తావించగా.. అనుమానితులుగా పరిగణించే ఆరుగురి పేర్లు చెప్పారు. దీంతో పోలీసులు కొందరు ఉద్యోగుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బందిపోటు దొంగలు తమ వెంట తుపాకీ తీసుకువచ్చారని, ఓ రౌండ్ కాల్పులు జరిపారని స్థానికులు చెప్తున్నారు. తుపాకీ చూపించిన నేపథ్యంలోనే కార్మికులు ప్రతిఘటించలేదని తెలుస్తోంది. అయితే దుండగులు తుపాకీ వినియోగించారనే అంశాన్ని పోలీసులు కొట్టిపారేస్తున్నారు.

## 'పెట్టుబడి' సాయం మూడు దశల్లో!

▶ మొదటి పేజీ తరువాయి

కరెన్సీ కొరత వంటివి తలెత్తకుండా ఉంటుందని పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం చెక్కులు అందజేయాల్సి ఉండగా.. ఆరు బ్యాంకులకు ఈ బాధ్యతను అప్పగించారు. అందులో ఒక్క ఎస్‌బీఐ ద్వారానే 18 లక్షల మందికి చెక్కుల పంపిణీ జరగనుంది. మిగతా ఐదు బ్యాంకులు మిగతా రైతులకు చెక్కులు పంపిణీ చేస్తాయి. రికార్డుల డిజిటలైజేషన్ పూర్తయిన భూముల వివరాలను, రైతుల సమాచారాన్ని వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు బ్యాంకులకు అందజేస్తుంది. ఆ ప్రకారం చెక్కులను ముద్రించి జిల్లాలకు పంపిస్తారు.

**ఖరీఫ్‌లోనే రూ.6,600 కోట్లు..**

రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయం పథకాన్ని వచ్చే ఖరీఫ్ నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద రైతులకు ఎకరాకు ఖరీఫ్‌లో రూ.4 వేలు, రబీలో రూ.4 వేల చొప్పున అందజేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 1.65 కోట్ల ఎకరాలకు సంబంధించి సాయం పంపిణీ చేయాల్సి ఉంటుందని అంచనా. ఇందుకోసం ఖరీఫ్ సీజన్‌లోనే రూ.6,600 కోట్లు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా రెండు సీజన్లకు కలిపి పెట్టుబడి పథకానికి రూ.12 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

**రైతులకు బ్యాంకు ఖాతా తప్పనిసరి**

పెట్టుబడి పథకం కింద రైతులకు 'ఆర్డర్ చెక్కులు' జారీ చేయనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో జారీ చేసే ఈ ఆర్డర్ చెక్కులను ఏ బ్యాంకులోనైనా, ఏ బ్రాంచీలోనైనా నగదుగా మార్చుకోవడానికి వీలుంటుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. అయితే సంబంధిత రైతుకు ఏదో ఒక బ్యాంకులో తప్పనిసరిగా ఖాతా ఉండాలి. చెక్కును క్లియర్ చేసేటప్పుడు బ్యాంకులు సదరు రైతుకు ఖాతా ఉందో లేదో పరిశీలిస్తాయి. సంబంధిత రైతే 'పెట్టుబడి'చెక్కును క్లియర్ చేసుకుంటున్నాడో లేదో గమనించడానికి.. దుర్వినియోగం కాకుండా నియంత్రించడానికి ఈ నిబంధన పెట్టినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. రైతులెవరికైనా బ్యాంకు ఖాతా లేకుంటే వెంటనే తెరవాలని సూచిస్తున్నాయి.



## ఎస్సారెస్పీ పూడికపై కేంద్రం ఆందోళన

### తక్షణ నివారణ చర్యలు తీసుకోవాలని రాష్ట్రానికి ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** ఉత్తర తెలంగాణకు వరప్రదాయనిగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పెరుగుతున్న పూడికపై ఆందోళన పెరుగుతోంది. ఓవైపు ఎగువ ప్రవాహాలు కరువై ప్రాజెక్టులకు నీటి లభ్యత తగ్గిపోతుందన్న ఆందోళన ఉండగానే కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కొత్తగా పూడికతో నీటి నిల్వలు తగ్గుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో ఇది మరింత ఉధృతం కాకముందే తక్షణ నివారణ చర్యలు చేపట్టాల్సి ఉందని సూచించింది. ఈ మేరకు నీటి సమర్థ వినియోగ అధ్యయనం జరిపిన సీడబ్ల్యూసీ, వివరాలను రాష్ట్రానికి పంపి తక్షణ నివారణ చర్యలను సూచించింది. నిజానికి శ్రీరాంసాగర్‌ను 112 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టగా 1983లో జరిపిన సర్వే ప్రకారం తీవ్రంగా వచ్చి చేరిన పూడిక కారణంగా నిల్వ సామర్థ్యం 90.30 టీఎంసీలకు చేరింది. అనంతరం సైతం ఎగువ మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున గోదావరి మోసుకొచ్చిన బురద, మట్టి కారణంగా మరింత నిల్వలు తగ్గాయి. 2014లో జరిపిన హైడ్రాలిక్ సర్వే ప్రకారం అది 80.10 టీఎంసీలకు పడిపోయింది. ఏకంగా 10.20 టీఎంసీల మేర నిల్వలు తగ్గినట్లు నీటి పారుదల శాఖ అధ్యయనాలు తేల్చాయి. అనంతరం ఎస్సారెస్పీకి వచ్చిన ప్రవాహాలతో భారీ బురద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటి నిల్వలు క్రమంగా పడిపోతున్నాయి.

**ఆధునిక పద్ధతులతో పూడికతీత..**

భవిష్యత్‌లో రాష్ట్ర సాగు, తాగు అవసరాలకు తీవ్ర ఇక్కట్లు తప్పవన్న సాంకేతాల నేపథ్యంలో తక్షణ చర్యలకు ఉపక్రమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సూచించింది. పూడికతీతకు డ్రెడ్జింగ్ వంటి ఆధునిక పద్ధతులు అనుసరించాలని పేర్కొంది. రిజర్వాయర్‌లోకి పూడిక మట్టి కొట్టుకురావడాన్ని డ్యామ్ ఎగువ ప్రాంతంలోనే అరికట్టాలని, దీనికి వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ పద్ధతి అనుసరించాలని తెలిపింది. లేనిపక్షంలో రిజర్వాయర్‌లోకి నీరు వచ్చే హెడ్ ప్రాంతంలో పూడిక రాకుండా ఏటవాలు తెరలు ఏర్పాటు చేయాలని సూచించింది.

# చిరిగిన పతాకం.. పందికొక్కుల విహారం!

## హైదరాబాద్‌లో ఏపీ సచివాలయం దుస్థితి ఇదీ

- చంద్రబాబు కార్యాలయ బ్లాక్‌పై చిరిగిన జాతీయ జెండా రెపరెప
- పాడుబడ్డ బంగ్లాలుగా భవనాలు.. ఎటుచూసినా దుర్గంధం..
- నేలపై సీసీ కెమెరాలు.. వేలాడుతూ విద్యుత్ వైర్లు
- నిర్వహణను పట్టించుకోని ఏపీ పాలకులు, అధికారులు
- భవనాలను అప్పగించాలన్న తెలంగాణ విజ్ఞప్తి బేఖాతరు

సాక్షి, హైదరాబాద్

హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ సచివాలయం నిర్వహణను ఏపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. సచివాలయంలో ఏపీకి కేటాయించిన భవనాలపై జాతీయ జెండాను కూడా కనీసం పట్టించుకోలేదు. ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయం ఉండే ఎల్ బ్లాక్‌పై చిరిగిన జెండా రెపరెపలాడింది. నిబంధనల ప్రకారం రోజూ ఉదయం జాతీయ జెండాను ఎగరేసి.. సాయంత్రం ఆరు గంటల తర్వాత తొలగిస్తారు. కానీ కొంతకాలంగా ఈ బ్లాక్‌పై జెండాను పట్టించుకున్నట్లుగా లేదు. దీంతో పతాకం చిరిగిపోయింది. ఈ నేపథ్యంలో జాతీయ జెండాకు అవమానం జరిగిందంటూ మంగళవారం ఉదయం సచివాలయంలో అధికారులు, ఉద్యోగులందరి మధ్య చర్చ జరిగింది. ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు పలువురు ఫొటోగ్రాఫర్లు ఫొటోలు తీయటంతో అప్రమత్తమైన సిబ్బంది అప్పటికప్పుడు జెండాను తొలిగించి కొత్త జెండాను అమర్చారు.



హైదరాబాద్‌లోని ఏపీ సచివాలయంలో చెత్త కుప్పల్లో పడి ఉన్న ప్రభుత్వ వాహనాలు

### పాడుబడ్డ బంగ్లాలు..

సచివాలయంలో ఏపీకి కేటాయించిన భవనాలు ఇప్పటికే దాదాపుగా ఖాళీ అయ్యాయి. ఇక్కడున్న కార్యాలయాలు అమరావతిలో ఏర్పాటు చేసిన సచివాలయానికి తరలిపోయాయి. దాదాపు ఏడాది కిందటే ఇక్కడున్న ఉద్యోగులు, అధికారులు సహా వెళ్లిపోవటంతో ఈ భవనాలు బోసిపోయాయి. వీటిని పట్టించుకున్న నాథులు లేరు. అన్ని భవనాలు పాడుబడ్డ బంగ్లాలుగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని బ్లాకుల్లో ఎలుకలు, పందికొక్కులు స్వైర విహారం చేస్తున్నాయి. అన్ని బ్లాకులు పరిశుభ్రత లోపించి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఏపీ సచివాలయ ప్రాంగణానికి వెళ్లే దారిలో సీసీ కెమెరాలన్నీ ఎక్కడపడితే అక్కడే నేలపై పడిపోయాయి. అన్ని బ్లాకుల్లో విద్యుత్తు వైర్లు వేలాడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

### పట్టించుకోని ఏపీ ప్రభుత్వం

మరోవైపు ఈ భవనాలను ఖాళీ చేసి తమకు అప్పగించాలని గతేడాది నుంచి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న విజ్ఞప్తిని ఏపీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ఇప్పటికే ఏపీ భవనాలకు సంబంధించిన కరెంటు, నీటి బిల్లుల బకాయిలన్నీ పేరుకుపోయాయి. ఎస్పీ సింగ్ సీఎస్‌గా ఉన్న సమయంలోనే రూ.60 లక్షల బకాయిలు చెల్లించాలని ఏపీ ప్రభుత్వానికి లేఖలు రాసినా ప్రయోజనం లేకుండా పోయింది. గతేడాది స్వయంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు.. సచివాలయంలోని ఏపీ భవనాలను తమకు అప్పగించాలని కోరుతూ రాష్ట్ర మంత్రివర్గంలో తీర్మానం చేయించారు. కేబినెట్ తీర్మానాన్ని గవర్నర్ నరసింహన్‌కు పంపి భవనాల ఖాళీకి ఒత్తిడి పెంచారు. గవర్నర్ సమక్షంలో రెండు రాష్ట్రాల మంత్రుల త్రిసభ్య కమిటీలు పలుమార్లు చర్చలు జరిపినా ఈ భవనాల అప్పగింతపై ఏపీ తమ నిర్ణయాన్ని వెల్లడించకుండా పెండింగ్‌లో పెట్టింది. దీంతో ఈ భవనాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.

## చెరుకు సుధాకర్‌తో మందకృష్ణ భేటీ

### ఎమ్మార్పీఎస్ బంద్‌కు తెలంగాణ ఇంటి పార్టీ మద్దతు

**సాక్షి, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదని తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ అన్నారు. చెరుకు సుధాకర్‌తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మంగళవారం భేటీ అయ్యారు. ఈ నెల 13న తలపెట్టిన బంద్‌కు మద్దతు కోసం సుధాకర్‌ను కలసి మందకృష్ణ వినతిపత్రం అందించారు. వర్గీకరణ కోసం జాతీయస్థాయిలో ఉద్యమాన్ని తీవ్రం చేయాలని చెరుకు సుధాకర్ అన్నారు. వర్గీకరణ కోసం జరుగుతున్న బంద్‌కు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని, ఇంటిపార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ఫెడరల్ ఫ్రంట్ కోసం రాత్రికి రాత్రే ఇతర రాష్ట్ర నేతలకు ఫోన్లు చేసిన సీఎం కేసీఆర్.. వర్గీకరణ కోసం ఎందుకు చొరవ తీసుకోలేదని ప్రశ్నించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో తీర్మానం చేసి, వెంటనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఫ్రంట్ అనే కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. రాష్ట్రాన్నే కాకుండా దేశాన్నే దోచుకోవడానికే కేసీఆర్ కుట్రకు పాల్పడుతున్నారని సుధాకర్ ఆరోపించారు. మార్చి 10న మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను నిర్వహిస్తామన్నారు. మార్చి 13న జరిగే బంద్‌కు అన్ని పార్టీలు, వర్గాలు మద్దతివ్వాలని మంద కృష్ణ కోరారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ కోసం 24 ఏళ్లుగా పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ 24 గంటల బంద్ నిర్వహిస్తోందన్నారు.



## అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం

### నలుగురు హైదరాబాదీలు దుర్మరణం

**కాప్రా:** అస్సాంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. సిండికేట్ బ్యాంక్ మేనేజర్, ఆయన కుమారుడు, మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఎల్లారెడ్డిగూడలో నివాసముంటున్న భానుప్రకాశ్ సిద్దిపేటలోని సిండికేట్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం ఆయన తన కొడుకు కృష్ణవంశీ, మరో ఇద్దరు స్నేహితులతో కలసి అస్సాంలోని తేజ్‌పూర్ తవాంగ్‌కు వెళ్లారు. మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు భానుప్రకాశ్ ప్రయాణిస్తున్న కారు 120 అడుగుల లోతులో పడిపోయింది. దీంతో భానుప్రకాశ్, ఆయన కొడుకు కృష్ణవంశీ సహా మరో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. భానుప్రకాశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు. భానుప్రకాశ్ దుర్మరణంతో ఆయన నివాసప్రాంతం ఎల్లారెడ్డిగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఘటనాస్థలం లోయ ప్రాంతమంతా ఆర్మీ అధీనంలో ఉండటంతో మృత దేహాలను తరలించడం ఆలస్యమైంది. కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు, ఆర్మీ సాయంతో మృత దేహాలకు పోస్టుమార్టం పూర్తిచేశారు. మృతదేహాలను ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తీసుకురానున్నట్లు కుటుంబీకులు తెలిపారు. బుధవారం అల్వాల్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## ఎలివేటెడ్ కారిడార్లకు పచ్చజెండా!

- ప్రధాన రోడ్ల విస్తరణకూ తొలగిన అడ్డంకి
- రూ.3,120 కోట్ల పనులకు కేంద్రం అనుమతులు
- ఉప్పల్, శంషాబాద్, అంబర్‌పేట వంతెనలకు లైన్‌క్లియర్..

సాక్షి, హైదరాబాద్:

జాతీయ రహదారులు, వాటిపై అవసరమైన చోట్ల ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం అనుమతినిచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గతంలో మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించేందుకు వీలుగా ఇంతకాలం కేంద్రం అనుమతివ్వలేదు. రూ.3,120 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టులకు మంగళవారం కేంద్ర ఉపరితల రవాణా శాఖ పచ్చజెండా ఊపింది. ఇందులో హైదరాబాద్‌లో కీలకమైన మూడు ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో కేంద్ర ఉపరితల రవాణ శాఖతో తెలంగాణ జాతీయ రహదారుల విభాగం నిత్యం సంప్రదింపులు జరుపుతూ వాటికి తుది అనుమతులిచ్చేలా చర్యలు తీసుకుంది. తాజాగా ఆ విభాగం ఈఎన్‌సీ గణపతిరెడ్డి ఢిల్లీ వెళ్లి అధికారులతో చర్చించటంతో అన్ని పనులకు మంగళవారం తుది అనుమతులు లభించాయి.

### ఉప్పల్ ట్రాఫిక్‌కు పరిష్కారం

హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్ వద్ద ట్రాఫిక్ చిక్కులు తీవ్రంగా ఉండటంతో వాహన వేగానికి బ్రేకులు పడుతున్నాయి. ఇక్కడ రోడ్డును విస్తరించేందుకు కూడా అవకాశం లేకపోవటంతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని గతంలోనే ప్రతిపాదించారు. తాజాగా లభించిన అనుమతుల నేపథ్యంలో ఉప్పల్ కూడలి నుంచి పీర్జాదిగూడ దాటాక ఉన్న సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వరకు 6.25 కిలోమీటర్ల మేర కారిడార్ కొనసాగనుంది. ఇందుకు రూ.850 కోట్లు ఖర్చు కానుంది. భూసేకరణకు రాష్ట్రప్రభుత్వం రూ.200 ఖర్చు చేయనుండగా మిగతా మొత్తాన్ని కేంద్రం ఇస్తుంది. అత్యంత రద్దీగా మారిన అంబర్‌పేటలో కూడా మరో వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. చే నంబర్ కూడలి నుంచి అంబర్‌పేట మార్కెట్ వద్ద ఉన్న కూడలి వరకు 4 వరుసలతో నిర్మితమయ్యే ఈ వంతెనకు రూ.186 కోట్లు ఖర్చు కానున్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో మరో వంతెన నిర్మించనున్నారు. హైదరాబాద్‌ను నుంచి ఆరాంఘర్ వరకు పీవీ ఎలివేటెడ్ కారిడార్ ఉండగా ఆ తర్వాత వాహనాలు మళ్లీ ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వస్తోంది. శంషాబాద్‌లో ఇబ్బంది ఉండటంతో ఇక్కడ వంతెన నిర్మించబోతున్నారు. ఆరాంఘర్ నుంచి శంషాబాద్ దాటే వరకు 10 కిలోమీటర్ల మేర ఆరు వరుసలతో నిర్మితమయ్యే ఈ వంతెనకు రూ.284 కోట్లు ఖర్చు కానున్నాయి. ఇవి కాకుండా రూ.224 కోట్లతో అలీనగర్–మిర్యాలగూడ మధ్య 30 కిలోమీటర్లు రోడ్డు విస్తరణ, రూ.300 కోట్లతో మల్లేపల్లి–హాలియా మధ్య 40 కి.మీ., మేర రూ.207 కోట్లతో సిరోంచా–ఆత్మకూరు మధ్య 34 కి.మీ., మేర రూ.324 కోట్లతో మిర్యాలగూడ–కోదాడ మధ్య 46 కి.మీ., రూ.114 కోట్లతో హగ్గరి–రాయ్‌చూరు–జడ్చర్ల మధ్య 15 కి.మీ. మేర రోడ్లను విస్తరించనున్నారు. వీటికి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఈఎన్‌సీ గణపతి రెడ్డి 'సాక్షి'తో చెప్పారు.

## రాష్ట్ర పరిధిలోనే డీజీపీ నియామకం

### తెలంగాణ పోలీస్ ఫోర్సెస్ యాక్ట్ తీసుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని సవరిస్తూ..
- రేపు కేబినెట్ భేటీలో బిల్లు ముసాయిదాపై చర్చ

**సాక్షి, హైదరాబాద్:** డీజీపీ నియామక అధికారం రాష్ట్ర పరిధిలో ఉండేలా తెలంగాణ ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొస్తోంది. డీజీపీ నియామకంపై కేంద్రానికున్న అధికారాన్ని సవరిస్తూ 'హెడ్ ఆఫ్ ది పోలీస్ ఫోర్సెస్ యాక్ట్–2018'బిల్లును రూపొందిస్తోంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్న ఈ బిల్లుకు గతవారమే సాధారణ పరిపాలన శాఖ అనుమతివ్వగా న్యాయ శాఖ తుది మెరుగులు దిద్దుతోంది. ఈ నెల 8న జరిగే రాష్ట్ర కేబినెట్ భేటీలో బిల్లు ముసాయిదాపై చర్చించి ఆమోదించే అవకాశముంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో జేవీ రాముడు డీజీపీగా ఉన్నప్పుడు ఏపీ ప్రభుత్వం ఇదే చట్టం చేసింది. ఆ తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకురానుంది. ప్రస్తుత విధానం ప్రకారం డీజీపీని నియమించాలంటే డీజీపీ హోదా గల ఐపీఎస్ అధికారుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్‌సీకి పంపిస్తుంది. అందులో ముగ్గురు సీనియర్ అధికారులతో కూడిన జాబితాను యూపీఎస్సీ, డీవోపీటీ రాష్ట్రానికి తిరిగి పంపుతాయి. అందులో ఒకరిని సీఎం విచక్షణాధికారం మేరకు డీజీపీగా నియమిస్తారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే యూపీఎస్సీ, కేంద్రంతో సంబంధం లేకుండా డీజీపీ హోదా గల ఐపీఎస్ అధికారుల్లో సీనియారిటీ ప్రకారం ముఖ్యమంత్రే నియమించవచ్చు.

### రేపు కేబినెట్ భేటీ

4 నెలల సుదీర్ఘ సమయం తర్వాత రాష్ట్ర మంత్రివర్గం గురువారం సమావేశం కానుంది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 12 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల వ్యూహంపై చర్చించనున్నారు. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగానికి కేబినెట్ ఆమోదం తెలుపనుంది. అలాగే పలు కీలక బిల్లులను ఆమోదించనుంది. కొత్త పంచాయతీరాజ్ చట్టం, మున్సిపల్ చట్ట సవరణ, ఉర్దూ పోస్టుల నియామకాలకు సవరణల చట్టం సవరణ బిల్లులను భేటీలో చర్చించనున్నారు. ఫెడరల్ ఫ్రంట్ ప్రకటన తర్వాత జరుగుతున్న తొలి కేబినెట్ భేటీ కావడంతో క్షేత్రస్థాయిలో రాజకీయ పరిణామాలపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. తెలంగాణ పోలీస్ ఫోర్సెస్ యాక్ట్, భూముల రీ అసైన్‌మెంట్‌కు చట్ట సవరణ, వచ్చే విద్యా సంవత్సరం ఇంటర్ స్థాయి వరకు తెలుగును తప్పనిసరి చేసే బిల్లులను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు.

సాక్షి
బుధవారం, మార్చి, 7

## 'దలైలామా నోట్'

దేశాల మధ్య సంబంధాలను నిర్దేశించే అంశాల్లో అవసరాలు, అనివార్యతలు కీలకమైనవి. ఇవి పట్టనట్టు వ్యవహరిస్తూ పాత విధానాన్నే కొనసాగించడం వల్ల సమస్యలు తలెత్తక తప్పదు. 'టిబెట్ ప్రవాస ప్రభుత్వం' విషయంలో, ప్రత్యేకించి బౌద్ధ ఆధ్యాత్మిక గురువు దలైలామా విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ఆలోచనే చేసి ఉండొచ్చునని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. దలైలామా మన దేశానికి వలసవచ్చి అరవైయ్యేళ్లయిన సందర్భంగా 'ప్రవాస ప్రభుత్వం' ఆధ్వర్యంలో ఈనెల 31, వచ్చే నెల 1 తేదీల్లో న్యూఢిల్లీలో కొన్ని కార్యక్రమాలు జరగాల్సి ఉండగా వాటిలో పాల్గొనవద్దని కేంద్ర కేబినెట్ కార్యదర్శి పి.కె. సిన్హా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని సీనియర్ నాయకులకూ, అధికారులకు సూచన చేస్తూ ఒక రహస్య నోట్ జారీ చేసిన తీరు ఆశ్చర్యం కలిగించకమానదు. ఈ నోట్ గురించి ఆంగ్ల దినపత్రిక 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నాలుగు రోజులక్రితం బయటపెట్టినప్పుడు దలైలామా విషయంలో ప్రభుత్వ వైఖరేమీ మారలేదన్న జవాబే వచ్చింది. అయితే టిబెట్ ప్రవాస ప్రభుత్వం న్యూఢిల్లీ కార్యక్రమాలను హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలకు తరలించి గత్యంతరం లేకుండా మార్చుకుంది. తొలుత అనుకున్నవిధంగా అయితే ఈనెల 31న రాజ్‌ఘాట్‌లో సర్వమత ప్రార్థనలు, ఆ మర్నాడు 'థాంక్యూ ఇండియా' కార్యక్రమం జరగాల్సి ఉంది. ఇందులో సర్వమత ప్రార్థనల కార్యక్రమం రద్దయింది. 'థాంక్యూ ఇండియా' ధర్మశాలకు తరలిపోయింది.

మన దేశంలో 1959 నుంచి 'టిబెట్ ప్రవాస ప్రభుత్వం' కొనసాగుతోంది. ఆ ఏడాది చైనా సైన్యం టిబెట్‌లోకి ప్రవేశించి అక్కడ జరిగిన తిరుగుబాటును అణిచేయడంతో వేలాదిమంది శరణార్థులు మన దేశానికొచ్చారు. దలైలామా కూడా చైనా సైనికుల కన్నుగప్పి మారువేషంలో పదిహేను రోజులు హిమాలయ సానువుల్లో నడిచి మన దేశానికొచ్చారు. మొదట్లో ఆయన విషయంలో ఎలాంటి వైఖరి అవలంబించాలన్న అంశంలో అప్పటి ప్రధాని నెహ్రూ ఊగిసలాట ప్రదర్శించినా చివరకు స్వయంగా వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. అలాగని దలైలామా నాయకత్వంలోని 'ప్రవాస ప్రభుత్వాన్ని' గుర్తించలేదు. మొదట్లో టిబెట్ పౌరులకు కొన్ని పరిమితులతో పౌరసత్వ హక్కులు కల్పించారు. వారు మన దేశ పౌరుల్లాగే అన్ని రకాల హక్కులూ అనుభవించవచ్చునని... ఓటు హక్కు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగం చేసే హక్కు మాత్రం లేవు. కానీ ఆచరణలో ఇందువల్ల సమస్యలు తలెత్తుతున్నాయని భావించి మూడేళ్లక్రితం కొత్త విధానం ప్రకటించారు. వారికి భూమిని లీజుకివ్వడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం, అర్హతల్నిబట్టి ఉద్యోగాలు కల్పించడం వగైరాలు అందులో ఉన్నాయి. వాటిల్లో కొన్నిటిని అరుణాచల్‌ప్రదేశ్ అమలు చేయడం ప్రారంభించింది కూడా.

కానీ సమస్యేమంటే దలైలామాకు ఆశ్రయమివ్వడంగానీ, టిబెటెన్లను శరణార్థులుగా గుర్తించి వారికి సౌకర్యాలు కల్పించడంగానీ చైనాకు సుతరామూ ఇష్టం లేదు. అసలు దలైలామాను ప్రపంచ దేశాధినేతలెవరైనా కలిసినా, ఆయన్ను పిలిచినా చైనాకు కోపం వస్తుంది. మొదట్లో దలైలామా చూసుకుంటూ ఉండేవారు. టిబెట్‌ను చైనా గుప్పిట్లో పెట్టుకుని ప్రజల మత, భాషా, సాంస్కృతిక హక్కుల్ని హరిస్తున్నదని ఆరోపించేవారు. టిబెటెన్లకు స్వాతంత్య్రం లభిస్తే తప్ప పరిష్కారం దని చెప్పేవారు. ప్రపంచ నలుమూలలా ఉన్న దాదాపు కోటిమంది టిబెటెన్లు ఆయన్ను ఆధ్యాత్మికవేత్తగా భావిస్తారు. కానీ 1959 తర్వాత అక్కడి భూభాగంలోని పౌరులు చైనాకు వ్యతిరేకంగా పోరాడుతున్న దాఖలాలు లేవు. ఇటు దలైలామా వైఖరిలో కూడా కాలం గడిచేకొద్దీ మార్పు వచ్చింది. తాము చైనా నుంచి టిబెట్‌కు స్వాతంత్య్రాన్ని కోరడం లేదని అయిదారేళ్లక్రితమే ఆయన ప్రకటించారు. చైనాలో టిబెట్‌ను అంతర్భాగంగానే గుర్తించి ఆ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలన్నది ఆయన ప్రస్తుత డిమాండు. దలైలామాతోపాటే మన దేశం కూడా టిబెట్ పౌరులతో వ్యవహరించే విధానాన్ని మార్చుకుంటోంది. చైనాతో సంబంధాలు మెరుగుపడినకొద్దీ టిబెటెన్ల విషయంలో కొన్ని పరిమితులు విధిస్తోంది. గతంలో ఇచ్చినట్టుగా టిబెట్ పౌరులు ఆందోళనలకు అనుమతినీయడం లేదు. చైనా నేతలు వచ్చినప్పుడల్లా ముందస్తు అరెస్టులు చేయడం, వారిపై నిఘా ఉంచడం రివాజైంది.

ఇప్పుడు కేంద్ర కేబినెట్ కార్యదర్శి జారీచేసిన నోట్ కూడా అలా క్రమేపీ సడలుతూ వస్తున్న వైఖరిలో భాగమే కావొచ్చు. కానీ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం కాకుండా మరే పార్టీకి చెందిన ప్రభుత్వమైనా ఇలాంటి నోట్ జారీ చేసి ఉంటే, వేరే వారి సంగతలా ఉంచి బీజేపీ నుంచే గట్టి వ్యతిరేకత వచ్చేది. మన విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే గత నెలలో చైనాలో పర్యటించి ఆ దేశ ఉప విదేశాంగ మంత్రితో చర్చలు జరిపారు. ఈ స్థాయి చర్చలు జరగడం ఏడాది తర్వాత ఇదే ప్రథమం. భారత్‌లో దలైలామా కదలికలు ఉన్నప్పుడల్లా, టిబెట్ అంశంపై ఏదైనా కార్యక్రమం జరిగినప్పుడల్లా సరిహద్దుల్లో చైనా సమస్య సృష్టించడం రివాజుగా మారింది. నిరుడు ఏప్రిల్‌లో దలైలామా అరుణాచల్‌లో పర్యటించిన తర్వాత డోక్లాంలో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అది దాదాపు నిరంతరం సాగింది. అరుణాచల్ ప్రాంతంలో చైనా సైనికుల హడావుడి ఎక్కువైంది. వచ్చే జూన్‌లో ప్రధాని నరేంద్రమోదీ చైనాలో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశాలకు వెళ్తున్నారు. అందువల్ల కూడా టిబెట్ ఉత్సవాలు దేశ రాజధానిలో జరగకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించి ఉండొచ్చు. కానీ అందుకు ఇతర మార్గాలు ఎన్నుకుని ఉండాల్సింది. 'టిబెట్ ప్రవాస ప్రభుత్వం' పెద్దలతోనే కార్యక్రమాల నిర్వహణ విషయంలో మాట్లాడితే వారే దానికి తగినట్టుగా కార్యాచరణను రూపొందించుకునేవారు. ఆ పని చేయకుండా నోట్ వెలువరించడం, అది కాస్తా రచ్చకెక్కడం వల్ల చైనాకు మనపై చిన్నచూపు ఏర్పడే ప్రమాదం ఉంటుంది.



స్వదేశానికి దూరమై వలస వచ్చిన వారికీ తమదైన విలువ ఉంటుంది. వారి సమస్యలు మన సమస్యలుగా గుర్తించి సాయపడటమే ప్రపంచం బాధ్యత.

– సింథియా బాసినెట్
అమెరికన్ గాయని, నటి

### గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.షష్ఠి తె.4.18 వరకు (తెల్లవారితే గురువారం) తదుపరి సప్తమి, నక్షత్రం విశాఖ రా.12.43 వరకు, తదుపరి అనూరాధ వర్జ్యం ఉ.5.22 నుంచి 7.02 వరకు, దుర్ముహూర్తం ప.11.46 నుంచి 12.33 వరకు, అమృతఘడియలు ప.3.26 నుంచి 5.04 వరకు.

సూర్యోదయం : 6.20
సూర్యాస్తమయం : 6.04
రాహుకాలం : ప.12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

### నమాజ్ వేళలు

ఫజర్ : 5.18
జొహర్ : 12.27
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.24
ఇషా : 7.36

# మళ్లీ మూడో ఫ్రంట్ ముచ్చట



టీఎస్ సుధీర్

మూడో ఫ్రంట్ తన నాయకత్వంలోనే ఏర్పడుతుందని కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. అయితే 42 లోక్‌సభ స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, 17 మంది లోక్‌సభ సభ్యులను మాత్రమే కలిగి ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధపడతారా? అంతకుమించి మమత గడచిన నాలుగేళ్లుగా నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. కేసీఆర్ మాత్రం బీజేపీ వ్యతిరేక శిబిరంలో కొత్తగా ప్రవేశిస్తున్నవారు. ఇవన్నీ ఎలా ఉన్నా, ఒక అపనమ్మకం ఇక్కడ ప్రధానాంశమవుతోంది.

బీజేపీయేతర, కాంగ్రెసేతర పార్టీలతో మూడో ఫ్రంట్ ఏర్పాటు చేయడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు చేస్తున్న ప్రయత్నం గురించి గడచిన ఆదివారం ఢిల్లీలో ఒక జర్నలిస్ట్ మిత్రురాలి దగ్గర ప్రస్తావించాను. అందుకు ఆమె స్పందన ఏమిటంటే, అందులో పెద్ద విశేషం ఏముంది అనే. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అధికార నిలయం ఢిల్లీ. అక్కడ ఉంటూ ఆ పార్టీ విజయ పరంపరను, వైభవాన్ని సమీపంగా చూస్తున్నవారికి 1,500 కిలోమీటర్లకు అవతల ఎక్కడో జరుగుతున్న ఒక ప్రయత్నం పెద్ద ప్రాధాన్యం కలిగినదిగా కనిపించదని నాకు అర్థమైంది. అంతకు మించి ఆ ముందురోజే, అంటే గడచిన శనివారమే ఈశాన్య భారతంలో బీజేపీ విజయఢంకా మోగించిన సంఘటన జరిగింది. ఆ వారాంతానికల్లా దేశంలో బీజేపీ అధికారంలో లేదా, సంకీర్ణంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్రాల సంఖ్య 19 నుంచి 22కు చేరుకుంది.

కానీ ఇదే పరిణామాన్ని దక్షిణ భారతదేశం కోణం నుంచి చూడండి. ఇక్కడ బీజేపీ కర్ణాటకలో తగినంత బలం కలిగి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉప పాత్రను పోషిస్తోంది. కానీ ఢిల్లీ ఈ సువిశాల దేశాన్ని అన్ని విధాలుగా విజేతగా నిలిచిన ఒక పాలకుడి దృక్కోణం నుంచి చూస్తుంది. కానీ దక్షిణ భారతంలోనే కాకుండా, మిగిలిన భారతదేశంలోని చాలా రాష్ట్రాలు కూడా అసమ సంబంధాల సమీకరణలతోనే ఢిల్లీని చూస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి క్రోధ భావనలోనే ఉన్నారు. ఎక్కువ అధికారాలు కేంద్రం గుప్పిటలోనే ఉన్నాయని ఆయన ఆరోపణ. దేశంలో ఉన్న 29 రాష్ట్రాలకు కూడా కేంద్రం ఇచ్చిన స్వేచ్ఛ పరిమితమంటారాయన.

### మండిపడుతున్న రాష్ట్రాలు

కేటాయించవలసిన నిధుల కోసం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ కేంద్రాన్ని తొందర పెడుతున్నది. ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టం మేరకు ఇస్తామన్న నిధులు ఇవ్వమంటూ ఆ రాష్ట్రం ఢిల్లీ ముందు దేహీ అనవలసి రావడం గురించి ఆగ్రహంతో కూడా ఉంది. కావేరీ జలాల పంపిణీ నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయనందుకు తమిళనాడు కేంద్రం మీద మండిపడుతున్నది. తమ తమ రాష్ట్రాల జనాభాను బట్టి రిజర్వేషన్ కోటాను నిర్ణయించే అధికారం రాష్ట్రాలకు కట్టబెట్టాలని తెలంగాణ కోరుతున్నది. కలకత్తా మెట్రోరైలు మార్గం విస్తరణ ప్రాజెక్టు నిధులు సహా, పశ్చిమ బెంగాల్‌కు ఇవ్వవలసిన చాలా నిధులను కేంద్రం విడుదల చేయడం లేదని ఆ రాష్ట్ర నాయకత్వం ఆరోపణ. కేసీఆర్ యోచిస్తున్న సరికొత్త సహకార సమాఖ్య వ్యవస్థలో కేంద్రానికి పరిమిత అధికారాలు ఉండాలి. రాష్ట్రాలకు అత్యధికంగా అధికారాలు ఇవ్వాలి. అంటే కేసీఆర్ ఊహిస్తున్న నమూనాలో భారత్ అంటే, భారత సంయుక్త రాష్ట్రాలు అవుతుంది. కేసీఆర్ వ్యూహంలో ఆసక్తి కలిగించే విషయం ఒకటి ఉంది. 2014కు ముందు నరేంద్ర మోదీ వ్యక్త పరిచిన అభిప్రాయాల జాడలే అందులో కనిపిస్తాయి. అప్పుడు మోదీ కేంద్రాన్ని విమర్శించినట్టే ఇప్పుడు కేసీఆర్ కూడా కేంద్రం మీద ధ్వజమెత్తుతున్నారు. కేంద్రం రాష్ట్రాల మీద స్వారీ చేస్తున్నదని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో విమర్శించారు. కేసీఆర్ కూడా కేంద్రం రాష్ట్రాలను తోలుబొమ్మల మాదిరిగా ఆడించాలని చూస్తున్నదని ఆరోపించారు. నాడు యూపీఏ ప్రభుత్వం చట్టాలు చేయడం మినహా, వాటి అమలులో క్రియ శూన్యమని గుజరాత్ నుంచి మోదీ ఘోషించారు. విదేశ వ్యవహారాలు, రక్షణ, జాతీయ భద్రత, జాతీయ రహదారులు మినహాయించి మిగిలిన అన్ని మంత్రిత్వ శాఖలను కేంద్రం వదులుకోవాలని కేసీఆర్ చెబుతున్నారు. దేశంలోని ఆరులక్షల గ్రామాలలో రోడ్ల నిర్మాణం గురించి



ఢిల్లీలో ఉండే ప్రధానికి సంబంధం ఏమిటని కేసీఆర్ ప్రశ్నిస్తున్నారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలోని హేతుబద్ధత ఏమిటని కూడా అడుగుతున్నారు. ఇలాంటి పాలనా పరమైన సంస్కరణల గురించి తేనెతుట్టను కదపడానికి కేసీఆర్ వెనుక అజ్ఞాతంగా ఉన్న కారణాలు ఏమిటి? ఇదే ఇప్పుడు ఆయనను మిగిలిన అసంతృప్త ముఖ్యమంత్రుల దృష్టిలో పడేటట్టు చేసి, కేంద్రం పట్ల ఒక ప్రెషర్ గ్రూప్‌ను ఏర్పాటు చేయడానికి కారణమవుతున్నది. అయితే ఇలాంటి కూడిక వెనుక అంచనాలకు అందని కొన్ని లెక్కలు ఉన్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ రెండువందల స్థానాలకు మించి సాధించలేకపోతే, కాంగ్రెస్ కూడా మూడంకెలలో స్థానాలను గెలుచుకోలేకుంటే మూడో ఫ్రంట్‌కే అనివార్యంగా అధికార యోగం పడుతుందన్నదే ఆ లెక్క. నిజం చెప్పాలంటే ఇది 1996–98 నాటి యునైటెడ్ ఫ్రంట్ ప్రయోగం వంటిదే.

### ప్రాంతీయ పార్టీల నేతలు తక్కువ తిన్నారా?

కానీ అసమతౌల్యం అనే ఒక్క నినాదంతోనే కేసీఆర్ బీజేపీయేతర, కాంగ్రెసేతర పార్టీలను ఒక తాటి మీదకు తీసుకురాగలరా? ప్రాంతీయ పార్టీల అధినేతలు ఏకమై కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడమనేది, మరింత ప్రాతినిధ్యం కలిగిన ప్రభుత్వం ఏర్పడడమనేది వారు తమ తమ స్వాతిశయాలను వీడినప్పుడే సాధ్యపడుతుంది. ఒకే వ్యక్తికి ప్రయోజనం చేకూరడమనే ఫలశ్రుతి లేనపుడే అది వీలవుతుంది. వాస్తవం ఏమిటంటే చాలామంది ప్రాంతీయ పార్టీల నాయకులు బంధుప్రీతితో పాటు తమ తమ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని చాలా పరిమితంగా అనుమతించేవారే. అలాగే అలాంటి కలయిక చాలా అస్థిరత్వంతో కూడి ఉంటుందని గత అనుభవాలు వెల్లడిస్తున్నాయి. దీనితో కార్పొరేట్ ఇండియాకు బొత్తిగా పొసగని సంగతి కూడా గత అనుభవమే. బాగా గుర్తుంచుకోవలసిన ఇంకొక అంశం ఏదంటే, ఈ మూడో ఫ్రంట్ ప్రభుత్వ ఆలోచన వాస్తవరూపం దాల్చాలన్నా కూడా అటు కాంగ్రెస్ లేదా ఇటు బీజేపీ మద్దతు అనివార్యం.

### ఈ వాస్తవాల మాటేమిటి?

అప్పుడు మళ్లీ నాయకత్వ సమస్య తలెత్తుతుంది. రాబోయే మూడో ఫ్రంట్ తన నాయకత్వంలోనే ఏర్పడుతుందని కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. అయితే 42 లోక్‌సభ స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, 17 మంది లోక్‌సభ సభ్యులను మాత్రమే కలిగి ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధపడతారా? అంతకు మించి మమత గడచిన నాలుగేళ్లుగా నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. కేసీఆర్ మాత్రం బీజేపీ వ్యతిరేక శిబిరంలో కొత్తగా ప్రవేశిస్తున్నవారు. ఇవన్నీ ఎలా ఉన్నా, ఒక అపనమ్మకం ఇక్కడ ప్రధానాంశమవుతోంది. తాను బీజేపీ తయారుచేసి ఇచ్చిన స్క్రిప్టుకు అనుగుణంగా నడవడం లేదన్న సంగతిని కేసీఆర్ నమ్మేటట్టు చేయగలగాలి. కాంగ్రెస్, మూడో ఫ్రంట్‌గా విపక్షం చీలిపోవడం కంటే మోదీ, అమిత్‌షాలను సంతోషపరిచే అంశం మరొకటి ఏదీ ఉండదు. కానీ వచ్చే సంవత్సరం వేసవిలో తగినన్ని స్థానాలు దక్కకపోతే, కేసీఆర్ వంటి స్వతంత్ర పార్టీ సేనానితో ఒప్పందం చేసుకోవడమే మోదీకి సులభమవుతుందని కాంగ్రెస్ నమ్మకం. మరొక వాస్తవం కూడా ఉంది. తెలంగాణలోని వాస్తవిక పరిస్థితులే కేసీఆర్ వేయబోయే అడుగును ప్రధానంగా శాసిస్తాయి. ఎన్నికలు జరగడానికి ఇంకొక సంవత్సరం సమయం ఉండగా తాను మరొక స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నట్టు అంతా అనుకునేటట్టు కేసీఆర్ చేశారు. తెలంగాణలో ఉన్న రైతు సమస్య, నిరుద్యోగ సమస్యల గురించి మాట్లాడకుండా, ఆయన మొన్న శనివారం నుంచి జాతీయ స్థాయికి చేరడం గురించి చెబుతున్నారు. 2014లో ఉపయోగించిన తెలంగాణ సెంటిమెంట్ ఈ ప్రయాణంలో ఉపకరిస్తుందని ఆయన భావన.

### మోదీ ఇప్పుడు ఎందుకు చేదయ్యారు?

ఇతర ముఖ్యమంత్రులు, ప్రాంతీయ పార్టీల నేతలు తెలుసుకోగోరే మరొక అంశం కూడా ఉంది. మోదీ గురించి అంత కటువుగా కేసీఆర్ మాట్లాడడానికి, తీవ్ర వ్యతిరేకిగా మారిపోవడానికి వెనుక ఉన్న ప్రబలమైన కారణం ఏమిటి? ఇది వారు తెలుసుకోవాలనుకోవడానికి బలమైన కారణం ఉంది. 2016 నవంబర్ నుంచి కేసీఆర్ చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకోండి. పెద్ద నోట్ల రద్దును సమర్థించిన తొలి ఎన్డీయేతర ముఖ్యమంత్రి ఆయనే. వస్తుసేవల చట్టాన్ని కూడా కేసీఆర్ సమర్థించారు. రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే రామ్‌నాథ్ కోవింద్ అభ్యర్థిత్వాన్ని సమర్థించారు. ఆఖరికి అప్పుడు ప్రచారానికి హైదరాబాద్ వచ్చిన యూపీఏ అభ్యర్థి మీరా కుమార్‌ను కేసీఆర్ కలుసుకోలేదు కూడా. ఇప్పుడు మాత్రం కేసీఆర్ కేంద్రం పట్ల తీవ్ర అసంతృప్తితోనే ఉన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న తన ప్రతిపాదనకు కేంద్రం అంగీకరించలేదు. హైకోర్టు విభజన జరగలేదు. కొత్త సచివాలయ నిర్మాణానికి సికింద్రాబాద్‌లోని బైసన్ పోలో మైదానాన్ని బదలీ చేయలేదు. ప్రాజెక్టులకు నిధులు రావడం లేదు. అసెంబ్లీ నియోజక వర్గాల సంఖ్యను 119 నుంచి 153కు పెంచాలన్న ప్రతిపాదనకు అనుమతి రాలేదు. పైగా నియోజకవర్గాలు పెరుగుతాయన్న ఆశతో ఇతర పార్టీల నుంచి సభ్యులను తన పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడు వారికి స్థానాలు కేటాయించడం ఒక సమస్య. ఇవన్నీ ఆయన కేంద్రం పట్ల ఆగ్రహంగా ఉండడానికి వెనుక కారణాలు.

### వేచి చూడవలసిందే

కేంద్రం ఢిల్లీ, ముంబై పరిధిని మించి ఆలోచించడం లేదని ఇటీవల కేసీఆర్ కుమారుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి కె.టి. రామారావు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల విషయంలో దక్షిణ భారతానికి మొండి చేయి చూపుతున్నారని కూడా ఆయన ఆరోపించారు. అయితే సేద్యపు రంగంలో సంక్షోభానికి మోదీయే కారకుడని కేసీఆర్ ఆరోపిస్తున్నారు. కానీ అది తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్య. కాబట్టి రైతుల ఆత్మహత్యలలో దేశంలోనే మూడో స్థానం పొందిన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ ఇలాంటి విమర్శ చేయడం గురించి ఆయన ప్రత్యర్థులు ఎదురుదాడులకు దిగుతారు. ఢిల్లీ వైపు చూపు అనే అంశం విషయంలో ఆయన అనుభవాన్ని కూడా నెమరు వేసుకోవాలి. ఆయన కంటే ముందు ఇద్దరు– ఎన్టీ రామారావు, నారా చంద్రబాబునాయుడు ఆ ప్రయత్నంలో నవ్వుల పాలయ్యారు. నేషనల్ ఫ్రంట్ రాజకీయాలలో ఎన్టీఆర్ ఉన్నారు. యునైటెడ్ ఫ్రంట్, ఎన్‌డీఏలతో చంద్రబాబు నడిచారు. ఇవన్నీ ఎలా ఉన్నా, కేసీఆర్ ప్రయత్నం ఎలాంటి ఫలితాలను ఇస్తుందో వేచి చూడడం మంచిది. 2001లో ఆయన తెలంగాణ ఉద్యమాన్ని భుజానికి ఎత్తుకున్నప్పుడు ఎద్దేవా చేసిన వారు ఉన్నారు. కొన్ని ఎగుడు దిగుళ్లు ఉన్నా ఆయన విజయం సాధించారు. కాబట్టి పూర్తిగా నిరాశావాదంలోకి పోకుండా ఆయన ప్రయత్నం ఎంతవరకు సాగుతుందో పరిశీలించాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

# మరణం సంచలనమౌతున్నప్పుడు!

సుకుమారమైన ప్రాణాలే అయినా పొంగిపొర్లే జీవంతో జీవితం శాశ్వతం అని నమ్మేలా చేస్తారు మనుషులు. అలాంటి చైతన్యాన్ని వదిలి, వెలుగు ఆరిపోయే క్షణాలు అత్యంత ఆకర్షణీయంగా మారిపోయిన కాలంలోకి ఎలా నడిచి వచ్చాం?

అభిప్రాయం



డా. కె.ఎన్. మల్లీశ్వరి

పన్నెండు గంటల రైలు ప్రయాణంలో తారసపడిన పాతికేళ్ల ఆ సహ ప్రయాణీకుడు ఇప్పటికీ ఆలోచనల మొదట నిలబడే ఉన్నాడు, కరకర చిప్స్ నవిలేస్తూ కేరళ మధు 'ఆకలి హత్య' వీడియోలని ఆత్రుతగా వెతుకుతూనే ఉన్నాడు. పదహారేళ్ళ బాలిక సజీవదహనం వీడియో క్లారిటీని కళాత్మకంగా వ్యాఖ్యానిస్తూనే ఉన్నాడు. ఆసక్తికరమైన షాకింగ్ వీడియోలను వాట్సప్ గ్రూపుల్లో ఫ్రెండ్స్‌కి స్నేహధర్మంగా చేరవేస్తూనే ఉన్నాడు. ఆ భయానక భీభత్స నిర్విచార యువకుడికి దూరంగా రైల్లో సీటు మారాను. సీటు మారినంత సులువా లోకాన్ని మారడం!

పొద్దున్న లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే లోపు నేరాన్ని కళ్ళారా తనివితీరా చూడని రోజు ఇపుడొక కల. ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్సప్ – నలుగురు కూచుని నవ్వే వేళలన్నీ నేరాల, ఘోరాల, మరణాల.. వాటి వెనుక సవాలక్ష కారణాల దృశ్యమాలికలతో అల్లుకుపోతున్నాయి. ఆల్ ఈజ్ వెల్ విత్ ది వరల్డ్ అనుకుంటూ నిద్రపోయే భద్రజీవుల గురించి కాదు, సమాజ క్షేమం కోసం నిరంతరం నేరాలని ప్రశ్నించేవారి గురించి కాదు, నేరదృశ్యాలను అదేపనిగా చూడటం, అక్కడితో మనసాగక షేర్ చేయడం, ప్రతిచోటా నేరాన్ని ఊహించడం ఒక వ్యాపకంగా మారిపోయిన చిత్రజీవుల గురించి ఇపుడు మాట్లాడుకోవాలి. పువ్వుల్లాంటి సుకుమారమైన ప్రాణాలే అయినా పొంగిపొర్లే జీవంతో జీవితం శాశ్వతం అని నమ్మేలా చేస్తారు మనుషులు. అలాంటి చైతన్యాన్ని పక్కనబెట్టి, వెలుగు ఆరిపోయే క్షణాలు, అత్యంత ఆకర్షణీయంగా మారిపోయిన కాలంలోకి ఎలా నడిచి వచ్చాం?

దివిసీమ ఉప్పెన ఊపేసిన 3వ రోజున కాబోలు, నాటి ఓ తెలుగు దినపత్రికలో కొన్ని వార్తాకథనాలు, హృదయ విదారకమైన ఫోటోలు వచ్చాయి. నీళ్ళలో కొట్టుకుపోతున్న ఒక గేదె కళేబరం–కాళ్ళు బిగదన్ని ఒళ్ళు నీలుక్కుపోయి కళ్ళు తెరుచుకుని ఉన్న ఒక ఫోటో నా బాల్యంలోకి సమాచారం రూపంలో ప్రవేశించిన భీభత్సం. అది మనసు మీద కొట్టిన దెబ్బ మామూలుది కాదు. ఆ తర్వాత తుఫాను రాత్రుళ్లలో ఉలిక్కిపడి లేచి, కొట్టంలో ఉన్న చుక్కగేదె, మాళీ గేదెల క్షేమం కోసం దణ్ణాలు పెట్టుకోవడం, పొద్దున్నే లేచి ఉరుక్కుంటూ వెళ్లి వాటిని కావిలించుకోవడం ఇప్పటికీ వెంటాడే జ్ఞాపకాలు.

సమాచారం, అవగాహనని, జ్ఞానాన్నికాక భయాన్ని కలిగించడం, ఆ భయం ఒక వ్యసనం కావడం, ఎప్పటి నుంచీ మొదలైంది! నలభై యాభై ఏళ్లకిందట మనుషులకి దుఃఖంమీద, విషాదంమీద, మరణం మీద ఎంతో కొంత గౌరవం ఉండేదనుకుంటాను. పాఠకులకి జుగుప్సనీ, భయాన్ని కలిగించే ప్రమాద దృశ్యాలు, మరణాలు వంటివి పత్రికల ముందు పేజీలలో వేసేవారు కాదు. లోపలి పేజీల్లో వేసినా చాలా భాగాన్ని కనపడకుండా కవర్ చేస్తూ వేసేవారు. విషాదాలను రిపోర్ట్ చేయాల్సిన సందర్భాల్లో మిగతా సమాజపు భావోద్వేగాలు, ప్రజల



క్షేమం కొద్దోగొప్పో గణనలోకి వచ్చేవి. కళ్ళలోంచి ఊపిరి వదలబోతున్న ఒక పసిబిడ్డ – ఎముకుల కుప్ప వంటి, అస్తిపంజరం వంటి ఆ పసిబిడ్డ మీద వాలబోతున్న ఒక రాబందు, ఆ దృశ్యాన్ని కెమెరాలో బంధించిన ఒక ఫోటోగ్రాఫర్ తర్వాతి రోజుల్లో ఆ వెంటాడే జ్ఞాపకంలోనుంచి బైటకి రాలేక ఆత్మహత్య చేసుకున్నాడని విన్నాం.

రోజులు మారుతూ వచ్చాయి. యాక్సిడెంట్లు, హత్యలు, హింసాయుత ఘటనల సమాచారం, హద్దులు చెరిపేసుకుని వెల్లువెత్తడం మొదలైంది. అటువంటి భీభత్స దృశ్యాలని నీళ్ళు తాగినంత సులువుగా చూడటం, ఏ నెప్పీ తాకనంతగా గుండెని రాయి చేసుకోవడమనే దశల్లోకి, ఏ కలవరం లేకుండా మనని మనం సర్దేసుకున్నాం. ఇపుడిక 'అంతకు మించి' ఏదో కావాలి. సమాచారాన్ని చకచక అందించే సాంకేతికతని సొంతం చేసుకున్నాక అలవాటైన ప్రాణం ఊరుకుంటుందా! కొట్టి చంపడాలు, తగలబెట్టి చంపడాలు, ఎన్నిమార్గాల్లో మరణం పుట్టుకొస్తుందో అన్నిటినీ లైవ్‌లో చూసి సంబరపడాలి. సంబరపడుతూ దుఃఖాన్ని ప్రకటించాలి. అది చూసి ఊరుకోవడంతోనే ఆగదని మానసిక వికారాల్లోకి, నేరాల్లోకి నడిపిస్తుందని ఎన్నో సర్వేలు చెపుతున్నాయి.


ఎన్‌కౌంటర్లలో మరణించినవారి శరీరాలను కర్రలకి రెండువైపులా మూటల్లా వేలాడదీసిన దృశ్యాలను సహించినపుడే మనమంతా సామూహికంగా మరణించాం. చావులను, విషాదాలను ప్రమాదాలను వీడియోలు తీస్తూ ఒకరితో ఒకరం పంచుకుంటూ క్షణక్షణం మరణిస్తూ ఉన్నాం. మంచిలోనూ, చెడ్డలోనూ, ఔన్నత్యం లోనూ, నేరంలోనూ, బతుకులోనూ, చావులోనూ ఎట్లాంటి స్థితిలోనైనా–వారు మనుషులు కాబట్టి గౌరవానికి అర్హులు. బతికున్నపుడు శరీరానికి, వ్యక్తిత్వానికి ఎలాంటి గౌరవం ఇస్తామో మరణానికి కూడా అంతే గౌరవం ఉండాలి. జుగుప్సాయుతమైన సంచలనంలోకి మానవ శరీరాలను ఈడ్చడం కన్నా హీనమైన పని మరొకటి లేదు. దోస్తోవస్కీ నేరము–శిక్ష నవలలో ఇలా అంటారు ''మేధస్సూ, లోతైన హృదయం ఉన్నవారికి అదేస్థాయిలో నెప్పీ తీవ్రమైన వేదన కూడా ఉంటాయని''. టీవీలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్ల ముందు ఆహార విహారాదులు కానిస్తూ మధ్యలో వేడివేడి నేరాలను నంజుకుంటూ బతికేసే స్థితికి చేరాక, మేధస్సు మగతలోకి హృదయం ఉపరితలం మీదకి చేరుకుంటుంది. నెప్పీ వేదనలు సోషల్‌మీడియాకి తాజా సరుకులవుతాయి. సమస్యలు సశేషమై సంచలన మానవత్వాలు వీరంగం వేస్తుంటాయి.

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి ప్రరవే
ఈ–మెయిల్ : malleswari.kn2008@gmail.com

# వ్యాపారీకరణతో పెను ప్రమాదం

బొగ్గుగనుల జాతీయకరణ స్థానంలో కేంద్ర ప్రభుత్వం వాణిజ్య గని విధానాన్ని ప్రవేశపెట్టడంతో ప్రైవేట్ బొగ్గు సంస్థలు మళ్లీ రాజ్యమేలే పరిస్థితి ఏర్పడనుంది. ధరల నియంత్రణ కూడా వాటి పరమయ్యే ప్రమాదముంది.

సందర్భం



బి. జనక్ ప్రసాద్

స్వాతంత్య్రం నేపథ్యంలో భారత ప్రభుత్వం పలు పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెట్టింది. భారత ప్రభుత్వ నిర్వహణలో 1956లో ఏర్పడిన జాతీయ బొగ్గు అభివృద్ధి సంస్థ బొగ్గు ఉత్పత్తిని పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. 1945 నుంచే కార్యకలాపాలు సాగిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 1956 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చింది. భారతీయ బొగ్గు పరిశ్రమ 1950లలో ప్రభుత్వ యాజమాన్య కంపెనీల ఆజమాయిషీలో ఉండేది. ఇవ్వాళ సింగరేణి కాలరీస్ సంస్థ తెలంగాణ ప్రభుత్వం, భారత ప్రభుత్వం ఆజమాయిషీలో 51:49 నిష్పత్తితో కొనసాగుతోంది. పెరుగుతున్న ఉక్కు పరిశ్రమ అవసరాల రీత్యా, నేలబొగ్గు నిక్షేపాలను వెలికితీసి వాడుకోవడంపై ఆసక్తి పెరిగింది. కానీ దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలకు తగినంత మూలధనాన్ని సమకూర్చే పనికి ప్రైవేట్ బొగ్గు గని యజమానులు పూనుకోలేదు.

ప్రైవేట్ బొగ్గు గని యజమానులు అశాస్త్రీయ పద్ధతులను పాటించడం, గని కార్మికుల పని పరిస్థితి దిగజారడం వంటివాటిపై స్పందించిన కేంద్రప్రభుత్వం ప్రైవేట్ బొగ్గుగనులను జాతీయం చేయాలని నిర్ణయించుకుంది. ఇది రెండు రకాలుగా జరిగింది. 1971–72లో ఖనిజబొగ్గు గనులను, 1973లో థర్మల్ బొగ్గు గనులను కేంద్రప్రభుత్వం స్వాధీనపర్చుకుంది. 1971లో కోకింగ్ కోల్ మైన్స్ యాక్ట్ ద్వారా బొగ్గు గనులను, బొగ్గు ప్లాంట్‌లను జాతీయం చేసి భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఇక 1973 కోల్ మైన్స్ యాక్ట్ ద్వారా 1971లో స్వాధీనపర్చుకున్న బొగ్గు గనులతోపాటు, 7 రాష్ట్రాల్లోని ఖనిజ, ఖనిజయేతర బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ఈ అన్ని గనులనూ కోల్ మైన్స్ యాక్ట్ 1973 ద్వారా కేంద్రప్రభుత్వం 1973 మే 1న జాతీయం చేస్తున్నట్లు ప్రకటించింది.

ఖనిజయేతర బొగ్గు గనులను ఇలా 1973లో జాతీయం చేసి భారత బొగ్గుగని ప్రాధికార సంస్థ అధీనంలోకి తీసుకొచ్చారు. కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థగా ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌ను 1975లో స్థాపించారు. ఇది రాణిగంజ్ బొగ్గుక్షేత్రంలోని అన్ని ప్రైవేట్ కాలరీలను స్వాధీనపర్చుకుంది. దీంతో 29.72 బిలియన్ మెట్రిక్ టన్నుల నిల్వలతో ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ దేశంలోనే రెండో అతిపెద్ద బొగ్గు సంస్థగా ఆవిర్భవించింది.

దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కోల్ మైన్స్ యాక్ట్ 2015ను పార్లమెంట్ 2015 మార్చిలో ఆమోదించింది. దీంతో బొగ్గుగనులను వేలం పాటద్వారా కేటాయించే అధికారం కేంద్రప్రభుత్వానికి దఖలు పడింది. అలాగే తమ సొంత సిమెంట్, ఉక్కు,



విద్యుత్ లేక అల్యూమినియం ప్లాంట్ల వినియోగం కోసం బొగ్గుగనులను తవ్వుకోవడానికి ప్రైవేట్ సంస్థలకు కూడా ఈ చట్టం అవకాశమిచ్చింది. ఇక 2018 ఫిబ్రవరి 20న భారత్‌లో ప్రైవేట్ సంస్థలు వాణిజ్య బొగ్గు పరిశ్రమలో ప్రవేశించడానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ అనుమతించేసింది. దీంతో 1973 జాతీయకరణ తర్వాత వాణిజ్యపరమైన బొగ్గుగనులపై ప్రభుత్వ యాజమాన్యంలోని కోల్ ఇండియా సంస్థకున్న గుత్తాధిపత్యం చెదిరిపోయింది. దీంతో టన్ను ధరను ఎవరు ఎక్కువ పాడుకుంటే వారికి గనులు దక్కే విధానం అమలులోకి వచ్చేసింది.

***వాణిజ్య బొగ్గు గని తవ్వకాల దుష్ఫలితాలు :***

1. బొగ్గు అత్యంత అరుదైన సరుకు కాబట్టి ఒకసారి నిల్వలు ఖాళీ అయ్యాయంటే తర్వాత బొగ్గు లభ్యం కాదు. గతంలో ప్రైవేట్ గని సంస్థలు లాభదాయకంగా ఉండే బొగ్గు నిక్షేపాలలోనే బొగ్గును తవ్వుకుని కఠిన పరిస్థితుల్లోని బొగ్గు గనుల జోలికి వెళ్లేవి కావు.

2. అనుమతించిన ప్రాంతంలోనే కాకుండా ప్రైవేట్ బొగ్గుగనుల యజమానులు అక్రమ తవ్వకాలకు పాల్పడే ప్రమాదముంది.

3. లేబర్ చట్టాల ఉల్లంఘనకు అవకాశమెక్కువ.

4. బొగ్గు తవ్వకాల రికార్డు లేకుండా ప్రైవేట్ కంపెనీలు జరిపే తవ్వకాలవల్ల ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీలు, పన్నులు తగ్గిపోయే అవకాశం ఎక్కువ.

5. ప్రైవేట్ కంపెనీలతో పోటీ పడి, ఉత్పత్తి వ్యయం తగ్గించుకునే ప్రయత్నంలో కార్మికుల సంఖ్యను ప్రభుత్వ బొగ్గు సంస్థలు తగ్గించడం అనివార్యం. కార్మికుల తొలగింపు మాత్రమే కాకుండా తాజా నియామకాలు గణనీయంగా తగ్గిపోతాయి.

6. బొగ్గు పరిశ్రమ క్రమేపీ ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లి, జాతీయకరణకు మునుపటిలాగా ధరలను ఇతర నిబంధనలనూ వారే నియంత్రించే ప్రమాదం పొంచి ఉంది.

7. ప్రైవేట్ సంస్థల ప్రవేశంతో గనుల్లో ప్రమాదాలు పెరుగుతాయి. అధిక లాభాల యావలో ఇవ కార్మికుల భద్రతను గాల్లో కలిపేయడం తెలిసిందే. దీంతో మరిన్ని ప్రమాదాలు, మరిన్ని మరణ ఘటనలు తప్పవు.

8. కాలుష్య నిబంధనలను ఖాతరు చేయవు కాబట్టి ప్రైవేట్ బొగ్గుగని కంపెనీలు పర్యావరణానికి కలిగించే ప్రమాదం మామూలు స్థాయిలో ఉండదు.

వ్యాసకర్త ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ
ఈ–మెయిల్ : janakprasad@rediffmail.com

# వాయ్‌టెక్ అను నేను..



1944, ఫిబ్రవరి నెల..
రెండో ప్రపంచ యుద్ధ కాలం.. ఇటలీలోని పోర్ట్ ఆఫ్ నేపల్స్..
బ్రిటిష్ ఆఫీసర్ బ్రౌన్ సైనికుల రిజిస్టర్ చెక్ చేస్తున్నాడు..
అప్పుడే ఈజిప్టు నుంచి వచ్చిన నౌకలో పోలండ్ సైనికుల బృందం ఒకటి దిగింది..
జర్మన్, ఇటలీ సైన్యానికి వ్యతిరేకంగా తమతో కలిసి పోరాడటానికి..
అందుకే వారందరి వ్యవహారాలు చూడ్డానికి బ్రౌన్ ఇక్కడికి వచ్చాడు..

రిజిస్టర్ చూస్తూ.. ఒక్కో సైనికుడి పేరు పిలుస్తున్నాడు..
కార్పొరల్ వాయ్‌టెక్.. ఎవరూ పలకలేదు..
మరోసారి గట్టిగా పిలిచాడు.. ఊహూ.. సౌండ్ లేదు..
మరోసారి రిజిస్టర్ చెక్ చేసుకున్నాడు..
కార్పొరల్.. ఆర్మీలో నాన్ కమిషన్డ్ జూనియర్ ఆఫీసర్ ర్యాంక్..
సర్వీసు నంబర్ అంతా సరిగ్గానే ఉంది.. ఏమయ్యాడబ్బా..
వాయ్‌టెక్ అంటూ చిరాగ్గా ముఖం చిట్లించాడు..
అప్పుడొచ్చాడు వాయ్‌టెక్.. మందగమనంతో..
కేర్‌లెస్‌గా.. గుర్రుమన్నాడు..
అంతే.. అంతోటి ఆఫీసరుకూ
ఆ చలికాలంలో చెమటలు పట్టాయి..
**ఎందుకంటే వాయ్‌టెక్.. ఓ ఎలుగుబంటి!!**



ఓ ఎలుగుబంటి సైనికుడా.. అదెలా..
తెలియాలంటే..
ఓ రెండేళ్లు వెనక్కి వెళ్లాలి..

1942లో ఇరాన్‌లోని పోలిష్ ఆర్మీ క్యాంప్.. అక్కడ గొర్రెలు కాచుకునే ఓ అబ్బాయికి చిన్నపాటి ఎలుగుబంటి దొరికింది. దాన్ని పట్టుకుని తిరుగుతున్నాడు. పోలండ్ సైనికులు చూశారు. కొన్ని టిన్ల ఆహారం, చాక్లెట్, స్విస్ కత్తి ఇస్తే.. ఆ ఎలుగుబంటిని ఇచ్చేశాడు. వారు దాన్ని పెంచుకోవడం మొదలుపెట్టారు. వాయ్‌టెక్ అని పేరు పెట్టారు. తమకు వచ్చే రేషన్‌లోని ఆహారాన్ని వంతుల వారీగా వాయ్‌టెక్‌కు పెట్టారు. వాయ్‌టెక్ సైనికుల్లా బీర్లు తాగడం మొదలుపెట్టాడు. సిగరెట్లు తాగడం, తినడం మొదలుపెట్టాడు. నిజానికి ఆ క్యాంప్‌లో ఉన్నవారిలో ఎక్కువమంది యుద్ధ ఖైదీలు. పోలండ్‌ను సోవియట్ యూనియన్ ఆక్రమించుకున్నప్పుడు పట్టుబడినవారు. జర్మనీ సోవియట్ మీద దాడి చేసిన సమయంలో వారిని వదిలేశారు. ఇంటికి తిరిగివెళ్దామనుకున్నారు.. కానీ తమ దేశం సోవియట్ అధీనంలో ఉంది. యుద్ధ సమయంలో చాలా మంది కుటుంబ సభ్యులూ చనిపోయారు. దీంతో వాళ్లకి వాయ్‌టెక్ ఓ ఎంటర్‌టైన్‌మెంట్. అందుకే వాడితోనే మల్లయుద్ధం, బాక్సింగ్ చేసేవారు. తాము ఏ దేశానికి వెళ్తే.. అక్కడికి తీసుకెళ్లేవారు. అయితే.. ఇప్పుడు వాయ్‌టెక్ ఆరడుగుల ఎలుగుబంటి. పెంపుడు జంతువంటే.. ఒప్పుకోవడానికి పోర్టు సిబ్బంది సిద్ధంగా లేరు. అందుకే.. పోర్ట్ ఆఫ్ నేపల్స్‌కు బయలుదేరినప్పుడు ఈజిప్టు పోర్టులో దాన్ని నిలిపేశారు. క్రూర జంతువన్నారు. దీంతో పోలండ్ సైనికులు ఓ అనూహ్యమైన నిర్ణయం తీసుకున్నారు. వాయ్‌టెక్‌ను సైనికుడిగా రిజిస్టర్ చేశారు. ర్యాంక్, సర్వీస్ నంబర్, పేబుక్ కూడా ఇచ్చారు. అందరిలాగే.. వాయ్‌టెక్‌కు శిక్షణ ఇచ్చారు. భారీ మందుగుండు సామగ్రి, క్షిపణులు ఉన్న బాక్సులను ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తీసుకెళ్లడం నేర్పించారు.



లోగో

### ఇప్పుడు వాయ్‌టెక్ క్రూర జంతువు కాదు.. పోలండ్ సైనికుడు...

సైనికుడే కానీ సత్తా చాటే సమయం ఏదీ? అది కూడా రానే వచ్చింది. 1944.. మాంటే కసీనో యుద్ధం.. వెనుకంజ వేయలేదు.. బాంబులు పడుతున్నా బెదరలేదు..22వ ఆర్టిలరీ సప్లై కంపెనీ తరఫున యుద్ధ రంగంలోకి దూకాడు. మందుగుండు సామగ్రి ఉన్న బాక్సులతోపాటు భారీ క్షిపణులను మోస్తూ.. తమ సహచరులకు అందించాడు.. నిరంతరాయంగా పనిచేశాడు..



అచ్చంగా ఓ సైనికుడిలాగానే.. యుద్ధం ముగిసిన తర్వాత పోలండ్ సైనికులు బ్రిటన్ ఆశ్రయం కోరారు. వాళ్లతోనే వాయ్‌టెక్ కూడా.. స్కాట్లాండ్‌లో ఓ సెలబ్రిటీలా అయిపోయాడు. పిల్లలను తన వీపుమీద ఎక్కించుకుని.. వాగుల్లో ఈదాడు. పార్టీల్లో డాన్సులేశాడు.. తర్వాత తర్వాత వాయ్‌టెక్‌ను ఎడిన్‌బర్గ్‌లోని జూకు పంపించారు. అంత వరకూ స్వేచ్ఛగా తిరిగిన వాయ్‌టెక్ నిర్బంధాన్ని తట్టుకోలేకపోయాడు.. విచారంగా ఉండేవాడు.. 1963లో జూలోనే చనిపోయాడు.. వాయ్‌టెక్ సేవలకు గుర్తింపుగా 22వ ఆర్టిలరీ కంపెనీ తమ లోగోను మార్చేసింది. క్షిపణులను మోస్తున్న వాయ్‌టెక్ బొమ్మను లోగోగా పెట్టుకుంది. ఎడిన్‌బర్గ్‌తోపాటు పలు ప్రాంతాల్లో వాయ్‌టెక్ విగ్రహాలు వెలిశాయి. యుద్ధంలో పాల్గొన్న ఎలుగుబంటిగా చరిత్రకెక్కాడు.. అందుకే అంటారు..

కార్పొరల్ వాయ్‌టెక్..
ఓ క్రూర జంతువు కాదు..
ఓ యోధుడు.. ఓ హీరో..
నాటికీ.. ఏనాటికీ..

– సాక్షి, తెలంగాణ డెస్క్

# ఎందుకు నీరుగారుస్తున్నారు?

- ఆర్టీఈ అమలులో తెలుగు రాష్ట్రాల తీరుపై హైకోర్టు అసంతృప్తి
- ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఇవ్వాలని పిల్

**సాక్షి, హైదరాబాద్:** ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను అర్హులైన పేద విద్యార్థులకు కేటాయించాలని విద్యా హక్కు చట్ట (ఆర్టీఈ) నిబంధనలను ఎందుకు అమలు చేయట్లేదని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలను హైకోర్టు ప్రశ్నించింది. పేద విద్యార్థులకు ఉపయోగపడాలనే చట్ట సంకల్పాన్ని ఎందుకు నీరుగారుస్తున్నారని ప్రశ్నించింది. చట్టాన్ని తెలుగు రాష్ట్రాలు సక్రమంగా అమలు చేయట్లేదంటూ వనపర్తి జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన వై.తిప్పారెడ్డి రాసిన లేఖను హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా (పిల్) పరిగణించి అప్పటికే తాండవ యోగేశ్ అనే లా విద్యార్థి దాఖలు చేసిన పిల్‌తో జత చేసి మంగళవారం విచారించింది. ఆర్టీఈ చట్టం 2007లో వస్తే నేటికీ సక్రమంగా ఎందుకు అమలు చేయలేకపోతున్నారని కోర్టు మండిపడింది. ఏపీకి చెందిన ఒక మంత్రికే ప్రైవేటు విద్యా సంస్థలున్నాయని, ఆర్టీఈ చట్టానికి అనుగుణంగా జారీ అయిన జీవోలపై కోర్టులు స్టేలు ఇస్తే వాటిని ప్రభుత్వాలు రద్దు చేసేందుకు ప్రయత్నించట్లేదని పిటిషనర్ యోగేశ్ వాదించారు. ప్రైవేటు పాఠశాలలు గుర్తింపు పొందాలన్న నిబంధన అమలు కావట్లేదని, పలు రాష్ట్రాల్లో ఆర్టీఈ చట్టం బాగా అమలు జరుగుతోందని, తెలుగు రాష్ట్రాల్లో దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు–వసూలు చేస్తున్న ఫీజులు, సిబ్బంది–వారి విద్యార్హతలు, 25 శాతం సీట్ల వివరాలు, ఇతర సమాచారం విద్యాధికారి దగ్గర ఉండాలని, ఇవన్నీ వెబ్‌సైట్‌లో పొందుపర్చకుండా చట్ట నిబంధనల్ని కాలరాస్తున్నారని చెప్పారు. ప్రైవేటు పాఠశాల్లో చదివే విద్యకు ఫీజుల్ని రీయింబర్స్‌మెంట్ చేస్తే.. విద్యార్థులు ప్రైవేటు పాఠశాల్లో చేరితే సర్కారీ బడులు మూతపడే ప్రమాదముందని ఏపీ ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఆర్టీఈ చట్టం ఏమేరకు అమలు చేశారో వివరణ ఇవ్వాలని రెండు రాష్ట్రాల్ని ఆదేశించింది. విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

# కోర్టుకు వస్తే కొడతారా?

- తీవ్రంగా పరిగణించిన హైకోర్టు
- ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కేసులో మరో మలుపు
- నేడు కొనసాగనున్న విచారణ



**సాక్షి, హైదరాబాద్:** 'రాష్ట్ర రాజధానిలోని మహబూబ్‌గంజ్, సిద్దిఅంబర్ బజార్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలని పిల్ దాఖలు చేసిన పిటిషనర్‌పై దాడి చేస్తారా? ఇందుకు అఫ్జల్‌గంజ్ పోలీసులు వ్యక్తిగత బాధ్యత వహించాలి. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించకపోగా, కోర్టుకు వచ్చిన వారికి కూడా రక్షణ కల్పించలేరా?'అని పోలీసులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న వారు తనపై దాడి చేశారని పిటిషనర్ లక్ష్మీ నివాస్ అగర్వాల్ హైకోర్టు దృష్టికి తీసుకురావడంతో దాడి చేసిన వారిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్‌కు రక్షణ కల్పించకుండా పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. ఇందుకు అఫ్జల్‌గంజ్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వ్యక్తిగతంగా బాధ్యులవుతారని పేర్కొంది. దాడి ఘటనపై అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై బుధవారం విచారణ జరుపుతామని వెల్లడించింది. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దాడికి బాధ్యులైన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించింది. వ్యాజ్యం విచారణ సందర్భంగా తనపై దారుణంగా దాడి చేశారని, దుండగులతో స్థానిక పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు కుమ్మక్కయ్యారని అగర్వాల్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఫొటోల్ని పరిశీలించాలని, సీసీ ఫుటేజీని పరిశీలిస్తే దాడి వెనుక ఉన్నవారు బయటపడతారని కోరారు. అనంతరం విచారణ బుధవారానికి వాయిదా పడింది. కాగా, హైదరాబాద్‌లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై రిటైర్డ్ ప్రొఫెసర్ బీఆర్ శాంత రాసిన లేఖను కూడా పిల్‌గా పరిగణించిన హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఫుట్‌పాత్‌ల ఆక్రమణల వల్లే జనమంతా రోడ్లపై నడవాల్సిన దుస్థితి ఏర్పడిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, పట్టణ ప్రణాళిక శాఖ డైరెక్టర్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది.

# 'పాలమూరు'పై మొదలైన విచారణ

### వాదనలు ప్రారంభించిన నాగం

**సాక్షి, హైదరాబాద్:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్‌ఎల్ఐఎస్) ఎలక్ట్రో మెకానికల్ (ఈఅండ్ఎం) పరికరాల ధరల పెంపుపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టులో విచారణ మొదలైంది. ఇందులో భాగంగా మంగళవారం నాగం పార్టీ ఇన్ పర్సన్‌గా (న్యాయవాదితో నిమిత్తం లేకుండా తన వాదనలు తానే వినిపించడం) వాదనలు ప్రారంభించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం వాస్తవాలను పక్కదారి పట్టిస్తోందన్నారు. అటు ప్రభుత్వం, ఇటు బీహెచ్‌ఈఎల్ తమ చర్యల ద్వారా ఖజానాకు కోట్ల రూపాయలమేర నష్టం కలిగించాయన్నారు. ప్యాకేజీ 5లో మొత్తం 9 పంప్‌అండ్ మోటార్ల ధరను రూ.1,729 కోట్ల నుంచి రూ.2,436 కోట్లకు పెంచారని కోర్టుకు నివేదించారు. ఈ వ్యవహారంలో కుదిరిన ఒప్పందాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరితే తిరస్కరించారన్నారు. కోర్టు పనివేళలు ముగియడంతో ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# హోటల్‌లో రూ.10 లక్షల నెక్లెస్ మాయం

### పోలీసుల అదుపులో అనుమానితులు

**హైదరాబాద్:** బెంగళూరుకు చెందిన ఓ మహిళ బంగారు నెక్లెస్ హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని కెన్స్ హోటల్‌లో చోరీకి గురైంది. వజ్ర వైడూర్యాలు పొదిగిన ఈ నెక్లెస్ విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బెంగళూరు మల్లేశ్వరం 8 మెయిన్ రోడ్డు రూలా అపార్ట్‌మెంట్స్‌లో నివసించే కె.జయప్రకాశ్ తన కుటుంబంతో కలసి పెళ్లి కోసం హైదరాబాద్ వచ్చారు. ఇక్కడి శ్రీనగర్‌కాలనీ కెన్స్ హోటల్ రూమ్ నంబర్ 204ను ఈ నెల 3న మధ్యాహ్నం 2.45 గంటలకు అద్దెకు తీసుకున్నారు. రాత్రి 7.30కి పెళ్లికి వెళ్లేందుకు ముస్తాబవుతుండగా కప్‌బోర్డులో నెక్లెస్ కనిపించలేదు. వెంటనే హోటల్ నిర్వాహకులను అప్రమత్తం చేశారు. రాత్రి 11.30 గంటల వరకు వారు స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# ఉద్యోగం రాలేదని దివ్యాంగుడి ఆత్మహత్య

**హైదరాబాద్:** ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన ఓ దివ్యాంగుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా మర్రిగూడెం మండలం కోదాశపల్లి గ్రామానికి చెందిన బి.మహేందర్(28) వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెడికేర్ ఆస్పత్రి సమీపంలోని దివ్యాంగుల వసతి గృహంలో పదేళ్లుగా ఉంటూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తర్వాత వివాహం చేసుకుందామనుకున్న ఆ యువకుడి ప్రయత్నాలు తరచూ విఫలమవుతుండటంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ తలుపు తీయకపోవడంతో తోటి విద్యార్థులు కిటికీలో నుంచి చూడగా మహేందర్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# చనిపోతున్నానంటూ స్నేహితుడికి ఫోన్

### భవనం పైనుంచి దూకి ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్:** చదవలేకపోతున్నాననే ఆందోళనలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. మంచిర్యాలకు చెందిన విక్రమ్.. టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఈసీఈ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి మిత్రులందరూ కలసి పార్టీ చేసుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు మిత్రుడి బైక్ తీసుకుని మణికంఠనగర్ కాలనీలోని హాస్టల్‌కు విక్రమ్ చేరుకున్నాడు. తర్వాత స్నేహితుడు ప్రశాంత్‌కు ఫోన్ చేసి బ్యాక్‌లాగ్‌లు పెరిగిపోతున్నాయంటూ ఆందోళన చెందాడు. మిత్రులకు తాను బాకీ ఉన్న రూ.4 వేల అప్పు తీర్చాలని కోరాడు. అనంతరం తాను చనిపోతున్నట్లు అతడికి చెప్పి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

## కాంగ్రెస్ లేకుండా థర్డ్ ఫ్రంట్ సాధ్యమా?


జైపాల్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ స్థాయిలో ఏ ఫ్రంట్ ఉన్నా కాంగ్రెస్, బీజేపీల్లో ఒక పార్టీ మద్దతు లేకుండా ప్రధాని అయిన సందర్భం లేదని, అందరికంటే తెలివి కొంచెం ఎక్కువ ఉన్న కేసీఆర్‌కు ఆ విషయం తెలియదా అని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ లేకుండా థర్డ్ ఫ్రంట్ సాధ్యమయ్యే ప్రసక్తే లేదన్నారు. నాలుగేళ్ల ప్రధాని మోదీకి బానిసగా ఉన్న కేసీఆర్ ఇప్పుడు కుట్రపూరితంగా ఆయనకు వ్యతిరేకంగా కనిపిస్తున్నారని, ఎన్నికల తర్వాత బీజేపీ పంచనే చేరుతాడని అన్నారు.

### ✦ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణలో లంబాడీలను ఎస్టీల్లో చేర్చే ప్రతిపాదన విరమించుకోవాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ బిల్లును తిరస్కరించాలని కేంద్రాన్ని కోరాయి. తెలంగాణ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆదివాసీ సంఘాలు మంగళవారం ఢిల్లీలో సంప్రదాయ నృత్యాలతో ధర్నా చేపట్టాయి. తమ హక్కులకు భంగం కలిగించే చర్యలను విరమించుకోవాలని సంఘం నేతలు రామకృష్ణ, వెంకటరావు, జేజేరాం డిమాండ్ చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని నిర్ణయించడంపై ఏపీ ఆదివాసీ సంఘం నేతలు వాబయోగి, చిరంజీవులు, కృష్ణారావు, మాధవరావు ఆవేదన వ్యక్తం చేశారు.

### ✦ 'రిజర్వేషన్ల అధికారాలు రాష్ట్రాలకే ఉండాలి'

**సాక్షి, హైదరాబాద్:** విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలని టీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు లేకుండా చేసి, కేంద్రమే పెత్తనం చలాయిస్తే ఫెడరల్ స్ఫూర్తికి అర్థమేముందని మంగళవారం ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు.

### ✦ ఈ నెల 9న సీఎల్పీ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) ఈనెల 9న సమావేశం కానుంది. సీఎల్పీ నేత కె.జానారెడ్డి అధ్యక్షతన జరగనున్న భేటీలో రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. సీఎల్పీ కార్యాలయంలో 9న మధ్యాహ్నం జరిగే సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమాచారం పంపారు. దీంతో బస్సు యాత్రను 8వ తేదీన ముగించనున్నారు. 9 వరకు షెడ్యూల్ ఉన్నప్పటికీ సీఎల్పీ సమావేశం ఉండటంతో 8వ తేదీన హుజూరాబాద్ నియోజకవర్గంలో జరిగే సభతో తొలి దఫా యాత్ర నిలిపివేయనున్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత యాత్ర ప్రారంభం కానుంది.

### ✦ అది భారతీయ జూఠా పార్టీ: కర్నె

**సాక్షి, హైదరాబాద్:** అబద్ధాలతో పబ్బం గడుపుతున్న బీజేపీ అసలు పేరు భారతీయ జూఠా పార్టీ అని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ వ్యాఖ్యానించారు. టీఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ఎగనామం పెట్టేందుకు బీజేపీ రోజుకో కొత్త నాటకమాడుతోందని విమర్శించారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా తెలంగాణకు ఏదో చేసినట్టు అబద్ధాలు చెప్పారన్నారు. ప్రధాని మోదీని దూషించే విధంగా మాట్లాడలేదని సీఎం కేసీఆర్ స్పష్టంగా వివరణ ఇచ్చిన తర్వాత కూడా బీజేపీ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

### ✦ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు: తలసాని

**సాక్షి, హైదరాబాద్:** స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నేతలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ విమర్శించారు. మంగళవారం గద్వాల జిల్లాకు చెందిన కురుమలు సచివాలయంలో మంత్రులు తలసాని, జూపల్లి కృష్ణారావులను కలిశారు. గొల్ల, కురుమలకు సబ్సిడీపై అందజేస్తున్న గొర్రెలను తమకు కూడా ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన తలసాని కురుమ కులస్తులందరికీ గొర్రెలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

# రైతు బీమాకు రూ.500 కోట్లు

**బడ్జెట్‌లో కేటాయించాలని ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదన**

- అన్నదాతల సాధారణ మరణాలు, ఆత్మహత్యలకూ ఇదే బీమా వర్తింపు
- ఇక రైతు ఆత్మహత్యల జాబితా తయారీకి చెల్లుచీటీ
- రూ. 5 లక్షల పరిహారంలో రూ. 2 లక్షలు కేంద్రం వాటా



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రత్యేకంగా బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిపై కరీంనగర్‌లో ఇటీవల జరిగిన రైతు సదస్సులో సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనకు అనుగుణంగా అధికారులు మార్గదర్శకాలు ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు పంటలు నష్టపోతేనే ప్రభుత్వం రైతుకు బీమా పరిహారం ఇచ్చేది. రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.6 లక్షలు అందించే అవకాశం ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త పథకంలో అన్నదాతలు సాధారణ మరణం పొందినా, ఆత్మహత్యలకు పాల్పడినా, ప్రమాదంలో మృతిచెందినా ఆయా కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందజేస్తారు. ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ బీమా కోసం ఏడాదికి రూ.300 చొప్పున ప్రీమియం చెల్లించాలి. దాన్ని కూడా ప్రభుత్వమే రైతుల తరపున చెల్లిస్తుందని వ్యవసాయశాఖ వర్గాలు చెప్పాయి. రైతులకు చెల్లించే బీమా పరిహారంలో రూ.2 లక్షలు కేంద్రం, రూ.3 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. కొత్త పథకం వచ్చాక ఆత్మహత్యల కింద ఇస్తున్న రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా పథకాన్ని ఎత్తివేస్తారు.

**సాగుకు రూ. 15 వేల కోట్లు...**

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 15 వేల కోట్లు కేటాయించాలని వ్యవసాయశాఖ ఆర్థికశాఖకు ప్రతిపాదించినట్లు తెలిసింది. సచివాలయ వర్గాల సమాచారం ప్రకారం రైతుకు పెట్టుబడి సాయం పథకానికి రూ. 12 వేల కోట్లు, రైతు బీమాకు రూ. 500 కోట్లు, రైతు వేదికల నిర్మాణానికి రూ. 200 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణకు రూ. 522 కోట్లు, వడ్డీలేని రుణాలకు రూ. 500 కోట్లు, పంటల బీమాకు రూ. 210 కోట్లు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు రూ. 775 కోట్లు, విత్తన చైన్ పథకానికి రూ. 180 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు చేశారు.

### ఏది సాధారణ మరణం... ఏది ఆత్మహత్య?

రాష్ట్రంలో దాదాపు 72 లక్షల మంది రైతులున్నట్లు ఇటీవల భూ ప్రక్షాళన సర్వే సందర్భంగా ప్రభుత్వం అంచనా వేసింది. ఆ ప్రకారం ప్రతి రైతుకూ ఏటా ప్రభుత్వమే రూ. 300 చొప్పున బీమా ప్రీమియం చెల్లిస్తుంది. కేంద్ర నేర గణాంకాల లెక్కల ప్రకారం దేశంలో ప్రతి వెయ్యి మంది రైతుల్లో ఏడాదికి 12 మంది చొప్పున మరణిస్తున్నారని అంచనా. ఆ ప్రకారం ప్రభుత్వం రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టిందని, ఆ లెక్కల ప్రకారమే బడ్జెట్ కేటాయింపులు చేస్తుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు రైతులు పంట నష్టపోయి ఆత్మహత్య చేసుకుంటే జిల్లాల్లో ఆర్డీవో, డీఎస్పీ, వ్యవసాయాధికారి ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీలు నిర్ధారించేవి. ఏవి వ్యవసాయ సంబంధిత ఆత్మహత్యలో, ఏవి కావో త్రిసభ్య కమిటీలే అంచనా వేసేవి. కమిటీలు రూపొందించే జాబితాల ఆధారంగా వ్యవసాయ సంబంధిత ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం రూ. 6 లక్షల చొప్పున పరిహారం చెల్లించేది. అయితే ఇక నుంచి రైతులు ఎవరైనా ఆత్మహత్యలకు పాల్పడినా, సాధారణ మరణం పొందినా కూడా ఆయా కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున బీమా పరిహారం అందనుంది. దీనివల్ల ఎవరు ఆత్మహత్య చేసుకున్నారో కూడా నిర్ధారించాల్సిన, జాబితాలు తయారు చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండదు. ఫలితంగా రైతు ఆత్మహత్యలపై రాజకీయ దుమారం చెలరేగకుండా ప్రభుత్వానికి వెసులుబాటు ఉంటుందని అంటున్నారు.

# లైఫ్ సైన్సెస్ @ విజన్ 2030!

**కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తాం: మంత్రి కేటీఆర్**


మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ లైఫ్ సైన్సెస్ అడ్వైజరీ కమిటీతో భేటీలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రాన్ని లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందుకు తీసుకెళ్తామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామా రావు పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాభివృద్ధి కోసం విజన్ 2030 పేరుతో త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నామని తెలిపారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ అడ్వైజరీ కమిటీతో మంగళవారం ఆయన ఇక్కడ సమావేశమయ్యారు. రాష్ట్రానికి లైఫ్ సైన్సెస్ రంగంలో ఉన్న అవకాశాలను కమిటీ సభ్యులు కేటీఆర్‌కు వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో ఇక్కడున్న మౌలిక వసతులు లైఫ్ సైన్సెస్ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు అందించనున్నాయని తెలిపారు. ఈ రంగ అభివృద్ధికి అమలు చేయాల్సిన విజన్‌పై మంత్రితో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా రంగాన్ని ఒక ప్రాధాన్య రం గంగా ఎంచుకుని, పరిశ్రమ అభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందిస్తోందని కేటీఆర్ తెలిపారు. ఈ రంగంలో హైదరాబాద్ ఫార్మాసిటీ ఓ మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇటీవలి బయో ఏసియా సదస్సులో రాష్ట్ర లైఫ్ సైన్సెస్ రంగ అభివృద్ధిపై జరిపిన చర్చలు, వచ్చిన సలహాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. రానున్న ఏళ్లలో రాష్ట్ర లైఫ్ సైన్సెస్ రంగం తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతో పాటు అంతర్జాతీయ కంపెనీలను ఇక్కడికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ రంగంలో వస్తున్న డిజిటల్ మెడిసిన్, ఫార్మా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానం రంగ ప్రవేశం చేస్తే కొత్తగా పుట్టుకొచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

**పరిశోధనల కోసం ఇంక్యుబేటర్**

హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ ఈకో సిస్టమ్‌ను అభివృద్ధి పరుస్తామని కేటీఆర్ తెలిపారు. ఇందుకు అవసరమైన పరిశోధన, శిక్షణకు ప్రభుత్వం చురుగ్గా ఏర్పాట్లు చేస్తుందన్నారు. లైఫ్ సెన్సెస్ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు టీ–హబ్ వంటి ఇంక్యుబేటర్‌ను జీనోమ్ వ్యాలీ లో ఏర్పాటు చేస్తామన్నారు. ఐదు వ్యాధులను ఎంపిక చేసి, వాటి కట్టడికి అవసరమైన పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తామన్నారు. ఫార్మా కంపెనీలు, విద్యా సంస్థలు, సీసీఎంబీ వంటి పరిశోధన సంస్థలను సమన్వయ పరిచేందుకు రిచ్ సంస్థ ప్రయత్నిస్తుందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగంలో పరిశోధనలు చేసే స్టార్టప్‌లు, హై రిస్క్ రీసెర్చ్‌కు ప్రోత్సా హం అందించేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. లైఫ్ సైన్సెస్ రంగం పరిశ్రమల భాగస్వామ్యంతో పాఠశాల స్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. నూతన పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడంతోపాటు ఇక్కడి పరిశ్రమల విస్తరణపై దృష్టి సారిస్తామన్నారు. ఈ మేరకు త్వరలోనే ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలతో సమావేశం ఏర్పాటు చేసి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. ఫార్మా రంగంలో మరిన్ని పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం ఒక ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బాడీని ఏర్పాటు చేస్తుందన్నారు.

### పరిశ్రమలకు ప్రోత్సాహం: పోచారం

**ఫుడ్ ప్రాసెసింగ్‌పై మంత్రివర్గ ఉపసంఘం భేటీ**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో వ్యవసాయ రంగం పటిష్టతతో పాటు రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ విధివిధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సచివాలయంలో సమావేశమైంది. మంత్రి పోచారం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ప్రాంతాలకు అను గుణంగా పండే పంటల విస్తీర్ణం, ప్రస్తుత మున్న పరిశ్రమలు, కొత్తగా అవసరమయ్యే పరిశ్రమలపై చర్చ జరిగిందని పోచారం చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలతో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి సమావేశం నిర్వ హించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ఈ నెల 15న మరోసారి సమావేశమై విధివిధానాలు ఖరారు చేసి సీఎం కేసీఆర్‌కు నివేదిక ఇస్తామని పేర్కొన్నారు.

## ఇక 50 కిలోల యూరియా బస్తాకు మంగళం

- మార్కెట్లోకి 2, 5, 10, 25, 45 కేజీల బస్తాలు
- ఆ ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు పార్థసారథి లేఖ



**సాక్షి, హైదరాబాద్:** యూరియా 50 కేజీల బస్తాకు కేంద్ర ప్రభుత్వం మంగళం పాడింది. ఇక నుంచి 2, 5, 10, 25, 45 కేజీల బస్తాలు అందుబాటులోకి రానున్నాయి. యూరియా వాడకాన్ని తగ్గించేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి మంగళవారం లేఖ రాశారు. బస్తా పరిమాణం తగ్గిస్తే బస్తాకు 5 కేజీల చొప్పున వాడకం తగ్గుతుందని చెప్పారు. ఈ విషయమై జిల్లాల్లో ఎరువుల దుకాణాదారులకు అవగాహన కల్పించాలని, అందుకు ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించాలని కోరారు. 46 శాతం నత్రజని గల వేప పూత పూసిన 45 కిలోల యూరియా బస్తా ధర రూ. 242గా నిర్ధారించారని.. పన్నులతో కలిపి రూ. 266కు అందించనున్నట్లు తెలిపారు. అలాగే జింక్ ఉన్న యూరియా 45 కేజీల బస్తా ధర రూ. 266గా నిర్ధారించారని.. పన్నులు కలిపి రూ. 290కు విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. తుది ధరలను కంపెనీలు ప్రకటిస్తాయని వివరించారు. అయితే 2 నుంచి 25 కేజీల పరిమాణాల్లో ఉండే యూరియా బస్తాలకు ధర కాస్త ఎక్కువ ఉండనుంది. రెండు కేజీల బస్తాకు రూ.1.50, 5 కేజీల బస్తాకు రూ. 2.25, పది కేజీల బస్తాకు రూ. 3.50, 25 కేజీల బస్తాకు రూ. 5 అదనంగా వసూలు చేయనున్నారు. 45 కేజీల బస్తాలు త్వరలో మార్కెట్లోకి రానున్నాయని పార్థసారథి వెల్లడించారు. ఇప్పటికే ఉన్న వాటిని త్వరగా విక్రయించాలని, పాత స్టాక్‌ను పాత ధరలకే విక్రయించాలని కోరారు. కాగా, అనుమతి లేని బీజీ–3 పత్తి విత్తనాలను మార్కెట్లోకి ప్రవేశపెట్టినందున దాడులు చేసి పట్టుకోవాలని పార్థసారథి మరో లేఖలో ఆదేశాలు జారీ చేశారు. మండల వ్యవసాయాధికారులను తక్షణమే రంగంలోకి దింపాలన్నారు.

### గవర్నర్ కాన్వాయ్‌లో బెంజ్ కారు

**రూ.1.69 కోట్లతో కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ కాన్వాయ్‌లో కొత్త కారు చేరింది. ఆయన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు బెంజ్ కారును కొనుగోలు చేసింది. రూ.1.69 కోట్లతో కొన్న ఎస్–450 మోడల్ బెంజ్ కారును జీఏడీ కార్యదర్శి అర్విందర్‌సింగ్ స్వయంగా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ నరసింహన్‌కు అప్పగించారు. కాగా, బెంజ్ కారు కోసం రాజ్‌భవన్ నుంచి వచ్చిన ప్రతిపాదనను ఆర్థిక శాఖ ఆమోదించి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నుంచే ఈ మొత్తాన్ని వెచ్చిస్తున్నట్టు పేర్కొన్నాయి.


## లోయర్ పెన్‌గంగలో మరో రెండు రిజర్వాయర్లు

- 2.12 టీఎంసీల సామర్థ్యంతో గోముత్రి, పిప్పల్‌కోఠి
- రూ.584 కోట్లతో అంచనాలు

**సాక్షి, హైదరాబాద్:** గోదావరి ఉపనది పెన్‌గంగపై మహారాష్ట్ర, తెలంగాణల మధ్య ఉమ్మడి ప్రాజెక్టుగా చేపడుతున్న లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టులో ఇప్పటికే నిర్మిస్తున్న ఛనాకా–కొరట రిజర్వాయర్‌కు అదనంగా మరో రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నిర్ణయించిన ఆయకట్టుకు అదనంగా మరో 48,300 ఎకరాలకు నీరిచ్చేలా గోముత్రి, పిప్పల్‌కోఠి రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టనుంది. 2.12 టీఎంసీల సామర్థ్యంతో వీటిని చేపట్టనుంది. పెనుగంగలో మొత్తం 42 టీఎంసీల నీటిని వాడుకునే హక్కు ఇరు రాష్ట్రాలకు ఉండగా, 12 శాతం నీటి వాటా (5.12 టీఎంసీలు) తెలంగాణకు దక్కాల్సి ఉంది. ఈ నీటితో ఆదిలాబాద్ జిల్లాలోని తాంసి, జైనథ్, బేల మండలాల పరిధిలోని 47,500 ఎకరాలకు సాగునీరిచ్చే అవకాశముంది. ఈ నీటిని వాడుకునే క్రమంలోనే 0.83 టీఎంసీ సామర్థ్యంతో ఛనాకా–కొరట బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. ఈ బ్యారేజీ ద్వారా అక్టోబర్ వరకే నీరిచ్చే అవకాశముండగా, నవంబర్ నుంచి ప్రవాహాలు తగ్గుతాయి. దీంతో నీటి ప్రవాహాలు సమృద్ధిగా ఉన్నప్పుడే నిల్వ చేసేలా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించనున్నారు. ప్రధాన కాల్వ 1.91 కిలోమీటర్ నుంచి 47 కిలోమీటర్ల వరకు ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల పరిధిలో ఉన్న 10,800 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా 0.7 టీఎంసీలో గోముత్రి రిజర్వాయర్‌ను నీటిపారుదల శాఖ ప్రతిపాదించింది. ఈ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.215 కోట్లు అవుతుందని అంచనా వేసింది. ఇందులో భూసేకరణ, ఆర్ అండ్ ఆర్‌కు రూ.28 కోట్లు వ్యయం అవుతుందని తేల్చింది. ప్రధాన కాల్వపై 47 కిలోమీటర్ నుంచి 89వ కి.మీ.కు జైనథ్, బేలా, ఆదిలాబాద్ మండలాల పరిధిలోని 37,500 ఎకరాలకు నీరిచ్చేలా 1.423 టీఎంసీలతో పిప్పల్‌కోఠి రిజర్వాయర్‌ను ప్రతిపాదించింది. దీనికి రూ.368.78 కోట్లతో అంచనా వేసింది. రెండింటికి కలిపి 584.78 కోట్లతో అంచనాలు వేసింది.

**105వ రోజు**

**06–03–2018, మంగళవారం**
**ఇంకొల్లు శివారు, ప్రకాశం జిల్లా**




### అధికార పార్టీ నేతల భూదాహానికి అంతే లేకుండా పోతోంది..

పాదయాత్రలో ఏ జిల్లాకు, ఏ ప్రాంతానికి వెళ్లినా తాగునీరు, రుణ మాఫీ, సంక్షేమ పథకాలు అందలేదన్న ఫిర్యాదులు ఎక్కువగా వచ్చేవి. కానీ ఈ రోజు అధికార పార్టీ నేతల భూదాహంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులొచ్చాయి. ఏ విధంగా భూదురాక్రమణలకు పాల్పడుతున్నారో, పేదల భూములు లాగేసుకునేందుకు ఏ విధంగా సిద్ధమవుతున్నారో బాధితులు నాకు చెప్పారు. దేవరపల్లి గ్రామంలో 46 దళిత కుటుంబాలవాళ్లు 40 ఏళ్లుగా 22 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారట. 4 దశాబ్దాల కిందటే ఇందిరాగాంధీ హయాంలో బీ ఫారాలు పొందిన ఆ భూములే వారికి జీవనాధారంగా మారాయట. తమకు ఆ భూములపై పూర్తి హక్కులున్నప్పటికీ.. గతంలో చంద్రబాబు పాలనలో ఐదేళ్లపాటు ఆ భూముల్లో పంటలు పండించుకోనీయకుండా టీడీపీ నేతలు అడ్డుపడ్డారని, 2004లో నాన్నగారు అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆ భూముల్లో పంటలు పండించుకునే అవకాశం కల్పించారని చెప్పారు. 2014 వరకూ ఎలాంటి ఇబ్బందీ రాలేదన్నారు. మళ్లీ ఇప్పుడు టీడీపీ సర్కార్ రావడంతో కష్టాలు మొదలయ్యాయట. ఆ పార్టీకి ఓటేయలేదని కక్ష గట్టారట. నీరు – చెట్టు కార్యక్రమం పేరుతో గత ఆగస్టులో రాత్రి వేళ.. దాదాపు 400 మంది పోలీసులను దించి ఆడామగ అనే తేడా లేకుండా అరెస్టులు చేసి, నిర్బంధించారని, పొక్లెయిన్‌లు తెచ్చి తమ భూముల్ని తవ్వించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కోర్టుకెళ్లామని వివరించారు. ఇది నిజంగా దారుణం. పేదలపై ఈ విధంగా కక్షగట్టడం, వారి జీవనాధారంపై దెబ్బకొట్టడం అన్యాయం.

చినగంజాం షెడ్యూల్డ్ కులాల సేవా సంక్షేమ సంఘం ప్రతినిధులదీ ఇదే బాధ. 60 కుటుంబాలకు చెందిన నిరుపేద దళితులు గత 15 ఏళ్లుగా 56 ఎకరాల భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో కష్టాలు మొదలయ్యాయని కన్నీరుపెట్టారు. టీడీపీ నేతలు బినామీల పేర్లతో తప్పుడు రికార్డులు సృష్టించి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, వారికి అధికారులు అండగా నిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూముల్లో ఇసుక అక్రమ వ్యాపారం చేసుకోవాలని చూస్తున్నారని, అర్హత లేనివారి పేర్లతో ఆన్‌లైన్లలో తప్పుడు రికార్డులు కూడా పెట్టారని తెలిపారు. గత్యంతరంలేక.. జరుగుతున్న మోసంపై తాము కోర్టును ఆశ్రయించామని చెప్పారు. వాళ్లకు ఆ పరిస్థితి రావడం నిజంగా శోచనీయం. పేదల భూములకు ప్రభుత్వమే రక్షణ కల్పించకపోతే ఎలా?

ప్రపంచంలోని ఉత్తమ నటీనటులకు ఆస్కార్ అవార్డులు ప్రకటించినట్లు పత్రికల్లో చూశాను. ప్రత్యేక హోదా విషయంలో డ్రామాలాడుతూ రాష్ట్రంపై దొంగ ప్రేమ చూపిస్తున్న చంద్రబాబు నటనాకౌశలాన్ని చూసి ఉంటే.. ఆస్కార్ అవార్డు ఆయనకే ఇచ్చేవారేమో!

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. నిరుపేదల జీవన ప్రమాణాలను పెంచడం కోసం ప్రభుత్వాలు వారికి ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల పట్టాలిస్తాయి. మీ ప్రభుత్వంలో అవేవీ చేయకపోగా.. వారికున్న కొద్దిపాటి భూములను సైతం బెదిరించి, భయపెట్టి, దౌర్జన్యంగా లాక్కోవడం న్యాయమేనా? వారి ఆస్తులను రక్షించాల్సిన ప్రభుత్వమే భక్షించడం ధర్మమేనా? కాపాడాల్సిన కనురెప్పే కంటిని కాటేస్తే.. ఆ కన్నీటి వెతలను ఎవరితో చెప్పుకోవాలి?

వైఎస్. జగన్.

# బాబూ.. దమ్ముంటే వారిపై వేటు వేయండి

**రూ.20 కోట్లు, రూ.30 కోట్లిచ్చి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొంటారా?**

- అనర్హత వేటు పడకుండా వ్యవస్థలను మేనేజ్ చేస్తారా?
- ఇంకొల్లు సభలో నిప్పులు చెరిగిన ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి :

'ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను సంతలో పశువుల మాదిరి రూ.20 కోట్లు, రూ.30 కోట్లకు కొనుగోలు చేయడమే కాక, నిబంధనలను తుంగలో తొక్కి మంత్రుల్ని చేస్తారా? వారిపై అనర్హత వేటు పడకుండా వ్యవస్థలను మేనేజ్ చేస్తారా? మీకు దమ్ము, ధైర్యం ఉంటే వాళ్లను అనర్హులుగా ప్రకటించండి. సత్తా ఉంటే మీ పార్టీ గుర్తుపై పోటీ చేయించి గెలిపించుకోండి. ఒక్క హామీ నెరవేర్చని మీకు జనం ఓటు వేస్తారన్న నమ్మకం లేదు. కాబట్టే వారిని ఎన్నికల్లో గెలిపించుకునే సాహసం చేయని అసమర్థ ముఖ్యమంత్రి మీరు' అంటూ ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిప్పులు చెరిగారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం 105వ రోజు ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లు గ్రామంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అబద్ధాలు, మోసాలు చేసే వ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా కావాలా.. అని ప్రశ్నించారు. మనందరి ప్రభుత్వం రాగానే రైతులకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ ఒక్క రైతు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రానివ్వనని హామీ ఇచ్చారు. ప్రతి రైతుకూ ఉచితంగా బోరు వేయిస్తామన్నారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

**పైనుంచి కిందిదాకా అవినీతే**

నాలుగేళ్ల పాలనలో అబద్ధాలు, మోసాలు, విచ్చలవిడిగా చట్టాలను ఉల్లంఘన చేయడం చూశాం. పైస్థాయి నుంచి కింది వరకు అవినీతి అన్నది విచ్చల విడిగా జరుగుతోంది. పైన చంద్రబాబు మట్టి మొదలు.. ఇసుక, మద్యం, బొగ్గు, కరెంటు కొనుగోలు, కాంట్రాక్టులు, రాజధాని భూములు, గుడి భూములను కూడా వదిలిపెట్టడం లేదు. అవినీతి డబ్బుతో తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు లంచం ఇస్తూ ఆడియో, వీడియో టేపులతో దొరికిపోయారు. మామూలుగా ఎవరైనా ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడితే ఆ ఉద్యోగిని సస్పెండ్ చేస్తారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి అడ్డగోలుగా దొరికిపోయినా ఆయన రాజీనామా చేయడు.. ఆయన్ను అరెస్టు చేయరు. అడ్డగోలుగా చట్టాలను తుంగలో తొక్కుతున్నారు. 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనుగోలు చేశారు. వారిలో నలుగురికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయకుండా కాపాడుతున్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరుగబోతున్నాయి కాబట్టి మీ అందర్నీ అడుగుతున్నా.. మోసాలు, అబద్ధాలు చెప్పే వ్యక్తి ముఖ్యమంత్రి కావాలా? చెడిపోయిన ఈ రాజకీయ వ్యవస్థలోకి నిజాయితీ, విశ్వసనీయత రావాలి. అది జగన్ ఒక్కడి వల్లే కాదు, మీ అందరి తోడు, దీవెనలు కావాలి. పొరపాటున ఈ చంద్రబాబును క్షమిస్తే రేపు పొద్దున ఏం జరుగుతుందో తెలుసా? చిన్న చిన్న అబద్ధాలు చెబితే నమ్మరని పెద్దవి చెబుతారు. ప్రతి ఒక్కరికి కేజీ బంగారం, ఇంటికో బెంజికారు అంటారు. ఇదీ నమ్మరని తెలిసి ప్రతి ఇంటికీ ఒక మనిషిని పంపించి రూ.3 వేలు డబ్బు కూడా ఇస్తామంటారు. డబ్బులు ఇస్తే వద్దు అనొద్దు. రూ.3 వేలు కాకుండా రూ.5 వేలు గుంజండి. అదంతా మన డబ్బే.. మన జేబుల్లోంచి దోచేసిన డబ్బే. ఓటు వేసేటప్పుడు మాత్రం మీ మనస్సాక్షి ప్రకారం ఓటు వేయండి. మోసాలు చేసేవారిని, అబద్ధాలు చెప్పేవారిని బంగాళాఖాతంలో కలపండి'' అని జగన్ పిలుపునిచ్చారు.


మంగళవారం ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో జరిగిన బహిరంగ సభలో భారీ జన సందోహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

# 132 ఏళ్ల 'సీసా సందేశం'


బీచ్‌లో దొరికిన సీసా

**2003లో** విడుదలైన శివమణి సినిమాలో హీరోయిన్ అసిన్ సముద్రం మధ్యలో అపాయంలో ఉన్నప్పుడు కాగితంపై ఓ సందేశం రాసి, దానిని గాజు సీసాలో పెట్టి పడవలో నుంచే నీళ్లలోకి విసిరేస్తుంది. కొన్నేళ్ల తర్వాత ఆ 'బాటిల్ సందేశం' మరో హీరోయిన్ రక్షితకు బీచ్‌లో దొరికి కథకు కీలకంగా మారుతుంది. తాజాగా ఆస్ట్రేలియాలోని ఓ బీచ్‌లో అలాంటి జిన్ 'సీసా సందేశం' లభించింది. అయితే ఇది ప్రేమ సందేశం మాత్రం కాదు. కాగితంపై వివరాలు రాసి జిన్ బాటిల్‌లో పెట్టి సముద్రంలోకి విసిరిన సందేశం ఇటీవల ఓ మహిళకు దొరికింది. సినిమాలోలాగా కాకుండా ఇది ఏకంగా 132 ఏళ్ల క్రితం నాటిది. అందుకే ఇది ప్రపంచంలోనే అత్యంత పాత 'బాటిల్ సందేశం' అయ్యింది. ఇంతకీ ఆ జిన్ సీసాలోని పేపర్‌లో ఏముంది? తెలుసుకోవాలంటే ఈ కథనం చదవండి..

పూర్వం ప్రపంచ వ్యాప్తంగా సముద్ర జలాల ప్రవాహాలు, అలల వేగాన్ని లెక్కించి నౌకలు సులువుగా ప్రయాణం సాగించేందుకు జర్మనీ శాస్త్రవేత్తలు కొత్త సముద్ర మార్గాలను కనుక్కునేవారు. ఇందుకోసం వారు 69 ఏళ్లపాటు పరిశోధనలు చేశారు. ఇంతకీ జలాల ప్రవాహాన్ని లెక్కించడానికి వాళ్లు ఏం చేసే వారంటే.. బాటిళ్లలో తేదీతో సహా సందేశాలు రాసిపెట్టి పడవలు, ఓడల నుంచి సముద్రం మధ్యలోకి విసిరేవారు. ఆ తర్వాత ఈ బాటిళ్లు ఎవరికి దొరుకుతాయో వారు ఆ సీసాలో ఉన్న కాగితాన్ని హాంబర్గ్‌లోని జర్మనీ నౌకల విభాగానికి లేదా దగ్గర్లోని జర్మనీ రాయబార కార్యాలయానికి అందించాలి. ఆ బాటిల్ సముద్రంలో విసిరిన తర్వాత ఎన్నాళ్లకు తీరానికి వచ్చిందనేదాన్ని అంచనా వేసి సముద్ర జలాల వేగాన్ని, అలల దిశను కనుగొనేవారు. 19వ శతాబ్దంలో ఇలాంటి కొన్ని వేల సీసాలను సముద్రాల్లోకి విసరగా వాటిలో దాదాపు పది శాతం (660) సందేశాలు మాత్రమే తిరిగొచ్చాయి. చివరిగా 1934లో ఇలాంటి బాటిల్ డెన్మార్క్‌లో దొరికింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆస్ట్రేలియాకు చెందిన ఓ మహిళకు అక్కడి బీచ్‌లో 'సీసా సందేశం' దొరికింది. జర్మనీకి చెందిన పౌలా నౌక నుంచి 1886 జూన్ 12వ తేదీన హిందూమహా సముద్రంలో ఫలానా అక్షాంశాలు, రేఖాంశాల ప్రదేశంలో ఈ బాటిల్‌ను నీళ్లలోకి విసిరేస్తున్నట్లు ఆ సందేశంలో రాసి ఉంది.

## హెల్మెట్‌తో వెన్నెముకకు రక్ష



**వాషింగ్టన్:** ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల వెన్నెముక మెడ పైభాగానికి (సర్వైకల్ స్పైన్) గాయం కాకుండా తప్పించుకోవచ్చని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ప్రమాద సమయంలో వెన్నెముకకు గాయం కాకుండా హెల్మెట్ కాపాడలేదని.. పైగా హెల్మెట్ వల్ల కొన్నిసార్లు వెన్నెముకకు గాయమయ్యే ప్రమాదం కూడా ఉందని అనేకమంది భావిస్తారు. అయితే ఇది కేవలం అపోహ మాత్రమేనని పరిశోధకులు అంటున్నారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ హాస్పిటల్స్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా 2010–15 మధ్య విస్కాన్సిన్ ఆస్పత్రిలో నమోదైన 1,061 మంది వాహన ప్రమాద బాధితుల మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. వీరిలో 323 మంది ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించగా.. 738 మంది హెల్మెట్ ధరించలేదు. హెల్మెట్ లేని వారిలో ఈ తరహా గాయాలయ్యే అవకాశం 10.8% ఉండగా.. ధరించిన వారిలో 4.6%గా ఉందన్నారు.

## మేఘాలయ సీఎంగా సంగ్మా ప్రమాణం

### నాగాలాండ్, త్రిపురలకు ఖరారైన కొత్త సీఎంల పేర్లు


ప్రమాణం చేస్తున్న సంగ్మా

**షిల్లాంగ్:** మేఘాలయ 12వ ముఖ్యమంత్రిగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) చీఫ్ కాన్రాడ్ సంగ్మా బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌భవన్‌లో మంగళవారం సంగ్మాతోపాటు మరో 11 మంది చేత మంత్రులుగా గవర్నర్ గంగా ప్రసాద్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ తదితరులు హాజరయ్యారు. సంగ్మాకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. మేఘాలయలో కాంగ్రెస్ 21 సీట్లు గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచినా.. రెండే సీట్లు గెలిచిన బీజేపీ ఇతరుల మద్దతు కూడగట్టి ఎన్‌పీపీ అధికారంలోకి వచ్చేలా చక్రం తిప్పింది.

**త్రిపుర సీఎంగా విప్లవ్ దేవ్ :** త్రిపురలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా విప్లవ్ దేవ్ నియమితులు కానున్నారు. మంగళవారం బీజేపీ, మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ ఎమ్మెల్యేలు సమావేశమై విప్లవ్‌ను సీఎంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకార వేడుక శుక్రవారం (9వ తేదీన) జరగనుంది.

**నాగాలాండ్‌కు కొత్త సీఎం రియో:** నాగాలాండ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నేషనలిస్ట్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)ని ఆ రాష్ట్ర గవర్నర్ పీబీ ఆచార్య ఆహ్వానించారు. ఎన్‌డీపీపీ సీనియర్ నేత నీఫ్యూ రియో గురువారం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు.

# లెనిన్ విగ్రహం కూల్చివేత

- త్రిపురలో ఉద్రిక్తత
- త్రిపుర, పశ్చిమబెంగాల్లో సీపీఎం ఆందోళన
- విదేశీ నేతల విగ్రహాలు వద్దు: కేంద్ర మంత్రి


లెనిన్ విగ్రహాన్ని కూల్చివేస్తున్న జేసీబీ.. (ఇన్‌సెట్‌లో) ముక్కలైన విగ్రహం

**అగర్తలా/న్యూఢిల్లీ:** ఈశాన్య రాష్ట్రం త్రిపుర వేడెక్కుతోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 25 ఏళ్ల వామపక్ష ప్రభుత్వాన్ని గద్దె దించి బీజేపీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి సీపీఎం, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడింది. పలు చోట్ల సీపీఎం కార్యాలయాలను ధ్వంసం చేసిన ఘటనలూ చోటు చేసుకున్నాయి. తాజాగా రాష్ట్రంలోని బెలోనియా పట్టణంలోని సోవియట్ రష్యా విప్లవ నేత వ్లాదిమర్ లెనిన్ విగ్రహాన్ని సోమవారం గుర్తుతెలియని దుండగులు జేసీబీతో కూల్చివేసిన ఘటన ఉద్రిక్తతలను మరింత పెంచింది. అంతకుముందు, ఆదివారం సబ్రూన్‌లోని లెనిన్ విగ్రహాన్ని కూడా కొందరు ధ్వంసం చేసి కూల్చేశారు. బెలోనియాలోని కాలేజీ స్క్వేర్‌లో నెలకొల్పిన లెనిన్ విగ్రహాన్ని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాశ్‌కారత్ ఇటీవలే ఆవిష్కరించారు. లెనిన్ విగ్రహ కూల్చివేతలపై దేశవ్యాప్తంగా పలుచోట్ల సీపీఎం శ్రేణులు నిరసనలు నిర్వహించాయి. ఈ ఘటనకు బీజేపీయే కారణమని ఆరోపించాయి. ఎన్నికల్లో విజయంతో బీజేపీ, దాని మిత్రపక్షమైన ఐపీఎఫ్‌టీ రాష్ట్రంలో దాడులకు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ ఆరోపించారు. లెనిన్ విగ్రహం కూలిచ్చవేసిన అనంతరం దుండగులు 'భారత్ మాతాకీ జై' అని నినదించారన్నారు. తమ పార్టీకి చెందిన వారిపై దాడులు చేయడంతో పాటు ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కాగా, లెనిన్ విగ్రహాన్ని కూల్చిన జేసీబీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. మరోవైపు, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ త్రిపుర గవర్నర్ తథాగత్ రాయ్, డీజీపీ ఏకే శుక్లాలకు ఫోన్ చేసి పరిస్థితిని సమీక్షించారు.

**లెనిన్ తీవ్రవాది: సుబ్రమణ్యస్వామి**
మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద, జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ వంటి ఎందరో స్వదేశీ నేతలు, ఆదర్శప్రాయులు మనకు ఉండగా,, విదేశీయుల విగ్రహాలు ఎందుకని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ వ్యాఖ్యానించారు. లెనిన్ విగ్రహం కూల్చివేతను బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి సమర్థించారు. రష్యాకు చెందిన లెనిన్ తీవ్రవాది అంటూ.. ఆయన విగ్రహాన్ని మన దేశంలో ఏర్పాటు చేయటమేంటని ప్రశ్నించారు. కావాలంటే, లెనిన్ విగ్రహాన్ని పార్టీ కార్యాలయాల్లో పెట్టుకుని, పూజించుకోవాలని కమ్యూనిస్టు నాయకులకు సూచించారు. లెనిన్ నిరంకుశ పాలనలో రష్యాలో ఎంతో మంది మరణించారన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహాన్ని మన దేశంలో నెలకొల్పుతారా అని ప్రశ్నించారు. త్రిపురలో వామపక్ష ప్రభుత్వ అణచివేతకు గురైన ప్రజలే లెనిన్ విగ్రహాన్ని కూల్చి ప్రతీకారం తీర్చుకున్నారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించారు. కాశీ, అయోధ్య, మధుర తదితర దేవాలయాల ధ్వంసంపై ఈ నేతలు మాట్లాడినట్లు తానెప్పుడూ వినలేదన్నారు.

### ప్రతీకారం.. ప్రజాస్వామ్యం కాదు: మమత



'సీపీఎం, ఆ పార్టీ అకృత్యాలకు నేను వ్యతిరేకం. మార్క్స్, లెనిన్‌లు నాకు నచ్చరు. అలాగే, బీజేపీ దౌర్జన్యాలను కూడా సహించను' అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ప్రతీకారం.. ప్రజాస్వామ్యం కానేకాదన్నారు. ప్రపంచ నేతల్లో ఒకరైన లెనిన్‌ను గౌరవించటం సంప్రదాయమని సీపీఐ నేత డి.రాజా అన్నారు.

**కోల్‌కతాలో ర్యాలీ:** లెనిన్ విగ్రహం కూల్చివేతకు నిరసనగా కోల్‌కతాలో సీపీఎం చేపట్టిన ర్యాలీలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్, బృందా కారత్, బిమన్ బోస్ పాల్గొన్నారు. త్రిపురలో సీపీఎం కార్యకర్తలపై దాడులను వారు ఖండించారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని ఏచూరి పిలుపునిచ్చారు.

## ఆధార్ లింకేజీ గడువు పెంపునకు అవకాశం

**న్యూఢిల్లీ:** ఆధార్‌ను ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలకు అనుసంధానం చేసే గడువును మరి కొంతకాలం పొడిగించే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం చేపట్టిన విచారణ సందర్భంగా అటార్నీ జనరల్(ఏజీ) కేకే వేణుగోపాల్ ఈ విషయం తెలిపారు. ఆధార్ కేసుపై సుప్రీంకోర్టులో వాదనలు ప్రస్తుతం కొనసాగుతున్నందున, ఇందుకు వీలుగా ప్రభుత్వం గడువు పెంచాలనుకుంటోందని ఏజీ తెలపగా ధర్మాసనం అంగీకరించింది. ఆధార్ విషయంలో పదేపదే ఒకే రకమైన వాదనలు చేసేందుకు పిటిషనర్లను అంగీకరించబోమని బెంచ్ తెలిపింది. బుధవారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.

## సిరియాలో విమానం కూలి 32 మంది మృతి

**మాస్కో:** సిరియాలో రష్యా రవాణా విమానం కుప్పకూలిన దుర్ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 32 మంది మృతిచెందారు. మేమిమ్ ఎయిర్‌బేస్‌లో మంగళవారం ఆ విమానం దిగాల్సి ఉండగా, అర కిలో మీటర్ దూరంలోనే ప్రమాదానికి గురైందని అధికారులు వెల్లడించారు. ఆ సమయంలో విమానంలో 26 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారని, వారంతా చనిపోయారని తెలిపారు. అనూహ్యంగా సాంకేతిక సమస్య తలెత్తడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేల్చారు. సిరియాలో ప్రభుత్వానికి మద్దతుగా రష్యా 2015 నుంచి వైమానిక దాడుల్లో పాల్గొంటున్న సంగతి తెలిసిందే.

## కార్తీకి మరో మూడు రోజుల కస్టడీ



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి సుప్రీంకోర్టు, ఢిల్లీ స్థానిక కోర్టుల్లోనూ ఊరట లభించలేదు. ఆయన సీబీఐ కస్టడీని ఢిల్లీ స్థానిక కోర్టు మరో మూడు రోజులు పొడిగించింది. బెయిల్ పిటిషన్‌ను సైతం వాయిదా వేసింది. ఇక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు నుంచి రక్షణ కోరుతూ కార్తీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తీ ఐదు రోజుల సీబీఐ కస్టడీ ముగిసిన నేపథ్యంలో మంగళవారం అతడిని సీబీఐ అధికారులు ప్రత్యేక న్యాయమూర్తి సునీల్‌రాణా ఎదుట హాజరుపరిచారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయని, వీటిలో కార్తీ పాత్రపై వాస్తవాలు తెలియాలంటే విచారణ తప్పనిసరి అని, అందువల్ల కస్టడీ పొడిగించాలని సీబీఐ కోరింది. కార్తీని ముంబై తీసుకువెళ్లి ఐఎన్ఎక్స్ మీడియా మాజీ ప్రమోటర్, ప్రస్తుతం బైకుల్లా జైలులో ఉన్న ఇంద్రాణి ముఖర్జియాతో కలిపి విచారించాల్సి ఉందని, ఈ కేసులో ఆమె వాంగ్మూలం ఓ కీలక ఆధారమని విజ్ఞప్తి చేసింది.

## మహిళ వేళ్లను నరికిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు!

**గాంధీనగర్:** గుజరాత్‌లోని గాంధీనగర్ జిల్లా ఛత్రల్ పట్టణంలో ముస్లిం మహిళ చేతివేళ్లను నరికి, ఆమె కుమారుడి చేతిని విరగ్గొట్టిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బయటకు రావద్దంటూ తాము ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేసినందుకు బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఈ దారుణానికి పాల్పడినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో రోషన్‌బీవీ సయద్(52) తన మూడు చేతివేళ్లను కోల్పోగా.. ఆమె కుమారుడు ఫర్జన్‌కు గాయాలయ్యాయి. బాధితురాలి బంధువుల కథనం ప్రకారం.. ఇల్లు వదిలి బయటకు రావద్దని రోషన్‌బీవీని, ఆమె కుమారుడ్ని సోమవారం హెచ్చరించగా.. పశువులను మేపుకునేందుకు వారిద్దరు బయటకు రాగా బజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని.. స్పృహలోకి వచ్చాక ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

# శ్రీలంకలో ఎమర్జెన్సీ

### బౌద్ధులు, ముస్లింల మధ్య ఘర్షణల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం



కాండీలో ధ్వంసమైన భవనం శిథిలాలను తొలగిస్తున్న పోలీసులు

**కొలంబో:** శ్రీలంకలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మత ఘర్షణల నేపథ్యంలో దేశంలో పది రోజుల పాటు ఎమర్జెన్సీని విధిస్తున్నట్లు అక్కడి సామాజిక సాధికారత శాఖ మంత్రి ఎస్.బి. దిస్సనాయకే మీడియాకు వెల్లడించారు. శ్రీలంకలోని కాండీ జిల్లాలో బౌద్ధులు, ముస్లింల మధ్య తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ అల్లర్లలో ఇప్పటికే ఇద్దరు మరణించారు. పలు మసీదులు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో ఘర్షణలు దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా నిరోధించేందుకు పది రోజుల పాటు అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు దిస్సనాయకే తెలిపారు. అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ఆధ్వర్యంలో మంత్రిమండలి ప్రత్యేకంగా సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

**బౌద్ధులు, ముస్లింల మధ్య ఘర్షణలు**
పర్యాటక ప్రాంతమైన కాండీ జిల్లా తెల్దెనియా ప్రాంతంలో గత నెల 22న ఓ ప్రైవేటు వివాదంలో ముస్లింల దాడిలో గాయపడిన సింహళీయుడొకరు మరణించాడు. ఈ నేపథ్యంలో సోమవారం బౌద్ధుల దాడిలో పది మసీదులు, 75 దుకాణాలు, 32 ఇళ్లు ధ్వంసమయ్యాయని ముస్లింలు వెల్లడించారు. పరిస్థితులను అదుపు చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున భద్రతా బలగాలను పంపించింది. అల్లర్లను నియంత్రించేందుకు కాండీ జిల్లాలో కర్ఫ్యూ విధించారు.

**ఘర్షణల నేపథ్యం ఇదీ..:** శ్రీలంకలో ఈ రెండు వర్గాల మధ్య ఘర్షణలకు నూరేళ్ల నేపథ్యం ఉంది. శ్రీలంక నగరం కాండీ సింహళ బౌద్ధులకు పుణ్యస్థలం. 2.10కోట్ల జనాభా ఉన్న ఈ ద్వీపంలో 70 శాతానికి పైగా సింహళ బౌద్ధులుండగా, ముస్లింలు పది శాతం. శ్రీలంకలో బౌద్ధమత ఆధిపత్యం సాధించడానికి జరిగిన ప్రయత్నాల్లో మొదటి నుంచీ ప్రధాన పాత్ర పోషించింది బౌద్ధ సన్యాసులే. గత పదేళ్లలో రాజకీయ పంథాను ఎంచుకున్న బౌద్ధ సన్యాసులు ముస్లింలను లక్ష్యంగా చేసుకుని విద్వేష ప్రచారం సాగిస్తున్నారు. బౌద్ధ తీవ్రవాద సంస్థ బోడు బాల సేన కాండీలో ముస్లిం వ్యతిరేక ప్రచారంతో మత ఉద్రిక్తతకు కారణమైంది.


## 'షమ్మీ ఆంటీ' కన్నుమూత



**ముంబై:** బాలీవుడ్ సీనియర్ నటి షమ్మీ(89) మంగళవారం కన్నుమూశారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పార్సీ కుటుంబంలో జన్మించిన షమ్మీ 200కు పైగా సినిమాలు, పలు టీవీ ధారావాహికల్లో నటించారు. ఉస్తాద్ పెడ్రో, భాయి–బహెన్, దిల్ అప్నా ఔర్ ప్రీత్ పారాయం, హాఫ్ టికెట్, జబ్ జబ్ ఫూల్ ఖిలే, ఇతెఫాక్, ది బర్నింగ్ ట్రైన్, కుద్రత్, స్వర్గ్ తదితర చిత్రాల్లో నటించారు. దేఖ్ భాయ్ దేఖ్, జబాన్ సంభాల్ కే, శ్రీమాన్ శ్రీమతి, కభీ యే కభీ వో, ఫిల్మి చక్కర్ లాంటి ధారావాహికలు ఆమెకు మంచి పేరు తెచ్చాయి. సినీ దర్శకుడు, నిర్మాత సుల్తాన్ అహ్మద్‌ను షమ్మీ వివాహం చేసుకుని, ఏడేళ్ల తరువాత విడాకులు తీసుకున్నారు.

## 13న విపక్షాలతో సోనియా భేటీ!

### బీజేపీకి వ్యతిరేకంగా ఫ్రంట్ ఏర్పాటు కోసమే: కాంగ్రెస్ వర్గాలు



**న్యూఢిల్లీ/చెన్నై:** బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే సమైక్య కూటమి ఏర్పాటుపై చర్చించేందుకు ఈనెల 13న విందు సమావేశం ఏర్పాటు చేశారని పార్టీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. పార్లమెంటులో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కలిసికట్టుగా ఆందోళన కొనసాగిస్తున్న తరుణంలో.. ఆ ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు, అలాగే 2019 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలతో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు కోసం ఈ విందు భేటీని వేదికగా వాడుకోవాలని సోనియా యోచిస్తున్నారని ఆ నేత తెలిపారు. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెసేతర ఫ్రంట్ ఏర్పాటుపై సంప్రదింపులకు టీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపాదించిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తృణమూల్ అధినేత్రి మమత బెనర్జీ సహా అందరు కీలక ప్రతిపక్ష నేతలతో చర్చలకు సోనియా ఆసక్తిగా ఉన్నారన్నారు.

**ఎన్నికలకు ముందు చెపుతాం: డీఎంకే**
కేంద్రంలో ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయమైనా లోక్‌సభ ఎన్నికలకు ముందు మాత్రమే తీసుకుంటామని బెంగాల్ సీఎం మమతకు చెప్పినట్లు డీఎంకే తెలిపింది.

# వంతెన పైనుంచి పడ్డ ట్రక్కు

### 30 మంది మృతి.. గుజరాత్‌లో ఘోర ప్రమాదం


ప్రమాదస్థలం వద్ద గుమిగూడిన ప్రజలు

**భావ్‌నగర్:** పెళ్లి వేడుకలకు వెళ్తున్న ట్రక్కును మృత్యువు వెంటాడింది. అప్పటివరకు పెళ్లి కబుర్లతో ఆహ్లాదంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా భీతావహంగా మారింది. రక్తసిక్తమైన మృతదేహాలతో, క్షతగాత్రుల ఆర్తనాదాలతో మారుమోగింది. గుజరాత్‌లోని భావ్‌నగర్ జిల్లాలో ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి.. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రక్కు బ్రిడ్జి నుంచి కిందికి పడిపోయింది. దీంతో 30 మందికిపైగా చనిపోయారు. మరో 30 మంది గాయాలపాలయ్యారు. అందులో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో నలుగురు చిన్నారులు, 8 మంది మహిళలు ఉన్నారు. 26 మంది ఘటనా స్థలిలోనే చనిపోయారని, మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారని రాష్ట్ర హోం శాఖ సహాయ మంత్రి ప్రదీప్ సింగ్ జడేజా తెలిపారు. ఉదయం 7:30–7:45 గంటల మధ్య ప్రమాదం జరిగిందని, జిల్లా అధికారులు, స్థానిక గ్రామాల ప్రజలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని చెప్పారు. 'బోతాడ్ జిల్లాలోని టోటమ్ గ్రామంలో పెళ్లికి హాజరయ్యేందుకు దాదాపు 60 మందితో అనిదా గ్రామం నుంచి ట్రక్కు బయలుదేరింది. భావ్‌నగర్–రాజ్‌కోట్ రహదారిపై రంగోలా వద్ద బ్రిడ్జిపై ముందు వెళ్తున్న వాహనాన్ని దాటబోయి.. అదుపుతప్పి కింద పడిపోయింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది' అని జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ ఐఎం సయ్యద్ తెలిపారు. మరోవైపు ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు.

# చోటా మోదీ ఎక్కడ?

### నీరవ్ మోదీపై పార్లమెంటులో విపక్షాల విసుర్లు

- ఉభయసభల్లో రెండో రోజూ కొనసాగిన నిరసనలు
- బ్యాంకింగ్ స్కాంలపై ప్రధాని సమాధానానికి ప్రతిపక్షాల పట్టు
- చర్చకు మేం సిద్ధం.. ప్రతిపక్షమే పారిపోతోంది: కేంద్రం


లోక్‌సభ వెల్‌లోకి వచ్చి ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

**న్యూఢిల్లీ:** వరుసగా రెండోరోజు కూడా పార్లమెంటులో వాయిదాల పర్వం కొనసాగింది. బ్యాంకింగ్ కుంభకోణాలపై ప్రధాని సమాధానం కోసం విపక్షాలు పట్టుబట్టడంతో ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే ఉభయ సభలు బుధవారానికి వాయిదాపడ్డాయి. పీఎన్‌బీ, ఇతర బ్యాంకు స్కాంలపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించినా... చోటా మోదీ (నీరవ్ మోదీ) ఎక్కడ? అంటూ ప్రతిపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. ప్రాంతీయ పార్టీలు కూడా తమ డిమాండ్లపై ఆందోళన కొనసాగించడంతో ఉభయసభలు నిరసనలతో హోరెత్తాయి. తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్ఎస్, మరాఠీకి ప్రాచీన హోదా కోసం ఎన్డీఏ మిత్రపక్షం శివసేన, కావేరీ నదీ జలాల నిర్వహణ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడీఎంకేలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశాయి.

**లోక్‌సభలో రెండో రోజూ అదే తీరు..**
లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే నినాదాలు చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళనను కొనసాగించాయి. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు సభను స్పీకర్ సుమిత్రా మహాజన్ వాయిదా వేశారు. అనంతరం సభ సమావేశమయ్యాక కూడా అదే పరిస్థితి కొనసాగింది. 'చోటా మోదీ (నీరవ్ మోదీ) ఎక్కడికి పారిపోయారు.. ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. నీరవ్‌ను భారత్‌కు తీసుకురండి' అంటూ కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. ఆందోళనల మధ్యే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక అవకతవకలపై చర్చకు కేంద్రం సిద్ధమని, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమాధానమిస్తారని చెప్పారు. అయినా పరిస్థితి సద్దుమణగకపోవడంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు.

**రాజ్యసభ మూడుసార్లు వాయిదా..**
బ్యాంకు కుంభకోణాలు, ఇతర ప్రాంతీయ అంశాలపై కాంగ్రెస్, ఇతర విపక్షాల ఆందోళనలతో రాజ్యసభలో రెండో రోజు సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చకు సిద్ధమని చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు, డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్‌లు చెప్పినా గందరగోళం సద్దుమణగలేదు. దీంతో మూడు సార్లు వాయిదాల అనంతరం మధ్యాహ్నం 3.35 గంటల సమయంలో సభ బుధవారానికి వాయిదా పడింది.

## త్రిపురలో సైద్ధాంతిక విజయం: మోదీ

త్రిపురలో కమ్యూనిస్టు ప్రభుత్వంపై బీజేపీ భారీ గెలుపును సైద్ధాంతిక విజయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఇరవై ఐదేళ్లపాటు కొనసాగిన వామపక్ష ప్రభుత్వాన్ని కూలదోయటం పార్టీ ఆలోచననే మార్చివేసిందని వ్యాఖ్యానించారు. ఇదే ఊపును రాబోయే నెలల్లోనూ కొనసాగించేందుకు కష్టపడి పనిచేయాలని పార్టీ నేతలను కోరారు. మంగళవారం ఇక్కడ జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. 'మన విజయపరంపర కొనసాగుతోంది. ఇప్పుడు కర్ణాటక వంతు అంటూ నేతలు ప్రధానికి స్వాగతం పలికారు' అని మంత్రి అనంత్‌కుమార్ మీడియాకు చెప్పారు. మరోవైపు, జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం(ఎన్‌హెచ్‌పీఎస్) 'ఆయుష్మాన్ భారత్' అమలు దిశగా సాగుతున్న ఏర్పాట్లపై ప్రధాని మోదీ సమీక్షించారు.

## ఏప్రిల్‌లో 'కొరియా' శిఖరాగ్ర భేటీ


కిమ్‌తో యాంగ్ కరచాలనం

**సియోల్:** దేశ రక్షణకు పూచీ ఇస్తే అణ్వాయుధాలను త్యజించేందుకు ఉత్తరకొరియా ముందుకువచ్చింది. దీంతోపాటు దక్షిణ కొరియా అధ్యక్షుడితో సమావేశమయ్యేందుకు కూడా ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ సంసిద్ధత తెలిపారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే–ఇన్ జాతీయ భద్రతా సలహాదారు చుంగ్–ఇయు–యాంగ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం ఇటీవల ఉ.కొరియా వెళ్లింది. రాజధాని ప్యాంగ్‌యాంగ్‌లో ఆ దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో ఈ బృందం సమావేశమైంది. మంగళవారం తిరిగి స్వదేశానికి చేరుకున్న ఈ బృందం చర్చల ఫలితాలను వెల్లడించింది. ఉ.కొరియాతో చర్చల్లో గణనీయ పురోగతి కనిపించిందని పేర్కొంది. సరిహద్దు గ్రామం పన్‌మున్‌జోంలో ఏప్రిల్‌లో రెండు దేశాల అధ్యక్షుల సమావేశానికి అంగీకారం కుదిరిందని తెలిపింది. తమపై సైనిక పరమైన ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా చేసి, ప్రభుత్వ మనుగడకు గ్యారెంటీ ఇచ్చిన పక్షంలో అణ్వాయుధాలను, క్షిపణులను కలిగి ఉండటంలో అర్థం లేదని, వాటిని త్యజిస్తామని ఉత్తరకొరియా పాలకుడు చెప్పినట్లు యాంగ్ వెల్లడించారు. తాము ఎలాంటి అణు, మిస్సైల్ పరీక్షలు జరుపబోమని ఉత్తరకొరియా హామీ ఇచ్చిందన్నారు.

# కొత్తగా 27 పీజీ వైద్య సీట్లు

## మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి గానూ కొత్తగా 27 పీజీ వైద్య సీట్లు పెరిగాయి. సీట్ల పెంపుపై ఈ మేరకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) వైద్య విద్య సంచాలకుడికి లేఖ రాసింది. గాంధీ వైద్య కళాశాల ఛాతీ విభాగంలో 1, అనస్తీషియా విభాగంలో 2, కాకతీయ వైద్య కళాశాల చర్మ వ్యాధుల విభాగంలో 1, స్త్రీ వ్యాధుల చికిత్స విభాగంలో 5, రేడియాలజీలో 3, ఈఎన్‌టీలో 1, కంటి విభాగంలో 1, ఉస్మానియా వైద్య కళాశాల స్త్రీ వ్యాధుల విభాగంలో 4, ఈఎన్‌టీ విభాగంలో 3, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) అనస్తీషియా విభాగంలో 6 సీట్ల చొప్పున పెరిగాయి. తెలంగాణ ప్రభుత్వ ఆస్పత్రులలో పెంచిన సదుపాయాలతోనే వైద్య విద్యలో 27 సీట్లు పెరిగాయని వైద్య, ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. సీట్ల పెంపుతో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. సీట్లు పెరగడానికి కృషి చేసిన వైద్య సిబ్బంది, అధికారులను మంత్రి అభినందించారు.

## ఆన్‌లైన్‌లో భాషా పండితుల సెట్

**సాక్షి, హైదరాబాద్:** ఆన్‌లైన్‌లో భాషా పండితుల సెట్ నిర్వహించాలని విద్యా శాఖ నిర్ణయానికి వచ్చింది. ఇప్పటికే డీఈఈ సెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న విద్యా శాఖ ఈసారి భాషా పండితుల సెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి బుధవారం జరిగే సమావేశంలో చర్చించి అధికారిక ప్రకటన చేయనుంది. మరోవైపు సెట్ కన్వీనర్‌గా రమణకుమార్‌ను నియమించింది. భాషా పండిత శిక్షణ సంస్థలు తమ గుర్తింపును రెన్యువల్ చేసుకునేందుకు ఈ నెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

## మహిళా రైల్వేస్టేషన్‌గా బేగంపేట్

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణమధ్య రైల్వే మహిళా రైల్వేస్టేషన్‌కు శ్రీకారం చుట్టింది. మహిళా ఉద్యోగుల శక్తిసామర్థ్యాలను ప్రోత్సహించేందుకు, వారిలోని ఆత్మ విశ్వాసం, సృజనాత్మకతలను పెంపొందించేందుకు ప్రత్యేక స్టేషన్‌లపై దృష్టి సారించింది. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బేగంపేట రైల్వేస్టేషన్‌ను 'మహిళా ఉద్యోగుల రైల్వేస్టేషన్'గా ప్రకటించనున్నట్లు సీపీఆర్వో ఉమాశంకర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బేగంపేటలో 8 మంది కమర్షియల్ ఉద్యోగులు, నలుగురు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్లు, మరో ఆరుగురు పాయింట్స్ ఉమెన్, ఇద్దర్ ఆర్‌పీఎఫ్ మహిళా పోలీసులను నియమించనున్నట్లు పేర్కొన్నారు. వీరు రైల్వేస్టేషన్ నిర్వహణ, టిక్కెట్ బుకింగ్, ప్రయాణికుల భద్రత తదితర కార్యకలాపాలను నిర్వహిస్తారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో ఇప్పటికే చంద్రగిరి రైల్వేస్టేషన్‌ను మహిళా ఉద్యోగుల రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేశారు. త్వరలో ఫిరంగిపురం స్టేషన్ కూడా మహిళా ఉద్యోగుల రైల్వేస్టేషన్‌గా మారనుంది.

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా రజత్‌కుమార్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా రజత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఏపీ సచివాలయం ప్రాంగణంలోని సౌత్ హెచ్ బ్లాక్‌లో చాంబర్ కేటాయించారు. రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన రజత్‌కుమార్‌ను రిలీవ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రాకు పర్యావరణ, అటవీ శాఖ పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది.

## నాలా భూములూ నమోదు

### పాస్‌బుక్‌లో రైతుల వ్యవసాయేతర భూముల వివరాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని రైతుల అధీనంలో ఉన్న వ్యవసాయేతర (నాలా) భూములను కూడా పక్కాగా రికార్డు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెట్టుబడి సాయం పథకం అమలు నేపథ్యంలో వ్యవ సాయేతర భూములకు ఎట్టి పరిస్థితుల్లో సాయం అందకుండా చూడటంతో పాటు భవిష్యత్తులో క్రయవిక్రయ లావాదేవీలను సులభతరం చేసేందుకు నాలా భూముల వివరాలను కూడా రైతుల పాస్ పుస్తకంలో నమోదు చేయనున్నారు. ఇందుకు పాస్‌పుస్తకంలో ప్రత్యేక కాలమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కాగా, భూరి కార్డుల ప్రక్షాళన అనంతరం తేలిన లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో మొత్తం 15,16,873 ఎకరాల వ్యవసాయేతర భూములున్నాయి. అందులో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 2.65 లక్షల పైచిలుకు ఎకరాలుండగా, మంచిర్యాలలో 1.77 లక్షలు, మెదక్‌లో 1.67 లక్షలు, నాగర్‌కర్నూల్‌లో 1.12 లక్షల ఎకరాలున్నాయి. ఇక, నాలా భూములు అత్యల్పంగా నిర్మల్ జిల్లాలో 563.05 ఎకరాలే ఉండడం గమనార్హం.

## నిమిషం నిబంధన ఎత్తేయండి: పీఆర్‌టీయూ

**సాక్షి, హైదరాబాద్:** నిమిషం నిబంధనతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ నిబంధనను ఎత్తివేయాలని పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సచివాలయంలో విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరిని కలసి నిమిషం నిబంధనతో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం లేకపోవడం, పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యతో ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు.

## 'దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశమివ్వండి'

**సాక్షి, హైదరాబాద్:** విదేశీ విద్య కోసం బీసీ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మహాత్మజ్యోతిబాపూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ను శ్యాచురేషన్ పద్ధతిలో ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్నను కలసి బీసీ విద్యార్థుల విదేశీ విద్య సమస్యలపై జాజుల బృందం వినతి పత్రం సమర్పించింది. అనంతరం జాజుల మాట్లాడుతూ... 2017-18 విద్యాసంవత్సరంలో ఇప్పటికే 350 మంది బీసీ విద్యార్థులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారని, అన్ని అర్హతలున్నా ప్రభుత్వం విధించే పరిమితితో కొంతమందికే అవకాశం దక్కిందన్నారు. దరఖాస్తు చేసుకున్న బీసీ విద్యార్థులందరికీ ఈ స్కాలర్‌షిప్‌ను ఇవ్వాలన్నారు. అలాగే దరఖాస్తు గడువు తేదీని పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. అర్హులందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని, శ్యాచురేషన్ పద్ధతి అవలంబించడం ప్రభుత్వం పరిశీలనలో ఉందని మంత్రి చెప్పారని వివరించారు.



మంగళవారం పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న టీఆర్‌ఎస్ ఎంపీలు

## రిజర్వేషన్ల అధికారం

# రాష్ట్రాలకే ఇవ్వాలి

### పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీల ఆందోళన

**సాక్షి, న్యూఢిల్లీ:** రిజర్వేషన్ల అమలు అధికారాన్ని రాష్ట్రాలకు కట్టబెట్టేలా ఆర్టికల్ 16 (4)ను సవరించాలంటూ టీఆర్‌ఎస్ ఎంపీలు మంగళవారం పార్లమెంటులో ఆందోళన చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. అయితే అదే సమయంలో టీఆర్‌ఎస్‌తోపాటు వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ, ఏఐఏడీఎంకే, కాంగ్రెస్‌లు పలు అంశాలపై ఆందోళన చేయడంతో గందరగోళం నెలకొంది. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదా వేశారు. తిరిగి 12 గంటలకు సభ ప్రారంభమైనా ఆందోళనలతో సభాకార్యక్రమాలు స్తంభించాయి. చివరికి సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు ఉదయం 10.30 గంటలకు పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టీఆర్‌ఎస్ ఎంపీలు ధర్నా చేశారు. ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్, కవిత, బూర నర్సయ్య గౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, నగేశ్, బాల్క సుమన్, సీతారాం నాయక్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీలు, ఎస్టీల రిజర్వేషన్లు పెంచేందుకు వీలుగా కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలు రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచాలనుకున్నప్పుడు.. అందుకు దారితీసే పరిస్థితులను బేరీజు వేయాలన్న సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని ప్రస్తావించారు. తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

# పాత 'బస్తీ మే సవాల్'..!

### ఎంఐఎంతో అమీతుమీకి కాంగ్రెస్ పార్టీ నిర్ణయం

- మజ్లిస్‌కు పట్టున్న 4 అసెంబ్లీ స్థానాల్లో సత్తా చాటేలా వ్యూహం
- చార్మినార్‌కు మహ్మద్‌గౌస్, చాంద్రాయణగుట్టలో పహిల్వాన్
- ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఫిరోజ్‌ఖాన్‌కే నాంపల్లి టికెట్
- మలక్‌పేట, కార్వాన్‌లో అవసరమైతే ఇతరులకు మద్దతు?
- అజారుద్దీన్‌కు సారథ్య బాధ్యతలు.. హైదరాబాద్ ఎంపీ బరిలోకి!
- ఎంఐఎంను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తోన్న రాహుల్

**సాక్షి, హైదరాబాద్:** మజ్లిస్ పార్టీతో అమీతుమీకి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఎంఐఎంకు పట్టున్న పాతబస్తీలో సత్తా చాటేందుకు హస్తం పార్టీ వ్యూహం రచిస్తోంది. ఇన్నాళ్లూ ఎంఐఎంతో అవగాహన కుదుర్చుకుని పాతబస్తీ రాజకీయాలు చేసిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ పార్టీని లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతోంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, అనంతర పరిణామాలతో పాటు దేశవ్యాప్తంగా ఎంఐఎం అనుసరిస్తున్న తీరును దృష్టిలో ఉంచుకుని మజ్లిస్‌తో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వచ్చే ఎన్నికల్లో మజ్లిస్ గెలిచే అవకాశమున్న అసెంబ్లీ స్థానాల్లో కనీసం నాలుగింటికైనా ఎసరు పెట్టేలా ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటి నుంచే అభ్యర్థుల వేటలో దిగిన పీసీసీ పెద్దలు.. దారుస్సలాంను దెబ్బతీసే బాధ్యతలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజారుద్దీన్‌కు అప్పగించనున్నారు.

**ఆ నాలుగింటిలో..**

పాతబస్తీలో ఎంఐఎం ఆధిపత్యానికి గండి కొట్టడం అంత సులువైన పనేమీ కాదు. దశాబ్దాలుగా ఆ పార్టీకి అండగా నిలుస్తున్న ఆరేడు నియోజకవర్గాల్లో దారుస్సలాం మాటే వేదం. అలాంటి చోట ఇన్నాళ్లూ మిత్రపక్షంగా ఉండి ఇప్పుడు టార్గెట్ చేయాల్సి రావడాన్ని కాంగ్రెస్ సవాల్‌గా తీసుకుంది. మజ్లిస్ గెలిచే అవకాశమున్న యాకుత్‌పుర, బహదూర్‌పుర స్థానాల్లో కదిలించడం కష్టమేననే అంచనాకు వచ్చిన కాంగ్రెస్ మిగిలిన స్థానాలపై గురిపెట్టింది. ఎంఐఎంకు ఆయువుపట్టు లాంటి చార్మినార్, చాంద్రాయణగుట్ట, నాంపల్లి అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవాలని, ఆయా స్థానాల్లో సామాజిక, రాజకీయ పరిస్థితులు తమకు కలసి వస్తాయని అంచనా వేస్తోంది. చార్మినార్‌లో ఎంఐఎంకు చెందిన మాజీ కార్పొరేటర్ మహ్మద్‌గౌస్, చాంద్రాయణగుట్టలో ఎంఐఎం బద్ధశత్రువు మహ్మద్ పహిల్వాన్‌ను రంగంలోకి దింపాలని భావిస్తోంది. నాంపల్లి స్థానం నుంచి మంచి పట్టున్న,ఇటీవలే పార్టీలో చేర్చుకున్న ఫిరోజ్‌ఖాన్‌కు నాంపల్లి టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. కార్వాన్, మలక్‌పేట స్థానా ల్లో ఇతర పార్టీలు గట్టిపోటీ ఇచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో నేరుగా బరిలోకి దిగాలా.. లేక గట్టి అభ్యర్థులకు మద్దతివ్వాలా అనే దానిపై పీసీసీ పెద్దలు మల్లగుల్లాలు పడతున్నారు.

**అజారుద్దీన్ నేతృత్వంలో..**

పాతబస్తీ రాజకీయాలను పూర్తిగా మార్చేయాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను తురుపుముక్కగా భావిస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సూచన మేరకు హైదరాబాద్‌లోని ఎంఐఎం ప్రభావిత నియోజకవర్గాల పార్టీ బాధ్యతలను పూర్తిగా ఆయనకు అప్పగించే అవకాశాలున్నాయి. దీనిలో భాగంగానే పీసీసీ బస్సుయాత్రలోనూ అజర్‌కు తగిన ప్రాధాన్యమిస్తున్నారు. బస్సు యాత్ర ప్రారంభమైన చేవెళ్లలో జరిగిన తొలి బహిరంగసభలో అజారుద్దీన్‌తో మాట్లాడించడమే కాక.. రాహుల్ సూచన మేరకు ఈసారి అజర్ కీలకపాత్ర పోషిస్తారని బహిరంగంగా ప్రకటించారు. అజారుద్దీన్ పట్ల ఎంఐఎంకు మద్దతు పలికే వర్గాల్లోనూ సానుభూతి ఉంటుందని, ఆయన్ను హైదరాబాద్ ఎంపీ స్థానంలో బరిలోకి దింపితే అసెంబ్లీ అభ్యర్థులకూ బలం చేకూరుతుందని కాంగ్రెస్ యోచిస్తోంది. త్వరలో అజర్‌తో పాతబస్తీలో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

### రాహుల్ లక్ష్యం

ఎంఐఎంను లక్ష్యంగా చేసుకోవాలనేది రాహుల్ నిర్ణయమేనని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎంఐఎం అనుసరించిన వైఖరి తమను దెబ్బతీసిందనే అంచనాకు ఏఐసీసీ పెద్దలు వచ్చారని, అందుకే దేశవ్యాప్తంగా ఎంఐఎంను రాజకీయ ప్రత్యర్థిగా భావించాలని రాహుల్ డైరెక్షన్ ఇచ్చినట్టు పీసీసీ నేతలు చెబుతున్నారు.

## సర్కారు గొర్రెలకు

# మేత కరువు

**సాక్షి, హైదరాబాద్:** వేసవి ముంచుకు రావడంతో రాష్ట్రంలో మూగజీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. ప్రధానంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన గొర్రెల పంపిణీ పథకానికి మండుతున్న ఎండలతో ఇక్కట్లు మొదలయ్యాయి. ఇప్పటికే లక్షలాదిగా పంపిణీ చేసిన గొర్రెలకు చాలా జిల్లాల్లో మేత కరువైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇంచుమించుగా ఇలాంటి పరిస్థితే నెలకొంది. రాష్ట్రంలోని గొల్లకుర్మలకు ఇప్పటివరకు మొత్తం రెండు లక్షల గొర్రెల యూనిట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. అంటే దాదాపు 42 లక్షల గొర్రెలు. వీటికి మరో 20 లక్షల పిల్లలు పుట్టాయని, ఈ సంపద ఇప్పటికే 62 లక్షలకు చేరిందని పశు సంవర్ధక శాఖ అంచనా వేసింది. గొర్రెలు మేపేందుకు సరిపడే పశుగ్రాసం అందుబాటులో లేదని క్షేత్రస్థాయిలో గొల్ల కుర్మలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో అటవీ ప్రాంతాలకు, పంటలు వేయని ప్రాంతాలు, చెరువు గట్లు, కొండలు, గుట్టల్లోకి మేపేందుకు తీసుకెళతారు. ఇప్పుడు గొర్రెల సంఖ్య అన్ని చోట్ల ఒక్కసారిగా పెరగటంతో గ్రాసానికి కటకట ఏర్పడిందని కాపరులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. పల్లెల్లో సాగు విస్తీర్ణం పెరగడంతో బీడు భూములు సైతం లేకుండా పోయాయి. పట్టణాల్లో భూములు రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మారడంతో గ్రాసం కొనుగోలు చేయడానికి కూడా అందుబాటులో ఉండదు. దీంతో పల్లీ పిండి, పత్తి పిండి, శనగలు, ఉలవ తదితర ధాన్యాల పొట్టు, దాణా పెట్టడమే ప్రత్యామ్నాయం, ఇవన్నీ ఖరీదైనవి కావటం, గ్రాసం దొరక్కపోవటం ఇబ్బందికరంగా ఉందని గొర్రెల పథకంలో లబ్ధి పొందిన గొల్ల కుర్మలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని జిల్లాల్లోనూ ఇంచుమించుగా ఇదే పరిస్థితి నెలకొంది. అన్ని ప్రాంతాల్లో గొర్రెల మేతకు గ్రాసం కరువైందనే సమాచా రం అందుతుండటంతో ఇటీవలే పశుసంవర్ధక శాఖ అన్ని జిల్లాల్లో సర్వే చేయించింది. జనవరి నుంచి జూన్ వరకు మొత్తం ఆరు నెలలపాటు రాష్ట్రంలో ఉన్న గొర్రెలకు 87.03 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసం అవసరమని.. అందులో 82.51 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసం అందు బాటులో ఉందని అంచనా వేసింది. మరో 4.52 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసం కొరత ఉన్నట్లు అంచనాకు వచ్చింది. ఈ నేపథ్యంలో గొర్రెలకు అవసరమైనంత గ్రాసాన్ని అందుబా టులో ఉంచేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళి కను వెంటనే అమలు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వానికి నివేదించింది. పశుగ్రాసం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించిం ది. వర్షాలు పడేంత వరకు చెరువులు, కుంటల్లో నీరు నిండే అవకాశం లేనందున.. ఉన్న నీటి తేమతోనే పశుగ్రాసం పెంచే అవకాశముందని ప్రత్యామ్నాయాలను సూచించింది.


# రాయితీ బస్సు రూ.కోట్లు మేసింది!

- ఆర్టీసీని పిప్పిచేసి పీల్చేసిన 'జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం'
- ఆర్థికమాంద్యం పేరు చెప్పి కథ నడిపిన ఢిల్లీ నేతలు
- ఇప్పుడు వాటిని నడపలేక తంటాలు
- తప్పని స్థితిలో పాత బాడీ తొలగించి పునర్నిర్మాణం
- రూ.50 కోట్లమేర ఖర్చుచేయాల్సిన పరిస్థితి

**సాక్షి, హైదరాబాద్:** కంపెనీలు, రాజకీయ నేతలు మిలాఖత్ అయితే ఎలా ఉంటుంది.. కమీషన్ల నీడలో కోరుకున్న పనులు చకచకా జరిగిపోతాయి. ఆ కోవలోదే ఈ బస్సు కథ. జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం (జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం).. యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిన ఉదాత్త పథకం. కానీ కమీషన్ల ముఠా దీన్నీ వదల్లేదు. ఆ పథకంలో ఉన్న అవకాశాన్ని అందిపుచ్చుకుని అందినంత దండుకుంది. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద కేంద్రం ఆర్టీసీకి బస్సులిచ్చింది. వీటి వ్యయంలో 35 శాతం నాటి యూపీఏ ప్రభుత్వం భరించింది. వాటి విలువను లెక్కకడితే ఒక్కో బస్సుపై ఆ మొత్తం రూ.7 లక్షల వరకు అవుతుంది. అంటే అంత మేర ఆర్టీసీకి ఆదా అయినట్లే. కానీ ఒక్కో బస్సు వల్ల తెలంగాణ ఆర్టీసీకి ఇప్పుడు ఏకంగా రూ.9 లక్షల చిల్లు పడింది. కేంద్రం సహకరిస్తే ఆర్టీసీ లాభాల బాట పట్టాల్సింది పోయి ఈ నష్టమేంటన్న అనుమానం కలగడం సహజం. మర్మం తెలియాలంటే ఆర్థికమాంద్యం నాటి పరిస్థితిలోకి చూడాలి. అలా చూస్తే ఓ కుంభ కోణం కనిపిస్తుంది. దాని మూల్యం ఆర్టీసీకి దాదాపు రూ.80 కోట్ల వరకు నష్టం. 2011లో నాటి యూపీఏ ప్రభుత్వం జేఎన్‌ఎన్‌యూఆర్ ఎం పథకం కింద రాష్ట్రాల రవాణా సంస్థలకు సబ్సిడీపై బస్సులు అందించాలని నిర్ణయించిం ది. పథకం తొలి విడతలో హైదరాబాద్‌కు 600 బస్సులివ్వనున్నట్లు ప్రకటించింది. ఈ మొత్తం వ్యయంలో కేంద్రం 35 శాతం, రాష్ట్రప్రభుత్వం 15 శాతం భరించాల్సి ఉండగా మిగతా 50 శాతం ఆర్టీసీ వ్యయం చేయాల్సి ఉంది. సగం ఖర్చుతో అన్ని బస్సులు రావటం ఆర్టీసీకి బాగా కలిసొస్తుందని అప్పట్లో భావించారు. సంవత్సరం తిరిగే సరికి వాటి అసలు రూపం బయటపడటంతో ఆర్టీసీ బెంబేలెత్తాల్సి వచ్చింది. బస్‌బాడీ మొత్తం ఎక్కడికక్కడ ఊడిపోవడం మొదలైంది. దీంతో వాటి నిర్వహణ దినదినగండంగా మారింది. సిటీ బస్సులు లీటర్ డీజిల్‌కు 5 కిలోమీటర్ల వరకు తిరిగితే ఇవి మాత్రం 3 కిలోమీటర్లు ఇవ్వటం కూడా గగనంగా మారింది. మియాపూర్‌లో ఉన్న ఆర్టీసీ సొంత బస్‌బాడీ యూనిట్‌లో బస్సుకు కొత్త బాడీ తయారీ చేసి ఇంజన్ ఓవర్‌హాలింగ్ చేసి వాటికి కొత్త రూపునిస్తోంది. ఇలా ఒక్కో బస్సును పూర్తి స్థాయిలో మార్చేందుకు ఆర్టీసీకి దాదాపు రూ.9 లక్షల వరకు ఖర్చవుతోంది. ఇలా ఏడాదిగా 250 బస్సులకు కొత్త రూపునిచ్చింది. మరో 350 బస్సులను ఇంకో ఏడాదిలో సిద్ధం చేయాలని నిర్ణయించింది. మొత్తం ప్రాజెక్టు కోసం ఆర్టీసీ దాదాపు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేయాల్సిన దుస్థితి తలెత్తింది. ఈ బస్సులను అందించినప్పుడు కేంద్రం రూ.40 కోట్ల మేర భరించగా, ఇప్పుడు ఆర్టీసీ రూ.50 కోట్లకుపైగా నష్టపోతోంది.

**ఆర్థికమాంద్యం పేరుతో మోసం..**

2010లో దేశం ఆర్థిక మాంద్యం దెబ్బకు విలవిల్లాడింది. ఆ సమయంలో చాలా కంపెనీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అదే సమయంలో కొందరు ఢిల్లీ స్థాయి బడా నేతలు రంగ ప్రవేశం చేశారు. ఆర్థికమాంద్యంతో దెబ్బతిన్న కంపెనీలకు ప్రభుత్వం చేయూతనందించాలని, ఇందుకు ప్రత్యేక చర్యలు అవసరమని కేంద్రాన్ని నమ్మించారు. ఆ క్రమంలోనే ఈ బస్సుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ కొనుగోలు వ్యవహారం అంతా లోపాల పుట్టగా మారింది. ఏమాత్రం నాణ్యత లేని బస్సులను అంటగట్టేశారు. కేంద్రం భారీ సంఖ్యలో బస్సులను కొన్న ఈ వ్యవహారంలో నేతలు మధ్యవర్తులుగా వ్యవహరించి పెద్ద మొత్తంలో కమీషన్లు దండుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. అక్రమంలో నాణ్యతలేని బస్సులను సరఫరా చేసి కొన్ని కంపెనీలు ఆర్థికమాంద్యం నష్టాన్ని పూడ్చుకున్నాయంటున్నారు.



# స్వార్న్ వర్జిన్..

## మగాడిలా బతికే ఓ మహిళ కథ

నువ్వెవరు?
నేనా.. నేను ఆడపిల్లని..
అయితే నువ్వు గట్టిగా మాట్లాడటానికి లేదు..
నీకు నచ్చినోడ్ని పెళ్లి చేసుకోవడానికి లేదు..
ఓటు వేయడానికి లేదు.. వాచీ పెట్టుకోవడానికి లేదు..
ఆ ఉద్యోగం చేయకూడదు.. ఈ ఆస్తి కొనకూడదు..
అక్కడికి వెళ్ల కూడదు.. ఇక్కడికి రాకూడదు..
నువ్వు కేవలం నీ భర్త ఆస్తివి.. పిల్లల్ని కనిపెట్టే యంత్రానివి..
అసలు.. నువ్వు మనిషివే కావు.. కట్టుబానిసవి..

ఇవి మధ్య యుగాల నాటి కూతలు కావు..
మన మధ్యనే.. మన కళ్లముందే మహిళల నుదిటిపై రాస్తున్న రాతలు..

ఉత్తర అల్బేనియా పర్వత ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలు..
ఇక్కడ మహిళలకు స్వేచ్ఛ, సాధికారత అన్నమాటలు మచ్చుకైనా వినిపించవు..
ఆడపిల్లగా ఎందుకు పుట్టామా అన్నట్లు ఉంటుంది..
బతుకే చీకటిగా మారిన ఆ సమయంలో మిణుకుమిణుకుమంటూ
వారికి కనిపించిన ఆశాకిరణం
**స్వార్న్ వర్జిన్.. మగాడిగా బతికే ఓ మహిళ..**



– సాక్షి, తెలంగాణ డెస్క్

### అనుకోకుండా.. మొదలై..

ఈ గ్రామాల్లో మహిళల హక్కుల సంగతి దేవుడెరుగు.. పుట్టగానే ఆ పిల్ల ఫలానా వాడి పెళ్లామని పెద్దలు నిర్ణయించేస్తారు. అక్కడ చట్టాలు పనిచేయవు. 500 ఏళ్లుగా వాళ్లు పాటిస్తున్న చట్టం 'కెనన్ ఆఫ్ లెకె దుకాక్‌జీనీ'..దాని ప్రకారం మహిళలు బిగ్గరగా మాట్లాడకూడదు.. కనీసం వాచీ కూడా పెట్టుకోకూడదు. ఆస్తులు కొనకూడదు. వ్యాపారాలు చేయకూడదు.. ఇలాంటి నిర్బంధాలు ఎన్నో.. అక్కడ పితృస్వామిక వ్యవస్థ అమలవుతుంది. అసలు స్వార్న్ వర్జిన్(స్థానిక భాషలో బర్న్షా) అన్నది సామాజిక అవసరం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడి గిరిజన పెద్దలు పెట్టారు. ఓ కుటుంబ పెద్ద చనిపోయినప్పుడు.. ఇంట్లో మగపిల్లలు లేకపోతే.. అవివాహితురాలైన అమ్మాయి.. కుటుంబ పెద్ద బాధ్యతలు చేపట్టవచ్చని నిర్ణయించారు. అయితే, అందుకోసం ఆమె 12 మంది గ్రామ పెద్దల ముందు తాను జీవితాంతం అవివాహితురాలిగా.. కన్యగా ఉంటానని 'స్వార్న్ వర్జిన్'గా ప్రతిన పూనాల్సి ఉంటుంది. అప్పట్నుంచి ఆమె మగాళ్ల దుస్తులు ధరించవచ్చు. వారు చేసే అన్ని ఉద్యోగాలు చేయవచ్చు. ఆస్తులు కలిగి ఉండొచ్చు. అక్కడ పురుషులకు ఉండే అన్ని హక్కులు స్వార్న్ వర్జిన్‌కు ఉంటాయి. తర్వాతి కాలంలో వివిధ కారణాలతో పలువురు స్వార్న్ వర్జిన్‌గా మారారు. పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక మారినవారు కొందరైతే.. ఈ ఆటవిక చట్టాలపై తమ ధిక్కారానికి.. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు సూచికగా మరికొందరు స్వార్న్ వర్జిన్‌గా మారారు.



### అదేం పెద్ద విషయం కాదు..

'ఈ పురుషాహంకార, అణచివేతతో కూడిన సమాజంలో తమ జీవితాన్ని తాము జీవించేందుకు మహిళలకు ఇదో మార్గంగా కనిపించింది.ఇందుకోసం లైంగికపరమైన గుర్తింపును కూడా వదులుకోవడానికి సిద్ధపడ్డారు' అని కొసావాలోని ప్రిస్టినా వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ లిండా అన్నారు. మహిళల హక్కుల విషయంలో కొన్నేళ్లుగా అల్బేనియాలో పురోగతి కనిపించినప్పటికీ.. అక్కడి పర్వత ప్రాంతాల్లో ఇప్పటికీ ఇలాంటి చట్టాలే రాజ్యమేలుతున్నాయి. అయితే, కొన్ని చోట్ల పరిస్థితి నెమ్మదిగా మెరుగుపడుతోంది. ఓ అంచనా ప్రకారం ప్రస్తుతం వంద మందికిపైగా స్వార్న్ వర్జిన్‌లు ఉన్నారు. అదే సమయంలో జీవితాంతం తోడుండే ఓ భాగస్వామిని, పిల్లలను కోల్పోయామన్న బాధ వారిలో ఏ మాత్రం కనిపించదు. సెక్స్ అన్నది పెద్ద విషయం కాదంటారు.. ఎలాగోలా బతికేయడం వేరు.. తమకు నచ్చినట్లు ఇలాగే బతకాలనుకోవడం వేరు అని వారు అంటారు.

**మీరు చంద్రుడిలోని మచ్చను మాత్రమే చూస్తున్నారు..**
**మేము దాని చుట్టూ పరుచుకుని ఉన్న వెలుగును చూస్తున్నాం..**

– స్వార్న్ వర్జిన్

మీ సలహాలు, సందేహాలు
పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

## ఏపీ ఎడ్‌సెట్-2018; లాసెట్ అండ్ పీజీ లాసెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ కళాశాలల్లో రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాలకు ఏపీ ఎడ్యుకేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీఎడ్‌సెట్)-2018; మూడేళ్ల/ఐదేళ్ల లా డిగ్రీ, రెండేళ్ల లా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ లాసెట్ అండ్ పీజీ లాసెట్-2018 ప్రకటనలు విడుదలయ్యాయి. బీఈడీ కోర్సుకు దరఖాస్తు రుసుం రూ.650 (ఎస్సీ/ఎస్టీ-రూ.450); లా డిగ్రీ (ఎల్‌ఎల్‌బీ)కి రూ.750, లా పీజీ (ఎల్‌ఎల్‌ఎం)కు రూ.850. ఏపీ ఎడ్‌సెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు 2018, మార్చి 8 నుంచి స్వీకరిస్తారు. చివరి తేదీ ఏప్రిల్ 5, 2018. ఏపీ లాసెట్ అండ్ పీజీలాసెట్‌కు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మార్చి 9 నుంచి ఏప్రిల్ 5వరకు స్వీకరిస్తారు. అర్హతలు, రిజర్వేషన్లు తదితర పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.sche.ap.gov.in

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI ACADEMY
పదో తరగతి తెలుగు పేపర్-1
మాదిరి ప్రశ్నపత్రం

# జాబ్ పాయింట్



## సాయుధ దళాలు, ఢిల్లీ పోలీస్

**1223 ఖాళీలు**

**స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)... సాయుధ దళాలు (సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, సీఐఎస్ఎఫ్), ఢిల్లీ పోలీస్ విభాగంలోని 1,223 ఎస్ఐ పోస్టులకు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లోని ఏఎస్ఐ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. సీఐఎస్ఎఫ్‌లోని ఎస్ఐ, ఏఎస్ఐ ఖాళీల వివరాలను తర్వాత ప్రకటిస్తారు.**

- **పోస్టులు:** సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ).
- **విభాగాల వారీ ఖాళీలు:** ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ-150 (పురుషులు-97+మహిళలు-53); సాయుధ దళాల్లో ఎస్ఐ పోస్టులు: సీఆర్‌పీఎఫ్‌లో 274 (పురుషులు), బీఎస్ఎఫ్‌లో 508 (పురుషులు-483+ మహిళలు-25), ఐటీబీపీలో 85 (పురుషులు-72+మహిళలు-13), ఎస్ఎస్‌బీలో 206 (పురుషులు).
- **వేతన శ్రేణి:** ఎస్ఐ-రూ.35,400-1,12,400; ఏఎస్ఐ-29,200-రూ.92,300.
- **అర్హతలు:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఢిల్లీ పోలీస్ విభాగంలోని ఎస్ఐ పోస్టుల పురుష అభ్యర్థులకు అదనంగా ఎల్ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ (మోటార్ సైకిల్, కారు) ఉండాలి.
- **వయసు:** 2018, ఆగస్టు 1 నాటికి 20-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష (పేపర్-1, పేపర్-2), ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్ (పీఎస్‌టీ), ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ (పీఈటీ), డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్. పేపర్-1లో ఉత్తీర్ణులైన వారికి పీఈటీ, పీఎస్‌టీ నిర్వహిస్తారు. వీటిలో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే పేపర్-2 ఎగ్జామినేషన్ ఉంటుంది. రెండు పేపర్లలోనూ వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. అనంతరం డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఉంటుంది.
- **రాతపరీక్ష విధానం:** దీన్ని రెండు పేపర్లుగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్-1లో నాలుగు విభాగాలు.. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్ ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నల చొప్పున మొత్తం 200 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం గరిష్ట మార్కులు 200. పరీక్ష వ్యవధి 2 గంటలు. పేపర్-2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్ నుంచి 200 ప్రశ్నలు 200 మార్కులకు ఇస్తారు. పేపర్-2 పరీక్ష వ్యవధి రెండు గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. రెండు పేపర్లలోనూ ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు చొప్పున కోత విధిస్తారు.
- **శారీరక ప్రమాణాలు (ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్: పీఎస్‌టీ):** ఎత్తు-ఎస్టీ (పురుష) అభ్యర్థులకు 162.5 సెం.మీ., మిగిలిన కేటగిరీ పురుషులకు 170 సెం.మీ., ఛాతీ-ఎస్టీ (పురుషుల)కు 77 సెం.మీ. (సాధారణం)-82 సెం.మీ. (గాలి పీల్చినపుడు); మిగిలిన కేటగిరీల పురుషులకు 80 సెం.మీ. (సాధారణం)-85 సెం.మీ. (గాలి పీల్చినపుడు); ఎస్టీ (మహిళ)లకు ఎత్తు-154 సెం.మీ., మిగిలిన కేటగిరీ మహిళలకు-157 సెం.మీ. అలాగే అందరు అభ్యర్థులకూ ఎత్తుకు అనుగుణంగా బరువు ఉండాలి. తగిన దృష్టి సామర్థ్యం (ఎన్ 6, ఎన్ 9; 6/6, 6/9), శారీరక, మానసిక ఆరోగ్యం, వినికిడి శక్తి ఉండాలి. టాటూ (పచ్చబొట్లు) ఉండకూడదు.
- **దేహ దారుఢ్య పరీక్ష (ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్: పీఈటీ):** పరుగు-100 మీటర్ల దూరాన్ని పురుషులు 16 సెకన్లలో, మహిళలు 18 సెకన్లలో పూర్తిచేయగలగాలి. అలాగే 1.6 కి.మీ. దూరాన్ని పురుషులు 6.5 నిమిషాల్లో, మహిళలు 800 మీటర్ల దూరాన్ని 4 నిమిషాల్లో పరిగెత్తగలగాలి; లాంగ్‌జంప్-పురుషులు 3.65 మీటర్ల దూరాన్ని, మహిళలు 2.7 మీటర్ల దూరాన్ని మూడు అవకాశాల్లోపు అధిగమించాలి; హైజంప్-పురుషులు 1.2 మీటర్ల ఎత్తును, మహిళలు 0.9 మీటర్ల ఎత్తును మూడు అవకాశాల్లోపు దూకగలగాలి; షాట్‌పుట్ (పురుషులకు మాత్రమే)- 16 ఎల్‌బీఎస్‌ను 4.5 మీటర్ల దూరానికి 3 అవకాశాల్లోపు విసరగలగాలి.
- **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/మహిళ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 2, 2018. ❖ **వెబ్‌సైట్:** www.ssc.nic.in, www.ssconline.nic.in

## ఎయిమ్స్ రిషికేశ్

**223 ఖాళీలు**

**ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)... 223 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.**

- **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్-31, అడిషనల్ ప్రొఫెసర్-36, అసోసియేట్ ప్రొఫెసర్-75, అసిస్టెంట్ ప్రొఫెసర్-81. ❖ **వేతనశ్రేణి:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000; అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100. పోస్టును బట్టి గ్రేడ్ పే వేర్వేరుగా ఉంటుంది.
- **విభాగాలు:** అనస్థీసియాలజీ, అనాటమీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, కమ్యూనిటీ మెడిసిన్/ఫ్యామిలీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎండోక్రినాలజీ అండ్ మెటబాలిజం, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్/టాక్సికాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ/హెమటాలజీ, మైక్రోబయాలజీ, నియోనటాలజీ, నెఫ్రాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, పాథాలజీ/ల్యాబ్ మెడిసిన్, ఫార్మకాలజీ, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, ఫిజియాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, రేడియో డయాగ్నసిస్, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, ట్రామా సర్జరీ, ఎమర్జెన్సీ మెడిసిన్, యూరాలజీ.
- **అర్హతలు:** మెడికల్/డెంటల్ అభ్యర్థులకు సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/బీడీఎస్‌తోపాటు పీజీ (ఎండీ/ఎంఎస్/ఎండీఎస్/ఎంసీహెచ్/ డీఎం..); నాన్ మెడికల్ అభ్యర్థులకు పీజీతోపాటు పీహెచ్‌డీ. అలాగే పోస్టులను బట్టి నిబంధనల మేర బోధనానుభవం ఉండాలి. ❖ **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.3,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తుల ప్రారంభం:** మార్చి 17, 2018.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 30, 2018.
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

## ఎయిమ్స్ రాయ్‌బరేలీ

**31 ఖాళీలు**

**ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో 31 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ చండీగఢ్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్) ప్రకటన విడుదల చేసింది. ఎయిమ్స్ రాయ్‌బరేలీకి పీజీఐఎంఈఆర్-చండీగఢ్ మెంటార్ ఇన్‌స్టిట్యూట్‌గా వ్యవహరిస్తోంది.**

- **పోస్టు-ఖాళీలు:** గ్రూప్ 'ఎ'లో అకౌంట్స్ ఆఫీసర్ (ఏవో)-1; గ్రూప్ 'బి'లో స్టాఫ్ నర్స్ గ్రేడ్ 2/నర్సింగ్ ఆఫీసర్-15, స్టోర్ కీపర్-1, జూనియర్ ఇంజనీర్ (జేఈ)-2 (ఎలక్ట్రికల్-1+ఏసీ అండ్ ఆర్-1), టెక్నికల్ అసిస్టెంట్/టెక్నీషియన్-4, టెక్నికల్ ఆఫీసర్ (ఆప్తాల్మిక్)(రిఫ్రాక్షనిస్ట్)-1, టెక్నికల్ ఆఫీసర్ (డెంటల్ టెక్నీషియన్)-1; గ్రూప్ 'సి'లో జూనియర్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్ (రిసెప్షనిస్ట్)-1; ల్యాబ్ టెక్నీషియన్-1; ఫార్మసిస్ట్ గ్రేడ్ 2-2; స్టెనోగ్రాఫర్-3; స్టోర్ కీపర్ కం క్లర్క్-2. ❖ **వేతన శ్రేణి:** గ్రూప్ 'ఎ' పోస్టులకు రూ.15,600-రూ.39,100; గ్రూప్ 'బి'-రూ.9,300-రూ.34,800; గ్రూప్ 'సి'-రూ.5,200-రూ.20,200.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి బీకాం/బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ (నర్సింగ్/పోస్ట్ సర్టిఫికెట్/మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ/ఆప్తాల్మిక్ టెక్నిక్స్/మెడికల్ రికార్డ్స్)/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్/డిప్లొమా (నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ/ఫార్మసీ/మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ)/డిగ్రీ/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా/ఇంటర్మీడియెట్. అలాగే నిబంధన మేరకు సంబంధిత రంగంలో అనుభవం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** అకౌంట్స్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్ (డెంటల్ టెక్నీషియన్), జూనియర్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్ (రిసెప్షనిస్ట్) పోస్టులకు 21-35 ఏళ్ల లోపు; స్టాఫ్ నర్స్/నర్సింగ్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్ (ఆప్తాల్మిక్), ల్యాబ్ టెక్నీషియన్‌కు 21-30; స్టోర్ కీపర్‌కు 18-35 ; టెక్నికల్ అసిస్టెంట్/టెక్నీషియన్‌కు 25-35; ఫార్మసిస్ట్ గ్రేడ్ 2కు 21-27; స్టెనోగ్రాఫర్‌కు 18-27 ఏళ్ల లోపు ఉండాలి. జేఈ, స్టోర్ కీపర్ కం క్లర్క్‌కు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** ఎస్సీ/ఎస్టీ-రూ.500; మిగిలిన కేటగిరీలకు రూ.1,000. దివ్యాంగ కేటగిరీకి ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** మార్చి 26, 2018. ❖ **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28, 2018.
- **వెబ్‌సైట్:** www.pgimer.edu.in

## పుణె కంటోన్మెంట్ బోర్డ్

**77 ఖాళీలు**

**కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని పుణె కంటోన్మెంట్ బోర్డ్ (పీసీబీ)... 77 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.**

- **పోస్టు-ఖాళీలు:** అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ (ఏఎంవో)-4; జూనియర్ ఇంజనీర్ (జేఈ)-4 (సివిల్-3+ఎలక్ట్రికల్-1); ఇంగ్లిష్ మీడియం స్కూల్ టీచర్స్-26 (బీఈడీ-10+డీఈడీ-16); హెల్త్ ఇన్‌స్పెక్టర్ (హెచ్ఐ)-3; స్టాఫ్‌నర్స్-8; ల్యాబ్ టెక్నీషియన్ (ఎల్‌టీ)-2; జూనియర్ క్లర్క్స్-18; డ్రైవర్-10; హిందీ టైపిస్ట్-1; హెల్త్ అసిస్టెంట్-1.
- **వేతనం:** ఏఎంవో, జేఈ, ఇంగ్లిష్ మీడియ టీచర్స్ (బీఈడీ), స్టాఫ్ నర్స్, -రూ.9,300-రూ.34,800; మిగిలిన పోస్టులకు రూ.5,200-రూ.20,200. పోస్టును బట్టి గ్రేడ్ పే వేర్వేరుగా ఉంటుంది. ❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ఇంజనీరింగ్ డిప్లొమా/బీఈ/బీఏ.బీఈడీ (ఇంగ్లిష్/సోషల్ స్టడీస్/హిందీ/బీ.పీ.ఈడీ)/బీఎస్సీ.బీఈడీ/హెచ్ఎస్సీ.డీఈడీ/బీఎస్సీ (కెమిస్ట్రీ)+డిప్లొమా (శానిటరీ ఇన్‌స్పెక్టర్)/బీఎస్సీ (నర్సింగ్/జనరల్ నర్సింగ్)/బీఎస్సీ (ఫిజిక్స్/కెమిస్ట్రీ)+ల్యాబ్‌టెక్నీషియన్ కోర్స్/ఇంటర్మీడియెట్/పదోతరగతి. అలాగే పోస్టును బట్టి అనుభవం, కంప్యూటర్ ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం, టైపింగ్ (హిందీ) తదితర అర్హతలుండాలి. ❖ **వయసు:** ఏఎంవోకు 18-30 ఏళ్ల లోపు; మిగిలిన పోస్టులకు 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** రాతపరీక్ష. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 7, 2018. ❖ **వెబ్‌సైట్:** www.punecantonmentboard.org

## ఈఎస్ఐసీ సనత్‌నగర్

**52 ఖాళీలు**

**హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఉన్న ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజీ, హాస్పిటల్స్‌లోని 52 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు-ఖాళీలు:** ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ట్యూటర్స్-3 (పాథాలజీ), సీనియర్ రెసిడెంట్స్-9 (జనరల్ మెడిసిన్-3+జనరల్ సర్జరీ-1+ఆర్థోపెడిక్స్-1+ఆప్తాల్మాలజీ-1+ఓబీజీవై-1+అనస్థీసియా-1+రేడియాలజీ-1), జూనియర్ రెసిడెంట్స్-8 (జనరల్ మెడిసిన్-1+జనరల్ సర్జరీ-2+ఆప్తాల్మాలజీ-2+టీబీ/ఛాతీ-1+సైకియాట్రీ-1+పీడియాట్రిక్స్-1); ఈఎస్ఐసీ హాస్పిటల్‌లో సీనియర్ రెసిడెంట్స్-15 (ఐసీయూ-5+జనరల్ మెడిసిన్-3+జనరల్ సర్జరీ-3+పీడియాట్రిక్స్-2+ఆర్థోపెడిక్స్-2); ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సీనియర్ రెసిడెంట్స్-17 (అనస్థీసియా-6+రేడియాలజీ-2+కార్డియాలజీ-2+పీడియాట్రిక్స్ సర్జరీ-2+యూరాలజీ-1+న్యూరో సర్జరీ-3+పీడియాట్రిక్ క్రిటికల్ కేర్-1). ❖ **వేతనం:** ట్యూటర్స్, జూనియర్ రెసిడెంట్స్-రూ.74,000; సీనియర్ రెసిడెంట్స్-రూ.88,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ఎంబీబీఎస్+పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా/మెడికల్ ఎంఎస్సీ. అలాగే ఎంసీఐ, స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, నిబంధనల మేర అనుభవం ఉండాలి.
- **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి సీనియర్ రెసిడెంట్స్‌కు 35, జూనియర్ రెసిడెంట్స్, ట్యూటర్స్‌కు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, వాకిన్ ఇంటర్వ్యూ. ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థుల అకడమిక్ స్కోర్, బోధనానుభవం, కో-కరిక్యులర్ యాక్టివిటీస్, పరిశోధన, నీట్ పీజీ-2018, నీట్ సూపర్ స్పెషాలిటీ స్కోర్-2017 ఆధారంగా 1:10 నిష్పత్తిలో మెరిట్ జాబితా తయారుచేసి వాకిన్ ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్లో పొందుపరుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.
- **దరఖాస్తు రుసుం:** రూ.225; ఎస్సీ/ఎస్టీ/మహిళ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ/ఈఎస్ఐసీ రెగ్యులర్ క్యాండిడేట్స్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 16, 2018.
- **వాకిన్ ఇంటర్వ్యూ తేదీలు (షార్ట్ లిస్టింగ్ అభ్యర్థులకు మాత్రమే):** పోస్టులు, విభాగాల వారీ మార్చి 20-31, ఏప్రిల్ 2-9, 2018.
- **వెబ్‌సైట్:** www.esicmchyd.ac.in

## ఐఐఎస్సీ బెంగళూరు

**14 ఖాళీలు**

**బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) సూపర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో 14 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** సిస్టమ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైనీ (ఎస్ఏటీ).
- **మొత్తం ఖాళీలు:** 14 (జనరల్-5+ఓబీసీ-6+ఎస్సీ-2+ఎస్టీ-1).
- **శిక్షణ వ్యవధి:** ఏడాది.
- **స్టైపెండ్:** రూ.15,000.
- **అర్హతలు:** కంప్యూటర్ సైన్స్‌లో ఎంసీఏ/ఎంఎస్సీ లేదా కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/టెలికమ్యూనికేషన్స్‌లో బీఈ/బీటెక్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ద్వితీయ శ్రేణి ఉత్తీర్ణత ఉన్నా సరిపోతుంది. సి ప్రోగ్రామింగ్, యునిక్స్‌లో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **పరీక్ష కేంద్రం:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, మల్లేశ్వరం, బెంగళూరు-12.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.150; ఎస్సీ/ఎస్టీ-రూ.75; దివ్యాంగ కేటగిరీకి ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి ఐఐఎస్సీ బెంగళూరు చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 13, 2018. ❖ **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.serc.iisc.in

## ఎయిర్‌ఫోర్స్ ఏఎఫ్‌సీఏవో

**16 ఖాళీలు**

**ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఎయిర్ ఫోర్స్ సెంట్రల్ అకౌంట్స్ ఆఫీస్ (ఏఎఫ్‌సీఏవో).. 16 గ్రూప్ 'సి' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టు-ఖాళీలు:** లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)-14 (అన్‌రిజర్వ్‌డ్-7+ఎస్సీ-4+ఓబీసీ-3); మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-1 (అన్‌రిజర్వ్‌డ్); హౌస్ కీపింగ్ స్టాఫ్ (హెచ్‌కేఎస్)-1 (అన్‌రిజర్వ్‌డ్).
- **వేతనశ్రేణి:** రూ.5,200-రూ.20,200.
- **అర్హతలు:** ఎల్‌డీసీకి ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యతోపాటు టైపింగ్ (ఇంగ్లిష్/హిందీ); ఎంటీఎస్, హెచ్‌కేఎస్‌కు పదోతరగతి/తత్సమాన విద్య.
- **వయసు:** 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష. ❖ **రాతపరీక్ష విధానం:** దీన్ని నాలుగు పేపర్లుగా నిర్వహిస్తారు. ఇందులో ఎల్‌డీసీకి జనరల్ ఇంటెలిజెన్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఇవి ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉంటాయి. మిగిలిన పోస్టులకు పదోతరగతి స్థాయిలోని జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. ❖ **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు.
- **వెబ్‌సైట్:** www.indianairforce.nic.in

## ఐఐటీ ఖరగ్‌పూర్‌లో

**12 ఖాళీలు**

**ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) సెంట్రల్ లైబ్రరీలో 12 ట్రైనీ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** ప్రొఫెషనల్ ట్రైనీ.
- **శిక్షణ వ్యవధి:** ఏడాది.
- **స్టైపెండ్:** రూ.16,000.
- **అర్హతలు:** మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎం.లిబ్) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (బీ.లిబ్)లోనూ ప్రథమశ్రేణి మార్కులు పొంది ఉండాలి. సంబంధిత రంగంలోని కంప్యూటర్ అంశాలపై నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తులు పంపాల్సిన చిరునామా:** లైబ్రేరియన్, సెంట్రల్ లైబ్రరీ, ఐఐటీ ఖరగ్‌పూర్-721302, పశ్చిమబెంగాల్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 4, 2018.
- **వెబ్‌సైట్:** www.iitkgp.ac.in

సాక్షి బిజినెస్
బుధవారం 7-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 430 ▼ | 110 ▼ |
| 33,317 | 10,249 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 10.30కి)

| సూచీ | | | |
|---|---|---|---|
| ● నాస్‌డాక్ | 7,352 | ▲ | 21 |
| ● డోజోన్స్ | 24,762 | ▼ | 113 |
| ● ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,147 | ▲ | 31 |
| ● డాక్స్ | 12,114 | ▲ | 23 |
| ● షాంఘై | 3,290 | ▲ | 33 |
| ● నికాయ్ | 21,418 | ▲ | 376 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 65.70 | 65.83 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.32 | 91.50 |
| € | యూరో | ఎస్‌బీఐ | 81.47 | 81.63 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.04 | 62.16 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 51.41 | 51.51 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.06 | 50.16 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 15.71 | 18.62 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 16.08 | 18.80 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 7.24 | 11.76 |

# అంతా ఆఖరి గంటలోనే..!

### ఐసీఐసీఐ, యాక్సిస్‌లకూ పీఎన్‌బీ సెగ

- పీసీఏ పరిధిలోకి మరో ఐదు బ్యాంక్‌లు!
- చివరి గంటలో అమ్మకాల వెల్లువ
- లాభాలతో మొదలై నష్టాలతో ముగింపు
- ప్లస్ 313 నుంచి మైనస్ 537కు సెన్సెక్స్
- 430 పాయింట్లు డౌన్; 33,317 వద్ద ముగింపు
- ఈ ఏడాది కనిష్ట స్థాయికి సెన్సెక్స్
- కీలకమైన 10,250 దిగువకు నిఫ్టీ
- 110 పాయింట్ల నష్టం.. 10,249 వద్ద క్లోజ్




**పం**జాబ్ నేషనల్ బ్యాంక్ రుణ కుంభకోణం తాజా ప్రకంపనల ధాటికి మంగళవారం స్టాక్ మార్కెట్ కుదేలయింది. మరో ఐదు బ్యాంక్‌లను పీసీఏ పరిధిలోకి ఆర్‌బీఐ తేనున్నదన్న వార్తలతో బ్యాంకింగ్ రంగ స్థితిగతులు ఇన్వెస్టర్లను ఆందోళనలోకి నెట్టాయి. ట్రంప్ సుంకాల విధింపుకు వ్యతిరేకత ప్రబలంగా ఉండటంతో వాణిజ్య యుద్ధాలపై ఆందోళన తగ్గి ప్రపంచ మార్కెట్లు లాభపడినా... మన మార్కెట్ మాత్రం భారీగా నష్ట పోయింది. పీఎన్‌బీ కుంభకోణం 2010 నుంచే జరుగుతోందని వెల్లడి కావడం, ఈ స్కామ్ విషయంలో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ సీఈఓలకు ప్రభుత్వం నుంచి నోటీసులు అందడం కూడా ప్రతికూల ప్రభావం చూపాయి. బీఎస్ఈ సెన్సెక్స్ కీలకమైన 33,350 పాయింట్ల దిగువకు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,250 పాయింట్ల దిగువకు పడిపోయాయి. వరుసగా ఐదో రోజూ ప్రధాన స్టాక్ సూచీలు నష్టపోయాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 430 పాయింట్లు నష్టపోయి 33,317 పాయింట్ల వద్ద, నిఫ్టీ 110 పాయింట్లు పతనమై 10,249 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీలు దాదాపు మూడు నెలల కనిష్ట స్థాయికి పడిపోయాయి. గత ఏడాది డిసెంబర్ 14 తర్వాత సెన్సెక్స్‌కు ఇదే కనిష్ట స్థాయి. గత నెల 6 తర్వాత సెన్సెక్స్ అత్యధిక పాయింట్లు నష్టపోవడం కూడా ఇదే తొలిసారి. కాగా సెన్సెక్స్‌కు ఈ ఏడాది ఇదే కనిష్ట స్థాయి.

**ఆరంభ లాభాలు ఆవిరి...**

ఉక్కు, అల్యూమినియమ్ దిగుమతి సుంకాలపై నిరసన తీవ్రం కావడంతో సుంకాల విషయమై అమెరికా పునరాలోచన చేసే అవకాశాలున్నాయన్న అంచనాల కారణంగా వాణిజ్య యుద్ధాల ఆందోళన తగ్గింది. దీంతో ప్రపంచ మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ఈ దన్నుతో సెన్సెక్స్ ఉదయం 34,047 పాయింట్ల వద్ద భారీ లాభాల్లోనే ఆరంభమైంది. కొనుగోళ్లు జోరుగా సాగడంతో ఇంట్రాడేలో 313 పాయింట్ల లాభంతో 34,060 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. అయితే ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్‌లకు ఎస్ఎఫ్ఐఓ నోటీసుల వ్యవహారంతో లాభాలు ఆవిరయ్యాయి. చివరి గంటలో లాభాల స్వీకరణ కూడా చోటు చేసుకోవడంతో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇంట్రాడేలో 537 పాయింట్ల నష్టంతో 33,210 పాయింట్ల కనిష్ట స్థాయిని తాకింది. మొత్తం మీద రోజంతా సెన్సెక్స్ 850 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇక నిఫ్టీ ఇంట్రాడేలో 83 పాయింట్ల లాభంతో 10,441 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత 143 పాయింట్లు నష్టపోయి 10,216 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. నిఫ్టీ రోజంతా 226 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 1,129 పాయింట్లు కుదేలైంది. భారత రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులు క్షీణిస్తున్నాయని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ తాజా నివేదిక వెల్లడించడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు వరుసగా ఐదో రోజూ పెరగడం ప్రతికూల ప్రభావం చూపించాయి.

**ప్రపంచ మార్కెట్లు బాగానే ఉన్నా...**

అంతర్జాతీయంగా ఆశావహ పరిస్థితులున్నప్పటికీ, మన మార్కెట్ నష్టపోయిందని జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. మొండి బకాయిల సమస్య, బాండ్ల రాబడులు పెరుగుతుండడం, నిధులపై అధిక వడ్డీ వ్యయాలు ప్రభావం చూపాయని వివరించారు. సమీప భవిష్యత్తులో మార్కెట్లో ఒడిదుడుకులు కొనసాగుతాయని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ అంచనా వేస్తున్నారు.

### ఐదు రోజుల్లో రూ.4.30 లక్షల కోట్లు ఆవిరి

ఐదు రోజుల స్టాక్ మార్కెట్ నష్టాల కారణంగా రూ.4.30 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,129 పాయింట్లు నష్టపోయింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఈ ఐదు ట్రేడింగ్ సెషన్లలో రూ.4,30,043 కోట్లు ఆవిరై రూ.1,44,20,606 కోట్లకు పడిపోయింది. ఒక్క మంగళవారం రోజే రూ. 1.54 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది.

### బ్యాంక్ షేర్లు బేర్...

**పీ**ఎన్‌బీ రుణ కుంభకోణం దర్యాప్తులో భాగంగా సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(ఎస్ఎఫ్ఐఓ) ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓ చందా కొచర్‌కు, యాక్సిస్ బ్యాంక్ సీఈఓ శిఖా శర్మలకు నోటీసులు జారీ చేసింది. పీఎన్‌బీ రుణ కుంభకోణంలో కీలకమైన నీరవ్ మోదీ, మేహుల్ చోక్సీలకు ఇతర బ్యాంక్‌ల్లో కూడా రుణాలున్నాయో లేదోనన్న విచారణలో భాగంగా ఎస్ఎఫ్ఐఓ ఈ నోటీసులు జారీ చేయడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మోదీ, చోక్సీలతో వ్యాపార లావాదేవీలు నిర్వహించిన 31 బ్యాంక్‌లకు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను ఎస్ఎఫ్ఐఓ విచారించనున్నదని వార్తలు వచ్చాయి. కాగా పీఎన్‌బీ స్కామ్‌లో కీలకమైన వ్యక్తుల్లో ఒకరైన గీతాంజలి జెమ్స్ మేహుల్ చోక్సీకి ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1,000 కోట్లు, యాక్సిస్ బ్యాంక్ రూ.700 కోట్ల మేర రుణాలిచ్చాయని సమాచారం. ఇంట్రాడేలో బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్‌లు తాజా ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) ప్లాన్ కిందకు ఈ బ్యాంక్‌లను ఆర్‌బీఐ తెచ్చే అవకాశాలున్నాయన్న వార్తలు ఈ బ్యాంక్ షేర్లను పడగొట్టాయి. మరో వైపు బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా తాజా ఏడాది కనిష్ట స్థాయికి పడిపోయింది. ఈ అన్ని ప్రతికూల వార్తల కారణంగా ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, యస్‌బ్యాంక్ షేర్లు 3 శాతం వరకూ పతనమయ్యాయి.

**ఇవీ... మార్కెట్ విశేషాలు**

- సెన్సెక్స్‌లో నాలుగు షేర్లు– ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, హీరో మోటొకార్ప్, కోల్ ఇండియాలు మాత్రమే లాభపడ్డాయి. మిగిలిన షేర్లు నష్టపోయాయి. సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, టాటా మోటార్స్, విప్రో, పవర్ గ్రిడ్, ఐటీసీ, రిలయన్స్, బజాజ్ ఆటో, ఎల్‌అండ్ టీ, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యూనిలివర్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఏషియన్ పెయింట్స్, ఓఎన్‌జీసీ, ఎన్‌టీసీపీలు 3 శాతం వరకూ నష్టపోయాయి.

**కోలుకున్న ప్రపంచ మార్కెట్లు:** వాణిజ్య యుద్ధాల భయాలు తగ్గడంతో ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. జపాన్ నికాయ్, చైనా షాంగై కాంపొజిట్, హాంగ్‌కాంగ్ హాంగ్‌సెంగ్, దక్షిణ కొరియా కోస్పీ సూచీలు 1–2% రేంజ్‌లో పెరిగాయి.

## తొలి ఏడాది రూ.100 కోట్ల లక్ష్యం

### విపణిలోకి హావెల్స్ వాటర్ ప్యూరిఫయర్లు




వాటర్ ప్యూరిఫయర్లను విడుదల చేస్తున్న శశాంక్ శ్రీవాస్తవ్. చిత్రంలో హావెల్స్ ఇతర ప్రతినిధులు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఫాస్ట్ మూవింగ్ ఎలక్ట్రికల్ గూడ్స్ (ఎఫ్ఎంఈజీ) దిగ్గజం హావెల్స్ ఇండియా వాటర్ ప్యూరిఫయర్ల విభాగంలోకి అడుగుపెట్టింది. మంగళవారమిక్కడ డిజిటచ్, డిజిప్లస్, యూటీఎస్, మ్యాక్స్, ప్రో, యూవీ ప్లస్ పేరిట ఆరు నూతన శ్రేణి వాటర్ ప్యూరిఫయర్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా హావెల్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ శశాంక్ శ్రీవాస్తవ్ మాట్లాడుతూ.. ''ప్రతి ఏటా హావెల్స్ విస్తరణ పెట్టుబడుల్లో భాగంగా వాటర్ ప్యూరిఫయర్ల తయారీ, మిషనరీ ఇతరత్రా వాటికి రూ.100 నుంచి 150 కోట్ల మధ్య ఇన్వెస్ట్‌మెంట్ చేస్తోంది. 95 శాతం ప్యూరిఫయర్ల తయారీ హరిద్వార్ ప్లాంట్‌లోనే జరుగుతుంది. ప్లాంట్ సామర్థ్యం ఏటా 5 లక్షల యూనిట్లు'' అని వివరించారు. ప్రస్తుతం దేశంలో వాటర్ ప్యూరిఫయర్ల పరిశ్రమ రూ.5,800 కోట్లుగా ఉందని. ఇందులో సంఘటిత పరిశ్రమ వాటా రూ.3,500 కోట్లుగా ఉంటుందని తెలియజేశారు. ''ఇప్పటివరకు ఉత్తరాదిలోని 7 రాష్ట్రాలు, 19 నగరాల్లో వెయ్యికి పైగా ప్యూరిఫయర్లను విక్రయించాం. తొలి ఏడాది రూ.100 కోట్ల వ్యాపారాన్ని లక్ష్యించాం. ఐదేళ్లలో రూ.500 కోట్లకు పైనే సాధిస్తాం'' అని తెలియజేశారు. ఆయా ఉత్పత్తుల ధరలు రూ.10,499–23,999 మధ్య ఉన్నాయి.

## ప్రపంచ కుబేరుడు అమెజాన్ 'బెజోస్'

### ఫోర్బ్స్ 2018 జాబితాలో టాప్

- సంపద 112 బిలియన్ డాలర్లు...
- టాప్–20లో భారత్ నుంచి ఒకేఒక్కడు ముకేశ్ అంబానీ...
- 40.1 బిలియన్ డాలర్ల సంపద.. 19 ర్యాంక్



**న్యూయార్క్:** ఈ ఏడాది ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ నిలిచాడని ఫోర్బ్స్ మ్యాగజైన్ మంగళవారం వెల్లడించింది. జెఫ్ బెజోస్ ఫోర్బ్స్ శ్రీమంతుల వార్షిక జాబితాలో మొదటి స్థానాన్ని సాధించడం ఇదే మొదటిసారి. గత 24 ఏళ్లలో 18 ఏళ్ల పాటు అత్యంత సంపన్నుల జాబితాలో మొదటి స్థానంలో ఉన్న మైక్రోసాఫ్ట్ బిల్‌గేట్స్ ఈ ఏడాది రెండో స్థానంలో ఉన్నారని పేర్కొంది. ఏడాది కాలంలో అమెజాన్ షేర్లు 59 శాతం పెరగడంతో జెఫ్ బెజోస్ సంపద ఈ ఏడాది దాదాపు రెట్టింపై 11,200 కోట్ల డాలర్లకు పెరిగింది. ఇక రెండో స్థానంలో ఉన్న బిల్‌గేట్స్ సంపద 9,000 కోట్ల డాలర్లుగా ఉంది. ఇక మూడో స్థానంలో 8,400 కోట్ల డాలర్లతో లెజండరీ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ నిలిచారు. 7,200 కోట్ల డాలర్లతో ఫ్రెంచ్ పారిశ్రామికవేత్త బెర్నార్డ్ ఆర్నాల్ట్ నాలుగో స్థానంలో, 7,100 కోట్ల డాలర్లతో ఫేస్‌బుక్ మార్క్ జుకర్‌బర్గ్ ఐదో స్థానంలో ఉన్నారు.

**119 మంది సంపన్న భారతీయులు...**

ఇక భారత్ విషయానికొస్తే, ప్రపంచ బిలియనీర్ల జాబితాలో మొత్తం 119 మంది భారతీయులకు చోటు దక్కింది. వీరిలో 18 మంది కొత్తగా ఈ జాబితాకెక్కారు.అత్యంత సంపన్న భారతీయుడైన రిలయన్స్ అధినేత ముకేశ్‌అంబానీ ఈ ప్రపంచ సంపన్నుల జాబితాలో 19 వస్థానంలో ఉన్నారు. ఆయన సంపద 4,010 కోట్ల డాలర్లుగా (దాదాపు రూ.2.61 లక్షల కోట్లు) ఉంది. ఈ జాబితాలో 58వ స్థానంలో విప్రో అజిమ్ ప్రేమ్‌జీ (1,880 కోట్ల డాలర్లు), 62వ స్థానంలో ఆర్సెలర్ లక్ష్మీ మిట్టల్ (1,850 కోట్ల డాలర్లు), 98వ స్థానంలో శివ్ నాడార్ (1,460 కోట్ల డాలర్లు) ఉన్నారు. ఇక సన్ ఫార్మా అధినేత దిలిప్ సంఘ్వి 1,280 కోట్ల డాలర్ల సంపదతో 115వ స్థానంలో ఉన్నారు. రామ్‌దేవ్ అగర్వాల్, తరంగ్ జైన్, నిర్మల్ మిందా, రవీంద్ర కిశోర్ సిన్హాలు ఒక్కొక్కరు వంద కోట్ల డాలర్ల సంపదతో ఈ జాబితాకెక్కారు. ఈ జాబితాలో 176 స్థానంలో సావిత్రి జిందాల్ ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ఫార్మా దిగ్గజాలకు కూడా ఈ జాబితాలో స్థానం లభించింది. అరబిందో ఫార్మా రామ్ ప్రసాద్ రెడ్డి 250 కోట్ల డాలర్ల సంపదతో 965వ ర్యాంక్‌ను, దివీస్ మురళి 230 కోట్ల డాలర్లతో 1,070వ ర్యాంక్‌ను సాధించారు.

వందకోట్ల డాలర్లు (దాదాపు రూ.6,500 కోట్లు) పైబడిన ప్రపంచ వ్యాప్త సంపన్నులతో ఫోర్బ్స్ పత్రిక ఈ జాబితాను రూపొందించింది. ఈ జాబితాలో మొత్తం 2,208 మంది సంపన్నులకు స్థానం లభించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 9 తర్వాతి షేర్ల ధరలను పరిగణనలోకి తీసుకొని ఈ జాబితాను రూపొందించారు. గత ఏడాది బిలియనీర్ల జాబితాలో స్థానం పొంది, ఈ ఏడాది ఈ జాబితా నుంచి జారిపోయిన వాళ్ల జాబితాలో పీఎన్‌బీ స్కామ్ సూత్రధారి నీరవ్ మోదీ ఉండడం విశేషం.

గత ఏడాది 7.7 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న బిలియనీర్ల సంపద ఈ ఏడాది 9.1 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. ఒక్కో బిలియనీర్ సగటు సంపద 4.1 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది.

## బంధన్ బ్యాంక్ ఐపీఓకు సెబీ గ్రీన్ సిగ్నల్

### ఇష్యూ రూ.2,500 కోట్లు

- బ్యాంకుల్లో ఇదే పెద్ద ఐపీఓ




**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ బంధన్ బ్యాంక్ ఐపీఓకు(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. కోల్‌కతా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ బ్యాంక్.. ఈ ఏడాది జనవరి 1న సెబీకి ఐపీఓ పత్రాలను సమర్పించింది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.2,500 కోట్లు సమీకరించనుంది. భారత బ్యాంకింగ్ రంగంలో ఇదే అతి పెద్ద ఐపీఓ అని మర్చంట్ బ్యాంకర్ల సమాచారం. ఈ ఐపీఓలో భాగంగా 9,76,63,910 తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. అంతే కాకుండా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఈ బ్యాంక్ భాగస్వాములు– ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ), ఐఎఫ్‌సీ ఎఫ్ఐజీ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు కలిసి 1,40,50,780 షేర్లను విక్రయిస్తాయి. ఒక బ్యాంక్‌గా మారిన తొలి సూక్ష్మ రుణ సంస్థ ఇది. భవిష్యత్ మూలధన అవసరాలకు ఈ ఐపీఓ నిధులను వినియోగించుకోవాలని బ్యాంక్ యోచిస్తోంది. 2014లో ఆర్‌బీఐ బంధన్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐడీఎఫ్‌సీలకు బ్యాంక్ లైసెన్స్‌లు జారీ చేసింది.

**ఈ నెల 13 నుంచి భారత్ డైనమిక్స్ ఐపీఓ**

హైదరాబాద్ కేంద్రంగా క్షిపణులు, ఇతర రక్షణ సంబంధిత పరికరాలు తయారు చేస్తోన్న భారత్ డైనమిక్స్ కంపెనీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్నది. ఈ నెల 15న ముగిసే ఈ ఐపీఓకు ధరల శ్రేణిని కంపెనీ రూ.413–428గా కంపెనీ నిర్ణయించింది. ఈ నెల 15న ముగిసే ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.961 కోట్లు సమీకరిస్తుందని అంచనా.

## పీఎన్‌బీ స్కామ్.. బ్యాంకర్లకు సమన్లు

### నీరవ్ మోదీ సంస్థలకు ఇచ్చిన రుణాలపై ఎస్ఎఫ్ఐవో ఆరా

- విచారణకు 31 బ్యాంకుల ఎగ్జిక్యూటివ్‌లు
- యాక్సిస్, ఐసీఐసీఐ చీఫ్‌లకూ పిలుపు?
- వివరణ కోరిన స్టాక్ ఎక్స్ఛేంజీలు
- గీతాంజలి గ్రూప్ వీపీ విపుల్ అరెస్టు




**ముంబై:** పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పీఎన్‌బీ) నీరవ్ మోదీ గ్రూప్ సంస్థల కుంభకోణానికి సంబంధించి సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐవో) దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ సంస్థలకు రుణాలిచ్చిన బ్యాంకర్ల నుంచి సమాచారం సేకరించడం ప్రారంభించింది. ఆయా సంస్థలకు సదరు బ్యాంకులు ఎంత మేర రుణాలిచ్చినదీ.. తదితర వివరాలు తెలియజేసేందుకు రావాలంటూ దాదాపు 31 బ్యాంకుల ఎగ్జిక్యూటివ్‌లకు ఆదేశాలు పంపింది. దర్యాప్తులో సహకరించాల్సిందిగా ఎస్ఎఫ్ఐవో కోరిన మీదట.. యాక్సిస్ బ్యాంక్ డిప్యూటీ ఎండీ వి. శ్రీనివాసన్‌తో పాటు ట్రేడ్, ట్రాన్సాక్షన్స్ విభాగంలో పనిచేసే కొందరు ఎగ్జిక్యూటివ్‌లు విచారణకు హాజరైనట్లు పేర్కొన్నాయి. సుమారు రెండు గంటలపాటు వారు ఎస్ఎఫ్ఐవో కార్యాలయంలోనే ఉన్నారని, చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్, నీరవ్ మోదీ సంస్థలతో లావాదేవీల గురించి ఎస్ఎఫ్ఐవో వారిని ప్రశ్నించిందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మంగళవారం.. ఒకదశలో ఐసీఐసీఐ బ్యాంకు ఎండీ చందా కొచర్, యాక్సిస్ బ్యాంక్ సీఈవో శిఖా శర్మలకు కూడా ఎస్ఎఫ్ఐవో సమన్లు పంపిందంటూ వార్తలు వచ్చాయి. వీటిపై ఆయా బ్యాంకుల నుంచి స్టాక్ ఎక్స్ఛేంజీలు వివరణ కోరాయి. అయితే, సాధారణంగా నోటీసుల్లాంటివి చీఫ్‌ల కార్యాలయాలకే వస్తాయి కాబట్టి ఈ ఊహాగానాలు వచ్చి ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. రుణాలు తీసుకున్న సంస్థలతో లావాదేవీలు జరిపే అధికారులకే ఎక్కువ వివరాలు తెలుస్తాయి కనక.. విచారణకు వారే హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి.

**సీబీఐ అదుపులో 'మాస్టర్‌మైండ్' విపుల్ చితాలియా..**

పీఎన్‌బీ కుంభకోణం కేసులో గీతాంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వైస్ ప్రెసిడెంట్ విపుల్ చితాలియాను సీబీఐ అరెస్టు చేసింది. నేరుగా గ్రూప్ చీఫ్ మెహుల్ చోక్సీకి రిపోర్ట్ చేసే చితాలియాను 'మాస్టర్ మైండ్'గా సీబీఐ అభివర్ణించింది. పీఎన్‌బీ రిటైర్డ్ డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టితో కుమ్మక్కై మోసపూరిత ఎల్‌వోయూలు, ఫారిన్ లెటర్స్ ఆఫ్ క్రెడిట్స్ (ఎఫ్ఎల్‌సీ)ల దరఖాస్తులను తయారు చేయడంలో చితాలియా కీలకపాత్ర పోషించినట్లు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి అరెస్టయినవారిలో చితాలియా 19వ వ్యక్తి. ముంబై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన తర్వాత.. సీబీఐ ప్రత్యేక కోర్టులో ఆయన్ను హాజరుపర్చారు. మార్చి 17 దాకా సీబీఐ కస్టడీకి కోర్టు ఆదేశించింది. చితాలియాపై ఇప్పటికే లుక్ అవుట్ నోటీసు జారీకావడంతో ఆయన బ్యాంకాక్ నుంచి రాగానే ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి.

**ఎల్‌వోయూల ఆధారంగానే ఇతర బ్యాంకుల రుణాలు**

పీఎన్‌బీ ఉద్యోగులతో కుమ్మక్కై తీసుకున్న లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ) ఆధారంగా ఇతర బ్యాంకుల నుంచి రుణాలు పొందిన మోడీ గ్రూప్ సంస్థలు రూ. 12,700 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడ్డాయని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సీబీఐతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటివీ విచారణ జరుపుతున్నాయి. గీతాంజలి జెమ్స్‌కి దాదాపు రూ.6,800 కోట్ల మేర రుణాలిచ్చిన 31 బ్యాంకుల కన్సార్షియంనకు ఐసీఐసీఐ బ్యాంక్ లీడ్ బ్యాంకర్‌గా ఉంది. మోదీ కంపెనీలకు అది నేరుగా ఎలాంటి రుణాలివ్వలేదు. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా పీఎన్‌బీ ఎల్‌వోయూల ఆధారంగానే గీతాంజలి జెమ్స్‌కి రుణాలిచ్చిందే తప్ప నేరుగా లోన్‌లు ఇవ్వనట్లు తెలుస్తోంది.

**ఈడీ కేసుపై హైకోర్టుకు ఫైర్‌స్టార్ డైమండ్..**

పీఎన్‌బీ కుంభకోణం కేసుకు సంబంధించి నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమపై మనీ ల్యాండరింగ్ కేసు పెట్టడాన్ని సవాలు చేస్తూ పిటీషన్ దాఖలు చేసింది. తమ స్థిరాస్తులను జప్తు చేస్తూ ఈడీ తీసుకున్న చర్యలను రద్దు చేయాలని కోరింది.

**చర్యలపై పీఎంవోకి వివరణ..:** పీఎన్‌బీ స్కామ్ కేసులో తీసుకున్న చర్యల గురించి మార్చి 1న ప్రధాని కార్యాలయానికి వివరాలు అందించినట్లు ఆర్థిక శాఖ రాజ్యసభకు తెలిపింది. సీబీఐ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా రెండు కేసులు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలు ప్రాంతాల్లో సోదాలతో పాటు కొన్ని ఆస్తులు కూడా జప్తు చేసినట్లు పేర్కొంది. అలాగే మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ ఖాతాలనూ స్తంభింపచేసినట్లు, స్కామ్‌లో ఉన్న సంస్థల ఆస్తులు, ఖాతాల వివరాల కోసం 13 దేశాలకు అభ్యర్థనలు పంపినట్లు వివరించింది.

### భారీ రుణాలున్నవారి పాస్‌పోర్టులపై లుక్కేయండి!

**ఆ వివరాలన్నీ తీసుకోండి: ఆర్థిక శాఖ**

- బ్యాంకులకు ఆదేశాలు.. 45 రోజుల గడువు

**న్యూఢిల్లీ:** విజయ్ మాల్యా, నీరవ్ మోదీల తరహాలో భారీ ఎత్తున బ్యాంకులకు రుణాలు ఎగవేసి, విదేశాలకు పారిపోయే వారిని కట్టడి చేయడంపై కేంద్ర ఆర్థిక శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా రూ.50 కోట్లు, అంతకు మించి భారీగా రుణాలు తీసుకున్న రుణ గ్రహీతలందరి పాస్ పోర్టు వివరాలను సేకరించాలని ప్రభుత్వ రంగ బ్యాంకులను (పీఎస్‌బీ) ఆదేశించింది. ఇందుకు 45 రోజుల గడువు విధించింది. ఒకవేళ రుణ గ్రహీతకు పాస్‌పోర్ట్ లేని పక్షంలో ఆ విషయాన్ని ధ్రువీకరిస్తూ వారి దగ్గరి నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని సూచించింది. అలాగే, పాస్‌పోర్ట్ వివరాలు కూడా పొందుపర్చేలా రుణ దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు చేయాలని పేర్కొంది. ఆర్థిక నేరగాళ్లు .. మోసాలకు పాల్పడి దేశం విడిచి పారిపోకుండా సత్వరం చర్యలు తీసుకోవడానికి పాస్‌పోర్ట్ వివరాలు బ్యాంకులకు ఉపయోగపడగలవని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వివరాలు లేకపోవడం వల్లే.. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు విదేశాలకు పారిపోకుండా వెంటనే తగు చర్యలు తీసుకోలేకపోతున్నాయని వివరించాయి.

## సుజుకీ కొత్త జిక్సర్ బైక్స్..


### ప్రారంభ ధర రూ.80,928



**న్యూఢిల్లీ:** ప్రముఖ టూవీలర్ కంపెనీ 'సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా' తాజాగా 2018 ఎడిషన్ జిక్సర్, జిక్సర్ ఎస్ఎఫ్ బైక్స్‌ను మార్కెట్లో ఆవిష్కరించింది. వీటి ధరలు వరుసగా రూ.80,928, రూ.90,037గా ఉన్నాయి. అన్ని ధరలు ఎక్స్‌షోరూమ్ ఢిల్లీవి. రెండింటిలోనూ సుజుకీ ఎకో పర్ఫార్మెన్స్ టెక్నాలజీతో కూడిన 155 సీసీ ఇంజిన్‌ను అమర్చినట్లు కంపెనీ తెలిపింది.

## శాంసంగ్ గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్ ధరెంతో తెలుసా?

### రూ.57,900 నుంచి ప్రారంభం..



**న్యూఢిల్లీ:** ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తాజాగా గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్ స్మార్ట్‌ఫోన్లను భారత మార్కెట్లో ఆవిష్కరించింది. వీటి ప్రారంభ ధర రూ.57,900. కాగా కంపెనీ తొలిసారిగా ఈ ప్రీమియం ప్రొడక్టులను ఇటీవల స్పెయిల్‌లోని బార్సిలోనాలో ఆవిష్కరించింది. డ్యూయెల్ ఎపర్చర్ అండ్ స్లో మోషన్ వీడియో ఆప్షన్స్, డ్యూయెల్ స్టీరియో స్పీకర్స్, డాల్బీ సౌండ్ వంటి ఫీచర్లున్న ఈ స్మార్ట్‌ఫోన్లు యాపిల్ ఐఫోన్–ఎక్స్, గూగుల్ పిక్సెల్–2 ఫోన్లకు గట్టిపోటీనిస్తాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇక ఈ స్మార్ట్‌ఫోన్లు మార్చి 16 నుంచి కస్టమర్లను అందుబాటులోకి రానున్నవి. ఎస్9 స్మార్ట్‌ఫోన్‌లో 5.8 అంగుళాల డిస్‌ప్లే, 4 జీబీ ర్యామ్, 12 ఎంపీ రియర్ కెమెరా, 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 3,000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ప్రత్యేకతలున్నాయి. ఇక ఎస్9 ప్లస్‌లో 6.2 అంగుళాల డిస్‌ప్లే, 6 జీబీ ర్యామ్, 12 ఎంపీ రియర్/ ఫ్రంట్ కెమెరాలు, 3,500 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లున్నాయి.

## ఒడిశాలో ఎంఎస్‌ఎంఈ సదస్సు ప్రారంభం

**భువనేశ్వర్:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ) అంతర్జాతీయ సదస్సు మంగళవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ప్రారంభమైంది. సీఎం నవీన్ పట్నాయక్ ప్రారంభించిన ఈ సదస్సులో జర్మనీ, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు చెందిన 35 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్నో అంతర్జాతీయ సంస్థలు, దేశీయ స్టార్టప్‌లు, ఎగుమతిదారులు, ప్రభుత్వరంగ సంస్థలు ఈ సదస్సులో 350కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ నెల 10వరకు ఈ సదస్సు కొనసాగుతుంది. ఎంఎస్‌ఎంఈ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం నవీన్ పట్నాయక్ తెలిపారు.

## ఎస్‌ఎంబీలకు గో డాడీ డిజిటల్ వేదిక

**హైదరాబాద్:** టెక్నాలజీ ప్రొవైడర్ గో డాడీ... చిన్న, మధ్య తరహా వ్యాపారస్తులకు (ఎస్‌ఎంబీ) డిజిటల్ సేవలందించేందుకు ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్ వేదికగా ఎస్‌ఎంబీలను తమ వ్యాపారాన్ని నిర్వహించుకునేందుకు వీలుగా వెబ్‌సైట్ నిర్వహణ, పరిష్కారాలు, అవగాహన, కస్టమర్లను ఆకట్టుకోవటం వంటి అంశాల్లో డిజిటల్ మాధ్యమంలోనే సేవలందిస్తున్నామని, అందుకే ఈ క్యాంపెయిన్ ఆరంభించామని గో డాడీ తెలిపింది.

## దేశీయంగానూ సోలార్ పవర్ వాడనున్న మైక్రోసాఫ్ట్

**న్యూఢిల్లీ:** టెక్నాలజీ దిగ్గజ కంపెనీ 'మైక్రోసాఫ్ట్' తాజాగా భారత్‌లో తొలి పునరుత్పాదక ఇంధన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బెంగళూరులోని తన కొత్త ఫెసిలిటీకి సోలార్ ఎలక్ట్రిసిటీ కోసం అట్రియా పవర్ సంస్థతో ఈ డీల్‌ను కుదుర్చుకున్నట్లు సంస్థ తెలిపింది. ఇక ఈ ఒప్పందంలో భాగంగా మైక్రోసాఫ్ట్.. అట్రియా పవర్ నుంచి 3 మెగావాట్ల సోలార్ ఎలక్ట్రిసిటీని కొనుగోలు చేస్తుంది.

# గతేడాది రూ.81,683 కోట్ల రైటాఫ్!

### అది కూడా ప్రభుత్వ రంగ బ్యాంకులే • ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడి



**న్యూఢిల్లీ:** అంతకంతకూ కొండలా పేరుకుపోతున్న మొండిబకాయిలతో సతమతమవుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) భారీ మొత్తంలోనే రుణాలను మాఫీ చేస్తున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పీఎస్‌బీలు రూ.81,683 కోట్ల విలువైన రుణాలను మాఫీ (రైటాఫ్) చేసినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం రాజ్యసభకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే, బ్యాంకులు పన్ను ప్రయోజనాల కోసం, అదే విధంగా మూలధన సద్వినియోగం కోసం బ్యాలెన్స్ షీట్ రైటాఫ్ కింద చూపిస్తాయని... సంబంధిత రుణ గ్రహీతలు ఈ బకాయిలను తిరిగి చెల్లించాల్సిందేనని జైట్లీ స్పష్టంచేశారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.20,339 కోట్ల విలువైన రుణాలను రైటాఫ్ చేసినట్లు ఆయన తెలియజేశారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో (2017-18) సెప్టెంబర్ వరకూ పీఎస్‌బీలు రూ.28,781 కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం నాలుగేళ్లకు పైబడిన మొండి బకాయిలను (పూర్తిస్థాయిలో ప్రొవిజనింగ్ చేసిన వాటితో సహా) బ్యాంకులు వాటి బ్యాలెన్స్ షీట్‌ల నుంచి తొలగిస్తాయి. దీన్నే సాంకేతికంగా రైటాఫ్ కింద పరిగణిస్తారు. అయితే, చట్టపరంగా ఈ బకాయిల వసూలు ప్రక్రియను బ్యాంకులు కొనసాగిస్తాయని, అందువల్ల రైటాఫ్‌తో రుణ గ్రహీతలకు ప్రయోజనం చేకూర్చినట్లు భావించకూడదని జైట్లీ వివరించారు.

#### బ్యాంకింగ్ మోసాలు @ రూ.52,717 కోట్లు

గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (2013 ఏప్రిల్ 1 నుంచి) బ్యాంకింగ్ రంగ మోసాలకు సంబంధించి 13,643 కేసులు వెలుగుచూశాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ ప్రతాప్ శుక్లా పార్లమెంటులో చెప్పారు. ఈ మోసాల విలువ రూ.57,717 కోట్లుగా ఆయన తెలిపారు. ఇక బినామీ చట్టం-2018 కింద ఇప్పటివరకూ వెయ్యికిపైగా ఆస్తులను ప్రాథమికంగా జప్తు (అటాచ్) చేసినట్లు మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వీటి విలువ రూ.3,800 కోట్లకు పైగానే ఉంటుందని శుక్లా వివరించారు.

## అమెరికా నుంచి ఎల్‌ఎన్‌జీ దిగుమతులు



**న్యూఢిల్లీ:** ఇటీవలే అమెరికా నుంచి ముడి చమురు కొనుగోళ్లు ప్రారంభించిన భారత్... తాజాగా ద్రవీకృత సహజ వాయువును (ఎల్‌ఎన్‌జీ) కూడా దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టింది. లూసియానాలోని షెనియర్ ఎనర్జీకి చెందిన సబీన్ పాస్ లిక్విఫాక్షన్ ప్లాంటు నుంచి ఏటా 3.5 మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ దిగ్గజం గెయిల్ ఇండియా కాంట్రాక్టు కుదుర్చుకుంది. 20 ఏళ్ల ఈ డీల్‌లో భాగంగా తొలి కార్గో.. గెయిల్‌కి చెందిన 'మెరీడియన్ స్పిరిట్' రవాణా నౌక లూసియానా నుంచి భారత్‌కి బైల్దేరింది. ఇది ఈ నెల 28 నాటికి ఇది మహారాష్ట్రలోని దభోల్ టెర్మినల్‌కి చేరుతుందని గెయిల్ తెలిపింది. 2011లో గెయిల్ ఈ ఒప్పందం కుదుర్చుకుంది. భారత్ గతేడాది అక్టోబర్ నుంచే అమెరికా నుంచి చమురు దిగుమతి చేసుకోవడం ప్రారంభించింది.

# యులిప్‌లపై 15-16 శాతం రాబడి

### బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** యులిప్‌లపై రాబడి 15-16 శాతం వరకూ ఉంటోందని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలియజేసింది. గడిచిన 15 ఏళ్లలో సగటున ఈ స్థాయి రాబడి వస్తోందని కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సంపత్ రెడ్డి మంగళవారమిక్కడ మీడియాతో చెప్పారు. '2016-17లో యులిప్‌ల మార్కెట్ భారత్‌లో రూ.4.1 లక్షల కోట్లుంది. 30 శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో వృద్ధి ఉంటుందని అంచనా. జీవిత బీమా పాలసీల్లో యులిప్‌ల వాటా 60 శాతం దాకా ఉంటుంది. యులిప్‌ల వృద్ధి రేటు జీవిత బీమా పాలసీల కంటే అధికంగా నమోదు చేస్తోంది. బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి ఆరు రకాల యులిప్‌లు అందుబాటులో ఉన్నాయి' అని వెల్లడించారు.

**కరెక్షన్ ఉండొచ్చు:** స్టాక్ మార్కెట్‌లో కరెక్షన్ ఉండొచ్చని సంపత్ రెడ్డి తెలిపారు. 'రానున్న రోజుల్లో ఐటీ రంగం బాగుంటుంది. ఫార్మా ఏడాదిన్నరగా ఒడిదుడుకులకు లోనవుతోంది. ప్రైవేటు బ్యాంకింగ్ రంగం మంచి పనితీరు కనబరుస్తోంది' అని వివరించారు. కాగా, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా లైఫ్ గోల్ అష్యూర్ పేరుతో నూతన యులిప్ పాలసీని ప్రవేశపెట్టింది. పాలసీ గడువు ముగిసిన తర్వాత 1.35%గా ఉన్న ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీలను మినహాయించి మోర్టాలిటీ చార్జీలను వెనక్కి చెల్లిస్తారు. అది కూడా యూనిట్ల రూపంలో అందజేస్తారు. 18 నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఈ ఆన్‌లైన్ పాలసీ తీసుకోవచ్చు.

## ఎయిర్ ఏషియా నుంచి రూ.799కే విమాన టికెట్



**బెంగళూరు:** ఎయిర్ ఏషియా విమానయాన సంస్థ రూ.799 నుంచే దేశీయ ప్రయాణ టికెట్లను, రూ.999 నుంచి అంతర్జాతీయ ప్రయాణ టికెట్లను అందిస్తోంది. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు ఆఫర్ అమల్లో ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 3 నుంచి వచ్చే ఏడాది మే 29 మధ్య ప్రయాణాల కోసం ఆఫర్ కింద టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

### కార్పొ బ్రీఫ్స్

**అల్ట్రాటెక్ సిమెంట్:** ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన ఈ కంపెనీలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్(ఎఫ్‌పీఐ) పరిమితిని 30 శాతం నుంచి 40 శాతానికి పెంచింది. భారత్‌లో అతి పెద్ద సిమెంట్ కంపెనీ ఇది. ఈ కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 6.8 కోట్ల టన్నులు.

**టాటా మోటార్స్:** ఆర్థిక ఫలితాలు అధికారికంగా వెల్లడికాకముందే వాట్సాప్ ద్వారా లీకైన విషయంలో దర్యాప్తు జరపాలని టాటా మోటార్స్‌ను మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆదేశించింది. సంబంధిత నివేదికను మూడు నెలల్లోగా అందజేయాలని పేర్కొంది.

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ బాండ్ రేటింగ్ పెంచిన మూడీస్

**న్యూఢిల్లీ:** మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తాజాగా జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కార్పొరేట్ ఫ్యామిలీ రేటింగ్ (సీఎఫ్‌ఆర్) అండ్ సీనియర్ అన్‌సెక్యూర్డ్ బాండ్ రేటింగ్‌ను బీఏ3 నుంచి బీఏ2కు అప్‌గ్రేడ్ చేసింది. కాగా గతవారం ఫిచ్ రేటింగ్స్ కూడా జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌పై తన ఔట్‌లుక్‌ను ప్రతికూలం (నెగటివ్) నుంచి స్థిరం (స్టేబుల్)కు మార్చింది. బీఏ2 సీఎఫ్ఆర్ రేటింగ్ అప్‌గ్రేడ్ అనేది పశ్చిమ, దక్షిణ భారత దేశంలోని తమ భారీ కార్యకలాపాలను, పటిష్టమైన మార్కెట్ వాటాను ప్రతిబింబిస్తోందని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ పేర్కొంది. విస్తృత స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, తీర ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండటం వల్ల వ్యయాలు తక్కువగా ఉంటాయని, ఈ అంశం కూడా రేటింగ్ పెంపునకు దోహదపడిందని తెలిపింది.

## ఆర్‌కామ్‌కు ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ షాక్

**న్యూఢిల్లీ:** రుణాల ఊబిలో కూరుకుపోయిన అనిల్ అంబానీ గ్రూప్ రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు (ఆర్‌కామ్) ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ షాకిచ్చింది. ఎరిక్సన్ కేసులో ఆర్‌కామ్ తమ అనుమతి లేకుండా ఆస్తుల విక్రయం, అదేవిధంగా బదలాయింపు, తనఖా పెట్టేందుకు వీల్లేదంటూ మధ్యంతర ఆదేశాలను జారీచేసింది. టెలికం పరికరాల తయారీ సంస్థ ఎరిక్సన్ ఇండియా ఆర్‌కామ్ నుంచి తనకు రావాల్సిన బకాయిలను వసూలు చేసుకోవడం కోసం ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఆర్‌కామ్ తన మొబైల్ వ్యాపారాన్ని ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియోకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. తాజా ఆదేశాల నేపథ్యంలో ఈ డీల్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. కాగా, తమకు ఆర్‌కామ్ రూ.3,200 కోట మేర చెల్లించాల్సి ఉందని ఎరిక్సన్ ట్రిబ్యునల్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొంది.

## ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో ఆమ్‌ప్లస్ సోలార్ ప్రాజెక్టులు

**న్యూఢిల్లీ:** దాదాపు రూ. 2,700 కోట్ల పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో సౌర విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు ఆమ్‌ప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ తెలిపింది. ఇందుకోసం ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వివరించింది. వీటి ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో రూ. 1,200 కోట్లతో 200 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించనుంది. అటు మహారాష్ట్రలో రూ. 1,500 కోట్లతో 300 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్రాజెక్టు నిర్మించనుంది.

## జీవీకే, జీఎంఆర్ విమానాశ్రయాలకు అవార్డులు

### పలు విభాగాల్లో నంబర్ 1 స్థానం

• ప్రకటించిన అంతర్జాతీయ విమానాశ్రయాల మండలి

**న్యూఢిల్లీ:** జీవీకే, జీఎంఆర్‌కు చెందిన ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాలు పలు విభాగాల్లో ప్రపంచంలోనే మేటి ఎయిర్‌పోర్టులుగా నిలిచి 'ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ అవార్డులను' సొంతం చేసుకున్నాయి. ఇందులో జీవీకే గ్రూపు ఆధ్వర్యంలోని ముంబై ఛత్రపతి శివాజీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (సీఎస్‌ఐఏ) 'కస్టమర్ల అనుభవం'లో ప్రపంచంలోనే మేటి విమానాశ్రయంగా నిలిచింది. అంతర్జాతీయ విమానాశ్రయాల మండలి (ఏసీఐ) నిర్వహించిన సర్వేలో లక్షల మంది ప్రయాణికులు ఈ విషయంలో సీఎస్‌ఐఏకు ఓటేశారు. అంతర్జాతీయ విమానాశ్రయాల మండలిలో 176 దేశాలకు చెందిన 1,953 విమానాశ్రయాలకు సభ్యత్వం ఉంది.

**4 కోట్లకు పైగా ప్రయాణికులు.. ఢిల్లీ నెంబర్ 1**

జీఎంఆర్ గ్రూపు నిర్వహణలోని ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఐజీఐఏ) ఏటా 40 మిలియన్లకు పైగా ప్రయాణికుల రాకపోకలతో... ఈ విభాగంలో ప్రపంచంలోనే నంబర్ 1 స్థానం దక్కించుకుంది. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ అవార్డు సొంతం చేసుకున్నట్లు జీఎంఆర్ ఆధ్వర్యంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ తెలిపింది.

**కోటిన్నర లోపు ప్రయాణికులు... శంషాబాద్‌కే ఓటు**

శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మరోసారి ప్రపంచ అత్యుత్తమ ఎయిర్‌పోర్టు అవార్డును దక్కించుకుంది. ఏటా ఐదు నుంచి పదిహేను మిలియన్ల ప్రయాణికుల విభాగంలో అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డు లభించింది.

## పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంపు సరైనదే

### స్వాగతించిన ఆయిల్‌పామ్ డెవలపర్స్ సంఘం



**హైదరాబాద్:** ముడి పామాయిల్, ఆర్‌బీడీ (శుద్ధి చేసిన) పామోలిన్‌పై దిగుమతి సుంకాన్ని పెంచడాన్ని ఆయిల్‌పామ్ డెవలపర్స్ అండ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ (ఓపీడీపీఏ) స్వాగతించింది. ప్రస్తుతం ముడి పామాయిల్‌పై 30 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని 44 శాతానికి, 40 శాతంగా ఉన్న ఆర్‌బీడీ పామోలిన్ సుంకాన్ని 54 శాతానికి పెంచారు. సామాజిక సంక్షేమ సర్‌చార్జీలను కూడా కలిపితే ముడి పామాయిల్‌పై ఈ సుంకం 48.4 శాతానికి, ఆర్‌బీడీ పామోలిన్‌పై 59.40 శాతానికి చేరుతుందని ఓపీడీపీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 3,321 |
| ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ) | 29,914 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 7,15,138 |
| ఎఫ్‌ఐఐ | 620 |
| డీఐఐ | -734 |

| వడ్డీ రేట్లు | అంకెలు శాతాల్లో |
|---|---|
| బేస్‌రేట్ రేంజ్ | 8.65 – 9.45 |
| డిపాజిట్ రేట్ రేంజ్ | 6.00 – 6.75 |
| డాలర్ లిబార్(6 నెలలు) | 2.22 |

## బులియన్ రూ.లలో

| | ధర | మార్పు |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (99.9, 10గ్రా) | 30,605 | ▼ 60 |
| బంగారం (99.5, 10గ్రా) | 30,455 | ▼ 60 |
| వెండి (కిలో) | 38,435 | ▼ 115 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | -- | |
| బంగారం (22 క్యారెట్లు) | 29,090 | ▼ 90 |
| వెండి (కిలో) | -- | |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 30,540 | ▼ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 29,090 | ▼ 90 |
| వెండి (కిలో) | 41,400 | ▼ 300 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 31,350 | ▼ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 29,060 | ▼ 60 |
| వెండి (కిలో) | 39,500 | ▼ 300 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 31,280 | ▼ 552 |
| బంగారం (22 క్యారెట్లు) | 29,090 | ▼ 90 |
| వెండి (కిలో) | 39,900 | ▼ 1,800 |
| **విజయవాడ** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 31,500 | |
| బంగారం (22 క్యారెట్లు) | 29,150 | |
| వెండి(కిలో) | 39,700 | |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 31,450 | ▼ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 29,090 | ▼ 90 |
| వెండి (కిలో) | 39,400 | ▼ 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 62.34 (రాత్రి 11.00కు) | $62.57 (సోమవారం ముగింపు) |
| బ్రెంట్ | 65.55 (రాత్రి 11.00కు) | $65.54 (సోమవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 07-3-2018

| | |
|---|---|
| విశాఖ | 350-00 |
| చిత్తూరు | 378-00 |
| వరంగల్ | 347-00 |
| ముంబై | 390-00 |
| చెన్నై | 385-00 |
| విజయవాడ | 340-00 |
| గోదావరి | 340-00 |
| నమక్కల్ | 370-00 |
| **06-3-2018 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 345-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.05 |
| బెంగళూరు | 375-00 |
| కోల్‌కతా | 380-00 |
| ఢిల్లీ | 350-00 |

### ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 405.25 | 403.95 |
| AMBUJA CEME | 240.65 | 246.1 |
| ASIAN PAINT | 1101.6 | 1105.95 |
| AXIS BANK L | 517.35 | 524.55 |
| BAJAJ AUTO | 2899.2 | 2943.55 |
| BAJAJ FINAN | 1637.75 | 1636.95 |
| BHARTI AIRT | 413.9 | 421.45 |

### A B C D

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| 3M INDIA LI | 20832.6 | 21012.8 |
| 63 MOONS TE | 91.2 | 92.95 |
| 8K MILES SO | 718.25 | 730.85 |
| 3M INDIA LI | 20747.9 | 20832.6 |
| 63 MOONS TE | 89.3 | 91.2 |
| 8K MILES SO | 710.5 | 718.25 |
| AARTI DRUGS | 587.2 | 589.7 |
| AARTI INDUS | 1159.55 | 1161.85 |
| AARVI ENCON | 91 | 95 |
| ABAN OFFSHO | 164.45 | 166.75 |
| BANNARI AMM | 1675 | 1690.4 |
| BANSAL MULT | 114.5 | 112.25 |
| BANSWARA SY | 113.05 | 113.4 |
| BASF INDIA | 2036.2 | 2080.4 |
| BATA INDIA | 714.9 | 716.2 |
| BAYER CROPS | 3870.9 | 3799.95 |
| BEARDSELL L | 55 | 55.6 |
| BEML LIMITE | 1259.25 | 1360.3 |
| BERGER PAIN | 242.6 | 242.65 |
| BETA DRUGS | 150.75 | 150 |
| BF INVESTME | 315.95 | 315.75 |
| BF UTILITIE | 425.85 | 429.1 |
| BGR ENERGY | 113.8 | 116.2 |
| DHUNSERI IN | 377.7 | 402.35 |
| DHUNSERI PE | 143.4 | 148.6 |
| DHUNSERI TE | 315.1 | 326.05 |
| DIC INDIA L | 515.45 | 518.95 |
| DILIP BUILD | 982.35 | 960.9 |
| DISH TV IND | 67.05 | 70.4 |
| DISHMAN CAR | 320.2 | 330.2 |
| DIXON TECHN | 3521.25 | 3476.3 |
| DOLLAR INDU | 448.25 | 449.55 |
| DOLPHIN OFF | 86 | 87.65 |
| DONEAR IND. | 57.9 | 58.9 |
| DR. LAL PAT | 897.4 | 910.65 |
| DYNAMATIC T | 1826.85 | 1909.4 |

### E F G H

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| GTPL HATHWA | 158.65 | 165.45 |
| GUFIC BIOSC | 115.35 | 117.4 |
| GUJ IND POW | 107.7 | 110.25 |
| GUJ NAR VAL | 418.45 | 428.6 |
| GUJ STATE F | 124.05 | 126.95 |
| GUJ. APOLLO | 224.15 | 226.55 |
| GUJARAT ALK | 708.6 | 709.6 |
| GUJARAT AMB | 263.15 | 271.95 |
| GUJARAT FLU | 789.5 | 786.6 |
| GUJARAT GAS | 877.35 | 862.6 |
| GUJARAT MIN | 135.75 | 137.65 |
| GUJARAT PIP | 136.2 | 138.05 |
| GUJARAT STA | 200.1 | 204 |

### I J K L

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| JASH ENGINE | 151.25 | 153.75 |
| JAY BHARAT | 463.55 | 458.65 |
| JAYANT AGRO | 367.6 | 372.05 |
| JAYSHREE TE | 98.4 | 98.9 |
| JBF INDUSTR | 148.8 | 147.05 |
| JBM AUTO LI | 417.5 | 431.95 |
| JET AIRWAYS | 720.4 | 739.9 |
| JET KNITWEA | 100 | 108 |
| JHS SVEND. | 63.65 | 65.4 |
| JIND POL IN | 61.15 | 61.45 |
| JINDAL DRIL | 158.65 | 160.45 |
| JINDAL PHOT | 61.8 | 61.7 |
| JINDAL POLY | 344.1 | 341.05 |

### M N O P

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| MAHINDRA LO | 484.45 | 481.25 |
| MAITHAN ALL | 866.3 | 882.75 |
| MAJESCO LIM | 456.7 | 467.25 |
| MAN INDUSTR | 117.2 | 120.35 |
| MAN INFRA L | 52.4 | 53.25 |
| MANAKSIA LT | 54.5 | 55.65 |
| MANAPPURAM | 106 | 108.05 |
| MANG.CHEM.F | 63.15 | 65.25 |
| MANGALAM CE | 314.95 | 321.5 |
| MANGALAM DR | 156.85 | 160.35 |
| MANPASAND B | 384.15 | 399.05 |
| MARATHON NX | 477.15 | 484.6 |
| MAS FINANCI | 590.45 | 590.95 |
| PETRON ENGG | 106.15 | 109.5 |
| PFIZER LTD | 2182.3 | 2221.7 |
| PG ELECTROP | 289.9 | 299 |
| PHILIPS CAR | 1094.3 | 1118.2 |
| PI INDUSTRI | 877.5 | 876.35 |
| PIONEER DIS | 182.15 | 193.15 |
| PLASTIBLEND | 205.05 | 199.7 |
| PNB HOUSING | 1161.8 | 1201.65 |
| PNC INFRATE | 161.75 | 163 |
| PODDAR HOUS | 1176.2 | 1180 |
| PODDAR PIGM | 286 | 274.8 |
| POKARNA LIM | 202.85 | 206.2 |
| POLY MEDICU | 255.05 | 255.45 |

### R S T U

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| SHAKTI PUMP | 543.4 | 549.15 |
| SHALBY LIMI | 203.75 | 206.95 |
| SHALIM PAIN | 161.65 | 163.9 |
| SHANKARA BL | 1761.3 | 1780.3 |
| SHANTHI GEA | 138.15 | 139.9 |
| SHARDA CROP | 382.95 | 390.05 |
| SHARDA MOTO | 2047.05 | 2186 |
| SHEELA FOAM | 1576.15 | 1571.05 |
| SHEMAROO EN | 526.35 | 529.3 |
| SHILPA MEDI | 417.2 | 409.05 |
| SHIPPING CO | 67.85 | 69.2 |
| SHIRPUR GOL | 141.15 | 147.55 |
| SHIVA TEXYA | 513.35 | 534.4 |
| THE INDIA C | 148.95 | 153.35 |
| THE INDIAN | 133.9 | 134.45 |
| THE MANDHAN | 127.7 | 132.7 |
| THE NEW IND | 670.95 | 702.75 |
| THE PHOENIX | 652.35 | 651.1 |
| THE RAMCO C | 742.25 | 734.75 |
| THE RUBY MI | 320 | 322.8 |
| THE STATE T | 151.1 | 153.85 |
| THE TINPLAT | 220.1 | 223.75 |
| THEJO ENGIN | 520 | 535 |
| THEMIS MEDI | 585.7 | 603.05 |
| THERMAX LTD | 1179.05 | 1188.5 |
| THIRUMALAI | 1959.35 | 1978.65 |

### V W X Z

### నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

### బీఎస్‌ఈలో పీఎస్ షేర్లు

# మావోల ప్రతీకార దాడి

**కానిస్టేబుల్ హత్య • రెండు బస్సులు, రెండు లారీలు దహనం**

**చర్ల:** పూజారి కాంకేర్ ఎన్‌కౌంటర్‌కు మావోయిస్టులు కౌంటర్ ఎటాక్‌లు మొదలు పెట్టారు. ఎన్‌కౌంటర్‌లో 10 మంది సహచరులను కోల్పోయిన మావోయిస్టులు సోమవారం అర్ధరాత్రి ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో ఓ కానిస్టేబుల్‌ను హత మార్చారు. రెండు బస్సులు, రెండు లారీలను దహనం చేశారు. గతంలోనూ బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లో జరిగిన పలు ఎన్‌కౌంటర్ల తర్వాత ప్రతీకారం తీర్చుకున్నారు. 2008లో కంచాల్ ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు చనిపోగా, 2014లో పూవర్తిలో కేకేడబ్ల్యూకు చెందిన 11 మంది మృతి చెందారు. 2016లో ఇదే ప్రాంతంలోని బొట్టెంతోగు సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8 మంది మరణించారు. ఈ అన్ని సందర్భాల్లోనూ మావోయిస్టులు పలువురు ఇన్ ఫార్మర్లను హతమార్చారు. తాజా ఎన్‌కౌంటర్‌తో అధికార టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సరిహద్దు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## సైకో చేతిలో వృద్ధుడి హత్య


మృతుడు నర్సయ్య

**ములుగు రూరల్:** రోడ్డు వెంట నడుస్తూ వెళ్తున్న ఓ వృద్ధుడు సైకో చేతిలో హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం జాకారం–అబ్బాపురం రహదారిలో మంగళ వారం తెల్లవారుజామున జరిగింది. జాకారం గ్రామానికి చెందిన సామంతుల రాజు భార్య వారం రోజుల క్రితం భర్తతో గొడవ పడి రేగొండ మండలం కొప్పులలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో ఆమెను ఇంటికి తీసుకొద్దామనే ఉద్దేశంతో మంగళ వారం తెల్లవారుజామున ఉదయం కాలినడకన అత్తగారి ఊరికి బయల్దేరాడు. అదే సమయంలో ఇదే మండలం అబ్బాపురం గ్రామానికి చెందిన కొంగొండ నర్సయ్య (75) కాలినడకన స్వగ్రామం నుంచి జాకారం మీదుగా ములుగుకు వస్తున్నాడు. ఈ క్రమంలో జాకారం–అబ్బాపురం మార్గంలో అతడికి నర్సయ్య ఎదురుపడగానే మతిస్థిమితం కోల్పోయి దాడి చేయడంతో నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ తర్వాత అతడు డీఆర్‌డీఏ శిక్షణా శిబిరంపై దాడికి పాల్పడ్డాడు. శిబిరంలో ఉన్న యువతులపై రాళ్లు విసరడంతో వారు పోలీసులకు సమాచారమివ్వగా వారు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు.

## యాదాద్రిలో రైతు ఆత్మహత్య

**రాజాపేట (ఆలేరు):** పంట దిగుబడి సరిగా రాక, చేసిన అప్పులు తీర్చేమార్గం కానరాక బింగి అయిలయ్య అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బింగి అయిలయ్య (55)కు భార్య బాలమణి, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలు, కుమారుడి వివాహాలు చేశాడు. తనకున్న నాలుగెకరాల్లో పత్తి, వరి, మొక్క జొన్న సేద్యం చేశాడు. సాగు పెట్టుబడులు, కుటుంబ అవసరాల నిమిత్తం రూ. లక్షల్లో అప్పు చేశాడు. దిగుబడి ఆశాజనకంగా లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

• మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి సత్యమ్మ(62) మంగళవారం వడదెబ్బతో అస్వస్థతకు గురైంది. ఆస్పత్రికి తరలించాగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది.

# ‘ఫ్రంట్’కు మద్దతు పచ్చి అబద్ధం

**పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

- మమత.. కేసీఆర్‌కు ఫోన్ చేయలేదు.. కాంగ్రెస్‌తోనే శిబూసొరేన్
- కొడుకు కోసమే కేసీఆర్ కొత్త నాటకం
- ఎంపీలే గెలవనప్పుడు థర్డ్ ఫ్రంట్ ఎక్కడిది?
- ఇది బీజేపీ సెకండ్ ఫ్రంట్ : రేవంత్‌రెడ్డి
- నిర్మల్, మెట్‌పల్లిలో కాంగ్రెస్ ప్రజా చైతన్యయాత్ర


మంగళవారం రాత్రి జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఉత్తమ్. వేదికపై కాంగ్రెస్ నేతలు

సాక్షి, నిర్మల్/జగిత్యాల

‘థర్డ్ ఫ్రంట్.. ఓ పచ్చి అబద్ధం. కేసీఆర్ ఆడుతున్న కొత్త నాటకం. ఆయన వెంట ఎవరూ లేరు. తనకున్న పరిచయంతో కేశవ రావు మమతాబెనర్జీకి ఫోన్ చేసి... కేసీఆర్‌తో మాట్లాడించారు. అందరూ కలిసివస్తే చూద్దామని మాత్రమే మమత చెప్పారు. ఇటు జార్ఖండ్ మాజీ సీఎం శిబూసొరేన్ కూడా కేసీఆర్‌తో మాట్లాడలేదు. ఈరోజు ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తోనే ఉంటామని ప్రకటించారు’అని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజాచైతన్య బస్సుయాత్రలో భాగంగా మంగళవారం నిర్మల్‌లో, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో జరిగిన బహిరంగ సభలలో ఆయన మాట్లాడారు. కొడుకును ముఖ్యమంత్రిని చేసేందుకే కేసీఆర్ కొత్త ఫ్రంట్ నాటకం మొదలు పెట్టారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఎంపీలు గెలిచే పరిస్థితి లేదని, అలాంటప్పుడు ఇక థర్డ్ ఫ్రంట్ ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. తన ఫ్రంట్‌కు దేశవ్యాప్తంగా మద్దతు వస్తోందంటూ కేసీఆర్ పచ్చి అబద్ధాలను ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఇందుకు ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని చూపారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ.5 వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో రైతు పంటకు మద్దతు ధర కోసం రూపాయి కూడా టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. నాలుగేళ్లలో 4వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా.. ఒక్క కుటుంబాన్ని కూడా సీఎం పరామర్శించలేదని తెలిపారు. మేలో ఇస్తామంటున్న పెట్టుబడి రాయితీ ఎన్నికల స్టంటేనని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంత ఇచ్చావ్..? ఇంటికో ఉద్యోగం ఏమైంది..? దళితులకు మూడెకరాలు ఏమైనయ్..? డబుల్ బెడ్‌రూం ఎంత మందికి ఇచ్చినవ్? ’అని కేసీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. తాము అధికారంలోకి వస్తే రైతులు రూ.2 లక్షల రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తామని పునరుద్ఘాటించారు. అధికారంలోకి వచ్చి రాగానే బంగారు తెలంగాణ తెస్తా అన్న కేసీఆర్ ఇప్పుడు జై భారత్ అని నాటకం ఆడుతున్నాడని, సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. నీరవ్ మోదీ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావనకు రాకుండా పక్కదారి పట్టించేందుకే కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు.

**ఏ టెంటూ లేనోళ్లదే ‘ఫ్రంట్’: రేవంత్**

దేశంలో ఏ టెంటూ లేకుండా ఉన్నోళ్లదే థర్డ్ ఫ్రంట్ అంటూ కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఇది కేంద్రంలోని బీజేపీ సెకండ్ ఫ్రంటేనని అభివర్ణించారు. బీజేపీ చేతిలో కేసీఆర్ కీలుబొమ్మ అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో జెండాలు మోసి.. దండాలు పెట్టి.. ప్రాణాలు తీసుకున్నోళ్లు కనుమరుగయ్యారని,, అంతా కుటుంబ పాలనే సాగుతోందని విమర్శించారు. కొడుకును సీఎం చేయడానికే కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతున్నారని చెప్పారు. హీరోయిన్లతోని సెల్ఫీలు దిగుడు.. క్యాట్‌వాక్‌లు చేసుడు తప్ప కేటీఆర్‌కు ఏం తెలుసని ఆయన ప్రశ్నించారు. చప్రాసీకి అర్హత లేని కొడుకును సీఎం చేస్తామంటే ప్రజలు ఊరుకుంటారా?; తెలంగాణ కేసీఆర్ అబ్బ జాగిరా అన్ని ధ్వజమెత్తారు. బలిదానాలు చేసుకున్నోళ్లను, ఉద్యమంలో పోరాడినోళ్లను మరిచి.. సడ్డకుడి కొడుకు సంతోష్‌రావును రాజ్యసభ సభ్యున్ని చేస్తడట అని నిప్పులు చెరిగారు.


మంగళవారం నిర్మల్‌లో జరిగిన సభలో పాల్గొన్న ప్రజలు

**కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి: జానారెడ్డి**

దేశానికి స్వాతంత్య్రాన్ని సాధించి పెట్టడంతో పాటు అభివృద్ధి చేసింది కాంగ్రెస్ హయాంలోనేనని ఆ పార్టీ శాసనసభ పక్షనేత జానారెడ్డి అన్నారు. పేదోళ్లకు రూపాయికే కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ, రుణ మాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలను తీసుకొచ్చింది తమ పార్టీయేనని చెప్పారు. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ కాంగ్రెస్సే కట్టించిందన్న విషయాన్ని టీఆర్‌ఎస్ సర్కార్ విస్మరించవద్దన్నారు. రూ.500 కోట్ల రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామన్నారు.

**నక్సల్స్ నీ పనిచేస్తరు: వీహెచ్**

‘నక్సల్స్ ఎజెండా అంటూ కేసీఆర్ అధికారంలోకి వచ్చిండు. ఇప్పుడు వాళ్లనే పిట్టలెక్క కాల్చి పారేస్తుండు. ఇగ నక్సల్స్ నీ పనిచేస్తరు కేసీఆర్..’అని సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. 106 సీట్లొస్తాయని సర్వేలు చేసినోళ్లకు కాంగ్రెస్ బస్సు యాత్రను చూడగానే భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు.‘అబద్ధాలు చెప్పే కేసీఆర్.. నీతో మూడో ఫ్రంట్ అయితదా?’అని ప్రశ్నించారు. ఈ సభలో సీఎల్పీ నేత కె. జానారెడ్డి, శాసన మండలిలో కాంగ్రెస్ పక్ష నేత షబ్బీర్ అలీ, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# 3 కోట్లు ఉత్తమ్‌వి కావా?

- 2014లో కోదాడలో దొరికిన ఆ డబ్బు ఎవరిది?: కేటీఆర్
- ఉన్న మాట అంటే జానారెడ్డికి అంత ఉలుకు ఎందుకు?
- వచ్చే ఎన్నికల్లో కోదాడలో గులాబీ జెండా పాతాలి

**సాక్షి ప్రతినిధి, సూర్యాపేట:** ‘‘2014 ఎన్నికలప్పుడు కోదాడలో రూ.3 కోట్లు ఇన్నోవాలో దొరికింది వాస్తవం కాదా..? అవి ఉత్తమ్‌కుమార్‌రెడ్డివి కావా? ఉన్నమాట అంటే జానారెడ్డికి అంత ఉలుకు ఎందుకు?’’ అని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ నాయకులపై ధ్వజమెత్తారు. మంగళవారం సూర్యాపేటలో రూ.81 కోట్లతో నిర్మించనున్న మురుగునీటి శుద్ధి ప్లాంట్, నాలా, కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో 1,110 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కోదాడలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను శంకరగిరిమాన్యాలు పట్టించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**కోదాడ నుంచే విజయయాత్ర ..**

వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థ యాత్రలు చేసినట్లు 40 మంది కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్రల పేరుతో దొంగ యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చరమగీతం పాడి, తెలంగాణ ముఖ ద్వారం కోదాడ నుంచే విజయయాత్ర ప్రారంభం కావాలని, గులాబీ జెండా పాతాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.


కోదాడ సభలో మాట్లాడుతున్న కేటీఆర్

సీతారామ ప్రాజెక్టుతో గోదావరి నీళ్లు పాలేరుకు తెస్తామని, నాగార్జునసాగర్ నీళ్లతో కోదాడను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రైతు బిడ్డగా, రైతుగా.. రైతుల పక్ష పాతిగా ఉంటూ వారి కోసం ఎకరానికి రూ.4 వేల పెట్టుబడి పథకం ప్రవేశపెట్టారని దేశంలో ఏ సీఎం ఇలా రైతుల గురించి ఆలోచించలేదన్నారు. రైతులకు రూ. 5 లక్షల ప్రమాద బీమా ప్రకటించారని, రాష్ట్రంలోని 72 లక్షల రైతు కుటుంబాలు దీని పరిధిలోకి వస్తాయన్నారు. నల్లగొండలో ఫ్లోరిన్ భూతం జిల్లాలోని కాంగ్రెస్ నేతల పుణ్యమేనన్నారు.. జానారెడ్డి నియోజకవర్గం పక్కనే ఉన్న దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో ఏటా ఫ్లోరోసిస్ పెరిగిందని.. 7 సార్లు గెలిచిన ఆయన ఏం చేశారన్నారు.

**ఆడకూతుళ్లకు మేన మామ కేసీఆర్..**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో రాష్ట్రంలోని ఆడకూతుళ్లకు కేసీఆర్ మేన మామ లాగా మారాడని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో 40 లక్షల మందికి పింఛన్ల కోసం రూ.5,500 కోట్లు ఇస్తున్నట్లు చెప్పారు. సభలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ జలాల కోసం ఇదే కోదాడ నుంచి హాలియా వరకు నాడు కేసీఆర్ పాదయాత్ర చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో నల్లగొండకు ఈ ప్రాంతంలో సుద్ద బావులు ఇస్తే.. తెలంగాణ వచ్చిన తర్వాత ఊట బావులను ఇచ్చామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సభలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్సీలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి వెళ్లి ఏం చేస్తడు?

**కేసీఆర్ ఫ్రంట్ ఏర్పాటుపై జేఏసీ ఛైర్మన్ కోదండరాం విసుర్లు**



**మహబూబాబాద్:/ నర్సంపేట:** రాష్ట్రంలోనే ఏ మార్పు తీసుకురాని ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి ఏం చేస్తారని టీజేఏసీ చైర్మన్ ఎం.కోదండరాం అన్నారు. మంగళవారం మహబూబాబాద్‌లో జరిగిన రైతాంగ, నిరుద్యోగ సదస్సులో, వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ దేశరాజకీయాల్లో గుణాత్మక మార్పులు తీసుకొస్తానని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందన్నారు. ‘‘కేసీఆర్ నాలుగేళ్లు ఇక్కడే ఏం సాధించనప్పుడు.. ఢిల్లీకెళ్లి ఏం చేస్తడు’’ అని ప్రశ్నించారు. ఫ్రంట్ పుట్టకముందే పుట్టినట్లు సంబురాలు జరుపుకోవడం హాస్యాస్పదమన్నారు.

**ఏప్రిల్‌లో కొత్త పార్టీ ప్రకటన**

ఏప్రిల్‌లో కొత్త పార్టీ ఆవిర్భావ ప్రకటన చేస్తామని కోదండరాం తెలిపారు. రైతులు, నిరుద్యోగులు, ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 10న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద చేపట్టే ఆట పాటలు, ఊరేగింపునకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# రక్తపు చేతులతోనే మరొకరికి తాళి

**మోత్కూర్‌లో ప్రియుడి చేతిలో ప్రియురాలి హత్య**

- మరొకరిని పెళ్లి చేసుకుంటున్నాడని నిలదీసిన ప్రియురాలు
- ఆగ్రహంతో హత్యచేసి.. పూడ్చిపెట్టిన కిరాతకుడు
- మరుసటి రోజే ఇంకో అమ్మాయి మెడలో తాళి కట్టిన ఘనుడు


భార్గవి, నరేందర్ సెల్ఫీ

**మోత్కూరు (తుంగతుర్తి):** ప్రేమించిన అమ్మాయిని హత్య చేసి ఇంకో అమ్మాయి మెడలో తాళి కట్టాడు ఓ కిరాతకుడు. తనను ప్రేమించి ఇంకో అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటున్నావని నిలదీసినందుకు ప్రియురాలిని తన వ్యవసాయ బావివద్ద చంపేసి, మట్టిదిబ్బ గోతిలో పూడ్చాడు. హత్యచేసిన మరుసటి రోజే పెళ్లి కూడా చేసుకున్నాడు. ఈ దారుణం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో మంగళవారం వెలుగుచూసింది.

**మాట్లాడుదామని నమ్మించి..**

మోత్కూరు మండల బుజిలాపురం గ్రామానికి చెందిన కాసగాని సత్తయ్య–ఆండాలు దంపతుల కుమారుడు నరేందర్(25) అలియాజ్ నందు, మోత్కూరుకు చెందిన బొడ్డుపల్లి లక్ష్మయ్య–లక్ష్మీ దంపతుల రెండవ కుమార్తె భార్గవి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆత్మకూర్‌లోని వినాయక ఆస్పత్రిలో భార్గవి రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. అదే ఆస్పత్రి అంబులెన్స్ డ్రైవర్‌గా నరేందర్ పనిచేస్తున్న సమయంలో స్నేహం ఏర్పడి ప్రేమగా మారింది. ఇటీవల నరేందర్‌కు తన తల్లిదండ్రులు జనగాం జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం నిశ్చయించారు. 4వ తేదీన పెళ్లి పెట్టుకున్నారు. దీంతో భార్గవి తనను పెళ్లి చేసుకోవాలని నరేందర్‌ను నిలదీసింది. నరేందర్ 3వ తేదీన మాయమాటలు చెప్పి భార్గవిని తన వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడే బండరాయికి మోది హత్య చేశాడు. మృతదేహాన్ని వ్యవసాయ బావి వద్ద పూడ్చిపెట్టి ఇంటికి వెళ్లాడు. 4వ తేదీన సుద్దాల గ్రామంలో నరేందర్ వివాహం చేసుకున్నాడు. తన కుమార్తె భార్గవి కనిపించకపోవడంతో ఆమె తండ్రి, బంధువులు అక్కడికి వెళ్లి గొడవ చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా 5వ తేదీన భార్గవి అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నరేందర్‌పై అనుమానం వ్యక్తం చేసి విచారణ జరిపారు. దీంతో భార్గవిని హత్యచేసి పూడ్చిపెట్టినట్లు అంగీకరించాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం కోసం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. భార్గవిని ఏవిధంగా హత్య చేశాడు, ఒక్కడే చేశాడా, అతడికి ఎవరైనా సహకరించారా అనే కోణాల్లో విచారిస్తున్నట్లు ఎస్‌ఐలు తెలిపారు.

**నరేందర్‌కు ఇది రెండో పెళ్లి**

నరేందర్ నాలుగు సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లోని కీసర ప్రాంతానికి చెందిన మేనమామ కూతురిని వివాహం చేసుకున్నాడు. పెళ్లి అయిన నాలుగు సంవత్సరాలకే అమ్మాయికి విడాకులు ఇచ్చాడు. ఇప్పుడు రెండో వివాహం చేసుకున్నాడు.

# కేసీఆర్ కొత్త నాటకం

**బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్**



**బీబీనగర్ (భువనగిరి):** ఉట్టికి ఎగరనోడు స్వర్గానికి ఎగిరినట్లు రాష్ట్రంలోని సమస్యలపై ప్రజల దృష్టి మళ్లించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ రాజకీయాలంటూ కొత్త డ్రామాకు తెర లేపారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని వెంకిర్యాల గ్రామంలో మంగళవారం నిర్వహించిన మూసీ ప్రక్షాళన పాదయాత్ర సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి 50 శాతానికిపైగా లబ్ధి జరిగేలా ప్రధాని నరేంద్రమోదీ ప్రణాళికలు రూపొందించారని, కానీ.. కేసీఆర్ మాత్రం వాటిని అమలు చేయకుండా ఏదో మార్పు తెస్తామని దేశ రాజకీయాలంటూ డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ విజయాలను చూసి తట్టుకోలేక కేసీఆర్ ప్రత్యామ్నాయ కూటమి అంటున్నారని, ప్రజా సమస్యలను పక్కనబెట్టి స్వార్థ రాజకీయాలు చేస్తూ కుటుంబ పాలనను కొనసాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి 2019లో ప్రజలు చరమగీతం పాడుతారని హెచ్చరించారు. రైతులపై చిత్తశుద్ధి లేని కేసీఆర్.. వారిపట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణను తాగుబోతు రాష్ట్రంగా మార్చి రూ.30వేల కోట్లకు పైగా ఆదాయం సమకూర్చుకుంటున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో లేపుతామన్నారు. సచివాలయానికి రాని కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి రాజకీయాలు చేస్తారా.. అని ఎద్దేవా చేశారు. టీఆర్‌ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2019లో అధికారంలోకి రాదని పేర్కొన్నారు.

# ‘ఫ్రంట్’కు మద్దతు వెల్లువ

**ఉపముఖ్యమంత్రి కడియం**



**భూపాలపల్లి:** ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటు కాబోయే ఫెడరల్ ఫ్రంట్‌కు అన్ని రాష్ట్రాల నుంచి మద్దతు లభిస్తోందని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాలలో నిర్మించిన 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని శాసన సభాపతి మధుసూదనాచారి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డితో కలసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పాలన దేశాన్ని భ్రష్టు పట్టించాయని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి సంబంధించి తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయడం ఎందుకు సాధ్యం కాదని ఆయన ప్రశ్నించారు. 70 ఏళ్లపాటు బీజేపీ, కాంగ్రెస్ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఇరుపార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడి దేశ ప్రజలను పట్టించుకోలేదన్నారు. తెలంగాణ జెండా కింద దేశ నాయకత్వం పని చేయబోతుందన్నారు. మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. త్వరలో పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆస్పత్రుల వరకు, ఏరియా ఆస్పత్రి నుంచి బోధనాస్పత్రుల వరకు తెలంగాణ డయాగ్నోసిస్ పేరుతో మెరుగైన రక్త పరీక్షల సేవలు అందిస్తామని వెల్లడించారు. వైద్యఆరోగ్య శాఖలో 10 వేల కొత్త పోస్టులు మంజూరు చేశామని, 2, 3 నెలల్లో వాటిని భర్తీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.



## రూ. 16 కోట్ల 21 లక్షలు...

‘మ్యాచ్ ఫర్ ఆఫ్రికా’ పేరిట ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ రోజర్ ఫెడరర్ నిర్వహించిన చారిటీ మ్యాచ్‌కు భారీ స్పందన లభించింది. ఆఫ్రికాలోని పేద విద్యార్థుల చదువుకు చేయూతనిచ్చేందుకు ఫెడరర్ ఫౌండేషన్ సాన్‌జోస్‌లో ఈ చారిటీ మ్యాచ్‌ను ఏర్పాటు చేసింది. ఈ మ్యాచ్‌ను 15,000 మంది అభిమానులు ప్రత్యక్షంగా తిలకించడంతో రూ. 16 కోట్ల 21 లక్షలు సమకూరాయి. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, అమెరికా ప్లేయర్ జాక్ సాక్, ఎన్‌బీసీ టీవీ ప్రముఖ యాంకర్ సావన్నా గుత్రి ఈ మ్యాచ్‌లో పాల్గొన్నారు. డబుల్స్‌లో బిల్‌గేట్స్‌తో జతకట్టిన ఫెడరర్ 2–0తో సోక్–గుత్రి జంటను ఓడించాడు.

# భారత్‌కు తొలి దెబ్బ

**మూడు ఓవర్లకు భారత్ స్కోరు 10/2. అదే లంక 3.4 ఓవర్లలోనే 50/1. ఈ ఆరంభమే శ్రీలంకను నిల బెట్టింది. మధ్యలో తడబడినా... విజయం చేజారకుండా చేసింది. మొత్తానికి భారత్‌కు పొట్టి ఫార్మాట్‌లో గట్టిదెబ్బే వేసింది శ్రీలంక. దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపై మట్టికరిపించిన టీమిండియాకు షాకిచ్చింది. గతంలో లంక గడ్డపై ఆడిన మూడు టి20ల్లోనూ గెలిచిన భారత్ ఈసారి భంగపడింది. ఆతిథ్య జట్టు జోరు ముందు ధావన్ మెరుపు ఇన్నింగ్స్ వృథా అయ్యింది. కుశాల్ పెరీరా ధాటికి భారత బౌలింగ్ తేలిపోయింది.**

- చెలరేగిన కుశాల్ పెరీరా
- తొలిపోరులో భారత్ ఓటమి
- ధావన్ మెరుపులు వృథా
- ముక్కోణపు టి20 టోర్నీ

**కొలంబో:** భారత్ జోరుకు శ్రీలంక కళ్లెం వేసింది. ‘నిదాహస్ ట్రోఫీ’ ముక్కోణపు టి20 టోర్నమెంట్‌లో ఆతిథ్య జట్టు శుభారంభం చేసింది. లంక టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ కుశాల్ పెరీరా (37 బంతుల్లో 66; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపులు శ్రీలంక విజయానికి గట్టి పునాది వేయగా... ధావన్ (49 బంతుల్లో 90; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) ‘హీరో’చిత ఇన్నింగ్స్ వృథాగా మారిపోయింది. తొలి మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. మనీశ్ పాండే (35 బంతుల్లో 37; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. చమీరకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 18.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసి గెలిచింది. తిసారా పెరీరా (22 నాటౌట్) మెరుగ్గా ఆడాడు. వాషింగ్టన్ సుందర్, చహల్ చెరో 2 వికెట్లు తీశారు. విజయ్ శంకర్ ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఈ టోర్నీలో గురువారం జరిగే రెండో మ్యాచ్‌లో భారత్... బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.

### రోహిత్ విఫలం... రైనా నిర్లక్ష్యం

ఆట మొదలైందో లేదో... భారత్ 2 వికెట్లను కోల్పోయింది. తొలి ఓవర్లో కెప్టెన్ రోహిత్ (0), రెండో ఓవర్లో రైనా (1) ఔట్. చమీర బౌలింగ్‌లో రోహిత్ కొట్టిన భారీ షాట్‌ను జీవన్ మెండిస్ అద్భుతంగా ఆదుకున్నాడు. రైనా నిర్లక్ష్యంగా వికెట్లను విడిచి ఆడగా... సూటిగా సంధించిన ఫెర్నాండో బంతి వికెట్లను కూల్చింది. దీంతో రైనా క్లీన్‌బౌల్డయ్యాడు. 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన భారత్‌ను ఓపెనర్ శిఖర్ ధావన్, మనీశ్ పాండే ఆదుకున్నారు.

### శివమెత్తిన ధావన్...

ఇద్దరు ముందుగా నిలదొక్కుకొని తర్వాత మెరుపుల ధాటిని కొనసాగించారు. జీవన్ మెండిస్ వేసిన ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్లో ధావన్ ఎల్బీని ఫీల్డ్ అంపైర్ తిరస్కరించాడు. దీంతో లంక రివ్యూకు వెళ్లింది. అక్కడా నిరాశే ఎదురైంది. అదే ఓవర్లో జట్టు స్కోరు 50 పరుగులు దాటింది. పాండే భారీ సిక్స్ బాదాడు. నువాన్ ప్రదీప్ వేసిన మరుసటి ఓవర్లో ధావన్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. 11వ ఓవర్లో బౌండరీతో శిఖర్ ఫిఫ్టీ (30 బంతుల్లో; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) పూర్తి చేసుకున్నాడు. అనంతరం ధావన్ వేగం పెంచాడు. భారీ సిక్సర్లతో లంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. దీంతో 12వ ఓవర్లో జట్టు స్కోరు వంద పరుగులకు చేరుకుంది. అయితే కాసేపటికే జీవన్ మెండిస్ బౌలింగ్‌లో గుణతిలకకు క్యాచ్ ఇచ్చి మనీశ్ పాండే వెనుదిరిగాడు. దీంతో మూడో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత ధావన్‌కు రిషభ్ పంత్ (23 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్) జతయ్యాడు. ఇద్దరు మరో వికెట్ పడకుండా వేగంగా పరుగులు జతచేశారు. ఈ క్రమంలో సెంచరీకి చేరువైన ధావన్... గుణతిలక బౌలింగ్‌లో పెరీరాకు క్యాచ్ ఇచ్చి ‘నెర్వస్ నైన్టీస్’లోనే వెనుదిరిగాడు. కార్తీక్ (13 నాటౌట్), రిషభ్ పంత్‌లు చివర్లో ఆశించినంత వేగంగా పరుగులు చేయలేకపోయారు. దీంతో భారత్ 180 పరుగులైనా చేయలేకపోయింది.



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ కుశాల్ పెరీరా

### చితక్కొట్టిన పెరీరా

లంక లక్ష్యం 175 పరుగులు. టి20ల్లో ఇదేమంత సులభం కాదు. కానీ ఒకే ఒక్కడి వేగం జట్టు గమనాన్ని శాసించింది. ఆ ఒక్కడు కుశాల్ పెరీరా. కుశాల్ మెండిస్ (11)తో శుభారంభం దక్కకపోయినా... గుణతిలక (19)తో కలిసి వాయువేగంతో విజయబాట పరిచాడు. ముఖ్యంగా శార్దుల్ ఠాకూర్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో పెరీరా చెలరేగాడు. 4, 4, 4, 6, 4+నోబ్, 4, 0తో మొత్తం 27 పరుగులు బాదేశాడు. రెండో ఓవర్ ముగిసేసరికి 19/1 స్కోరుగా ఉన్న లంక... అతని ధాటికి ఓవర్ వ్యవధిలో 46/1చేరుకుంది. దీంతో 3.4 ఓవర్లలోనే జట్టు స్కోరు ఫిఫ్టీ దాటింది. పవర్ ప్లే (6 ఓవర్లు) ముగిసేసరికి 75/2. పది ఓవర్లు పూర్తయ్యేసరికి 101/3. ఇవన్నీ పెరీరా ధాటికి నిదర్శనం. సుందర్ (2/28), చహల్ (2/37) కాస్త ఇబ్బంది పెట్టినా... శ్రీలంక విజయతీరాన్ని మాత్రం ఆపలేకపోయారు. గుణతిలక, మెండిస్, చండిమాల్ (14), షనక (15 నాటౌట్) చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయినా... కుశాల్ పెరీరా వేగానికి తోడుగా నిలిచారు.



ధావన్



### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ (సి) జీవన్ మెండిస్ (బి) చమీర 0; ధావన్ (సి) పెరీరా (బి) గుణతిలక 90; రైనా (బి) ఫెర్నాండో 1; మనీశ్ పాండే (సి) గుణతిలక (బి) జీవన్ మెండిస్ 37; రిషభ్ పంత్ (సి) ఫెర్నాండో (బి) చమీర 23; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 174.**
**వికెట్ల పతనం:** 1–1, 2–9, 3–104, 4–153, 5–174.
**బౌలింగ్:** చమీర 4–0–33–2, ఫెర్నాండో 3–0–38–1, ధనంజయ 4–0–37–0, తిసారా పెరీరా 3–0–25–0, జీవన్ మెండిస్ 3–0–21–1, గుణతిలక 3–0–16–1.

**శ్రీలంక ఇన్నింగ్స్:** గుణతిలక (సి) పంత్ (బి) ఉనాద్కట్ 19; కుశాల్ (సి) ధావన్ (బి) సుందర్ 11; కుశాల్ పెరీరా (స్టంప్డ్) కార్తీక్ (బి) సుందర్ 66; చండిమాల్ (బి) చహల్ 14; తరంగ (బి) చహల్ 17; షనక (నాటౌట్) 15; తిసార పెరీరా (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (18.3 ఓవర్లలో 5 వికెట్లకు) 175.**
**వికెట్ల పతనం:** 1–12, 2–70, 3–98, 4–127, 5–136. **బౌలింగ్:** ఉనాద్కట్ 3–0–35–1, వాషింగ్టన్ సుందర్ 4–0–28–2, శార్దుల్ ఠాకూర్ 3.3–0–42–0, చహల్ 4–0–37–2, విజయ్ శంకర్ 2–0–15–0, రైనా 2–0–14–0.



స్వర్ణాలతో ఓంప్రకాశ్, మను

## మను మళ్లీ మెరిసె...

**10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో స్వర్ణం**

**గ్వాడలహారా (మెక్సికో):** సీనియర్‌స్థాయిలో తాను పాల్గొంటున్న తొలి ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో టీనేజ్ సంచలనం మనూ భాకర్ మళ్లీ అదుర్స్ అనిపించింది. 16 ఏళ్ల ఈ హరియాణా అమ్మాయి వరుసగా రెండో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో పసిడి పతకం నెగ్గిన మనూ... 24 గంటల్లోపే మరో స్వర్ణం సాధించింది. ఈసారి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత్‌కే చెందిన ఓంప్రకాశ్‌తో కలిసి మనూ విజేతగా నిలిచింది. ఐదు జోడీలు పాల్గొన్న ఫైనల్లో మనూ–ఓంప్రకాశ్ ద్వయం 476.1 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. సాండ్రా రీట్జ్–క్రిస్టియన్ రీట్జ్ (జర్మనీ–475.2 పాయింట్లు) జంట రజతం... సెలైన్ గొబెర్‌విలె–ఫ్లోరియన్ ఫౌక్వెట్ (ఫ్రాన్స్–415.1 పాయింట్లు) జోడీకి కాంస్యం లభించాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత్‌కే చెందిన మెహులీ ఘోష్–దీపక్ కుమార్ ద్వయం కాంస్యం సాధించింది. ఫైనల్లో మెహులీ–దీపక్ జంట 435.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు ఈ టోర్నీలో భారత్ మూడు స్వర్ణాలు, నాలుగు కాంస్యాలతో కలిపి ఏడు పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## భారత మహిళలకు రెండో గెలుపు



రాణి రాంపాల్

**సియోల్:** దక్షిణ కొరియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ కొరియాతో మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో రాణి రాంపాల్ నేతృత్వంలోని భారత్ 3–2తో గెలిచింది. భారత్ తరఫున పూనమ్ రాణి (6వ నిమిషంలో), రాణి రాంపాల్ (27వ ని.లో), గుర్జీత్ కౌర్ (32వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. కొరియా జట్టుకు యురిమ్ లీ (10వ ని.లో), జంగ్‌జియున్ సియో (31వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ 2–0తో ఆధిక్యంలో ఉంది. మూడో మ్యాచ్ గురువారం జరుగుతుంది.

## టీమిండియా ఫైనల్ ఆశలు ఆవిరి

**ఇఫో (మలేసియా):** అజ్లాన్‌షా కప్ హాకీ టోర్నీలో భారత్ ఫైనల్ చేరే అవకాశాలకు తెరపడింది. మంగళవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2–4తో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మూడు లీగ్ మ్యాచ్‌లలో భారత్‌కు ఇది రెండో పరాజయం కాగా, మరో మ్యాచ్ ‘డ్రా’గా ముగిసింది. ఆస్ట్రేలియా తరఫున నోల్స్ (28వ ని.లో), జలెస్కీ (35వ ని.లో), బీల్ (38వ ని.లో), గోవర్స్ (40వ ని.లో) గోల్స్ సాధించారు. చివరి క్వార్టర్‌కు వచ్చే సరికి 0–4తో దాదాపు మ్యాచ్ కోల్పోయిన స్థితిలో భారత్ రెండు గోల్స్ సాధించింది. 52వ, 53వ నిమిషాల్లో వరుసగా రమణ్‌దీప్ సింగ్ గోల్స్ చేసినా అప్పటికే ఆలస్యమైపోయింది. నేడు జరిగే తమ తదుపరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య మలేసియాతో భారత్ ఆడుతుంది.

**సాయంత్రం 6 గంటల నుంచి ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.**

## వెస్టిండీస్ శుభారంభం

**60 పరుగులతో యూఏఈ ఓటమి • ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ**

**హరారే:** ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో వెస్టిండీస్ శుభారంభం చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో విండీస్ 60 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై విజయం సాధించింది. ముందుగా వెస్టిండీస్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. షిమ్రాన్ హెట్‌మర్ (93 బంతుల్లో 127; 14 ఫోర్లు, 4 సిక్సర్లు), క్రిస్ గేల్ (91 బంతుల్లో 123; 7 ఫోర్లు, 11 సిక్సర్లు) సెంచరీలతో చెలరేగారు. అనంతరం యూఏఈ 50 ఓవర్లలో 6 వికెట్లకు 297 పరుగులు చేసింది. రమీజ్ షహజాద్ (107 బంతుల్లో 112 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) శతకంతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. షైమాన్ అన్వర్ 64 పరుగులు సాధించగా...జేసన్ హోల్డర్ (5/53) ప్రత్యర్థిని దెబ్బతీశాడు. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్‌లో జింబాబ్వే 2 పరుగులతో అఫ్గానిస్తాన్‌ను ఓడించింది. ముందుగా జింబాబ్వే 43 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌట్ కాగా... అఫ్గానిస్తాన్ 49.3 ఓవర్లలో 194 పరుగులే చేయగలిగింది.



**3**

విండీస్ క్రికెటర్ గేల్ 11 వేర్వేరు దేశాలపై సెంచరీలు చేసిన మూడో క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. గతంలో సచిన్, ఆమ్లా మాత్రమే ఈ ఘనత సాధించారు.

## ద్యుతీ చంద్‌కు స్వర్ణం



**పాటియాలా:** ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఒడిశా అథ్లెట్ ద్యుతీ చంద్ మహిళల 100 మీటర్ల పరుగులో స్వర్ణం గెలిచింది. ఆమె 11.60 సెకన్లలో గమ్యానికి చేరింది. ద్యుతీకి తెలంగాణకు చెందిన నాగపురి రమేశ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ అథ్లెట్ నిత్య (12.10 సెకన్లు) నాలుగో స్థానంలో నిలిచింది. పురుషుల 100 మీటర్లలో శివ కుమార్ (తమిళనాడు–10.43 సెకన్లు) పసిడి పతకం నెగ్గాడు. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ వంశీ ప్రవీణ్ (10.71 సెకన్లు) ఏడో స్థానంతో సంతృప్తి పడ్డాడు.

## దేవధర్ ట్రోఫీ ఫైనల్లో కర్ణాటక

**ధర్మశాల:** ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కర్ణాటక జట్టు దేవధర్ ట్రోఫీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్ ‘ఎ’ జట్టుతో మ్యాచ్‌లో కర్ణాటక 65 పరుగులతో నెగ్గింది. తొలుత కర్ణాటక 50 ఓవర్లలో 4 వికెట్లకు 339 పరుగులు చేసింది. సమర్థ్ (85; 8 ఫోర్లు), పవన్ (95; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం భారత్ ‘ఎ’ 39.5 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది. రోనిత్ (3/64), గౌతమ్ (4/52) ఆకట్టుకున్నారు. గురువారం జరిగే ఫైనల్లో భారత్ ‘బి’తో కర్ణాటక ఆడుతుంది.

# ఆల్ ఇంగ్లండ్ వేటలో...

**భారత షట్లర్లు సన్నద్ధం ◆ విజయావకాశాలపై కోచ్ ఆత్మవిశ్వాసం ◆ మార్చి 14 నుంచి టోర్నీ**

**సాక్షి, హైదరాబాద్:** ఎప్పుడో 1980లో ప్రకాశ్ పడుకొనే చాంపియన్... ఆ తర్వాత 21 ఏళ్ల విరామం తర్వాత విజేతగా పుల్లెల గోపీచంద్... ఆ అరుదైన విజయం దక్కి కూడా 17 సంవత్సరాలు అవుతోంది. ఈ మధ్యలో సైనా నెహ్వాల్ రెండో స్థానంలో నిలవడమే ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అత్యుత్తమ ప్రదర్శన. బ్యాడ్మింటన్ చరిత్రలో అతి పురాతన టోర్నీగా గుర్తింపు ఉన్న ఈ మెగా ఈవెంట్‌కు ప్రత్యేక ఆకర్షణ ఉంది. గత కొన్నేళ్లలో మన షట్లర్లు ప్రపంచ వ్యాప్తంగా అన్ని పెద్ద స్థాయి టోర్నీలలో సత్తా చాటినా... ఆల్ ఇంగ్లండ్ మాత్రం వారికి కొరుకుడు పడలేదు. ఈ నెల 14 నుంచి బర్మింగ్‌హామ్‌లో జరగబోయే ఈ టోర్నీ కోసం భారత ఆటగాళ్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, సాయిప్రణీత్... మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, సైనా నెహ్వాల్ టోర్నీ బరిలో నిలిచారు. పురుషుల డబుల్స్‌లో భారత్ తరఫున మను అత్రి–సుమీత్ రెడ్డి, సాత్విక్ సాయిరాజ్ –చిరాగ్ శెట్టి... మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప–సిక్కిరెడ్డి, మేఘన–పూర్వీ షా జోడీలు బరిలో నిలిచాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి–ప్రణవ్ జంట తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

### ఒత్తిడి పెంచట్లేదు...

ఆల్ ఇంగ్లండ్ టోర్నీ కోసం గత రెండు వారాలుగా పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యాం. ఇతర సూపర్ సిరీస్ టోర్నీలతో పోలిస్తే ఆల్ ఇంగ్లండ్‌కు అందరి దృష్టిలో క్రేజ్ ఉన్నా... ఆ పేరుతో ఆటగాళ్లపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేయడం లేదు. ఈ ఏడాది పూర్తి స్థాయిలో సన్నాహాలు జరిపి ఆడుతున్న తొలి టోర్నీ ఇదే. మంచి ఫలితాలు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాం. ముఖ్యంగా సింధు, శ్రీకాంత్‌లకు మంచి అవకాశం ఉందని చెప్పగలను. సానుకూల ఫలితాలు ఆశిస్తున్నాం. అయితే డు ఆర్ డై లాంటి మాటలు చెప్పి ఆటగాళ్ళలో అనవసరంగా ఆందోళన పెంచాలని అనుకోవడం లేదు. ఆల్ ఇంగ్లండ్ తర్వాత వెంటనే కామన్వెల్త్ క్రీడలు ఉన్నాయి కాబట్టి ఆ దిశగా కూడా దృష్టి పెట్టి ప్రాక్టీస్ చేశాం. బీడబ్ల్యూఎఫ్ కొత్త షెడ్యూల్ కారణంగా మన ఆటగాళ్లకే ఎక్కువగా నష్టం జరగనుంది. 2018కి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఆటగాళ్లకు ఇప్పటికే అందించాను. కొత్త షెడ్యూల్ పరీక్ష ఇప్పుడు మొదలైంది. ఏడాదికి 12 టోర్నీల్లో కచ్చితంగా ఆడాల్సిన స్థితిలో టోర్నీ, ప్రిపరేషన్ కలిపి కామన్వెల్త్, ఆసియా క్రీడలకు రెండు నెలల టైమ్ పోతుంది. బ్యాడ్మింటన్ ప్రపంచంలో భారత్‌కు, మలేసియాకు మాత్రమే ఇప్పుడు సమస్య ఉంది. దేశం తరఫున పతకం కోసం కాబట్టి మా ఆటగాళ్లెవరూ పెద్ద ఈవెంట్లకు దూరం కావడం లేదు. అందుకే ప్రతీ షట్లర్ గురించి నాకున్న అవగాహన ప్రకారం వారు ఏయే టోర్నీల్లో ఆడాలో, ఆడకూడదో స్పష్టంగా వారికి షెడ్యూల్ ఇచ్చేశాను.

–పుల్లెల గోపీచంద్, చీఫ్ కోచ్

### 1.15 మీటర్ల నిబంధనతో..

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య కొత్తగా రూపొందించిన ‘1.15 మీటర్ల సర్వీస్ నిబంధన’ను తొలిసారి ఆల్ ఇంగ్లండ్ టోర్నీ లో ప్రవేశపెడుతున్నారు. దీని ప్రకారం సర్వీస్ చేసే సమయంలో కోర్టు నుంచి 1.15 మీటర్ల ఎత్తు వరకు మాత్రమే షటిల్‌ను ఉంచాలి. అది దాటితే ఫౌల్‌గా పరిగణిస్తారు. ఇప్పటి వరకు షట్లర్లు దాదాపు తమ నడుము భాగం వద్ద షటిల్ ఉంచి నేరుగా ప్రత్యర్థిపైకి దూసుకుపోయేలా వేగంగా సర్వీస్ చేస్తూ అదనపు ప్రయోజనం పొందుతున్నారు. నిబంధనల్లో సమానత్వం కోసం 1.15 మీటర్ల పరిమితిని విధించారు. పొడువైన ఆటగాళ్లకు ఇది సమస్యే. వారు బాగా కిందికి వంగాల్సి ఉంటుంది. భారత ఆటగాళ్లు ఫౌల్ కాకుండా ప్రత్యేక పరి కరంతో రోజూ దీనిపై ప్రాక్టీస్ చేస్తున్నారు.





### స్మాష్‌కు అవకాశం ఇవ్వడం లేదు...

ఇటీవల నా ఆటలో కొన్ని మార్పులు చేయడం తప్పనిసరిగా మారిపోయింది. తై జు లాంటివాళ్లు తెలివిగా తప్పు దోవ పట్టించే షాట్‌లను ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా జపాన్ క్రీడాకారిణులు కూడా సుదీర్ఘ ర్యాలీలపైనే దృష్టి పెట్టారు. గతంలో నా బలం స్మాష్‌ను సమర్థంగా ఉపయోగించుకునేదాన్ని. అయితే నా ప్రత్యర్థులు షటిల్‌ను ఏమాత్రం పైకి లేపకుండా ఆడుతూ స్మాష్‌కు అవకాశం ఇవ్వడం లేదు. దాంతో నేను కూడా కొత్తగా ఆలోచించాల్సి వచ్చింది. ఆల్ ఇంగ్లండ్‌లో గెలవాలనే నా కోరిక ఈ సారి తీరుతుందని ఆశిస్తున్నా. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టేందుకు ఇటీవలే కొత్తగా సొంత ఫిజియోను కూడా ఏర్పాటు చేసుకున్నాను. ముంబైకి చెందిన గాయత్రి నాతో కలిసి పని చేస్తోంది. గాయత్రి వచ్చిన తర్వాత నాలో చాలా మార్పు కూడా వచ్చింది. శరీరంపై అధిక భారం పడకుండా, అదే విధంగా ఎలాంటి లోపాలు లేకుండా ప్లానింగ్‌తో ఫిట్‌నెస్ ట్రైనింగ్ చేయడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మానసికంగా కూడా మరింత దృఢంగా మారాను.

–పీవీ సింధు

### పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నా...

గత ఏడాది నాకు అద్భుతంగా గడిచింది. ఈ సంవత్సరం ఇండియా ఓపెన్‌లో సానుకూల ఫలితం రాలేదు కానీ ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో విజయం సాధించాలని పట్టుదలగా ఉన్నా. ఫిట్‌నెస్ పరంగా ప్రస్తుతం 100 శాతం బాగున్నాను. ప్రత్యేకంగా సన్నాహాలు లేకపోయినా గత రెండు వారాలుగా బాగా శ్రమించాను. ఈ కష్టం ఫలితాల రూపంలోకి మారాలని కోరుకుంటున్నా. సింగిల్స్ కోచ్‌గా మంచి ఫలితాలు అందించిన ముల్యో జట్టుకు దూరం కావడంతో మరీ పెద్ద ప్రభావం ఉండకపోవచ్చు కానీ ఆయన శిక్షణ సమయంలో కొన్ని రకాల ఆలోచనలు, ప్రత్యర్థిని ఎదుర్కొనే విషయంలో కొన్ని వ్యూహాలకు అలవాటు పడ్డాం. ఇప్పుడు మళ్లీ మార్చుకోవాల్సి ఉంటుంది. అయితే గోపీ సర్ ఉన్నారు కాబట్టి సమస్య లేదు.

–కిడాంబి శ్రీకాంత్

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

> శక్తిమంతమైన మహిళ అంటే స్వరం ఉన్న మహిళే. తన కోసం, తన చుట్టూ ఉన్నవాళ్ల కోసం గళమెత్తే మహిళ.. ప్రపంచ గమనాన్నే మలుపు తిప్పగలుగుతుంది.
>
> - మిలిందా గేట్స్





రోజా, నగరి ఎమ్మెల్యే

పురుషుడిలో దమ్ము, ధైర్యం
లేనప్పుడల్లా చేసేదొక్కటే.
స్త్రీని కించపరచడం.
స్త్రీ సామర్థ్యాన్ని శంకించడం.
స్త్రీని అణచివేయడం.
ప్రతిభ, ఆత్మవిశ్వాసం ఉన్న మగాడు
ఇలాంటివేమీ చెయ్యడు.
అవి లేనివాళ్లకు ఉండేది ఒక్కటే..
రాజకీయ ఆరాటం!
అవన్నీ ఉన్న మహిళది
ప్రజలకోసం పోరాటం.

# వాళ్లది ఆరాటం.. నాది పోరాటం

● **మహిళలకు పవర్ ఇవ్వాలి అంటారంతా! మగవాళ్లు ఇస్తే స్త్రీలు పుచ్చుకోవడం ఏంటి? అలా అయితే మహిళలు సెకండ్ సిటిజన్స్ అన్నట్టే కదా!**

జనాభాలో మహిళలు 50 శాతం ఉన్నారు. అంటే సగ భాగం. కానీ, అన్నిచోట్లా దాదాపు నిర్ణయాధికారాలు మగవాళ్ల చేతుల్లోనే ఉన్నాయి. అవి మన చేతుల్లోకి ఎలా రావాలి?! మనం అవకాశాల కోసం పోరాడుతూనే ఉన్నాం. పోరాడాలి. అయితే, ఒకరిస్తే మనం తీసుకోవడం ఏంటి అనో, సెకండ్ సిటిజన్స్ అనో భీష్మించుకుని ఉంటే ఆ నిర్ణయాధికారం మన చేతుల్లోకి ఎప్పటికీ రాదు. అధికారం తీసుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి. అది ఎప్పటి వరకు అంటే.. మనకు నిర్ణయాధికారం వచ్చేవరకు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అనేది అమలయితే సెకండ్ సిటిజన్ అనే సమస్యే ఉండదు.

● **రాజకీయాలు ఎంతో తలనొప్పి వ్యవహారం అంటారు. 'అబ్బ.. ఈ రాజకీయాలు వద్దు' అని ఇన్నేళ్లలోనూ మీరు అనుకున్న సందర్భాలు ఉన్నాయా?**

రాజకీయాలు నిజంగానే చాలా తలనొప్పి వ్యవహారం. కానీ, అందరూ తలనొప్పి తలనొప్పి అనుకుంటూ ఉంటే ఈ రాజకీయాలు ఎప్పటికీ ప్రక్షాళన కావు. ఆడవాళ్లు రాజకీయాల్లో ఎదుగుతున్నారు, చురుగ్గా ఉన్నారు అంటే మగవాళ్లు తట్టుకోలేరు. నేరుగా ఎదుర్కోలేక ఆమె క్యారెక్టర్‌ని చెడుగా చిత్రించడం, నిందలు వేయడం, ఎలా కిందకు లాగేయాలా అని మిగతా అందరూ గ్రూప్‌గా చేరి తొక్కేయడానికి ప్రయత్నించడం చేస్తుంటారు. ఇందుకు చాలా ఉదాహరణలు ఉన్నాయి. నా విషయమే చూడండి.. తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు నన్ను గొప్ప లీడర్‌గా చూశారు. కానీ, వైసీపీలోకి వచ్చాక అప్పుడు గొప్పగా పొగిడిన వాళ్లే ఇప్పుడు ఎన్ని నిందలు వేస్తున్నారో, అణచివేయాలను కుంటున్నారో మీరే చూస్తున్నారుగా. ఒక మహిళగా నేను ఎదుర్కొన్న పీక్ సమస్య ఏంటంటే.. కాల్‌మనీ మాఫియాలో చిక్కుకుని మహిళల జీవితాలు నాశనమైపోతున్నాయని ఒక మహిళగా బాధపడి వారికి న్యాయం చేయాలని అసెంబ్లీలో పోరాటం చేస్తే, నా మీద లేనిపోని నిందలు వేశారు. ఏడాది పాటు రూల్స్‌కి విరుద్ధంగా సస్పెండ్ చేశారు. అప్పుడనిపించింది.. 'ఛ.. ఏంటీ రాజకీయాలు..' అని! నాకు ఎవరూ సపోర్ట్ లేరనే ఇలా చేశారు. అదే నాది కనుక రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం అయితే ఇలా చేసేవారా?! అసెంబ్లీ రికార్డ్స్ మార్ఫింగ్ చేసి మరీ ఇంత నీచానికి ఒడిగట్టారు. ధైర్యంగా ఎదుర్కొనే నా విషయంలోనే ఇలా జరిగితే మిగతా మహిళల పరిస్థితి ఏంటి? సస్పెండ్ చేసినా నేను వెనకడుగు వేయలేదు. హైకోర్టు దాకా ఈ సమస్యను తీసుకెళ్లాను.

> **మహిళలు చొరవగా, ధైర్యంగా ప్రజల కోసం పనిచేస్తూ ఉంటే కచ్చితంగా పురుషులకంటే బాగా రాణించగలుగుతారు. మహిళలకు రాజకీయాల్లో సక్సెస్ ఆలస్యంగా రావచ్చు. కానీ ఒక్కసారి సక్సెస్ వచ్చాక ప్రజలే వారిని ఉన్నత శిఖరాలకు చేరుస్తారు.**

● **మగవారికి చదువు నేర్పించవచ్చు కానీ, వారికి మహిళలను గౌరవించే సంస్కారాన్ని ఎలా నేర్పించాలి?**

అది కుటుంబం నుంచే జరగాలి. ఇంట్లో కొడుకు, కూతురు ఉంటే పెంపకంలో ఇద్దరినీ సమానంగా చూడాలి. చదువు ఒక్కటే నేర్పిస్తే సరిపోదు. సమాజం పట్ల ఎలా బాధ్యతగా ఉండాలో కూడా చెప్పాలి. ఇంట్లో ఏ ఒక్కరినీ తక్కువ చేయకూడదు. భార్య అయినా, భర్త అయినా ఇద్దరూ ఒకరినొకరు గౌరవించుకోవడం ఉంటే అది చూసి పిల్లలు నేర్చుకుంటారు. ఆ పెంపకంలో నుంచి వచ్చినవాళ్లకే సంస్కారం ఉంటుంది.

● **రాజకీయం అబద్ధమా? అబద్ధం రాజకీయమా?**

ఈ రోజు రాజకీయాలు చూస్తుంటే అబద్ధం రాజకీయం అని చెప్పలేం. కానీ, రాజకీయాలలో అబద్ధాలు చెప్పే నాయకులే ఎక్కువ కనిపిస్తున్నారు. అలాంటి వారిని ప్రజలు నమ్మడం వల్ల రాష్ట్రం ఎన్ని అష్టకష్టాలు పడుతుందో స్పష్టంగా అర్థమవుతోంది. కాబట్టి ఇప్పటికైనా అబద్ధాలు చెప్పేవారిని నమ్మకుండా నిజాయితీగా, విలువలతో కూడిన నేతలను నమ్మిన రోజే రాజకీయాలకు ఒక గౌరవం గుర్తింపు వస్తుంది, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుంది.

● **అన్ని ఆభరణాలలో రాజకీయం ఎలాంటి ఆభరణం?**

రాజకీయం అలంకారప్రాయమైన ఆభరణం కాదు. రాజకీయం అరుదైన బాధ్యత. ప్రజలలో మంచి పనులు చేసి, ప్రజల మన్ననలు పొందే అద్భుతమైన అవకాశం. ఒక వ్యక్తి ఎక్కువ మందికి సహాయం, న్యాయం చేసే అవకాశం ఒక్క రాజకీయం వల్లే వస్తుంది. ఆభరణంతో పోల్చితే కనుక పదిమందికి సాయం చేసే కీర్తికిరీటం రాజకీయం.

● **పవర్ వస్తుంది.. పోతుంది. ఎంపవర్‌మెంట్ ఎప్పటికీ ఉంటుంది. మన అక్కచెల్లెళ్లను ఎలా ఎంపవర్ చేయాలి?**

సహజంగానే ఎక్కడైనా మహిళ గట్టిగా ప్రశ్నించి, నిలదీస్తే ఆమె క్యారెక్టర్ మీద దాడి చేస్తారు. నోరెక్కువ అని ప్రచారం చేస్తారు. ఇవన్నీ తట్టుకొని, ఫ్యామిలీ సపోర్ట్‌తో ఫైట్ చేయగలిగితే.. మనం ఎంచుకున్న లక్ష్యం (ముఖ్యంగా పేద ప్రజలకు సాయం) చేరుకుంటాం. పురుషులతో పోలిస్తే మహిళలకు రాజకీయాల్లో ప్రతిబంధకాలు చాలా ఎక్కువ. మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ మొత్తం రాజకీయ వ్యవస్థ పురుషాధిపత్యమైపోయింది. ఇలాంటి వ్యవస్థలో మహిళలు రాణించాలంటే చాలా కష్టాలు ఎదుర్కోవాలి. రాజకీయాల్లో నిత్యం ప్రజల మధ్యలోకి వెళ్లాలి. కష్టమొచ్చినా, సంతోషమైనా, చావైనా, పుట్టుకైనా, ధర్నాలు, ఆందోళనలు ఇవన్నీ మహిళలకు రకరకాల ఇబ్బందులకు గురిచేస్తాయి. ఇక మహిళలు తమను తాము కాపాడుకోవడం రాజకీయాల్లో పెద్ద సవాల్. ఇక్కడ మహిళలను చాలామంది చులకన భావంతో చూస్తారు. ఆ అవమానాలను భరించి ధైర్యంగా నిలబడాలి. ఏ సమయమైనా ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమై ఉండాలి. ఇవన్నీ మహిళలకు ఇబ్బందికరమైన అంశాలే. కానీ, ఈ కష్టాలన్నీ అధిగమించి మహిళలు ఇప్పుడు రాజకీయాల్లో నిలదొక్కుకుంటున్నారు. రాజకీయాల్లో ఉన్న పురుషులకు కుటుంబం, స్నేహితులు, కార్యకర్తలు అందరూ సహకరిస్తారు. కానీ, మహిళలకు కుటుంబంలో, స్నేహితులలో సహకరించే వాళ్లే తక్కువ ఉంటారు. కనుక రాజకీయాలు మహిళలకంటే కూడా పురుషులకు అనుకూలంగా ఉంటాయి. కానీ మహిళలు ధైర్యంగా ప్రజల కోసం పనిచేస్తూ ఉంటే కచ్చితంగా పురుషులకంటే బాగా రాణించగలుగుతారు. మహిళలకు రాజకీయాల్లో సక్సెస్ ఆలస్యంగా రావచ్చు. కానీ ఒక్కసారి సక్సెస్ చూశాక మహిళలు ఉన్నత శిఖరాలకు చాలా వేగంగా చేరుకోగలుగుతారు.

● **పురుషులతో పోల్చితే రాజకీయాల్లో మహిళలకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతున్నాయి?**

చిన్నవిగా అనిపించే కొన్ని ఇబ్బందులు ఉంటాయి. అవి.. బయలాజికల్‌గా అన్ని రోజులూ తిరగలేం. మగవారికి షేక్ హ్యాండ్ ఇచ్చేటప్పుడు ఇబ్బందిగానే ఉంటుంది, ఇవ్వకుంటే తప్పుగా అర్థం చేసుకుంటారు. మహిళా నేతకి ఫాలోవర్‌గా ఉంటే తమ వెనుక వచ్చే పురుష నేతలు ఎగతాళి చేస్తారని చాలా మంది సపోర్ట్ చేయరు.

**- నిర్మలారెడ్డి చిల్కమర్రి**

చెట్టు నీడ

## గుర్తుపెట్టుకోవలసిన సంతోషం

ఇద్దరు మిత్రులు ఒక ఎడారిలో నడుచుకుంటూ వెళుతున్నారు. ఉన్నట్టుండి వారి మధ్య ఓ విషయమై వాదన మొదలైంది. అది తారస్థాయికి చేరింది.

కోపం తట్టుకోలేకపోయిన వ్యక్తి తటాలున తన మిత్రుడిపై చెయ్యి చేసుకున్నాడు. అయితే దెబ్బలు తిన్న వ్యక్తి ఏమాత్రం ఆవేశపడకుండా ఓ పక్కకు వెళ్లి దగ్గర్లోనే ఉన్న ఇసుకదిబ్బపై ప్రశాంతంగా కూర్చుని, అక్కడున్న ఓ పుల్లను తీసుకుని ఆ ఇసుకతిన్నెపై ఇలా రాశాడు.

> **కాసేపటి తర్వాత ఇద్దరు మిత్రులూ మళ్లీ మౌనంగా నడక సాగించారు. దారిలో ఓ చోట ఓ నీటి గుంట కనిపించింది. ఇద్దరూ కలిసి ఆ నీటిగుంటలోని నీటిని తాగేందుకు గుంటలోకి దిగారు.**

''ఈ రోజు నా ప్రాణస్నేహితుడు నన్ను బలంగా కొట్టాడు'' అని! కొట్టిన మిత్రుడికి తన మిత్రుడి వైఖరి అర్థం కాలేదు.

కాసేపటి తర్వాత ఇద్దరు మిత్రులూ మళ్లీ మౌనంగా నడక సాగించారు. దారిలో ఓ చోట ఓ నీటి గుంట కనిపించింది. అంతకు కొద్దిసేపటి క్రితం తమ ఇద్దరి మధ్య జరిగిన వివాదాన్ని వారు మరచిపోయారు. ఇద్దరూ కలిసి ఆ నీటిగుంటలోని నీటిని తాగేందుకు గుంటలోకి దిగారు.

ఇంతలో మిత్రుడితో దెబ్బ తిన్న వ్యక్తికి తన కాలిని ఎవరో లాగుతున్నట్టు అనిపించింది. నిజానికి అది లాగడం కాదు, అతని కాలు బురదలో కూరుకుపోతోంది.

మిత్రుడి స్థితి గమనించిన రెండో వ్యక్తి అతనిని ఎలాగో కష్టపడి గుంటలోంచి పైకి చేర్చాడు. ప్రాణాలతో బయటపడ్డ ఆ మిత్రుడు అక్కడికి దగ్గర్లో ఉన్న ఓ రాతిమీద కూర్చొని, అక్కడే ఉన్న ఓ రాయి తీసుకుని దానితో తాను కూర్చున్న రాతిమీద ఓ పక్కగా ఇలా రాశాడు: ''ఈరోజు నా మిత్రుడు నన్ను రక్షించాడు'' అని.

ఇది చూసిన మిత్రుడు ''నేను నిన్ను కొట్టినప్పుడు ఇసుకలో రాశావు. ఇప్పుడేమో కాపాడితే రాతి మీద రాశావు! వీటి అర్థమేమిటీ'' అని అడిగాడు. అప్పుడు ఆ మిత్రుడు ఇలా జవాబిచ్చాడు.

''ఎవరయినా మనల్ని గాయపరచినప్పుడు దానిని ఇసుకపై రాయాలి. అప్పుడు క్షమించడమనే గాలి దానిని చెరిపేస్తుంది. ఒకవేళ ఎవరైనా మంచో మేలో చేస్తే దానిని రాతి మీద రాయాలి. అది కాలాలను దాటి ఎప్పటికీ చెక్కుచెదరక ఉంటుంది'' అని! జీవితంలో కూడా మరచిపోవలసిన బాధలను ఇసుక మీద రాసుకోవాలి. గుర్తుపెట్టుకోవలసిన సంతోషాలను రాతి మీద బలంగా రాసుకోవాలి. అప్పుడే జీవన మాధుర్యాన్ని అనుభవించగలం.

బ్యూటిప్

## తాజాగా తేజస్సుతో..



● కొన్ని ద్రాక్ష పండ్లను సగానికి కట్ చేసి, ఆ సగం ముక్కలతో ఒక దాని తర్వాత ఒకటిని ఉపయోగిస్తూ ముఖంపైన మృదువుగా రుద్దాలి. ద్రాక్షలోని ఔషధ గుణాల వల్ల మృతకణాలు సులువుగా వదిలిపోతాయి. ఎండ వల్ల కందిన చర్మం పూర్వపు స్థితికి చేరుకుంటుంది ● టేబుల్ స్పూన్ ముడి తేనెను కొద్దిగా వేడిచేయాలి. తట్టుకోగలిగేంత వేడిగా ఉన్నప్పుడు వేళ్లతో ఆ తేనెను తీసుకొని ముఖమంతా రాయాలి. 5–10 నిమిషాలు అలాగే ఉంచాలి. తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి ● టేబుల్‌స్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్‌ల మీగడ కలిపి ముఖానికి పట్టించి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే చర్మకాంతి ఇనుమడిస్తుంది ● పిగ్మెంటేషన్ వల్ల అయిన నలుపు మచ్చలు పోవాలంటే బంగాళదుంపను సగానికి కోసి, ఆ ముక్కతో మృదువుగా రుద్దాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే నలుపు తగ్గుతుంది ● దోస రసం, గ్లిజరిన్, రోజ్ వాటర్ కలిపి ఫ్రిజ్‌లో ఉంచాలి. చల్లబడిన తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇది ఎండ వేడి నుంచి ఉపశమిస్తుంది. సన్‌స్క్రీన్‌లోషన్‌లా పనిచేస్తుంది.

# శక్తి స్వరూపం

**మహిళాభ్యున్నతికి 'సాక్షి' తలపెట్టిన 'నేను శక్తి' అక్షర ఉద్యమం నెల రోజులపాటు సాగి, నేటితో ముగిసింది. రేపు మహిళా దినోత్సవం. లింగ వివక్ష, గృహహింస, వేధింపులు, సాధికారత అనే నాలుగు అంశాలపై ఈ నాలుగు వారాలు ఇంటర్వ్యూలను, కేస్ స్టడీలను సాక్షి ప్రచురించింది. ఒక్కో అంశానికి ఒక్కో మహిళా ఉద్యమకారిణి గెస్ట్ ఎడిటర్‌గా 'ప్రారంభవాక్యం' రాశారు. ఇప్పుడు వారే 'ముగింపు అక్షరాలను' అందించారు.**

● లింగ వివక్ష

## 'కొనసాగింపు' ఒక కొత్త శక్తి

సాక్షి చేపట్టిన 'నేను శక్తి' కార్యక్రమం చాలా బలమైన ప్రయత్నం. కొన్ని లక్షల మందికి ఈ సమాచారం, జ్ఞానం చేరింది. ఈ చైతన్యం అందిపుచ్చుకున్న వాళ్లు కచ్చితంగా ఉంటారు. అప్పుడొకసారి, అప్పుడొకసారి ఏదైనా రాస్తే

> **స్త్రీల పట్ల వివక్షనూ; స్త్రీపురుష అసమానతల్నీ, ఇన్ని తరాలుగా పితృస్వామ్య సాలెగూడు స్త్రీల చుట్టూ ఎలా అల్లుకుందో, విలువల పేరుతో వారిని ఎలా బంధించిందో సాక్షి చూపించింది.**



అంతగా ప్రజల్లో విషయం నాటుకోదు. ప్రతిరోజూ పాఠకుల దృష్టిని మరల్చి సమాజంలోని స్త్రీ పురుష అసమానతలపై కేంద్రీకరించేలా చేయగలిగింది ఈ నెలరోజుల కార్యక్రమం. ఇందులో పాటించిన 'కొనసాగింపు' ప్రక్రియ చాలా కొత్తగా ఉంది. ప్రతీ సమాజంలోనూ పాత సంకెళ్ల స్థానంలో కొత్త సంకెళ్లు బిగుసుకుంటూ ఉంటాయి. వాటిని గుర్తించి వదిలించుకునే ప్రయత్నం జరగాలి. ఒక వైపు అసమానతల విధ్వంసం, మరోవైపు మానవీయ విలువల నిర్మాణం జరగాలి. వివక్ష వలయంలో నుంచి బయటపడటం ఎంత తేలికో అంత కష్టం కూడా. సాలెగూటిని బూజు కర్రతో తుడిచేయాలి. పుట్టుకొచ్చిన ప్రతిసారీ తుడవక తప్పదు.

**- ఓల్గా,** రచయిత్రి

● గృహహింస

## చట్టాలున్నా పోరు తప్పట్లేదు!



సాక్షి 'నేను శక్తి' క్యాంపెయిన్ మహిళల హక్కులను మరొక్కసారి గుర్తుచేసింది. దాదాపు నెల రోజులుగా సాగిన ఈ క్యాంపెయిన్‌లో వ్యథలు, వేదనలే కాదు.. విజయాలూ ఉన్నాయి. గాయపడ్డ ప్రతి మహిళా విజయాన్ని సాధించిన వైనం ఆమె శక్తికి నిదర్శనమే. అస్తిత్వం కోసం పోరాటం నిన్నమొన్న

> **ఈ క్యాంపెయిన్‌ను 'ఎపిటైజర్'గా భావిస్తున్నాను. మహిళలకు స్ఫూర్తినిచ్చి, ప్రేరణ కలిగించిన ప్రయత్నం ఇది. ఇందుకు సాక్షికి అభినందనలు.**

మొదలైంది కాదు. ఇంతకుముందే చెప్పుకున్నట్టు మన హక్కులను కాపాడుకునే ఎన్నో ముఖ్యమైన చట్టాలను తెచ్చుకున్నాం. అయినా ఇంకా వాటి మీదే పోరు సాగించాల్సి రావడం విచారకరం. ఇప్పుడు స్త్రీ చదువుకుంటోంది. ఆర్థిక స్వావలంబన సాధిస్తోంది. అయినా చట్టాలను వినియోగించుకునే స్థితిలో ఉందా? అసలు ఆ ఎరుక ఉందా? ఆ చైతన్యం కనిపిస్తోందా? అన్న ప్రశ్నలను రేకెత్తించాయి ఈ క్యాంపెయిన్‌లో ప్రచురితమైన వెతల కథనాలు. ఉంది.. ఎరుకా ఉంది.. చైతన్యమూ ఉంది అని సమాధానపర్చాయి.. ఆ వెంటనే వచ్చిన విజయ గాథలు. నా వరకు నేను ఈ క్యాంపెయిన్‌ను ఎపిటైజర్‌గా భావిస్తున్నాను. ఇందుకు 'సాక్షి'కి అభినందనలు. అయితే దీన్ని ఇక్కడితో ఆపకుండా కొత్త సమస్యల మీదా దృష్టి పెట్టాలని మాత్రం ఆశిస్తున్నాను.

**- శాంతా సిన్హా,** బాలల హక్కుల పరిరక్షణ కార్యకర్త

● లైంగిక వేధింపులు

## జీవించడాన్ని నేర్చుకుంటున్నారు

కన్నీరూ ప్రతిఘటనా ఒకే నదిలో రెండు పాయల్లా అక్షరాలై ప్రవహించాయి 'సాక్షి' కథనాల్లో. మేధస్సుకి ఆలోచన, శరీరానికి శ్రమ, మనసుకి అనుభూతి, ఉత్పత్తిలో గర్వించే భాగస్వామ్యం కోరడమే ధిక్కారమా? ఇది మా కనీస హక్కు కాదా? ఎందుకు పని సంబంధాల్ని 'ఆడామగ'ల లైంగికతగా కుదిస్తున్నారు? ఈ సంకుచితత్వానికి అంతం ఎప్పుడు? అని నిలదీస్తున్నారు ఇవాళ్టి స్త్రీలు. బహిరంగ ప్రదేశాల్లో స్త్రీల ప్రతి కదలికపైనా కామపు కళ్ల నిఘాలేనా? 'యవ్వనపు ఊహ కూడా ఇంకా చవిచూడని మొగ్గల

> **మహిళల భయాలు పటాపంచలయ్యే క్రమం వేగం పుంజుకుంది. మారుతున్న ఈ స్థితిని సాక్షి 'నేను శక్తి' క్యాంపెయిన్‌లోని ప్రతి వాక్యమూ పట్టి చూపింది.**



పాలిట చాక్లెట్ కూడా విషమైపోవాలా? అయ్యో అనడం కాదు.. అండగా నిలవండి. ముందు ఆమె ఫిర్యాదు వినండి. విచారించి నిజం నిగ్గుదేల్చండి. సాధ్యం కాదంటే కనీసం చట్టాల్ని అమలు పరచి మంచి పౌరులుగానయినా నిరూపించుకోండి. మా హక్కుల్ని గౌరవించకపోతే ప్రశ్నిస్తాం'అనేదే ఈ వ్యధార్థ కథనాల సారాంశం. కదలికే.. ఎటో అటు కదలడమే బతికున్నామనడానికి నిదర్శనం. బతకడం నుండి జీవించడం ఎలాగో నేర్చుకుంటున్నారు మన మహిళలు నిత్య సంఘర్షణల్లో, మనిషిగా నిలబడే బాటల్లో. అక్షరాల 'సాక్షి'గా అది నిజం.

**- దేవి,** సాంస్కృతిక కార్యకర్త

● సాధికారత

## శిఖరస్థాయికి మహిళా చైతన్యం




మహిళలు శక్తిమంతులే... అయితే ఆ వాస్తవాన్ని సమాజం అంగీకరించడంలోనే లోపం ఉంది. స్వాగతించడానికి జాప్యం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో సాక్షి చేపట్టిన 'నేను శక్తి' కాంపెయిన్ మహిళలకు మంచి ఆసరా. మహిళల రక్షణ కోసం చట్టాలున్నాయి, మహిళల

> **బాధిత మహిళలను, సవాళ్లను ఎదుర్కొని తమను తాము నిరూపించుకున్న వారిని ఏర్చి కూర్చి సుమహారంగా ఒక చోట చేర్చింది 'నేను శక్తి' క్యాంపెయిన్.**

పురోగతికి అవకాశాలున్నాయి. అయినా వాటిని అందిపుచ్చుకోవడానికి అవసరమైన చైతన్యమే తక్కువగా ఉండింది ఇంతకాలం. మహిళల్లో ఆ చైతన్యం చిగురించినప్పటి నుంచి సహజంగాకే కొంత ఘర్షణ ఎదురైంది పురుష సమాజం నుంచి. ఆ క్రమంలో మహిళల మీద దాడులు పెరిగిపోతు న్నాయి. వాటన్నింటినీ దాటుకుని విజయశిఖరాలను చేరిన మహిళలూ మన చుట్టూ ఉన్నారు. బాధిత మహిళలను, సవాళ్లను ఎదుర్కొని తమను తాము నిరూపించుకున్న వారిని ఏర్చి కూర్చి సుమహారంగా ఒక చోట చేర్చింది 'నేను శక్తి' క్యాంపెయిన్. సమాజంలో అనేక కోణాలను స్పృశించింది ఈ క్యాంపెయిన్. మన జర్నీ ఎంత వరకొచ్చింది, గమ్యం ఇంకా ఎంతదూరంలో ఉంది... అని సింహావలోకనం చేసుకోవడానికి ఇది ఒక దీపిక.

**- వనిత దాట్ల,** 'ఎలికో' వైస్‌చైర్‌పర్సన్

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్...! నేను ఒక అమ్మాయిని నైన్ ఇయర్స్ ప్రేమించా. తను నన్ను లవ్ చేసిందో లేదో నాకు తెలీదు కానీ, నన్నే చూసేది. నాతో మాట్లాడేది కూడా. కానీ కొన్నాళ్లకి తనకి పెళ్లి అయిపోయింది. నేనిప్పుడు మరో అమ్మాయిని లవ్ చేస్తున్నాను. తను కూడా నాతో బాగా మాట్లాడుతోంది. అయితే మొన్న మా ఇద్దరినీ ఆ మొదటి అమ్మాయి చూసి భయపడిందట. ఈ విషయం మా ఫ్రెండ్ చెప్పాడు. నేను ఇప్పుడు ఫస్ట్ అమ్మాయిని లవ్ చెయ్యాలా? లేక సెకండ్ అమ్మాయిని లవ్ చెయ్యాలా??

– వాసు

సెకెండ్ అమ్మాయిని నైన్ ఇయర్స్ లవ్ చెయ్యాలి.

'సార్ వాసు ముసలోడు అయిపోతాడు సార్!'

సరే ఎయిట్ ఇయర్స్ చెయ్యమను చాలు.

'ఎందుకు సార్ డిస్కౌంట్ ఇచ్చారు?'

యంగ్‌గా ఉంటాడని..!

'ఏంటి సార్ అంత వెటకారం? పాపం వాసు ఒక లవ్‌లో నైన్ ఇయర్స్ వేస్ట్ చేసుకున్నాడు. ఇప్పుడు మళ్లీ..........!'

మరి ఏంటి నీలాంబరీ, నైన్ ఇయర్స్ లవ్ చేసిన అమ్మాయి వాసును ఇంకో అమ్మాయితో చూసి దడుచుకుందంటే దాని మీనింగ్ ఏంటి నీలూ....??

'ఏంటి సార్????'

వీడు టెస్ట్ ప్లేయర్ నీలూ.. ఈ రోజుల్లో అంతా ట్వంటీ ట్వంటీ కదా, అందుకే దడుచుకుంది.

'వాసు తొందరగా లవ్వాడి.. తొందరగా పెళ్లి చేసుకో....!'

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 6 | | | | | 4 | |
| 9 | 1 | 3 | | | | | | 7 |
| 8 | | 4 | 2 | 1 | | | 5 | |
| 3 | 4 | | 9 | 6 | 8 | | | |
| | 9 | | | 7 | | | 6 | |
| | | | 5 | 4 | 1 | | 9 | 2 |
| | 6 | | | 3 | 5 | 8 | | 9 |
| 7 | | | | | | 5 | 3 | 4 |
| | 3 | | | | | 6 | | |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 8 | 5 | 2 | 4 | 1 | 9 | 7 | 6 |
| 2 | 6 | 9 | 5 | 3 | 7 | 1 | 4 | 8 |
| 1 | 4 | 7 | 8 | 9 | 6 | 3 | 5 | 2 |
| 7 | 5 | 4 | 9 | 2 | 8 | 6 | 3 | 1 |
| 8 | 9 | 1 | 6 | 5 | 3 | 4 | 2 | 7 |
| 6 | 3 | 2 | 7 | 1 | 4 | 5 | 8 | 9 |
| 5 | 1 | 6 | 4 | 7 | 2 | 8 | 9 | 3 |
| 4 | 2 | 8 | 3 | 6 | 9 | 7 | 1 | 5 |
| 9 | 7 | 3 | 1 | 8 | 5 | 2 | 6 | 4 |

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి:
జాము రాతిరి జాబిలమ్మ... జోల పాడనా ఇలా
జోరు గాలిలో జాజి కొమ్మ... జారనీయకే కల
వయ్యారి వాలు కళ్లలోన... వరాల వెండి పూల వాన
స్వరాల ఊయలూగు వేళ
॥ జాము రాతిరి॥

**చరణం - 1**
కుహు కుహు సరాగాలే శృతులుగా
కుశలమా అనే స్నేహం పిలువగా
కిలకిల సమీపించే సడులతో
ప్రతి పొద పదాలేవో పలుకగా
కునుకు రాక బుట్టబొమ్మ గుబులుగుందనీ
వనము లేచి వద్దకొచ్చి నిద్ర పుచ్చనీ
॥ జాము రాతిరి॥

**చరణం - 2**
మనసులో భయాలన్నీ మరిచిపో
మగతలో మరో లోకం తెరుచుకో
కలలతో ఉషాతీరం వెతుకుతూ
నిదరతో నిషారాణీ నడచిపో
చిటికలోన చిక్కబడ్డ కటిక చీకటి...
కరిగిపోక తప్పదమ్మ ఉదయకాంతికి...
జాముాతిరి జాబిలమ్మ జోల పాడనా ఇలా...
జోరుగాలిలో జాజి కొమ్మ... జారనీయకే కలా...
వయ్యారి వాలుకళ్లలోన... మ్మ్... మ్మ్...
ఆహా ... స్వరాల ఊయలూగువేళ...

కట్ చేయ్...దాచేయ్...

**చిత్రం:** క్షణక్షణం, **రచన:** సిరివెన్నెల
**సంగీతం:** ఎం.ఎం.కీరవాణి ; **గానం:** బాలు, చిత్ర

చూడు భయ్యా...
ప్రేమా, దోమా రెండు ఒక్కటే.
ఒకటి నిద్ర రాకుండా చేస్తుంది,
ఇంకోటి నిద్ర పోకుండా చేస్తుంది.

**వ్యవస్థ తప్పు చేస్తూ ఉంటే దానికి అనుగుణంగా మనం మారుతూపోతే, చివరకు మనమే ఉండం. మన ఉనికే ఉండదు. మన వ్యక్తిత్వం ఉండదు. మనల్ని మనం గుర్తించలేనంతగా మారిపోతాం. మారడం కంటే వ్యవస్థనే మార్చాలి. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటే వ్యవస్థ నీ కాళ్ల దగ్గర మోకరిల్లుతుంది.**

# మార్చాలి.. మారకూడదు

సినీ రంగంలోకి వచ్చిన వారికి ఇబ్బందులు ఎదురు కావడం సహజం. ఏదోరకంగా ఆడవారిని అణగదొక్కాలని ప్రయత్నిస్తారు. నేను, భానుమతి లాంటి కొందరు మాత్రం అన్నింటినీ తట్టుకుని నిలబడ్డాం. షూటింగ్‌లో నా హద్దుల్లో నేను ఉండేదాన్ని. మేకప్ వేసుకోవడం, నటించడం...ప్యాకప్ చెప్పగానే ఇంటికి వెళ్లిపోవడం... అంతవరకే. అనవసరంగా ఎవరోఒకరితో మాటలు కలపడం నాకు ఇష్టం ఉండేది కాదు. 'నా ఆత్మాభిమానం నేనే కాపాడుకోవాలి' అని నాకు నేనుగా అనుకున్నాను. ఆత్మాభిమానాన్ని చంపుకుని ఏ పనీ చేయక్కర్లేదు అని ప్రతివారు అనుకుంటే ఏ రంగంలోనైనా వ్యక్తిత్వంతో నిలబడగలుగుతారని నా అభిప్రాయం. వ్యక్తిత్వానికి ఆటంకం కలిగేలా ఉంటే, కెరీర్‌ను వదులుకోవడానికి కూడా నేను సిద్ధంగా ఉండేదాన్ని.



జమున

**నేను సెట్‌లో ఉంటే అందరూ జాగ్రత్తగా ఉండేవారు...**

నాకు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ అలవాటు చేశారు నాన్నగారు. సెట్‌లో అనవసరంగా నవ్వితే ఆయన ఊరుకునేవారు కాదు. మర్యాదగా ప్రవర్తిస్తూ, షూటింగ్ పూర్తి చేసుకుని రావాలనే నేర్పారు. అది నా మంచికే అని తెలిసింది. ఇంట్లో మాత్రం అందరం సరదాగా నవ్వుతూ తుళ్లుతూ ఉండేవాళ్లం. నా వ్యక్తిత్వానికి భంగం కలిగేలా ఉంటే నేను సహించలేను. పెద్ద పెద్ద హీరోలు కూడా నేను షూటింగ్‌లో ఉంటే చాలా మర్యాదగా ప్రవర్తించేవారు. ఒక రోజు షూటింగ్‌లో నేను లేననుకుని, ఒక పెద్ద హీరో మద్యం సేవించి వచ్చారు. సాధారణంగా సినిమాలో హీరో తప్పించి, మిగిలిన పాత్రలతో ఎలా నటించినా మద్యం వాసన మనకు తెలియదు, కాని హీరోలతో కొన్ని సీన్స్‌లో చాలా క్లోజ్‌గా నటించాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో వారి నోటి నుంచి వచ్చే మద్యం వాసన భరించడం ఎవరికైనా కష్టమే. అందుకే ఆ రోజు నేను షూటింగ్ చేయనని చెప్పేశాను. అప్పటికే ఒక అమ్మాయిని పట్టుకుని, కౌగిలించుకుని, ముద్దు పెట్టుకున్నారుట ఆ హీరో. ఆ సందర్భంలో నేను ఉండి ఉంటే, పరిస్థితి వేరేలా ఉండేదని సెట్‌లో అందరూ నాతో అన్నారు. ఆ మాటలకు నాకు సంతోషంగా అనిపించింది.నేను ఉండటం వల్ల సెట్‌లో క్రమశిక్షణ ఉంటుంది అని అందరూ అనుకోవడం నాకు గర్వకారణమే కదా. వాస్తవానికి నేను – ఆ హీరో కాంబినేషన్ చాలా బావుంటుందని అందరూ అనుకునేవారు. మాది హిట్ పెయిర్ కూడా.

**నాన్నగారికి కోపం వచ్చింది...**

ఎన్‌టిఆర్, ఏయన్నార్... మూడేళ్లు నాతో నటించకుండా నన్ను బాయ్‌కాట్ చేశారు. అందుకు వాళ్లు చెప్పిన కారణాలు విన్నాక నాకు నవ్వు వచ్చింది. నేను కాలు మీద కాలు వేసుకుని కూర్చుంటానని, నిర్మాతలను ఇబ్బంది పెడతానని, టైమ్‌కి సెట్స్‌లోకి రానని ప్రచారం చేశారు. నేను కాలు మీద కాలు వేసుకుని కూర్చోవడంలో తప్పేమిటో అర్థం కాలేదు. అంటే ఒక హీరోయిన్ అలా కూర్చోకూడదనా వాళ్ల ఉద్దేశం. అంత పెద్ద హీరోలకి ఆడవాళ్ల మీద అలాంటి అభిప్రాయం ఉండటం సరికాదు. వాళ్ల అన్నమాటలే నిజం అయి ఉంటే, ప్రతి కంపెనీలోను ఆరు సినిమాలు ఎలా చేయగలుగుతాను. అంతేనా నేను నటించిన సినిమాలు ఏడాదికి ఆరు విడుదలయ్యేవి. నిజంగానే నేను పొగరుగా ఉండి, టైమ్‌కి షూటింగ్‌కి రాకపోతే ఇన్ని సినిమాలు చేయగలిగేదానినా!

**పరిశ్రమ ఎంతో మారిపోయింది...**

అప్పట్లో నిర్మాతలు విలువలు పాటించేవారు. వ్యాపార దృక్పథంతో పాటు కంపెనీ నిలబడి బెస్ట్‌గా ఉండాలి అనుకునేవారు. అన్నపూర్ణ, జగపతి, సురేశ్... అందరూ ఉద్దండులే. ప్రస్తుతం సినీరంగంలో 'నిర్మాతలు' అని చెప్పుకునేవారికి, మా తరం నిర్మాతలకి పొంతన లేదు. ఈ తరం నిర్మాతలు 'ఫలానా హీరోయిన్ అయితే బావుంటుంది' అనుకుంటున్నారు. ఓపెనింగ్‌లకి హీరోయిన్లను పిలిచి మీద చేయి వేస్తున్నారు. అంత బలహీనంగా ఉంది వారి తత్త్వం. ఆ రోజులతో పోలిస్తే ఇప్పుడు లైంగిక వేధింపు ఎక్కువగా ఉందేమో అనిపిస్తోంది.

**నేను శక్తిని...**

నేను సినిమాలలో శక్తిస్వరూపిణిగా కత్తి దూసి యుద్ధం చేశాను కనుక 'జమున శక్తి స్వరూపం' అని నాకు పేరు. నేను శక్తిని అనుకోవడం ప్రతి స్త్రీకి చాలా అవసరం. ప్రస్తుతం అమ్మాయిలు బాగా చదువుకుంటున్నారు. వారిని ప్రభుత్వం కూడా ప్రోత్సహించాలి. జీవితం అంటే పెళ్లి కాదు, మొగుడి చేతిలో బానిసలా ఉండక్కర్లేదు. చక్కగా చదువుకున్నవారు తగిన ఉద్యోగం చేయొచ్చు, చదువురానివారు రెండు గేదెలను లేదా ఆవులను కొనుక్కుని పాల వ్యాపారం చేసుకుంటూ హుందాగా బతకొచ్చు. అంతేకాని ఆత్మాభిమానం చంపుకుని బతకవలసిన అవసరం లేదని నా అభిప్రాయం.

**అమ్మ పెంపకంలో....**

మా అమ్మ చాలా ధైర్యవంతురాలు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, రెండు రోజులు జైలుకి కూడా వెళ్లింది. ధైర్యంగా ఉండటం ఆవిడ దగ్గర నుంచే నేర్చుకున్నాను. ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం కాపాడుకోవడం కూడా అమ్మ దగ్గర నుంచే నేర్చుకున్నాను. అందుకే అందరూ నాకు అన్నీ అమ్మ బుద్ధులే వచ్చాయి అనేవారు. మా అమ్మ సాక్షాత్తు దేవత. ఆవిడ పెంపకంలోనే ఆత్మగౌరవం నిలబెట్టుకోవడం, ఎటువంటి సమస్యలు ఎదురైనా తట్టుకోవడం వచ్చాయేమో అనిపిస్తుంది.

ఇంటర్వ్యూ: **వైజయంతి**

## పరి పరిశోధన

### వర్టికల్ ఫార్మింగ్‌తో 30 రెట్లు ఎక్కువ దిగుబడి

నేల అవసరం లేని నిట్టనిలువు వ్యవసాయం గురించి మనం చాలాసార్లు వినే ఉంటాంగానీ.. ఇందులోనూ రికార్డులు బద్దలు కొట్టేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. అమెరికాకు చెందిన బోవరీ విషయాన్నే తీసుకోండి. ఈ సంస్థ అతితక్కువ స్థలం, నీరు, వనరులు వాడుకుని బోలెడన్ని ఆకు కూరలు పండించేందుకు రంగం సిద్ధం చేసింది. సంప్రదాయ పద్ధతుల్లో ఎకరానికి



పండించే దానికంటే బోవరీలో పండేది ఏకంగా 30 రెట్లు ఎక్కువ ఉండటం విశేషం. అత్యాధునిక టెక్నాలజీలను వాడుకోవడం ద్వారా తాము 95 శాతం తక్కువ నీరు.. క్రిమికీటక నాశినులు, రసాయన ఎరువులు ఏవీ వాడకుండానే అధిక దిగుబడులు సాధిస్తామని కంపెనీ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఒకే రకమైన పంట కాకుండా ఏకకాలంలో దాదాపు వంద రకాల ఆకు కూరలు, ఔషధ మొక్కలు పెంచడం ఇంకో విశేషం. ప్రత్యేకంగా తయారుచేసుకున్న కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా మొక్కలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహానగరాలకు చేరువలో ఇలాంటి వర్టికల్ ఫార్మింగ్ చేపట్టడం ద్వారా నగరవాసులకు తాజా ఆకుకూరలు దొరుకుతాయి. ఇందువల్ల రవాణా చేయవలసిన అవసరం ఉండదు. ఇలా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చునని బోవెరీ అంటోంది. ప్రస్తుతం ఈ సంస్థ పంటలు న్యూయార్క్‌లోని ఫోరేజ్, హోల్‌సమ్ ఫుడ్స్ వంటి స్టోర్లలో లభ్యమవుతున్నాయి.

### పెంగ్విన్ల కాలనీ బయటపడింది...

మంచుముద్ద అంటార్కిటికాలో ఓ పెంగ్విన్ల కాలనీని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆ.. ఇందులో విశేషమేముంది? అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే అంతరించిపోతున్నాయని అనుకుంటున్న అడిలీ రకం పెంగ్విన్లు ఇక్కడ ఉండటం ఒక విశేషమైతే.. ఏకంగా 15 లక్షల ప్రాణులు ఉండటం ఇంకో విశేషం. వుడ్‌హోల్ ఓషనోగ్రాఫిక్



ఇన్‌స్టిట్యూషన్ శాస్త్రవేత్తలు ఉపగ్రహ ఛాయాచిత్రాలు, డ్రోన్లతో జరిపిన పరిశోధనల ద్వారా ఈ కొత్త కాలనీ గురించి ప్రపంచానికి తెలిసింది. డాంగర్ ద్వీపంలో ఉన్న ఈ కాలనీని ఇప్పటివరకూ మనుషులెవరూ సందర్శించలేదని.. బహుశా అందుకే ఆ ప్రాంతంలో పెంగ్విన్లు బాగా వృద్ధి చెందుతూండవచ్చునని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త టామ్ హార్ట్ తెలిపారు. 1959లో తీసిన ఉపగ్రహ ఛాయాచిత్రాల్లోనూ వీటి ఉనికి గురించి కొన్ని ఆనవాళ్లు కనిపించాయని, ఆ తరువాత డాంగర్ ద్వీపమున్న పశ్చిమ అంటార్కిటికా ప్రాంతంలో పెంగ్విన్లు క్రమేపీ తగ్గిపోతూ వచ్చాయని హార్ట్ వివరించారు. దాదాపు ఏడు లక్షల జంటలతో ప్రపంచంలోనే అతిపెద్ద పెంగ్విన్ కాలనీగా 'హార్ట్' నిలిచింది అంటున్నారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతోపాటు అమెరికా, ఫ్రాన్స్‌లలోని ఇతర విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కూడా ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్నారు.

### నిత్య యవ్వనం గుట్టు తెలిసింది...

నిండు నూరేళ్లూ... ఎలాంటి జబ్బులు, ఇబ్బందులు లేకుండా గడిపితే ఎలా ఉంటుంది? అద్భుతంగా ఉంటుంది గానీ.. సాధ్యమయ్యేదెలా? అంటున్నారా? అరిజోనా స్టేట్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల పరిశోధనల పుణ్యమా అని ఈ దిశగా ఇంకో అడుగు ముందుకు పడింది. విషయం ఏమిటంటే.. మన క్రోమోజోమ్‌ల చివరన ఉండే టెలిమోర్లకు సంబంధించిన ఓ కీలక విషయాన్ని




తెలుసుకున్నారు. డీఎన్ఏ పోగుల్లోని కొన్ని భాగాలను టెలీమోర్లుగా మార్చేందుకు టెలిమరేస్ అనే ఎంజైమ్‌లు ఎలా పనిచేస్తాయో వీరు గుర్తించారు. సాధారణంగా మన శరీర కణాలు కొన్నిసార్లు విభజితమైన తరువాత మరణిస్తాయి. ఈ క్రమంలో క్రోమోజోమ్‌ల చివర ఉండే టెలీమోర్ల పొడవు తగ్గుతూ వస్తుంది. ఎప్పుడైతే టెలిమోర్ల పొడవు నిర్దిష్ట స్థాయికంటే తక్కువ అవుతుందో అప్పుడు కణ విభజన ఆగిపోతుంది. ఇంకోలా చెప్పాలంటే కణాలు.. వాటితోపాటు మనమూ వృద్ధులమవుతామన్న మాట. ఈ నేపథ్యంలో టెలీమోర్ల పొడవు తగ్గకుండా చూసేందుకు శాస్త్రవేత్తలు రకరకాల పరిశోధనలు చేస్తున్నారు. టెలీమెరేస్‌లో క్రోమోజోమ్ చివరల్లో ఉండే టెలీమోర్లకు సంబంధించిన డీఎన్ఏ ముక్కలను కచ్చితంగా తయారు చేసేందుకు ఒక వ్యవస్థ ఉందని.. ఇది.. ఆ ఎంజైమ్ మొత్తం పనితీరునూ ప్రభావితం చేస్తోందని వీరు తెలుసుకున్నారు ఈ వ్యవస్థను నియంత్రించగలిగితే టెలీమోర్ల పొడవు తగ్గకుండా ఉంటుంది.. తద్వారా కణాలు.. మనమూ నిత్యయవ్వనంతో ఉండవచ్చునని అంచనా.

## సంశోధన్

# ఇది సాధికారత శోధన

మధ్యభారతంలో ఓ కుగ్రామం పర్మినో. తరతరాలుగా వస్తున్న ఆచారంలో భాగంగా అక్కడంతా మగవాళ్ల పెత్తనమే. ఆడవాళ్లు తల బయట పెట్టాలంటే తల మీద గూంఘట్‌ను సవరించుకోవాలి. వాకిలి బయట తలపెట్టి తమను ఎవరూ చూడడం లేదని నిర్ధారించుకున్న తర్వాత కానీ అడుగు గడపదాటదు. అలాంటి కుగ్రామంలో ఊరి పెత్తందారు రతన్‌సింగ్. అతడి మాటకు తిరుగులేకుండా సాగిపోతోంది. అప్పుడు వచ్చిందో చట్టం. అది 73, 74 రాజ్యాంగ సవరణ. ఆ సవరణ ప్రకారం స్థానిక పరిపాలనలో మూడవ వంతు మహిళలు ఉండాలి. పదిమంది వార్డు సభ్యులు ఉండే పంచాయితీలో కనీసం ముగ్గురైనా మహిళలు ఉండాలి. అది చట్టం రూపం సంతరించుకుంది కాబట్టి గ్రామ పరిపాలనలో మూడవ వంతు మహిళలు ఉండి తీరాలి. చట్టాన్ని ఉల్లంఘించకూడదు. అలాగని ఊరి పెత్తనం తన చేతి నుంచి జారిపోవడానికి వీల్లేదు. పెత్తనం చేయి దాటుతుందనే ఆలోచననే భరించలేని స్థితిలో ఉంటాడు రతన్ సింగ్. 'కర్ర విరగకూడదు, పాము చావాలి' ఎలా...

**మన ఇంటి మహిళ అయితే!**

ఆ మూడవ వంతు మహిళలు తమవాళ్లే అయితే? గొప్ప ఆలోచన. తన తెలివి తానే మురిసిపోతూ మీసం మెలేసుకుంటాడు రతన్‌సింగ్. కొడుకు ఇందర్‌కు చెప్తాడు ఈ సారి పంచాయితీ ఎన్నికలలో కోడలు మంజు పోటీ చేయాలని. అది ఇంటి పెద్ద తీర్మానం. ఊరిపెత్తనం ఇల్లు దాటి పోకుండా ఉండడానికి చేసిన తీర్మానం. 'మంజు పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేస్తుంది' నిర్ణయం జరిగిపోయింది. నామినేషన్ పేపర్లు ఇంటికే వచ్చేశాయి. మగవాళ్లు చూపించి చోట సంతకం పెట్టడమే మంజు చేయాల్సింది. మామగారు, భర్త చెప్పినట్లు సంతకం చేసింది మంజు. ఇక మిగిలిన ఇద్దరు మహిళలు? పైగా ఈ ముగ్గురిలో షెడ్యూల్డ్ క్యాస్ట్, షెడ్యూల్డ్ ట్రైబ్ కూడా కవర్ అవ్వాలి. రతన్ సింగ్ మాటకు ఎదురు చెప్పని అనుచరులు గుర్తొచ్చారు. వారికి భార్యలున్నారు చాలు. పంచాయితీ ఎన్నికలు జరిగాయి. మగవారి నిర్ణయాలు అమలులోకి వచ్చేశాయి, వారు సూచించిన మహిళలే పంచాయితీ సభ్యులయ్యారు.

• ❖ •

పంచాయితీ సమావేశాల సమయంలో ఈ ముగ్గురు మహిళలూ గూంఘట్‌లు మరింత కిందకు లాక్కుంటూ భర్తల వెంట పంచాయితీ కార్యాలయాలకు వెళ్తుంటారు. మగవాళ్లంతా ఒక గదిలో కూర్చుని గ్రామ వ్యవహారాల మీద చర్చిస్తుంటారు. ఆడవాళ్లు మాత్రం మగవాళ్ల కంట పడకుండా మరొక గదిలో కూర్చుంటారు. పంచాయితీ గుమాస్తా రికార్డు బుక్ తీసుకుని ఆడవాళ్లున్న గదిలోకి వినయంగా వచ్చి సంతకాలు తీసుకుని వెళ్లిపోతుంటాడు.




• నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యునిసెఫ్‌లు సంయుక్తంగా 1996లో నిర్మించిన సంశోధన్ సినిమాకు గోవింద్ నిహలానీ దర్శకత్వం వహించారు.
• 73,74 రాజ్యాంగ సవరణ బిల్లును 1992లో పార్లమెంటులో ప్రవేశపెట్టగా, అది 1993 ఏప్రిల్‌లో అమలులోకి వచ్చింది. ఈ సవరణల ఆధారంగా రూపొందిన చట్టం... స్థానిక పరిపాలనలో మూడవ వంతు మహిళల భాగస్వామ్యం ఉండాలని చెప్తోంది.

అది కూడా పంచాయితీ పెద్ద చెప్పినప్పుడు.

ఆ క్లర్కు రికార్డు బుక్ తెచ్చినప్పుడు సంతకాలు పెట్టడానికా తాము సభ్యులైంది? మహిళా సభ్యులలో ఆలోచన రేకెత్తింది. వారిలో విద్య ఒక్కటే చదువుకున్న అమ్మాయి. ఎన్నికలకు కొద్ది ముందుగా పెళ్లయి ఆ ఊరికి వచ్చిన కొత్త కోడలు. ఆమె ఊరి పెద్ద పెత్తందారీ తనానికి తలొగ్గదామె. పంచాయితీకి విడుదలైన నిధులు ఏమవుతున్నాయి? బడి నిర్మాణం అసంపూర్తిగా ఎందుకు ఉంది? వంటి ప్రశ్నలు లేవనెత్తుతుంది. ఆమెను నియంత్రించడానికి ఆమె భర్త మీద ఒత్తిడి తెస్తుంటాడు రతన్‌సింగ్. దాంతో ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు వస్తుంటాయి. ఒత్తిడులకు భయపడి వెనుకడుగు వేయకుండా ముందడుగు వేయడానికి విద్య పోరాడుతుంది. మహిళలు సంఘటితమయ్యారు.

తమకూ మెదడు ఉందని, దానికి ఆలోచనలు ఉన్నాయని, ఇంటిని దిద్దడమే కాదు ఊరిని బాగు చేయడం కూడా తమకు చేతనవుతుందని నిరూపిస్తారు గ్రామంలోని మహిళలు. ఎంపవర్‌మెంట్ ఒకరు ఇస్తే వచ్చేది కాదు, సాధికారత సాధించుకోవాలనే తపన మహిళలో ఉండాలి. ఒకసారి ఆ బీజం పడితే అది మొలకెత్తక మానదు, మహావృక్షంగా మారకా మానదు.

– వాకా మంజులారెడ్డి

నేను శక్తి
సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం, 7-3-2018

●ఆదివాసీలకు అండగా నిలుస్తున్న యువతి ●12వ ఏటే అన్యాయాన్ని ఎదిరించిన ధీర ●సహాయం కోసం ఆశ్రయిస్తున్న పేదలు ●నేనున్నానని భరోసా ఇస్తూ రంగంలోకి ●మడావి కన్నిబాయి స్ఫూర్తివంతమైన కథ

# అడవి దివిటే



● కన్నిబాయి

### అది 2007

మడావి కన్నిబాయి ఆసిఫాబాద్‌లోని గిరిజన పాఠశాలలో 7వ తరగతి చదువుతూ సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. వచ్చినప్పటి నుంచి తల్లిదండ్రులు పడుతున్న బాధ, ఏడుస్తున్న తీరు చూసి దిగ్భ్రాంతి చెందింది. తల్లిదండ్రులు చెప్పిన విషయం విని నిశ్చేష్టురాలైంది. 'నాలుగేళ్ల క్రితం పొలాన్ని కౌలుకు ఇచ్చాం. ఇప్పుడు పొలం తిరిగి ఇవ్వాలని రైతును అడిగితే ఎక్కడి పొలం.. నేను కొనుగోలు చేశాను.. డబ్బులు కూడా అప్పుడే ఇచ్చేశాను అని బుకాయిస్తున్నాడు. గ్రామ పెద్దలకు చెప్పినా పట్టించుకోలేదు. ఏం తినాలి.. ఎలా బతకాలి' అంటూ కన్నవారు అసలు విషయం ఆ చిన్నారికి చెప్పారు. వెంటనే కన్నిబాయి తల్లిని వెంట బెట్టుకుని బస్సులో ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లింది. పీవో సార్ ఎక్కడుంటాడో తెలుసుకొని ఆయనకు తెలుగులో రాసిన ఓ దరఖాస్తును ఇచ్చింది. దాన్ని చూసిన పీవో ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. కన్నిబాయి ధైర్యాన్ని మెచ్చుకుని వెంటనే ఆర్డీవోతో పాటు మరికొంత మంది అధికారులను వెంటబెట్టుకుని గ్రామానికి వెళ్లాడు. రైతు కబ్జాలో ఉన్న పొలాన్ని మళ్లీ కన్నిబాయి తల్లిదండ్రులకు అప్పజెప్పాడు. అప్పుడే అనుకుంది కన్నిబాయి.... నాలాంటి కుటుంబాలు ఎన్నో ఉన్నాయి.. వారికి న్యాయం చేయాలి.. హక్కులు వారికి కల్పించాలి అని. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం భీమన్‌గొంది గ్రామానికి చెందిన మడావి కన్నిబాయి ఆ రోజు నుంచి ఆదివాసీ మహిళా చైతన్యానికి ఒక దివిటీలా నిలిచింది. తన పోరాటం తన మాటల్లోనే....



● కెరమెరి మండలం చున్నగూడలో అవగాహన కల్పిస్తున్న కన్నిబాయి

> ఆదివాసీ తెగల్లోని మహిళలకు భయం ఎక్కువ. ఆ భయాన్ని వీడినప్పుడే అభివృద్ధి చెందగలం. సమాజంలో జరుగుతున్న పోకడలను అర్థం చేసుకునేందుకు చదువు చాలా ముఖ్యం. నేడు ఆదివాసీల్లో చాలా మంది నిరక్షరాస్యులున్నారు. పిల్లలందరు బడికి వెళ్లాలి. బాగా చదువుకోవాలి. ముఖ్యంగా మహిళల్లో ఎదిరించే ధైర్యం, తన కాళ్లపై తాను నిలబడే తత్వం కలిగి ఉండాలి.

### పేదల పక్షం

నా పేరు మడావి కన్నిబాయి. తల్లిదండ్రులు మడావి భీంబాయి–జైతు. ఇద్దరు అన్నలున్నారు. నేను చిన్నదాన్ని. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఆసిఫాబాద్ లోని ఎస్టీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివాను. ఇంటర్ కెరమెరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించాను. ఆర్థిక ఇబ్బందులతో పై చదువులు చదవలేకపోయా. కాని ఉన్న చదువుతోనే చాలా పనులు చేయవచ్చని గ్రహించా. ఇందిరాక్రాంతి పథంలో పీవోపీ (పూరెస్ట్ ఆఫ్ పూర్) సీపీగా విధులు నిర్వహిస్తున్నప్పుడు మండలంలోని చాలా గ్రామాలు సందర్శించా. ఎస్టీ, ఎస్సీలలో ఉన్న అత్యంత వెనకబడిన కుటుంబాలపై సర్వే నిర్వహించా. ఆ క్రమంలో మండలంలో 108 అత్యంత వెనుకబడిన కుటుంబాలు ఉన్నాయని గుర్తించి, అధికారులకు నివేదిక సమర్పించా. ఆ తర్వాత ఆదివాసీ గిరిజన సంఘంలో మహిళా కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆసిఫాబాద్, కెరమెరి, తిర్యాణి మండలాలకు చెందిన 150 మంది ఆదివాసీలకు ఆర్వోఎఫ్ఆర్(అటవీ హక్కు) పత్రాలను ఇప్పించా. వారు ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. బ్యాంకుల నుంచి రుణాలు అందకపోవడంతో దళారులను, వ్యాపారులను ఆశ్రయించి వడ్డీలకు వడ్డీలు చెల్లించి నష్టపోతున్నారని తెలుసుకొని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆర్వీ కర్ణన్‌తో మాట్లాడి ఆ 150 మందికి పట్టాలిప్పించడం నాకు చాలా సంతోషం కలిగించింది. ప్రస్తుతం వారు సాగు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

### ఎన్నో నష్టపరిహారాలు

తిర్యాణి మండలానికి చెందిన కొలాం విద్యార్థిని ఆసిఫాబాద్‌లోని గిరిజన పాఠశాలలో 6వ తరగతి చదువుతూ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలియగానే ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని, మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టా. దీనికి స్పందించిన ప్రభుత్వం మృతురాలి కుటుంబానికి రూ. 2.5 లక్షల ఆర్థిక సహాయం చేసింది. అలాగే ఈ ప్రాంతంలో కొలాం అమ్మాయిలపై జరిగిన అత్యాచారాలపై గళం విప్పి వారికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేశా. ప్రస్తుతం కొలాం మహిళా డెవలప్‌మెంట్ సొసైటీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నా. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంచార్జిగా బాధ్యతలు చేపడుతున్నా. ఈ సొసైటీ ఆధ్వర్యంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, కెరమెరి, వాంకిడి మండలాల్లో ఇప్పటికి 41 గ్రామాలను సందర్శించి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను పూర్తిగా ఆదిమ గిరిజనులైన కొలాం, నాయక్‌పోడ్, తోటిలకు చెందేలా కార్యాచరణ రూపొందించా.

### సినిమాలో కొరియోగ్రాఫర్‌గా..

వీ6 టీవీ ఫేం బిత్తిరి సత్తి నటిస్తున్న 'తుపాకి రాముడు' సినిమాలో కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నాను. ఆ సినిమాల్లో నటించేందుకు 52 మంది కొలాం తెగకు చెందిన కళాకారులను తయారు చేసి నటింపజేస్తున్నాను. ఆ సినిమాల్లో నృత్యదర్శకురాలిగా నేనే డ్యాన్సులు నేర్పిస్తున్నాను. ఎలాంటి బట్టలు వేయాలి.. ఎలా నృత్యాలు చేయాలి అనేది నేర్పిస్తున్నాను.

### కొండలు ఎక్కగలను..

నెహ్రూ యువ కేంద్రంలో పని చేస్తున్నప్పుడు అక్కడి అధికారులు నాలో ఉన్న ప్రతిభను గుర్తించి ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇప్పించారు. దీంతో హైదరాబాద్, నిజామాబాద్, నిర్మల్‌లోని కుంటాల జలపాతంలో ఉన్న పెద్ద పెద్ద గుట్టలను సైతం ఎక్కాను. అధికారులతో ప్రశంసాపత్రాలు, మెమోంటోలు తీసుకున్నా.. కబడ్డీ, ఖోఖో ఆటలంటే చాలా ఇష్టం. ఇప్పటికీ గ్రామానికి వెళ్తే సమయం చిక్కితే ఆటలు ఆడుతా. గడిచిన రెండేళ్లుగా నేను పేదలకు చేస్తున్న సేవలను గుర్తించిన కుమురం భీం జిల్లా కలెక్టర్ చంపాలాల్, అటవీశాఖ మంత్రి జోగు రామన్న చేతుల మీదుగా మంచి సేవకురాలిగా అవార్డు అందుకున్నా.

### భయం వీడాలి.. విద్యనభ్యసించాలి!

ఆదివాసీ తెగల్లోని మహిళలకు భయం ఎక్కువ. ఆ భయాన్ని వీడినప్పుడే అభివృద్ధి చెందగలం. సమాజంలో జరుగుతున్న పోకడలను అర్థం చేసుకునేందుకు చదువు చాలా ముఖ్యం. నేడు ఆదివాసీల్లో చాలా మంది నిరక్షరాస్యులున్నారు. పిల్లలందరు బడికి వెళ్లాలి. బాగా చదువుకోవాలి. ముఖ్యంగా మహిళల్లో ఎదిరించే ధైర్యం, తన కాళ్లపై తాను నిలబడే తత్వం కలిగి ఉండాలి. సమాజంలో ఆదిమ తెగల వారంటే అందరికీ అలుసే. ఈజీగా మోసం చేయవచ్చనే భావన గిరిజనేతరుల్లో ఉంది. వాటిని తిప్పికొట్టే ధైర్య సాహసాలు కలిగి ఉండాలి. మోసపోకూడదు.

తమ హక్కులు, తమ చట్టాలను తెలుసుకోవాలి. కౌలు చేసుకుంటున్న కౌలుదార్లు చాలా మంది పట్టేదారులను మోసగించి భూములు లాక్కున్న సందర్భాలు ఉన్నాయి. వారి మోసాన్ని గ్రహించాలి. అప్పుడే సమాజంలో నిలబడగలం.

**– సుర్పం ఆనంద్,** సాక్షి ప్రతినిధి
కెరమెరి, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా

---

స్కిల్స్

## మాట భయాన్ని పోగొడతాను



డాక్టర్ కల్పన

పద్నాలుగేళ్ల క్రితం నేను హౌజ్‌వైఫ్‌ని. ఇద్దరు చిన్న పిల్లల తల్లిని. వారిని వదిలి ఉద్యోగానికి వెళ్లడం కష్టంగా ఉండేది. ఏదైనా సొంతంగా స్కిల్ ప్రోగ్రామ్ కోర్సు మొదలుపెడితే బాగుంటుందని అనిపించింది. అన్ని రంగాలను గమనించాను. ఏ రంగంలోనైనా సరే ఇంట గెలిచి, రచ్చగెలవాలంటారు. అలా గెలవాలంటే ఎదుటి మనిషిని ఆకట్టుకునేలా మాట్లాడాలి. చాలా మంది 'మాట' నైపుణ్యం లేని కారణంగా ప్రతిభ ఉండీ వెనుకబడటం గమనించాను. సమాజంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంత అవసరమో గుర్తించి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశాను. నెలలో రెండు సెషన్స్ తీసుకుంటాను. ప్రతి ఆదివారం పూర్తి క్లాస్ ఉంటుంది. ప్రతీ బ్యాచ్‌లోనూ సగం మంది మహిళలు ఉంటున్నారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకునేవారు, ఉన్నతి సాధించాలనుకునేవారూ క్లాసులకు అటెండ్ అవుతుంటారు. సాధారణంగా రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళల దగ్గర చాలా సమాచారం ఉంటుంది. కానీ, మైక్ దగ్గరకు రాగానే ఒక రకమైన భయంతో వెనక్కి వెళ్లిపోతుంటారు. వారికి ఎన్నో సూచనలు ఇస్తుంటాం. వాటిలో...

● 'మాట' రాజకీయ రంగంలో ఉన్నవారికి మరింత అవసరం. ● ఏ భాషలో మాట్లాడినా సరే ఎదుటివారికి మనం చెప్పదలుచుకున్న విషయం స్పష్టంగా చేరాలి. ● ఇంట్లో మాట్లాడటం వేరు. నలుగురిలో ఆకట్టుకునేలా మాట్లాడటం వేరు. ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా మనల్ని మనం ఎలా నిరూపించుకోవచ్చో తెలుస్తుంది, ఎలా కమ్యూనికేట్ చేయవచ్చో తెలుస్తుంది. ● సుష్మాస్వరాజ్, నిర్మలాసీతారామన్, స్మృతి ఇరానీ.. వంటి మహిళా నేతల ప్రసంగాలను చూపిస్తూ, వారి ఆత్మవిశ్వాసాన్ని పరిశీలించమంటాను. ● గ్రామాలలో సర్పంచ్‌గా, పట్టణాల్లో కార్పోరేటర్‌గా ఉన్నవాళ్లూ మా దగ్గర క్లాస్‌లు తీసుకున్నవారిలో ఉన్నారు. 'మేం ఇప్పుడు బాగా మాట్లాడగలుగుతున్నాం' అని చెబుతుంటారు. వారు 'మాట' నైపుణ్యాలను ఎలా పెంచుకున్నారో క్లాసులో వారి చేతనే చెప్పిస్తాం. ● కాన్ఫిడెంట్‌గా ఉండటం ముఖ్యం. దీని వల్ల బెరుకు, భయం దూరం అవుతాయి. ● ముందుగా 5 పాయింట్స్ నోట్ చేసుకొని చెప్పమంటాం, దీంట్లో పంచ్ డైలాగ్‌తో మీటింగ్‌ని ఎండ్ చేయమంటాం. ఆ తర్వాత పాయింట్స్ సంఖ్య పెంచుతూ, మధ్య మధ్యలో డైలాగ్స్ స్థాయి పెంచుతూ మాటలో నైపుణ్యాలు పెరిగేలా జాగ్రత్తలు తీసుకుంటాం. ● కాలేజీ అమ్మాయిలకు కూడా ఈ శిక్షణా తరగతులు ఇప్పిస్తే రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్నవారు వెలుగులోకి వస్తారు. తమ సత్తా చాటుతారు.

**– డాక్టర్ కల్పన,** డైరెక్టర్, మీడియా జంక్షన్, ముషీరాబాద్, హైదరాబాద్

---

గళం

## నేర్చుకున్నాను.. నేర్పుతున్నాను

నేను 10వ తరగతి పాసైన తర్వాత పెళ్లి చేసేశారు. మా నాన్న, మామయ్యలు ఊరి పెద్దలుగా ఉండి అందరి తల్లో నాలుకలా వ్యవహరించేవారు. సాధారణంగా మన్యంలో మహిళలకు ప్రాధాన్యత తక్కువ. అభివృద్ధికి దూరంగా ఉండే మా పంచాయితీకి నిధులు అరకొరగా వస్తున్నాయి. బడ్జెట్‌లో లక్షల కోట్లు ప్రకటిస్తున్నా పంచాయితీకి కేవలం వేలల్లో మాత్రమే ఉంటున్నాయి. దీంతో.. మా బొర్రా పంచాయితీ అభివృద్ధికి దూరమైపోయింది. గత ఎన్నికల సమయంలో రిజర్వేషన్ ప్రకారం పోటీ చేసే అవకాశం వచ్చింది. మా కుటుంబాలకు రాజకీయాలతో సంబంధం లేదు. రాజకీయాల్లో ఓనమాలు కూడా రావు. పదవిని ఎలా వినియోగించుకోవాలి, ఏఏ అభివృద్ధి పనులు చేసే అవకాశముందని మా గ్రామ పెద్దలు, మాజీ సర్పంచుల దగ్గర నేర్చుకున్నారు. నా భర్త చంద్రన్న పోలీస్ కానిస్టేబుల్ కావడంతో నా పదవి విషయంలో తలదూర్చరు. కాబట్టి నేనే అన్ని విషయాల్లోనూ అవగాహన కలిగించుకున్నాను. ఎదురైన అనుభవాల నుంచి ఒక్కో విషయాన్ని నేర్చుకుంటున్నాను. మా ఊరిలో రాజకీయాలంటే ఆసక్తి ఉన్న వారికి నేర్పిస్తున్నాను. మా పంచాయితీలో 14 గ్రామాలున్నాయి. ఒక్కో గ్రామంలో ఒక్కో స్వభావం ఉన్న మనుషులు ఉంటారు. మహిళను కదా.. అలాంటి వారి నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే ఆందోళన ఉండేది. అందుకే వారందరితోనూ కలుపుగోలుగా ఉండాలని నిర్ణయించుకున్నాను. వారిని కూడా సలహాలు అడిగేదాన్ని. పదవి దేముంది సార్ ఐదేళ్ల తర్వాత పోతుంది. మా ప్రాంత ప్రజల దృష్టిలో మహిళా సర్పంచైనా మంచిగా చేసిందనే పేరుండిపోవాలన్నదే నా ఆశయం. మన్యం ప్రాంతంలోనూ రాజకీయాల్లో మహిళలు రాణించగలరు అని నిరూపించాలని మా కుటుంబ సభ్యులు చెప్పిన మాటలతోనే స్వశక్తిగా ఎదుగుతున్నాను.



**– దోనేరు సుందరమ్మ,** బొర్రా పంచాయతీ సర్పంచి,
అరకు నియోజకవర్గం, విశాఖపట్నం

## మొదటి ఏడాది భర్త నడిపించారు

నేను ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. మా కుటుంబంలో ఎవ్వరికీ రాజకీయ పదవుల నేపథ్యం లేదు. గ్రామంలో పలుకుబడి ఉండటంతో వచ్చిన రిజర్వేషన్ల ప్రకారం సీటు దక్కింది. సర్పంచిగా పోటీ చెయ్యమని చెప్పారు. మొదట్లో భయం వేసింది. గ్రామ పెద్దలు ధైర్యం చెప్పడంతో ముందడుగు వేశాను. సర్పంచిగా గెలిచానే కానీ.. భయం ఉండేది. అధికారులతో ఎలా మాట్లాడాలి. ఏఏ పనులు చేసే అవకాశముంటుంది. ఎలాంటి పవర్ ఉంటుది.. ఇవేమీ తెలీదు. నా భర్త కొద్దో గొప్పో రాజకీయ అనుభవం ఉంది. ఆయన ధైర్యం చెప్పారు. ముందుండి నడిపిస్తానని చెప్పారు. మొదటి సంవత్సరమంతా నేను వెనుక.. నా భర్త ముందుండేవారు. ఏ సందర్భాల్లో ఎలా మాట్లాడాలి. ఏ తరహా పనులకు ఏ శాఖ అధికారిని సంప్రదించాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎలా వ్యవహరించాలనేది నా భర్త నడవడికను చూసి నేర్చుకున్నారు. క్రమంగా ఆయన సహాయం తీసుకోవడం తగ్గించాను. స్వతహాగా ప్రథమ పౌరురాలిగా నడవడం నేర్చుకున్నాను. ఇప్పుడు పూర్తి స్థాయి సర్పంచిగా వ్యవహరిస్తున్నాను. ఏదీ ముందు నుంచి రాదు కదా. నేర్చుకోవాలనే తపన పెరిగింది.. కాబట్టి ఈ నాలుగేళ్ల కాలంలో ఎవ్వరి నుంచి ఎలాంటి విమర్శలూ ఎదుర్కోలేదు. మహిళలు రాజకీయాల్లోకి రావాలంటే నాలాగే ఏమీ రాదని భయపడుతుంటారు. కానీ.. ఆ భయం నుంచే చాలా నేర్చుకోవచ్చని తెలుసుకున్నాను.



**– తుపాకుల ఆదిలక్ష్మి,** మజ్జివలస గ్రామ సర్పంచి,
భీమిలి మండలం, విశాఖపట్నం.

**– కరుకోల గోపీకిశోర్‌రాజా,** సాక్షి, విశాఖ సిటీ

**మాకు పంపండి:** ఒక మహిళగా మీరు గృహహింస వంటి వేధింపులకు గానీ, సామాజికంగా వివక్షకుగానీ లేదా సంబంధిత ఇతర సమస్యలతో బాధపడుతున్నారా? మీ సమస్యను రాసి మాకు మెయిల్ ద్వారా పంపించండి.ఆయా రంగాలకు చెందిన నిపుణులతో మీకు తగిన సూచనలు / సలహాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. మీరు మీ ప్రశ్నలను పంపాల్సిన మెయిల్ ఐడీ : nenusakthiquestions@gmail.com

---

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు - 25

## కోసే కొడవలి



● తాయమ్మ కరుణ

తాయమ్మ ఏ పాపం ఎరగదు.

కష్టపడి పని చేస్తుందంతే.

ఒకరి తిండి ఆశించదు.

కష్టపడి సంపాదించుకుంటుందంతే.

చిన్నప్పటి నుంచి, ఈడేరినప్పటి నుంచి తల్లిదండ్రులు లేని ఆ పిల్లను మేనమామ 'ఒక అయ్య చేతిలో పెట్టాలి' అని అంటూ ఉండేవాడు. ఆ అయ్య ఎవరో. ఎలాంటివాడో. చివరకు దొరకనే దొరికాడు.

ఇక అతడే మొగుడు. జీవితాంతం మొగుడు.

తాయమ్మ చక్కగా ఉంటుంది. ఒకరోజు ముచ్చటపడి కుచ్చిళ్లు పోసి చీర కట్టుకుంది.

మొగుడు చూసి 'ఎవడి దగ్గర కులకడానికి కట్టుకున్నావే' అని ఒంగోబెట్టి నాలుగు గుద్దాడు.

ఒకనాడు జడ వేసుకుందామని నెత్తికి నూనె రాసుకొని, దువ్వెన పెట్టి దువ్వుకుంటూ ఉండగా వీపు మీద దూలం పడినట్టయ్యి నేలకు కరుచుకుని పోయింది. మొగుడే.

'సోకులు కావల్సొచ్చాయా నీకు'...

ఆడది అటూ ఇటూ చూడకుండా మట్టి నాకుతూ ఉండిపోవాలంటే దానిని పనిలో పెట్టాలని అత్తగారి థియరీ. లంకంత ఇల్లు అది. పదిగొడ్ల చాకిరీ ఉంటుంది. ఇది చాలక ఒడ్ల మిల్లు పెట్టిచ్చి ఇచ్చారు. వడ్లగింజల్లో వడ్లగింజలా బియ్యపు గింజల్లో బియ్యపు గింజలా కలిసి పోయి ఉనికే లేనట్టు మనిషే కానట్టు అస్తమానం దుమ్మూ ధూళి ముఖంతో ఉంటే అందరికీ శాంతి.

కాని తాయమ్మ వడ్లమిల్లును బంగారుమిల్లు చేసుకుంది.

ఇక మొగుడికి మారో గోలి. ఉంటే ఏంటి... లేకపోతే ఏంటి... ఈ మిల్లుతో ముగ్గురు పిల్లలను తాను సాక్కోగలదు. ఇది తెలిశాక తాయమ్మ వెన్ను నిటారుగా అయ్యింది. కిందకు దిగి ఉండే చుబుకం పైకి లేచింది. కళ్లల్లో ధైర్యం రెపరెపలాడింది.

'ఏమే నకరాలు చేస్తున్నావ్' అన్నాడు మొగుడు అది చూసి.

అతడికి ఇరకాటంగా ఉంది. ఇదేమిటి... ఏదో చేయబోతే ఏదో అయ్యింది. బానిసగా మారుద్దామనుకుంటే యజమాని అయ్యిందే.

'నీ పెళ్లాన్ని ఫలాతున్‌ను చేసి పెట్టావేందిరా' అని ఊళ్లో మగవాళ్లు అంటుంటే నొప్పి. అందరికీ నొప్పే. ఆడది తన కాళ్ల మీద తాను నిలబడితే నొప్పి. ఎవరి మీదా ఆధారపడకపోతే నొప్పి. ఏం యుగాల తరబడి ఆడది వెర్రిముఖం వేసుకుని నిలబడాలా?

చీటికి మాటికి మొగుడు బాత్తూనే ఉన్నాడు.

బాదుకో అని మిల్లు నడుపుకుంది తాయమ్మ.

సంపాదించింది దొంగలా పెరుక్కుంటూనే ఉన్నాడు.

పెరుక్కో అని ఇల్లు చక్కబెట్టుకుంది తాయమ్మ.

ఒక్కనాడూ మనిషిగా చూడలేదు.

చూడకు అని కూతురి పెళ్లి చేసింది తాయమ్మ.

ఇప్పుడు ఇంటి మగసైన్యం పెరిగింది. మొగుడు, మొగుడి అన్నగారు, అల్లుడు... వీళ్లందరూ రింగ్ అయ్యారు. వీళ్ల అహానికి సవాలు తాయమ్మ.

'దాని పొగరు అణచాలి' అని అనుకున్నారు ఒకరోజు కల్లుతాగి.

పొగరు అణచాలట. ఎందుకు అణుస్తార్రా. ఏం చేసిందని అణుస్తారు. ఏనాడైనా ఒంటి నిండా బట్ట కట్టిందా. కడుపు నిండా తిండి తినిందా. దారిన కాచిన పువ్వును తుంచి జడలో పెట్టిందా. పాదాలకు చెప్పులు వేసుకొని నడిచిందా. చేతుల్లో నీళ్ల తీసుకుని ముఖమంతా తుడుచుకుని స్థిమితంగా చెట్టు కింద కూచుని వచ్చే పోయే ఆడవాళ్లతో కబుర్లు చెప్పిందా. గొడ్డు... ఆడగొడ్డు... మర ఆడించే గొడ్డు... అయినా వదల్రా మీరు.

వదలరు. మగాళ్లు వదలరు.

తెలివిగా పంచాయితీ పెట్టించారు.

తాయమ్మ మిల్లు పక్కన ఉండే ఇంటి ఆడది చేత పంచాయితీ పెట్టించారు.

'రోజంతా మిల్లు రొదరొదమని తిరుగుతా ఉంటే మా చెవులు సురాక్‌లు పడుతున్నాయి. మేము కాపురాలు చేసుకోవాల్నా వద్దా. కాసేపైనా పుర్సత్‌తో ఉండాల్నా వద్దా' అని ఆ ఆడమనిషి కంప్లయింట్ చేసింది.

ఇంకేముంది పంచాయితీ గగ్గోలు అయిపోయింది. మూడో ప్రపంచయుద్ధం వచ్చినంత ప్రమాదం అన్నట్టే పంచాయితీ పెద్దలు ముఖాలు పెట్టారు. సంజాయిషీ ఇచ్చేందుకు అక్కడ తాయమ్మ లేదు.

'పంచాయితీకి వచ్చి బదులు చెప్తావా. నోరు మూసుకు కూచో' అన్నాడు మొగుడు.

'ఈ ఇంటి ఆడది పంచాయితీకి రాకూడదమ్మా' అన్నాడు బావగారు.

'అవును అత్తమ్మా' అన్నాడు అల్లుడు.

మగాళ్లు మగాళ్లు ఏం మాట్లాడుకుని చచ్చారో. మొత్తం మీద 'తాయమ్మ మిల్లు బందు పెట్టాలి' అని తీర్పు ఇచ్చారు.

ఘన విజయం ఇది మొగుడికి. దండలు వేసుకుని రావడం ఒకటే బాకీ. ఈ వార్తతో ఇంటి ముగ్గురు మగాళ్లు సంతృప్తి చెంది ఆ సంగతి చెప్పడానికి ఇల్లు చేరారు.

'ఏంటి?' అంది తాయమ్మ తీర్పు విని.

'తీర్పు అలా వచ్చింది. ఏం చేస్తాం' అన్నారు వాళ్లు.

'అలా వచ్చిందా?' తల విదిల్చితే కురులు విడివడి సహస్రఫణులు పడగవిప్పినట్టు కనిపించాయి.

'నా కొడకల్లారా'... వాసాల్లో నుంచి కొడవలి లాగింది.

'బాడ్‌కవ్'... మొగణ్ణి ఎగిసి గుండెల మీద తన్నింది.

'ఆడదంటే మజాక్‌గా ఉందిరా నీకు. నిన్ను నమ్మి వస్తే, నీ ఇంటికి వస్తే, ప్రాణమున్న బొమ్మలా వస్తే, నీ బిడ్డలకు తల్లి కావడానికి బిడ్డసంచితో, నీ పిల్లలకు పాలు కుడపడానికి ఛాతికట్టుతో వస్తే, నీ ఇంటి దీపంలా మారడానికి వస్తే, తోడు నడవాల్సిందిపోయి, తోడుగా నడిపించాల్సిందిపోయి కొట్టి తిట్టి నలిపి నాశనం చేస్తావా. మెతుకు పెట్టక మలమలమని మాడుస్తావా? పుట్టింటి ముఖం చూడనీకుండా శోకం పెట్టిస్తావా? బెత్తెడు వెలుగు చూడనీకుండా చీకట్లో పెడతావా? ఛీ అనుకొని నా బతుకు నేను బతుకుతుంటే అది కూడా లేకుండా చేస్తావా? ఆడదంటే తల లేని మొండెం అనుకుంటున్నావురా' మళ్లీ ఎగిసి తన్నింది.

కష్టం చేసి కట్టెపేడులా బలపడ్డ శరీరం అది. వడ్లు ఆడించి లోహంలా మారిన చేతులు. ఎవరు నిలువరించగలరు?


'ఏయ్'... బావగారు అడ్డం రాబోయారు.

పంచె ఊడేలా కొట్టింది. అల్లుడు పరార్.

తాయమ్మ చూస్తూ ఉంది. చుట్టూ చూస్తూ ఉంది. ఒంట్లో మగకొవ్వు ఉంది కదా అని మీసం తిప్పుతూ ఎవడైనా వస్తాడా చూసుకుందాం అని కొడవలి పట్టుకొని భుజాలలో శక్తి తెచ్చుకుని అమ్మోరులా చుట్టూ చూస్తూ నిలబడింది.

కథ ముగిసింది.


స్త్రీ కొంగుముడిలో చిల్లర ఉంటే చాలా అభద్రత మగవాడికి. ఆదిశక్తి ఆడదే అయినా కుబేరుడు మగవాడే. సాక్షాత్తు లచ్చిందేవిని పెళ్లాడుతున్నా వడ్డీకి అప్పు ఇవ్వడానికి వస్తాడు. డబ్బు, సంపదా, అధికారం తన దగ్గరుంటే ఓకే. స్త్రీ భాగానికి వచ్చిందా ఇలాగే కుట్రలు చేస్తాడు. కాని ఆడవాళ్లందరూ అణిగిమణిగి ఉంటారా? తాయమ్మలా కొడవలి బిగించరూ?



పునః కథనం: **ఖదీర్**

సినిమా
నల్లగొండ
బుధవారం
7-3-2018
సాక్షి ఫ్యామిలీ

# పడిపడి లేచె మనసు


శర్వానంద్

శర్వానంద్ కథానాయకుడిగా హనురాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పడి పడి లేచె మనుసు'. సాయిపల్లవి కథానాయిక. శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి నిర్మిస్తున్నారు. మంగళవారం హీరో శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేశారు. ''డిఫరెంట్ అండ్ క్రియేటివ్ లవ్‌స్టోరీ చిత్రమిది. మా హీరో శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉంది. టైటిల్‌కు మంచి స్పందన లభిస్తోంది. ప్రస్తుతం కలకత్తాలో మఖ్య తారాగణంపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో వెంకట్ మాస్టర్ నేతృత్వంలో కొన్ని యాక్షన్ సీన్స్‌ను తెరకెక్కిస్తున్నాం. జయకృష్ణ సినిమాటోగ్రఫీ, విశాల్ చంద్రశేఖర్ సంగీతం ఈ సినిమాకు హైలైట్‌గా ఉంటాయి'' అన్నారు నిర్మాతలు. 'మహానుభావుడు' సినిమా తర్వాత శర్వానంద్ నటిస్తున్న ఈ లవ్‌స్టోరీపై అంచనాలు ఉన్నాయి. 'వెన్నెల' కిషోర్, కల్యాణి నటరాజన్, ప్రియా రామన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చంద్ర శేఖర్ రావిపాటి.

# ఆఫీసర్ ఆన్ యాక్షన్ మోడ్



విలన్స్‌ను రఫ్ఫాడిస్తున్నాడు హీరో నాగార్జున. ఎక్కడో తెలుసా? ముంబైలోని ఓ ఎత్తైన భవనంపై. మరి..అక్కడే ఎందుకు? అంటే మాత్రం 'ఆఫీసర్' సినిమా చూడాల్సిందే. నాగార్జున హీరోగా కంపెనీ పతాకంపై సుధీర్ చంద్రతో కలిసి రామ్‌గోపాల్ వర్మ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఆఫీసర్'. మైరా సరీన్ ఫీమేల్ లీడ్ క్యారెక్టర్ చేస్తున్నారు. ఈ సినిమాలో నాగార్జున పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. క్లైమాక్స్ షూట్ మినహా సినిమా కంప్లీట్ అయ్యిందని సమాచారం. ప్రస్తుతం చిత్ర బృందం క్లైమాక్స్‌ను ఫినిష్ చేసే పనిలోనే ఉన్నారు. ముంబైలో జరుగుతున్న ఈ సినిమా షూట్ ఆన్ లొకేషన్ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు నాగార్జున. ఈ ఫొటోను చూస్తుంటే ఆన్ డ్యూటీలో విలన్స్‌ను ఆఫీసర్ కుమ్మేస్తున్నట్లు ఉంది కదూ! ''పర్వత శిఖరంపై జివదనీ మాయ దేవాలయం ఉంది. మేము ముంబైలోని పదో ఫ్లోర్‌పై యాక్షన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నాం'' అని పేర్కొన్నారు నాగార్జున. ''నాగ్..'శివ' సినిమాలో కన్నా ఇప్పుడే నువ్వు ఫిట్‌గా ఉన్నావ్. అలా ఎలా మెయిన్‌టెయిన్ చేయగలుగుతున్నావో నాకు అర్థం కావడం లేదు'' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. ఈ చిత్రాన్ని మే 25న విడుదల చేయాలనుకుంటున్నారు.


'ఆఫీసర్' చిత్రంలో నాగార్జున...


మహేశ్‌బాబు

# మాట తప్పలేదు... మర్చిపోలేదు!

భరత్ రామ్‌కు చిన్నతనంలో వాళ్ల అమ్మ ఒక మాట చెప్పింది. 'ఒకసారి ప్రామిస్ చేసి ఆ మాట తప్పితే నువ్వు మనిషిగా పిలవబడవు' అని. ఎప్పటికీ ఆ మాటను తప్పలేదు, మర్చిపోలేదతను. పెద్దదే కాదు. కష్టమైందన్నప్పటికీ రాష్ట్రానికి సీయంగా జీవితంలో పెద్ద ప్రామిస్ చేశాడు భరత్. మరి..ఈ ప్రామిస్‌లో కూడా భరత్ ఎలా సక్సెస్ అయ్యాడో తెలుసుకోవాలంటే మాత్రం 'భరత్ అనే నేను' సినిమా చూడాల్సిందే. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో డి. పార్వతి సమర్పణలో డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. కియారా అద్వాని కథానాయిక. ప్రకాశ్‌రాజ్, శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సీయం భరత్ రామ్ పాత్రలో మహేశ్ బాబు నటిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఈ సినిమా టీజర్ 'ది విజన్ ఆఫ్ భరత్' ను రిలీజ్ చేశారు చిత్రబృందం. ముఖ్యంగా ఎడ్యుకేషన్ సిస్టమ్‌లోని లోపాలపై భరత్ గురిపెడతారట..మరి...ప్రతి ఒక్కరికి భయం..బాధ్యత ఉండాలి అంటున్న భరత్ ఎప్పుడు చార్జ్ తీసుకుంటున్నాడో తెలుసుగా! నెక్ట్స్ మంత్‌లోనే. అదేనండి..ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న విడుదల చేయబోతున్నారు అని చెప్తున్నాం.

# తల్లీ బిడ్డకు ఉన్న అనుబంధమే కణం

**- సాయి పల్లవి**

నాగ శౌర్య, సాయి పల్లవి జంటగా ఏఎల్.విజయ్ దర్శకత్వంలో ఎన్.వి.ఆర్ సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ నిర్మించిన చిత్రం 'కణం'. ఈ సినిమా ప్రీ–రిలీజ్ ఫంక్షన్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్మాత ఎన్‌వీ. ప్రసాద్ మాట్లాడుతూ –''ఈ సినిమాను మా బ్యానర్‌పై తెలుగులో రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. సాయి పల్లవి, నాగ శౌర్యకు ఈ సినిమా హ్యాట్రిక్ తెచ్చిపెడుతుంది అనుకుంటున్నాను. శ్యామ్ సి మ్యూజిక్, నిరవ్ షా విజువల్స్ ఈ సినిమాకు ప్లస్ అవుతాయి. దర్శకుడు విజయ్ ఏ ఉద్దేశంతో ఈ సినిమా తీశారో ఆ ఉద్దేశం నెరవేరాలని కోరుకుంటున్నాను. 37 రోజుల్లో ఈ సినిమాను పూర్తి చేయడం నిజంగా చిన్న విషయం కాదు. తెలుగులో రిలీజ్ చేసే అవకాశం ఇచ్చిన లైకా ప్రొడక్షన్స్ వాళ్లకు థ్యాంక్స్'' అన్నారు. సాయి పల్లవి మాట్లాడుతూ– ''తల్లీబిడ్డకు మధ్య ఉన్న అనుబంధం, తపనే ఈ కథ. చాలా ఎమోషనల్ కనెక్ట్‌తో ఈ సినిమా చేశా. మంచి సినిమా చూశాం అనే ఫీలింగ్‌తో ఆడియన్స్ థియేటర్ బయటకు రావాలని విజయ్ చక్కగా రూపొందించారు. నాగ శౌర్య చాలా బాగా నటించారు. ఇంత మంచి సినిమాను నిర్మించిన లైకా ప్రొడక్షన్స్‌కు థ్యాంక్స్. 'ఫిదా, ఎంసీఏ' సినిమాల్లాగే ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని అనుకుంటున్నాను'' అన్నారు.


ఎన్వీ ప్రసాద్, నీరవ్ షా, విజయ్, సాయిపల్లవి, బేబి వెరోనికా, శానం నాగఅశోక్, బీవీఎస్ఎన్ ప్రసాద్, కిరణ్

''మంచి సినిమాలను తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ ఎంకరేజ్ చేస్తూనే ఉంటారు. 2013లోనే ఈ సినిమా ఆలోచన వచ్చింది. టైమ్ తీసుకొని చేద్దాం అని వెయిట్ చేశాను. నాగ శౌర్య, సాయి పల్లవి, వెరోనికా చాలా బాగా యాక్ట్ చేశారు. ఎన్.వీ.ప్రసాద్ గారు ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చారు'' అన్నారు దర్శకుడు విజయ్. ''నాగ శౌర్య, సాయి పల్లవి, వెరోనికా, దర్శకుడు విజయ్ అలాగే సినిమాకు పని చేసిన యూనిట్ అందరికీ ఆల్ ది బెస్ట్'' అన్నారు జెమినీ కిరణ్. ''సినిమాలో నటించిన అందరికి, అలాగే నా మిత్రుడు ఎన్.వి.ప్రసాద్‌కు అభినందనలు'' అన్నారు నిర్మాత బీవీయస్ ఎన్. ప్రసాద్. ''నాగశౌర్య, సాయి పల్లవి మంచి ఫామ్‌లో ఉన్నారు. ఈ సినిమా కూడా వాళ్లకు పెద్ద సక్సెస్ తెచ్చిపెట్టాలని ఆశిస్తున్నాను'' అన్నారు శానం నాగ అశోక్ కుమార్. ఈ సినిమాకు సంగీతం: శ్యామ్ సి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.ప్రేమ్.




విఘ్నేష్ శివన్‌తో... నయనతార



# ప్రేమ యాత్రలు

విఘ్నేశ్ శివన్ – నయనతారలు ప్రేమలో మునిగి తేలుతున్నారన్న విషయం అందరికీ తెలిసిందే. ఇద్దరికి వీలు కుదిరినప్పుడల్లా ప్రేమ యాత్రలకు విదేశాలు వెళ్తూ ఉంటారు. ఈసారి యూఎస్ టూర్‌కు వెళ్లారు. లాస్ ఎంజెల్స్‌ను చుట్టేస్తూ ఇద్దరు ఫొటోలు దిగారు. ''క్వాలిటీ టైమ్ స్పెండ్ చేశాం. గ్రేట్ మొమొంట్స్‌ను, పాజిటివిటీను ఇచ్చినందుకు థ్యాంక్యూ యూఎస్‌ఏ. తప్పకుండా మళ్లీ వస్తాం'' అని చెబుతూ ఈ ఫొటోలను తన ట్విట్టర్ ఖాతాలో పంచుకున్నారు విఘ్నేశ్ శివన్.

# ప్రేక్షకుడిని, పరిశ్రమను కాపాడాలి



కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

'చిత్ర పరిశ్రమ సమస్యలపై ముఖ్యమంత్రులు స్పందించి ఓ కమిటీను నియమించాలి' అని అన్నారు నిర్మాత, దర్శకుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి. ప్రస్తుతం సినిమా పరిశ్రమలోని సమస్యలన్ని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ ద్వారా ఆయన కోరినట్టు పేర్కొన్నారు. ''డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు నిర్మాతలకు జరుగుతున్న వివాదం వల్ల సినిమాను అభిమానించే వారికి ఇబ్బందిగా మారింది. సినిమా తప్పితే వారికి వేరే వినోదం లేదు. 4 ఆటలతో పాటుగా 5వ ప్రదర్శనగా చిన్న సినిమాలు ఆడించి, ట్యాక్స్ లేకుండా ఓ జీవో తీసుకువచ్చి చిన్న సినిమాలను, నిర్మాతలను బతికించాలి. మేం ఇచ్చిన కంటెంట్‌తోనే కోట్లు ఆర్జిస్తున్న డిజిటల్ సర్వీస్ వాళ్లు మా సినిమాలను ఫ్రీగా ప్రదర్శించాలి. యూఎఫ్ఓ, క్యూబ్ రెండు మోనోపోలి ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వమే థియేటర్స్‌లో ప్రొజెక్టర్స్ బదులు ప్రొజెక్టర్స్ సరఫరా ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పరేషన్ ఏర్పాటు చేయాలి. టికెట్ బుక్కింగ్స్‌కు అదనంగా చార్జీలు పడుతున్నాయి, దాని కోసం ప్రభుత్వమే ఒక కొత్త పోర్టల్ ఏర్పాటు చేసి అందులో కొంత భాగం నిర్మాతకు ఇవ్వాలి. ఈ సమస్యలన్ని ఆలోచించి ప్రేక్షకులని, నిర్మాతలను కాపాడటం కోసం ఏదో పరిష్కారం ఆలోచించాలి'' అని లేఖలో కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి కోరారు.


నిఖిల్

# రిలీజ్ ఫీవర్ స్టార్ట్ అయింది

**"కిరాక్ పార్టీ' నా 15వ సినిమా. సినిమాకు పది రోజుల ముందు నుంచి నా ఫస్ట్ సినిమా, 15 సినిమా అనే డిఫరెన్స్ తెలీదు. హ్యాపీడేస్ అప్పుడు ఎలా నెర్వస్‌గా ఉన్నానో ఇప్పుడు అలానే ఉన్నాను. రిలీజ్ ఫీవర్ స్టార్ట్ అయింది" అన్నారు హీరో నిఖిల్. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా సిమ్రాన్, సంయుక్తా హెగ్డే హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'కిరాక్ పార్టీ'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై రామ బ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా మార్చి16న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో నిఖిల్ పాత్రికేయులతో పలు విశేషాలు పంచుకున్నారు.**

- కొన్ని సినిమాలు మనకు స్పెషల్‌గా ఉండిపోతాయి. 'హ్యాపిడేస్, యువత, కార్తికేయ' ఇప్పుడు ఈ సినిమా. మిగతా సినిమాలు హిట్స్ అయినా కూడా కొన్ని క్యారెక్టర్స్‌ను బాగా లవ్ చేస్తాం. ఇది నా ఫేవరెట్ రోల్. నేను కాలేజ్ మూవీ చేసి ఆల్మోస్ట్ 11ఇయర్స్ అయిపోతోంది.
- ఒక ఇంజినీరింగ్ స్టూడెంట్ నుంచి స్టూడెంట్ లీడర్ ఎలా అయ్యాడు అనేది కథాంశం. నేను చేసిన అన్నింట్లో పెర్ఫార్మన్స్ చేయడానికి ఎక్కువ స్కోప్ ఇచ్చింది. షూటింగ్ అప్పుడు కూడా అందరి కంటే ముందే సెట్‌కి వెళ్లిపోయేవాణ్ణి. ఈ క్యారెక్టర్ చాలా ఇష్టపడి చేశాను.
- ఈ సినిమా చేస్తుప్పుడు 'హ్యాపీడేస్' ఫీల్ వచ్చింది. 'హ్యాపీడేస్' తర్వాత ఫుల్ లెంగ్త్ కాలేజ్ ఫిల్మ్ రాలేదు. స్టార్ట్ టూ ఎండ్ వరకు కాలేజ్‌లోనే ఈ సినిమా నడుస్తుంది. అమ్మాయిల గురించి తెలుసుకోకుండా తప్పుగా మాట్లాడకూడదు ఒకవేళ అలా మాట్లాడితే ఆ అమ్మాయి ఎంత సఫర్ అవుతుందనే సెన్సిటీవ్ టాఫిక్ సినిమాలో ఉంటుంది.
- నా కాలేజ్ లైఫ్‌లో రెండు మూడు సార్లు గొడవలు అయ్యాయి. పోలీస్ స్టేషన్ దాకా వెళ్లింది. స్టూడెంట్స్ అని వదిలేశారు. అలాంటి మెమొరీస్ అన్నీ గుర్తొచ్చాయి. నేను, మా డైరెక్టర్, చందూ మొండేటి, సుధీర్ వర్మ, నిర్మాతలు అందరూ ఇంజినీర్సే.
- కన్నడ 'కిర్రిక్ పార్టీ' లాంటి క్యూట్ సినిమా మన తెలుగు ఆడియన్స్ మిస్ కావద్దని రిమేక్ చేశాం. ఈ సినిమాలో మార్చనవి రెండే రెండు. ఒకటి హీరోయిన్ సంయుక్త హెగ్డే, రెండు మ్యూజిక్. సంయుక్త బెస్ట్ డ్యాన్సర్, ఫుల్ ఎనర్జిటిక్. సో ఆమెను రీప్లేస్ చేయదలుచుకోలేదు. అలాగే ఇదొక మ్యూజికల్ ఫిల్మ్. అంజనీష్ లోకనాథ్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు.
- అనిల్ సుంకరగారు ఈ సినిమా డైరెక్షన్‌లో అస్సలు ఇన్వాల్వ్ అవ్వలేదు. కొబ్బరికాయ కొట్టిన రోజు, మధ్యలో ఏదో ఒకసారి వచ్చారు అంతే. చందూ మొండేటి (డైలాగ్స్), సుధీర్ వర్మ (స్క్రీన్ ప్లే)లతో శరణ్ వర్క్ చేశాడు. వాళ్లిద్దరూ నాకు బెస్ట్ ఫ్రెండ్స్. అలా వాళ్లు ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారు.
- తమిళ 'కణిదన్' రీమేక్, కార్తికేయ సీక్వెల్‌లో నటిస్తున్నాను.

# ఆ అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి

విజయ్ దేవరకొండ, శివానీ సింగ్ జంటగా శ్రీధర్ మర్రి దర్శకత్వంలో గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సుర్‌క్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మల్కాపురం శివకుమార్ సమర్పణలో రూపొందిన చిత్రం 'ఏ మంత్రం వేశావె'. చిత్రాన్ని ఈ నెల 9న విడుదల చేయాలనుకుంటున్నారు. నిర్మాత శివ కుమార్ మాట్లాడుతూ–'' రొమాంటింక్ థ్రిల్లర్ చిత్రమిది. అల్రెడీ చిత్ర ట్రెలర్‌కు, సాంగ్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. యూత్‌ను ఆకట్టుకునేలా ఉంటుంది. మంచి కంటెంట్ ఉన్న డిఫరెంట్ చిత్రమిది. రిలీజ్ చేసే అవకాశం మాకు దక్కింది. కథను నమ్మి సినిమా తీసుకున్నాం. సినిమాలో గేమ్‌కు ఎడిక్టై ఫ్యామిలీనే మర్చిపోయే స్టేజ్‌లో హీరో ఉంటాడు. అప్పుడు అతను మారడానికి ఎవరు హెల్ప్ చేశారు? ఎలా చేశారు? అన్న అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. తక్కువ సమయంలో ఎక్కువ క్రేజ్ సంపాదించుకున్న హీరో విజయ్ దేవరకొండకు ఈ సినిమా ప్లస్ అవుతుందనుకుంటున్నాను. తమిళ్‌లో హిట్ సాధించిన 'గులేబకావళి' చిత్రాన్ని తెలుగులో త్వరలో రిలీజ్ చేయాలనుకుంటున్నాం. ఈఏడాది మా బ్యానర్‌లో త్రీ మూవీస్ రానున్నాయి. కుమార్, రవిచందర్, కన్నడ డైరెక్టర్ రఘురాజ్ డైరెక్ట్ చేయనున్నారు. 'సూర్య వర్సెస్ సూర్య' మంచి సంతృప్తినిచ్చిన చిత్రం. హిందీలో రీమేక్ చేయడానికి చర్చలు జరుగుతున్నాయి'' అని అన్నారు. థియేటర్స్ క్లోజ్ విషయంపై స్పందిస్తూ– '' డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు,నిర్మాతలు చర్చలు సానుకూలంగానే సాగుతున్నాయి. ఈ నెల 9 నుంచి సినిమాల ప్రదర్శన ఉండొచ్చు. జాయింట్ యాక్షన్ కమిటీ తుది వివరాలను వెల్లడిస్తుంది'' అన్నారు శివకుమార్.


మల్కాపురం శివకుమార్

# సీరియస్ లుక్స్!


'సాహో' లుక్ అని వైరల్ అవుతున్న ఫొటో

ఇన్‌సెట్‌లో ఉన్న ఫొటో చుశారుగా! కథానాయిక శ్రద్ధాకపూర్ ఎంత సీరియస్ లుక్స్ ఇస్తున్నారో! ఇంతకీ..ఈ లుక్స్ 'సాహో' చిత్రంలోనివే నట. ప్రభాస్ హీరోగా 'రన్ రాజా రన్' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న సినిమా 'సాహో'. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయిక. గతేడాది అక్టోబర్‌లో 'సాహో' చిత్రంలోని ప్రభాస్ ఫస్ట్ లుక్‌ను చిత్ర బృందం అధికారికంగా రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే..'సాహో'లో శ్రద్ధాకపూర్ లుక్ ఇదేనంటూ సోషల్ మీడియాలో ఇన్‌సెట్‌లో ఉన్న ఫొటో వైరల్ అయ్యింది. శ్రద్ధాకపూర్ మేకప్ ఆర్టిస్ట్ శ్రద్ధా నాయక్ అకౌంట్ నుంచి ఈ ఫొటో వైరల్ అయ్యిందట. త్వరలోనే 'సాహో' టీమ్ దుబాయ్‌లో చేజింగ్ సీన్స్‌ను చిత్రీకరించబోతున్నారని కొందరు అంటున్నారు. మరికొందరు మాత్రం దుబాయ్‌లో అనుమతి దొరకలేదు. సో.. ఆ చేజింగ్ సీన్స్‌ను హైదరాబాద్‌లోనే భారీ బడ్జెట్‌తో సెట్‌వేసి చిత్రీకరిస్తారు అని అభిప్రాయపడుతున్నారు. మరి..ఈ షెడ్యూల్ ఎక్కడ జరుగుతుందనే దానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.


శ్రద్ధాకపూర్

# యువత ప్రశ్నిస్తే...

అనిల్ నెమలి, మేఘన జంటగా తారా నీలు కార్పొరేషన్ బ్యానర్‌పై అనురాగ్ స్వీయ దర్శకత్వంలో రూపొందనున్న ఓ కొత్త చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్త సన్నివేశాన్ని శ్రీరామ్ క్లాప్ ఇచ్చారు. భూపతి రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. దాసరి కిరణ్ తొలి సన్నివేశాన్ని డైరెక్ట్ చేశారు. ఈ సందర్భంగా హీరో అనిల్ మాట్లాడుతూ ''డైరెక్ట్ అవుదాం అని రామానాయుడు స్టూడియోలో కోర్స్ చేశాను. అనురాగ్ గారికి మా నాన్నతో ఉన్న పరిచయంతో, ఆయన చెప్పిన కథ నచ్చడంతో హీరో అయ్యాను'' అన్నారు.''ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ అవకాశం ఇచ్చిన అనురాగ్ గారికి థ్యాంక్స్'' అన్నారు మేఘన. ''ఈ సినిమాకు కథ, మాటలు, సంగీతం, నిర్మాణం, దర్శకత్వం నేనే చేస్తున్నాను. దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడింది. యువత సోషల్ మీడియాతో బిజీ అయిపోయింది. యువత ప్రశ్నిస్తే ఎలా ఉంటుంది అనే కథాంశంతో రూపొందించనున్నాం. అనిల్, మేఘనను హీరో హీరోయినుగా పరిచయం చేస్తున్నాను. నలుగురు కుర్రాళ్లు బాంబ్ బ్లాస్ట్ నుంచి ప్రజల్ని ఎలా కాపాడారన్నదే సినిమా కథాంశం'' అన్నారు అనురాగ్.


మేఘన, అనిల్ నెమలి

# హాలీవుడ్ కాన్సెప్ట్‌తో...


సుధాకర్, నిత్యా శెట్టి

'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' ఫేమ్ సుధాకర్ హీరోగా హరనాథ్ బాబు.బి దర్శకత్వంలో యునైటెడ్ ఫిలింస్ బ్యానర్ పై డి.శ్రీకాంత్ నిర్మిస్తున్న చిత్రం 'నువ్వు తోపు రా'. షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఈ సందర్భంగా హీరో సుధాకర్ మాట్లాడుతూ ''ఈ సినిమాలో నా క్యారెక్టర్ అన్ని ఎమోషన్స్‌తో కూడి ఉంటుంది. యూత్ తమని తాము చూసుకునే రోల్ ఇది. ఫస్ట్ సినిమా అయినా కూడా మంచి సినిమా అందించాలని నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. ఈ సినిమా నాకు మంచి పేరు తీసుకు వస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు.''ఈ సినిమాను 70 శాతం అమెరికాలో, 30 శాతం ఇండియాలో షూట్ చేశాం. హాలీవుడ్ కాన్సెప్ట్‌తో దర్శకుడు హరినాథ్ రూపొందించాడు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే గ్రాండ్‌గా రిలీజ్ చేస్తాం'' అన్నారు నిర్మాత శ్రీకాంత్.